

SREEMATH ANDHRA VALMIKI

# RAMAYANAMU



ANDHRA VALMIKI
**VASUDASA SWAMY**

A LITERAL METRICAL TRANSLATION OF
VALMIKI'S SANSKRIT RAMAYANAM

*by*


VAVILICOLANU SUBBA ROW

**alias VASUDASA SWAMY**

*late Telugu Pandit, Presidency College, Madras.*


AND THE AUTHOR OF

Sree Kumarabhyudayam, Sree Kausalya Parinayam,
Bhagavad Gita (Dwipada), Sree Krishna Leelamritamu,
Krishnavatara Thathwamu, Subhadra Vijaya Natakamu,
&c., &c., &c.,

WITH AUTHOR'S OWN COMMENTARY.

CALLED

## MANDARAM


PUBLISHED BY

Sree Kodanda Rama Sevaka Dharma Samajam,

ANGALAKUDURU - TENALI.



( ALL RIGHTS RESERVED )


## AYODHYA KANDAMU

**PART-II**

# అయోధ్యాకాండము - విషయసూచిక

## 2వ భాగము.


| | పుటలు |
|---|---|
| 123. శ్రీరామ వనవాస నిమిత్తకమైన దుఃఖమును లక్ష్మణుండు గుహునితోఁ జెప్పుట. | ౬౪౪ |
| 124. శ్రీరాముఁడు గంగను దాటఁ బ్రయత్నించుట | ౬౪౮ |
| 125. సుమంత్రుఁడు తన్నరణ్యమునకుఁ దోడ్కొనిపోవ శ్రీరాముని వేఁడుకొనుట | ౬౫౧ |
| 126. శ్రీరాముఁడు సుమంత్రుని సమాధాన పఱుచుట | ౬౫౩ |
| 127. సుమంత్రుఁడు శ్రీరాముని వదలిపోలేక పరితపించుట | ౬౫౭ |
| 128. శ్రీరామ లక్ష్మణులు జడలు ధరించుట | ౬౬౫ |
| శ్రీరాముని వానప్రస్థాశ్రమ స్వీకార విషయిక చర్చ | ౬౬౭ |
| 129. సీతాదేవి గంగను బ్రార్థించుట | ౬౭౦ |
| తాలకు-గుట్టలకు నదులకు హిందువులు నమస్కరింతురను నాక్షేపమునకు సమాధానము | ౬౭౧ |
| 130. శ్రీరాముఁడు తల్లిదండ్రులఁదలంచి దుఃఖించుట | ౬౭౯ |
| మోక్షమనునట్టి బ్రహ్మానందమునకు భగవంతుఁడొక యుపాయమే యయినను ఆచార్యుఁడంతకంటె సులభోపాయమను విషయము | ౬౮౫ |
| 131. లక్ష్మణుండు శ్రీరాము నూరార్చుట | ౬౮౯ |
| పరమభక్తి నిరూపణము | ౬౯౦ |
| 132. శ్రీరాముఁడు భరద్వాజాశ్రమమునకుఁ బోవుట | ౬౯౨ |
| నమస్కార విషయము | ౬౯౫ |
| 133. భరద్వాజముని శ్రీరామునకుఁ జిత్రకూట మార్గముఁ దెలుపుట | ౭౦౨ |
| 134. సీతారామలక్ష్మణులు శ్యామవటంబుఁ జేరుట | ౭౦౭ |
| 135. శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటమునందలి చిత్రములం జూపుట | ౭౧౦ |
| 136. శ్రీరాముఁడు వాల్మీకి మహర్షిని సందర్శించుట | ౭౧౪ |
| 7. శ్రీరామలక్ష్మణులు చిత్రకూటంబునం బర్ణశాల నిర్మించుట | ౭౧౫ |
| గృహశాంతి విషయిక చర్చ - హింసానిరూపణము | ౭౧౬ |

| | పుటలు |
|---|---|
| 138. సుమంత్రుఁడు మరల నయోధ్యకుఁబోవుట | ౭౨౧ |
| 139. సుమంత్రుని రథముంజూచి పౌరులు దుఃఖించుట | ౭౨౨ |
| 140. సుమంత్రుఁడు దశరథుఁజూచుట | ౭౨౬ |
| 141. దశరథుఁడు సుమంత్రుని శ్రీరామలక్ష్మణుల వృత్తాంతమడుగుట | ౭౨౭ |
| 142. సుమంత్రుఁడు దశరథునకు శ్రీరామ వాక్యములఁ దెలుపుట | ౭౩౦ |
| 143. సుమంత్రుఁడు దశరథునకు లక్ష్మణువాక్యంబులఁ దెలుపుట | ౭౩౨ |
| శ్రీరామ వనవాసదిన విషయిక చర్చ | ౭౩౮ |
| 144. సుమంత్రుఁడు తాను వచ్చు మార్గమునఁజూచిన విశేషములు చెప్పుట | ౭౩౯ |
| 145. సుమంత్రుఁడు పౌరుల దుఃఖమును దశరథునకుఁజెప్పుట | ౭౪౧ |
| 146. సుమంత్రునితో దశరథుఁడు దన్ను శ్రీరాముడున్న చోటికిఁ దీసికొని పొమ్మని చెప్పుట | ౭౪౨ |
| 147. సుమంత్రుఁడు కౌసల్య నూరార్చుట | ౭౪౮ |
| 148. కౌసల్య దశరథునితో నతని దుశ్చేష్టగురించి చెప్పుకొని యేడ్చుట | ౭౫౫ |
| శ్రాద్ధ నిమంత్రణ నిరూపణము | ౭౫౮ |
| 149. దశరథుఁడు కౌసల్యను క్షమింప వేఁడుట | ౭౬౫ |
| 150. దశరథుఁడు తాను జంపిన ముని బాలకు వృత్తాంతముఁ గౌసల్యకుఁ జెప్పుట | ౭౭౨ |
| 151. ఋషి తనపుత్రునకై విలపించుట | ౭౮౯ |
| సహపత్నీవ్రత విచారము | ౭౯౩ |
| 152. ఋషి దశరథుని శపించుట | ౭౯౬ |
| 153. దశరథుఁడు మృతుఁడగుట | ౮౦౨ |
| 154. దశరథు మృతికై యంతఃపురస్త్రీ లేడ్చుట | ౮౦౪ |
| సహగమన విషయము | ౮౦౭ |
| 155. అరాజకత్వ దోషవర్ణనము | ౮౧౪ |
| 156. మంత్రి పురోహితులు భరతునకు దూతల నంపుట | ౮౨౨ |
| 157. భరతుఁడు దుస్స్వప్నముఁగని పరితపించుట | ౮౨౫ |
| స్వప్న విషయము | ౮౨౭ |
| 158. రాజమాతలు భరతునితో సంభాషించుట | ౮౩౦ |
| 159. భరతుఁడయోధ్యకుఁ బ్రయాణంబగుట | ౮౩౫ |

| | పుటలు |
|---|---|
| 160. భరతుఁడయోధ్యా దుస్థితికి వగచుట | ౭౩౭ |
| 161. భరతుఁడు కైకేయి మేడకుఁబోవుట | ౭౪౩ |
| విధవాధర్మములు | ౭౪౪ |
| 162. కైకేయి భరతునకు దశరథుఁడు మరణించుటఁ దెలుపుట | ౭౪౫ |
| 163. కైకేయి భరతునకు శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట దెలుపుట | ౭౫౧ |
| 164. భరతుఁడు కైకేయిని దూషించుట | ౭౫౩ |
| భరతుఁడు తల్లిని దూషించుట దోషముకాదా? | ౭౫౪ |
| 165. భరతుఁడు కౌసల్యఁ జూడఁబోవుట | ౭౬౧ |
| 166. భరతుఁడు కౌసల్యతో శపథంబులు సేయుట | ౭౬౪ |
| శాస్త్రోల్లఘన మొనర్చువాఁడు భగవదనుగ్రహపాత్రుఁడు కాఁజాలఁడను విషయము | ౭౬౮ |
| సన్న్యాసము కలికాలమున నిషిద్ధమనుట | ౭౭౧ |
| 167. కౌసల్య భరతు నూరార్చుట | ౭౭౭ |
| 168. భరతుఁడు తండ్రి శవంబును జూచి యేడ్చుట | ౭౮౦ |
| 169. భరతుఁడు దశరథున కుత్తరక్రియలు సలుపుట | ౭౮౨ |
| క్షత్రియుల కాశౌచము పదునాలు దినములై యుండఁ బదినాళ్ళనుట యెట్లు? | ౭౮౪ |
| సపిండీకరణ విషయము | ౭౮౫ |
| నివాపాదులు పూర్తికాఁగానే కర్తల శ్రేయస్సు కోరినవారు చెప్పవలసిన ఉపశాంతివాక్యములు | ౭౮౮ |
| 170. రాజకర్తలు భరతునిఁ బట్టాభిషేకము చేసికొనఁ బ్రార్థించుట | ౮౦౫ |
| 171. పౌరులు వనమార్గంబును జక్కఁబఱచుట | ౮౦౭ |
| 172. వసిష్ఠుఁడు భరతునిఁ బట్టాభిషేకము చేసికొమ్మని చెప్పుట | ౮౧౪ |
| భరత పారతంత్ర్య నిరూపణము | ౮౧౭ |
| 173. భరతుఁడు శ్రీరాముఁ దోడితేరఁ బ్రయాణమగుట | ౮౨౩ |
| 174. గుహుఁడు భరతుని రాకఁగని సందేహించుట | ౮౨౬ |
| 175. గుహుఁడు భరతునిఁ జూడవచ్చుట | ౮౨౮ |
| 176. గుహుఁడు భరతునుద్దేశంబు సందేహించి యడుగుట | ౮౩౧ |
| 177. గుహుఁడు భరతునకు లక్ష్మణ వృత్తాంతముఁ దెలుపుట | ౮౩౮ |

| | | పుటలు |
|---|---|---|
| | గుహుని పలుకులువిని భరతుఁడు దుఃఖించుట | ౯౪౩ |
| 178. | భరతుఁడు గుహుని సీతారాముల నిద్రాహార విషయంబు లడుగుట | ౯౪౫ |
| | భరద్వాజుం డిచ్చినదాని శ్రీరాముఁ డెట్లు పరిగ్రహించెను? | ౯౪౭ |
| | శ్రీరాముఁడు పరుండినస్థలమును గుహుఁడు భరతునకుఁ జూపుట | ౯౪౮ |
| 179. | శ్రీరాముఁడు పరుండిన స్థలముఁ జూచి భరతుఁడు పరితపించుట | ౯౫౦ |
| 180. | భరతుఁడు గంగానది దాఁటుట | ౯౫౭ |
| 181. | భరతుఁడు భరద్వాజమహర్షిని సందర్శింపఁ బోవుట | ౯౬౧ |
| 182. | భరద్వాజుఁడు భరతుని రాకకుఁ గారణ మడుగుట | ౯౬౩ |
| 183. | భరద్వాజుఁడు భరతునకు విందుపెట్టుట | ౯౬౯ |
| 184. | భరతుఁడు భరద్వాజర్షిని రామాశ్రమంబునకుఁ ద్రోవయడుగుట | ౯౮౫ |
| 185. | భరతుఁడు భరద్వాజునకుఁ దనతల్లుల నెఱింగించుట | ౯౮౭ |
| 186. | భరతుఁడు చిత్రకూటంబునకుఁ బ్రయాణమగుట | ౯౯౦ |
| 187. | భరతుఁడు శత్రుఘ్ననకుఁ జిత్రకూట వనంబు వర్ణించిచెప్పుట | ౯౯౩ |
| | నివృత్తిమార్గ నిష్ఠా వివరణము | ౯౯౭ |
| 188. | శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటంబున వినోదములఁ జూపుట | ౯౯౮ |
| | వనవాస విషయము, గృహస్థాశ్రమ ప్రాశస్త్యము | ౧౦౦౩ |
| 189. | శ్రీరాముఁడు సీతకు మందాకినీ నది వర్ణించి చెప్పుట | ౧౦౦౬ |
| 190. | లక్ష్మణుండు శ్రీరామునితో భరతుఁడు సేనలతో వచ్చుట దెలుపుట | ౧౦౧౪ |
| 191. | భరతునిపైఁ గినిసిన లక్ష్మణుని శ్రీరాముఁడు శాంతిపఱచుట | ౧౦౧౮ |
| 192. | భరతుఁడు పాదచారియై శ్రీరామాశ్రమంబు వెదకుట | ౧౦౨౫ |
| 193. | భరతుండు రామాశ్రమంబుఁ జూచుట | ౧౦౨౯ |
| | శ్రీరాముఁ డౌపాసన మొనరించు విషయము | ౧౦౩౩ |
| 194. | భరతుఁడు శ్రీరాముని దర్శించుట | ౧౦౩౮ |
| 195. | శ్రీరాముఁడు భరతుని కుశలప్రశ్న సేయుట | ౧౦౪౨ |
| 196. | శ్రీరాముఁడు కుశలప్రశ్నవ్యాజంబున భరతునకు ధర్మోపదేశము సేయుట | ౧౦౪౪ |
| 197. | రామలక్ష్మణులు తండ్రికి నివాపము లిచ్చుట | ౧౦౮౫ |
| | పిండప్రదాన విషయిక చర్చ | ౧౦౮౯ |

| | పుటలు |
|---|---|
| 198 పౌరులు శ్రీరాముని పర్ణశాలకుఁ బోవుట | ౧౦౯౨ |
| 199. కౌసల్య సుమిత్రకు శ్రీరామలక్ష్మణుల మేటినీటిరేవుఁ జూపి దుఃఖించుట | ౧౦౯౫ |
| 200. కౌసల్యాదులు శ్రీరాముని జూచుట | ౧౦౯౮ |
| ఇత్వసంధిని గుఱించి | |
| 201. శ్రీరాముఁడు భరతునితో నీవు నిర్దోషివని చెప్పుట | ౧౧౦౬ |
| 202. భరతుఁడు శ్రీరాముని రాజ్యము గ్రహింపఁ బ్రార్థించుట | ౧౧౧౧ |
| 203. శ్రీరాముఁడు భరతునకు దుఃఖోపశాంతి వాక్యంబులు చెప్పుట | ౧౧౧౫ |
| 204. భరతుఁడు శ్రీరామునితోఁ దన దుఃఖమునకుఁ గారణము చెప్పుట | ౧౧౨౬ |
| 205. భరతుఁడు శ్రీరామునితో వనవాసంబతని కర్తవ్యధర్మంబుగాదనుట | ౧౧౩౨ |
| గృహస్థాశ్రమ ప్రాశస్త్యము | ౧౧౩౪ |
| 206. శ్రీరాముఁడు భరతునితో నతఁడు రాజగుట ధర్మమని చెప్పుట | ౧౧౪౧ |
| 207. జాబాలి శ్రీరామునితో నాస్తికవాక్యములఁ జెప్పుట | ౧౧౪౫ |
| చార్వాకమతము | ౧౧౫౧ |
| 208. శ్రీరాముఁడు జాబాలికి సత్యమవశ్యానుష్ఠేయమని బోధించుట | ౧౧౫౬ |
| 209. జాబాలికి శ్రీరాముఁడు కర్మంబవశ్య కర్తవ్యంబని చెప్పుట | ౧౧౭౮ |
| 210. జాబాలి శ్రీరామునితోఁ దన్ను క్షమింప వేఁడుట | ౧౧౮౫ |
| 211. వశిష్ఠుఁడు శ్రీరామునితో జ్యేష్ఠుఁడు రాజ్యార్హుఁడని పూర్వరాజ వృత్తాంతముఁ జెప్పుట | ౧౧౮౭ |
| 212. వసిష్ఠుఁడు శ్రీరాముని రాజ్యంబుఁ గొనుమని వేఁడుట | ౧౧౯౨ |
| 213. శ్రీరాముఁడు వసిష్ఠునితో నాచార్యులకంటెఁ దల్లిదండ్రులు శ్రేష్ఠులని చెప్పుట | ౧౧౯౭ |
| 214. శ్రీరాముఁడు వనవాసానంతరము రాజ్యంబుఁ గొన నంగీకరించుట | ౧౨౦౩ |
| 215. శ్రీరాముఁడు భరతుని సమాధానపఱుచుట | ౧౨౦౯ |
| 216. శ్రీరాముఁడు భరతునకు దనపాదుక లొసంగుట | ౧౨౧౦ |
| 217. భరతుఁ డయోధ్యకుఁ బ్రయాణమయి భరద్వాజాశ్రమంబుఁ జేరుట | ౧౨౧౩ |
| 218. నిరానందమైన యయోధ్యాపురి వర్ణనము | ౧౨౧౬ |
| 219. భరతుఁడు మరల నయోధ్యఁ బ్రవేశించుట | ౧౨౨౧ |
| 220. భరతుఁడు నందిగ్రామముఁ జేరుట | ౧౨౨౩ |

| | | పుటలు |
|---|---|---|
| 221. | ఋషీశ్వరులు చిత్రకూటంబు విడిచిపోవుట | ౧౨౩౨ |
| | వృద్ధఋషి తమకష్టంబుల శ్రీరామునితోఁ జెప్పుట | ౧౨౩౩ |
| 222. | సీతారామలక్ష్మణు లత్రిముని యాశ్రమంబుఁ జేరుట | ౧౨౩౬ |
| 223. | సీత కనసూయ హితోపదేశంబుఁ జేయుట | ౧౨౪౦ |
| 224. | సీత యనసూయ వాక్యంబులకు మోదించుట | ౧౨౪౪ |
| 225. | అనసూయ సీతాదేవి కంగరాగాదు లిచ్చుట | ౧౨౪౭ |
| 226. | సీత యనసూయకుఁ దన స్వయంవరము వృత్తాంతముఁ జెప్పుట | ౧౨౪౯ |
| 227. | అనసూయ సీతకు సాయంకాలము వర్ణించి చెప్పుట | ౧౨౫౪ |
| | భూతపిశాచము లెవ్వరిని బాధించునను విషయము | ౧౨౫౫ |

తాత్పర్యము.

అన్న పాదములు కడిగి తడియొత్తిపోయి చెట్టుక్రింద లక్ష్మణుఁ డుండఁగా సుమంత్రునిఁగూడి గుహుఁడు శ్రీరాముని గుణాతిశయములను ప్రసంగించుచు నెక్కువ ప్రేమచే విల్లెక్కు బెట్టి తెప్పవ్రాల్పక నిద్రపోక శ్రీరామచంద్రుని రాత్రి యంతయు రక్షించుచుండెను.

కం. ధీమంతుండు యశస్వి ద,యామండనుఁడు మహాత్ముఁ • డవిదితకష్టుం
డామహిపసుతుఁడు సుఖ యా,భూమిం బన్నుండ రేయి • పోయెఁ మెల్లన్.
౧౩౯

ధీమంతుండు = సత్యవాక్య పరిపాలనము వ్రతముగ సాధింపవలయునను బుద్ధిగలవాఁడు. యశస్వి = అకారణముచేతనే కీర్తిని సంపాదించినవాఁడు. దయామండనుఁడు = సర్వభూతదయయే యాభరణముగాఁ గలవాఁడు. మహాత్ముఁడు = గొప్ప మనస్సుగలవాఁడు. అవిదితకష్టుండు = కష్టమిట్టిదని యెఱుఁగనివాఁడు. (౧) సుఖమునే యనుభవించినవాఁడు (౨) సమచిత్తుఁడు. ద్వంద్వాతీతుఁ డగుటచే నిది సుఖమని యిది దుఃఖమని భేదము తెలియనివాఁడు. మహిపసుతుఁడు = రాజకుమారుఁడు. సుఖ = ఇతరులకుఁ గష్టములుగాఁ దోఁచినవికూడఁ దనకుసుఖముగానే యెంచువాఁడు. పన్నుండఁగ = పండుకొని యుండఁగా. మెల్లఁగ = మెల్లగాఁబోయెను. వేగిరముపోయిన సదయుఁడైన నీయన యడవులలోఁ గష్టపడవలసి వచ్చెనే యని మెల్లగాఁ బోయెను.

తాత్పర్యము.

బుద్ధిమంతుఁడును - కీర్తిమంతుఁడును-కృపాభూషణుఁడును-మహాత్ముఁడును - కష్టమెఱుఁగనివాఁడును - నగు రాజకుమారుఁడు సుఖముగా నాభూమిమీఁదఁ బండుకొని యుండఁగా మెల్లగా రాత్రి గడచిపోయెను.

౫౧-వ సర్గము.

ఉ. అన్ననిమిత్తమై వగ య • థార్థము మేల్కనియున్న లక్ష్మణున్
సన్నుతశీలుఁ గన్గొని భృ • శం బగుశోకముతో గుహుండు నో
యన్న! త్వదర్థమై యిదె శ • యం బుపకల్పిత మయ్యె, దాన సౌ
ఖ్యోన్నతి నిద్రపొమ్ము శ్రమ • మూడఁగ, నీ విటు లుండ నేటికిన్. ౧౩౪౦

వగయథార్థము = వాస్తవమైన దుఃఖము. యథార్థము మేల్కనియున్న = కలుకుపాటులేక - తెప్పవ్రాల్పక మేల్కని యుండెను. సన్నుతశీలున్ = సజ్జనులచేతఁ బొగడఁబడిన నడవడి గలవానిని. భృశము = అధికము. త్వదర్థమై=నీనిమిత్తమై. శయంబు = పడక. ఉపకల్పితమయ్యెన్ = ఏర్పాటుకాఁబడెను. సౌఖ్యోన్నతిన్ = సౌఖ్యాతిశయముచే.

తా త్ప ర్య ము.

అన్నయగు శ్రీరామచంద్రుని కొఱకు వంచనలేని దుఃఖము గలవాఁడై వంచనలేక మేలుకనియున్న, సాధువులచేఁ బొగడఁబడిన, సదవడి గలట్టి లక్ష్మణునిఁ జూచి యధికమైన దుఃఖముతో గుహుండు అన్నా లక్ష్మణా నీనిమిత్తమై యిదిగోఁ బరుక యేర్పాటు కాఁబడినది. దానిపై యథాసుఖముగ నిదురింపుము. బడలిక తీరును. నీవేల యిటుల మేల్కని యుండవలెను.

ఉ. మానితరాజపుత్ర ! సుకు • మారుఁడ వీ విట నున్నవారలో
కానలయందు ద్రిమ్మరెడి • కర్కశదేహులు గాన జానకీ
జానిని జాగరూకత ని•శాసమయంబున నప్రమత్తులై
పూనికఁ గాచు చుండుదుము • పొమ్ము శయింపు యథాసుఖంబుగన్. ౧౩౨౧

నేను మేల్కొనక యున్న శ్రీరామునకేమైన నపాయమువచ్చిన నేమి చేయవలయు నందువేమో.

మానితరాజపుత్ర = గౌరవింపఁబడు రాజకుమారా. నీవు రాజపుత్రుఁడవగు కారణముచేతనే గౌరవింపఁబడఁ దగినవాఁడవు. అదియునుగాక సుకుమారుఁడవు. ద్రిమ్మరెడి=తిరిగెడి. కర్కశదేహులు = ఎంతకష్టమైన నోరువఁగల కఠినదేహములు గలవారు. జానకీజానిని = జానకినిజాయ (భార్య)గాఁ గలవానిని, బహువ్రీహి సమాసాంతమున జాయ జానియగు. సు. వ్యా. సమా ౬౯ సూ. శ్రీరాముని. జాగరూకతఁ = హెచ్చరికతో. నిశాసమయంబునన్ = రాత్రికాలమందు. అప్రమత్తులై = ప్రమాదపడనివారై.

తా త్ప ర్య ము.

పూజ్యుఁడవైన రాజకుమారా! నీవు సుకుమారుఁడవు. ఇక్కడ నున్నవారో యడవులయందే తిరుగ నభ్యాసపడిన కఠినదేహులు. కావున శ్రీరాముని రాత్రి యంతయు హెచ్చరిక గలవారమై ప్రయత్నముతో గాచుచుండెదము. నీవుపోయి సుఖముగ శయనింపుము. శ్రీరామునకేమో యను భయము లేదు.

ఉ. ఏమన రాము కంటెఁ బ్రియుఁ • డెవ్వఁడు నెందును లేడు నాకు, నీ
భూమిని సత్య మిద్ది యన•పోహము సత్యము పైఁ బ్రమాణ మా
సీమహితాత్మసత్కృపఁగ•దే మహనీయయశంబు గేవలం
బామహితార్థమున్ విపులమైన • సుధర్మముఁ గందు నాయనా ! ౧౩౨౨

మాయన్న నిమిత్తమై నీవింత శ్రమపడనేల యందువా? అనపోహము = అసత్యముగాదు. కేవలం బామహితార్థమున్ = కేవలము గొప్ప ప్రయోజనము - మోక్షము.

తా త్ప ర్య ము.

శ్రీరాముని నిమిత్తమై పీక్రమము మేల? వందుకొమ్మనెదవా? విను. శ్రీరామునకంటె నెక్కువ ప్రీతి పాత్రుఁడు నాకెచ్చట నెవ్వఁడులేఁడు. ఆయన యందు నాకంతటి యనన్యభక్తికలదు. ఇది యపోహముగాదు. సత్యముపైఁ బ్రమాణముచేసి చెప్పెదను. ఈమహానుభావు దయచేఁగదా గొప్పకీర్తి యసమాన మైన గొప్పప్రయోజనము విస్తారమైన మంచి ధర్మఫలము గానఁగలను. అట్టివానినే నుపేక్షింతునా?

ఉ. జ్ఞాతులు నేను నల్గడల • సజ్యశరాసనముల్ ధరించి సం
ప్రీతిగఁ గూర్కు-మామకసు•హృత్తమునిన్ సహదారు నప్రమా
దాతతరీతిఁ గాతుఁ జతు•రంగబలంబు లెదిర్చి నేనియున్
ఖ్యాతిగ నాయెఱుంగని దొ•కండును లేదు వనాంతరంబునన్.  ౧౩-౨౩

జ్ఞాతులు = బంధువులు. నల్గడలన్ = నాలుగు దిక్కులందు. సజ్యశరాసనముల్ = ఎక్కుపెట్టఁబడిన విండ్లు. మామక = నా. సుహృత్తమునిన్ = మిత్రులయందు శ్రేష్ఠుఁడగు వానిని. సహదారున్ = భార్యతోఁ గూడినవానిని. అప్రమాదాతతరీతిన్ = విస్తారమైన హెచ్చరికతో. కాతున్ = రక్షింతును. వనాంతరంబునన్ = అడవిలోపల.

తా త్ప ర్య ము.

భార్యతోడ నిదురించు నా ప్రియమిత్రుని నేను నాబంధువులు నెక్కుపెట్టిన విండ్లతో నాలుగు ప్రక్కల మిగుల హెచ్చరికతోఁ జతురంగబలములతో నెవఁడైన నెదిరించినను నిద్రాభంగము కాకుండ రక్షింపగలను. ఈ యరణ్యమునందు నాకుఁ దెలియనట్టివ్వరును రాలేరు.

ఉ. జంకకు మన్న లక్ష్మణుఁడు • జాలి ననున్ గుహు లేదు భీతియేన్
శంకయు నేని ధర్మమతి • సర్వవిధంబుల నీవు గావఁగాఁ
బంకజనేత్రుఁ డైనరఘు • వర్యుఁడు సీతయు గొడ్డునేలపై
గొంకక పవ్వళింపఁగను • గూర్కఁగ నాకది యెట్లు సాధ్యమా!  ౧౩-౨౪

జంకకుము = సందేహపడకుము. శంకాతద్భవము జంకు. జాలిన్ = వ్యసనముతో. ధర్మమతిన్=ధర్మముతోఁగూడిన మనస్సుతో. గొడ్డునేలపై =ఆచ్ఛాదనము లేని భూమిమీఁద. పవ్వళింపఁగను = పండుకొనఁగా. కూర్కఁగన్ = నిదురింపఁగా.

తా త్ప ర్య ము.

లక్ష్మణా! మీరు కావఁగలరోలేరో మీరినట్లు నమ్మవచ్చునని సందేహింపకుము. అనిన గుహునితో లక్ష్మణుఁ డిట్లనియె. మిత్రమా నేను నిద్రపోక యుండుటకు శ్రీసీతారాముల కపాయము మేదైనఁ గలుగునో యను భయము కారణముగాదు. నీవు రక్షింపలేవేమో యను సందేహముగాదు. ఏలయనఁగా నీవు భయముచేఁ

చేయవలసి వచ్చునే యని చేయువాఁడవు గావు. భక్తిని ధర్మమనుసరించి శ్రద్ధతో నన్ని విధములఁ నీవు రక్షించుచున్నావు. రక్షింపగలవు. కాని కమలములవంటి నేత్రములుగల శ్రీరాముఁడును నట్టిదేయగు సీతయు నుత్తనేలమీఁద, నేకొంతుకు లేక, పండుకొని యుండఁగా సుఖనిద్రమాట యటులుండనీ నేను కన్నుమూయుటకు నైన నాకు సాధ్యమా. నేనుమూయఁ బ్రయత్నించినను తెప్పలు మూఁతలు పడునా? అసాధ్యకార్యము నేనెట్లు చేయఁగలను?

—•{ శ్రీరామవనవాసనిమిత్తక మైనదుఃఖమును లక్ష్మణుఁడు గుహునితోఁ జెప్పుట. }•—

ఉ. కంటికి నిద్రవచ్చునే, సు • ఖం బగునే బ్రదు కైన, మానసం
బంటునె భోగముల్. ప్రియహి • తా! దితిజామరకోటి నేనియుఁ
గెంటఁగ జాలు గంటుకొనఁ • గేలిగ నట్టిమహాత్ముఁ డిందు వా
ల్గంటియుఁ దాను జీర్ణతృణ • కల్పితశయ్యఁ బరుండి యుండఁగన్. ౧౩-౫౫

ప్రియహితా = మిక్కిలి ప్రీతిగల మిత్రుఁడా. దితిజామరకోటి = దైత్యులయు దేవతలయు సమూహములను, కంటుకొనన్ = విరోధించెనేని, కేలిగన్ = ఆటవలె నవలీలగ. గెంటఁగఁజాలుఁ = తఱుమఁగొట్టఁగలఁడు. వాల్గంటి = స్త్రీ; జీర్ణతృణ కల్పితశయ్యన్ = చివికిన గడ్డిచే నేర్పఱిచిన పకుకమీఁద. పరుఁడి = పండుకొని.

తా త్ప ర్య ము.

ప్రియ మిత్రుఁడా! దేవదానవసంఘములనైనను విరోధించెనేని యవలీలగ నాటవలెఁ దఱుమఁగొట్టఁగల మహాసమర్థుఁడు తాను దన భార్యతోఁ జివికినగడ్డి పడుకమీఁదఁ బండుకొనఁగా నాకెట్లు కంటికి నిద్రవచ్చును. బ్రదుకైన నెట్లు సుఖం బగును. భోగములు మనస్సునకైన రుచించునా!

చం. తపమునఁ గ్లేశపాటున వె • తం గని యొక్కని నాత్మతుల్యు నా
యపరిమిత ప్రతాపుని వ • నాంతరవీథులఁ ద్రోచి యాజి దాఁ
గృపణతఁ బెద్దకాలము మ • హిన్ మని యుండుట కల్ల; మిత్రమా!
విపుల యనాథ యై చెడెడు • వేగము సత్యము చూచు చుండుమీ. ౧౩-౫౬

తపమునన్ = ఉపవాసాది వ్రతములను. క్లేశపాటున = యజ్ఞాది శ్రమముల యొక్క, వెతన్ = బాధచేత. ఆత్మతుల్యున్ = గుణములందుఁ దనతో సమానుని. ఒక్కని = ముఖ్యుని. అపరిమిత ప్రతాపుని = పరిమితిలేని ప్రతాపము గలవానిని. ఆజి=దశరథుఁడు. కృపణతన్ = దీనత్వముచే. మని = బ్రదికి. కల్ల = అబద్ధము. విపుల = భూమి. అనాథయై = దిక్కులేనిదై.

తా త్ప ర్య ము.

ఉపవాసాది వ్రతములచేతను యాగాదులవలని వెతలచేతను, లేకలేక తన వంటివాని నొక్క కుమారుని, మితిచెప్పరాని పరాక్రమము గలవానిని, గాంచి

కడపట నతని నడవులపాలుచేసిన దశరథుఁడు దుఃఖమున కీనుఁడై చాలఁగాలము భూమిమీఁద బ్రతికియుండుట యసత్యము కావున భూమి దక్కలేనివై త్వరలోనే చెడును. నామాట సత్యము చూచుచుండుము.

కం. వేడిచి యేడిచి హా యని, చేడెలు గాసిల్లి సొమ్మ • సిలి పడ ధరపై
నేఁడుపురొద లే కున్నది, ఏ డెల్లను నుండుఁ గాదె • విగతధ్వని నై. ౧౩౨౬

విగతధ్వని = ధ్వనిలేనిది.

తా త్ప ర్య ము.

హాయని స్త్రీలందఱు నేడిచి యేడిచి గాసిపడి మూర్ఛపోయి భూమిమీఁదఁ బడఁగా నేడుపుధ్వనియైన లేక రాజగృహము పాడుపడినట్లు ధ్వనిలేకయుండునుగదా.

కం. వనితామణి కౌసల్యయు, జననాథాగ్రణియు నాదు • జననియు నీ రే
యినినైన నెల్ల వారును, మని యుందురొ యనుచు • మది శంకింతున్. ౧౩౨౭

తా త్ప ర్య ము.

వనితారత్నమైన కౌసల్యయు రాజు నాతల్లి లక్కనవా రీరాత్రియైన బ్రతికి యుందురా యని నేను సందేహించుచున్నాను.

కం. మనిన మనవచ్చుఁ జుమి నా,జనయిత్రి మనంబు నిల్పి • శత్రుఘ్ననిపై
మన నేర దనుచు వగచెద, జనసుత వీరసువు రాముజనని క్షీణంబున్. ౧౩౨౮

తా త్ప ర్య ము.

శత్రుఘ్నుని మీఁది ప్రేమచే నతఁడైన నున్నాఁడుకదా యని నాతల్లి సుమిత్రాదేవి బ్రదికిన బ్రదుకు నేమోకాని వీరునిగన్న తల్లియని ప్రసిద్ధిగన్న కౌసల్యాదేవి యొక్క క్షీణమైన నిఁక జీవింపదని దుఃఖించెదను.

కం. అనురక్తజనాకీర్ణయు, ననఘజనసుఖావలోక • నాహ్లాదద యా
ఘననగరి రాజుఁ గూర్చి వ్యసనసంకులయగుచుఁ జెడును • సత్యము హితుఁడా.

తా త్ప ర్య ము. ౧౩౩౦

అనురక్త జనాకీర్ణయు = అనురాగముగల జనులచే - సర్వత్రనిండినది. అనఘ జన = దోషరహితులైన జనులకు, సుఖావలోక నాహ్లాదద = సుఖమైన చూపులకు సంతోషము నిచ్చునది. ఘననగరి = గొప్ప పట్టణము. వ్యసన సంకుల = వ్యసనముచేఁ గలఁతనొందినది.

తా త్ప ర్య ము.

అనురాగముగల జనులచే నిండినదియుఁ బుణ్యాత్ములైన జనుల సుఖకరములైన చూపులకు సంతోషము కలిగించునదియు నగు పెద్దపట్టణము రాజు మరణించిన కారణమున - వ్యసనముచేఁ గలఁతి చెంది చెడుట సత్యము.

ఆ. తనదు పెద్దకొడుకు ♦ జననుతచారిత్రుఁ, బ్రియు మహానుభావు ♦ నయగుణాఢ్యు
రాము సౌకుమార్య ♦ ధాముఁ జూడక రాజు, మేనితోడ నెట్లు ♦ మెలఁగువాఁడు

తా త్ప ర్య ము. ౧౩౩౧

రాజమరణము నిశ్చయించి యింతిపట్టుగఁ జెప్పెదవే. అదియెట్లు లందువేని వినుము. జ్యేష్ఠ కుమారుఁడు లోకులందఱచేత శ్లాఘింపఁబడిన నడవడి గలవాఁడు. నీతిగుణ సంపద గలవాఁడు. సుకుమారత్వమునకు స్థానమైనవాఁడు నగు శ్రీ రాముని జూడక రాజు దేహము ధరించి యెట్లు తిరుగఁగలఁడు. కావున నాయన చచ్చుటయే సిద్ధము. నిరపరాధిని నిష్కారణముగఁ బెద్దకొడుకును నడవులపాలు చేసి పుత్రశోకముచేతను శాపబలముచేతను జావక బ్రదికెనేని యంత కఠినచిత్తుఁడు నంతటి మహాపాపి మఱియొకఁ డుండఁడు.

కం. పతి నృపతి గతించుట గని, పతి యగుకౌసల్య బిడ్డ ♦ సత్వరముగ, నా
పతిగతిఁ గని నాజననియుఁ, బతితోడిద లోక మనుచుఁ ♦ బ్రాణము విడుచున్.

తా త్ప ర్య ము. ౧౩౩౨

రాజు మరణించుటఁజూచి పతివ్రతయగు కౌసల్యయుఁ ద్వరగాన చచ్చును. కౌసల్య మరణించుట చూచి నాతల్లియుఁ బతిలోకమే తనకని ప్రాణము వదలును.

శా. ఖించెన్ ఖించె గతించె సర్వమును భూ ♦ మీనాథుఁ డీరాముఁ దా
నెంచెన్ రాజుగఁ జేయఁ, జేయకయ ము ♦ న్నే యీల్గు, నన్వేళఁ దా
మాలచుం జేరి భజించి యానృపతిని ♦ ర్యాణంబునం బైతృకో
దంచత్కార్యము లెల్లఁ దీర్చెదరు సి ♦ ద్ధార్థుల్ తనూసంభవుల్. ౧౩౩౩

ఈల్గున్ = చచ్చును. అంచున్ = సమీపమందు. నిర్యాణంబునన్ = మరణంబున. పైతృకోదంచత్కార్యములు = చచ్చినవారికిఁ జేయవలసిన యౌర్ధ్వదైహిక క్రియలు. సిద్ధార్థుల్ = కృతార్థులు. తనూసంభవుల్=కొడుకులు భరతశత్రుఘ్నులు.

తా త్ప ర్య ము.

సర్వము ఖించిపోయెను. ఇప్పుడు చేయఁదగిన దేదియులేదు. ఏమి ఖించిన దందువా. రాజు శ్రీరాముని రాజుగఁ జేయనెంచెను. అట్లు చేయుటకు ముందే చచ్చును. రాజు మరణించిన సమయమున భరతశత్రుఘ్నులు సమీపమున నుండి కొడుకులు చేయవలసిన యౌర్ధ్వలోక క్రియలు దీర్చి కృతార్థులయ్యెదరు. మాకా భాగ్యముకూడ లేదు.

సీ. అక్కటా తండ్రికి ♦ నౌర్ధ్వదైహికముల, భరతశత్రుఘ్నులు ♦ పరఁగఁ దీర్చి
రమ్యచత్వరముల ♦ రమణీయపథములఁ, బ్రాసాదహర్మ్యాది ♦ భవనములను
వారముఖ్యల రథ ♦ వారణవాజుల, నవ్యతౌర్య తిక ♦ నాదములను
హృష్టపుష్టప్రజా ♦ బృందంబులను సర్వ, కళ్యాణసంపూర్ణ ♦ కలనములను

తే. నిష్కుటారామచయముల • నిత్యవరస, మాజమహముల నొప్పు పే• రోజ నాదు
తండ్రి యేలెడియారాజ•ధానియందు, సంచరింతురు వారలు • సమ్మదమున. ౧౩౬౪

అక్కటా = అయ్యో! ఔర్ధ్వదైహికములన్ = మరణించినవారి కూర్ధ్వ లోకముల సుఖము కలుగుటకై చేయు పితృకార్యములు. రమ్యచత్వరములన్ = మనోహరములైన ముంగిళ్లచేతను రమణీయ పథములన్ = అందమైన బాటలచేతను ప్రాసాద = దేవాలయములు- రాజులయిండ్లు. హర్మ్య=ధనికుల యిండ్లు. "హర్మ్యాది ర్ధనినాంవాసః ప్రాసాదో దేవభూభుజా"మ్మని యమరుఁడు. వారముఖ్యల=వార స్త్రీలయందు ముఖ్యలగు వారియొక్కయు. తృతీయాసప్తములకుఁ బ్రాయికముగ జడంబునకు ద్వితీయ బహుళంబుగనగు. సు. వ్యా. కారక. ౭౧ సూ. నాహ్వైకదేశే నామగ్రహణమ్మని వారస్త్రీ వార యని చెప్పఁబడియె. ఇట్లులే సత్యభామను భామ యని కాని సత్యయని కాని భీమసేనుని భీముఁడని ప్రయోగములు కలవు. నవ్య తౌర్యత్రిక నాదముల = మనోహరములగు నృత్తగీత వాద్యముల యొక్కయు. ఈ మూఁటికిఁ దౌర్యత్రికమని పేరు. హృష్టపుష్ట ప్రజాబృందములన్ = సంతోషము తోడి పుష్టిగల జనుల సమూహములచేతను. సర్వకల్యాణ సంపూర్ణ కలనములను = పుత్రజన్మాదులగు శుభకార్యముల యొక్కయుఁ బూర్ణముగ నిండియుండుటను. నిష్కుటారామ చయముల = ఇంటికిఁ జేరిన తోఁటల సమూహములచేతను. నిత్య వరసమాజ మహములన్ = ఎడఁదెగక జరగు గొప్ప సభలయుత్సవములచేతను. పేరోజన్=గొప్ప కాంతిచే.

తాత్పర్యము.

అయ్యో తండ్రికి నూర్ధ్వలోక క్రియలుదీర్చి భరతశత్రుఘ్నులు నందము లైన ముంగిళ్లచేతను మనోహరములైన బాటలచేతను ప్రాసాదములు హర్మ్యములు మొదలైన యిండ్లచేతను నుత్తమ వేశ్యలచేతను రథములు నేనుఁగులు గుఱ్ఱములు వీనిచేతను శ్రవ్యములైన నృత్యగీత వాద్యములను మూఁడు విధములైన వాద్య ధ్వనులచేతను సంతోషించినట్టియుఁ బుష్టిగలట్టియు జనుల సమూహము చేతను - అన్నివిధములైన శుభకార్యములు పూర్ణముగాఁ గూడియుండుటచేతను. ఇండ్లకు జేరిన తోఁటల గుంపులచేతను. ఎల్లప్పుడు జరగు గొప్ప సభలయుత్సవములచేతను నొప్పు గొప్పకాంతిచే నాతండ్రి యేలు రాజధానియందు సంతోషముతో సంచ రింతురు.

ఉ. అంతకు జీవయుక్తుఁ డయి • యాజి మెలంగుచు నుండ నేము ని
శ్చింత మరణ్యవాసమును• జేసి ప్రతిజ్ఞను దీర్చి యాపయిన్
గాంతుమొకో యయోధ్య, మఱి • గాదిలితండ్రిపదాబ్జ మెయ్యెద
రిర్పితుమె మిత్రమా! యనుచుఁ•జెప్పుచు నుండ గతించె రేయియున్. ౧౩౬౫

అంతకున్ = అంతవఱకు. మేము మరలివచ్చువఱకు జీవయుక్తుఁడు = ప్రాణములతో నుండువాఁడు. నిశ్చింతము = ఏచింతలేక. నిశ్చింతము అవ్యయీభావ సమాసము. గాదిలి = ప్రీతిగల. ఇంతవఱకు నూరువిడిచిన రెండవనాఁటి చరిత్రము.

తా త్ప ర్య ము.

మే మరణ్యవాసమునుండి మరలి వచ్చువఱకు దశరథుఁడు జీవించియుండెనేని మేము కాననవాసము ముగించి ప్రతిజ్ఞ దీర్చి యామీఁద నయోధ్యఁజూడఁగలమా. తండ్రి పాదకమలములను దర్శింపఁగలమా. మేము ప్రతిజ్ఞ దీర్చినను దండ్రి జీవించి యుండఁడేని యయోధ్యయందు మాకేమికార్యము అచ్చటికి మరలఁ బోనేల యని చెప్పుచునుండఁగనే రాత్రి గడచిపోయెను.

కం. గురుసౌహృదమున లక్ష్మణుఁ, డురుశోకమునం దపించు♦చుండఁగ గుహుఁడున్
బరమార్తిఁ గార్చె నశ్రులు, జ్వరపీడిత మగుమతంగ♦జంబును బోలెన్. ౧౩౩౭

గురు సౌహృదమునన్ = అన్న తండ్రి ఏరియందలి స్నేహభావముచే. మతంగజంబును=ఏనుఁగును.

తా త్ప ర్య ము.

అన్నయందలి తండ్రి యందలి స్నేహభావముచే లక్ష్మణుఁ డధిక శోకంబునఁ బరితాప పడుచుండఁగా నిట్టివారి కిట్టిదశ వచ్చెఁగదాయని గుహుఁడును నధిక దుఃఖముచే జ్వరబాధపడు నేనుఁగువలెఁ గన్నీరు కార్చెను.

—♦ ౫౨వ సర్గము. శ్రీరాముఁడు గంగను దాఁటఁ బ్రయత్నించుట. ♦—

ఉ. లాలితమూర్తి లేచి శుభ ♦ లక్షణు లక్ష్మణుఁ జూచి తమ్ముఁడా
యోలి గతించె రేయి యరు♦ణోదయవేళయు డాసె వింటివే
మేలికలస్వనంబులను ♦ మే లొ్ాలిపెం బికకేకిలోక ప
త్ర్యాళి, దరింపఁగాఁ జనుద♦మా వడిఁ బాఱెడిజాహ్నవీనదిన్. ౧౩౩౮

లాలితమూర్తి=ఇంతిగాసి పడినను అందమైన యాకారముగల శ్రీరాముఁడు. ఓలి=క్రమముగా. అరుణోదయవేళయు =సూర్యోదయమగు సమయము. డాసెన్= సమీపించెను. మేలికల స్వనంబులను = మేలైన యవ్యక్త మధుర ధ్వనులచే. పికకేకి లోకపత్ర్యాళి = కోవిలలు, నెమిళ్లు వీని సమూహము, పక్షిగుంపు. తరింపఁగాన్ = దాఁటఁగా. జాహ్నవీనదిన్ = గంగానదిని.

తా త్ప ర్య ము.

దేహకష్టము మనోవ్యథ రెంటిచేతను బీడింపఁబడినను ముఖవర్చస్సు మాఱని శ్రీరాముఁడు నంతటి గాసిపడియు ముఖప్రసన్నతను వదలక శుభచిహ్నములే గానఁజేయు లక్ష్మణుఁజూచి తమ్ముఁడా రాత్రి క్రమముగాఁ గడచిపోయెను. సూర్యోదయవేళ కావచ్చినది. కోకిలలు నెమిళ్లు లోనగు పక్షులు అవ్యక్త మనోహర

ధ్వనులచే లోకులను మేలుకొలుపుచున్నవి. వేగముగఁ బాఱుచున్న గంగానదిని దాఁటఁ బోవుదమా.

చం. అనుడు సుమంత్రునిన్ గుహుని • నాతఁడు మీరలు వింటిరే కదా
యనఘుని దేశమంచుఁ దన•యన్నకడన్ నిలువన్, గుహుండు చ
య్యనఁ దనమంత్రులం బిలిచి • యంద అరిత్రచయాన్వియుక్తనా
వను సమకట్టుఁడీ దృఢము • వర్ణ్యము నావికవంతమున్ వెసన్. ౧౩౩౮

నిదేశము = ఆజ్ఞ - అరిత్రచయాన్వియుక్తనావను= తెడ్డు కఱ్ఱలగుంపులు మొద లైన వానితోఁ గూడిన యోడను, దృఢము=గట్టిగానుండునది - వర్ణ్యము= మెచ్చుకొనఁదగినదానిని, నావికవంతము=ఓడనడపెడివారిని గలది- వెసన్ = శీఘ్రముగా -

తాత్పర్యము.

శ్రీరాముఁడా ప్రకారము చెప్పఁగా లక్ష్మణుఁడు గుహుని సుమంత్రునిఁజూచి యీపుణ్యాత్ముని యాజ్ఞ మీరు విన్నారుకదా. కావలసిన కార్యము కానిండనిన గుహుఁడును తనమంత్రులఁబిలిచి మీరందఱు శీఘ్రముగఁ దెడ్లు కఱ్ఱలు మున్నగు నోడనడపు సామానులు గలట్టియు గట్టిగానుండునట్టియు రంగులుపూసి శ్లాఘ్యమైనదియు నోడనడుపువారు సిద్ధముగాఁగలదియు నగు నావను సిద్ధపఱుపుఁడు.

చం. అనవుడు వారు గూర్చి తెలి•యంబఱుపం దము నేలువానికిన్
వినయముతోడ మ్రొక్కి రఘు•వీరునకున్ గుహుఁ డాడు దేవ! నా
వను సమకట్టు టయ్యెఁ బిద•పం బని యెయ్యది? గంగ దాఁటఁగాఁ
జను నీక దీన నన్న రఘు•సత్తముఁ డెంతయు సంతసిల్లుచున్. ౧౩౩౯

సమకట్టుటయ్యెన్ = సిద్ధముచేయఁబడియె. ఇది మూఁడవనాఁటి చరిత్రము.

తాత్పర్యము.

గుహుఁ డీప్రకారము చెప్పఁగా వారంద అట్లుచేసి తమప్రభువగు గుహునకుఁ దెలుపఁగా గుహుఁడును శ్రీరామునకు వినయముతో నమస్కరించి యిట్లనియె. దేవా నావసిద్ధమయ్యెను. అవల దేని శేయుమని యాజ్ఞ. ఇఁకగంగ దాఁటవచ్చునని శ్రీరాముఁడును సంతోషించినవాఁడై.

కం. కృతకాముఁడ నైతిని నా,హితుఁడా! యీవస్తుతతుల • నెక్కింపుము నా
వతఁ డట్ల చేయ వీరులు, ధృతఖడ్గకలాపచాప•దీపితతను లై. ౧౩౪౦

కృతకాముఁడను = నెఱవేర్పఁబడిన కోరికగలవాఁడను -ధృతఖడ్గకలాప చాప దీపితతనులై =ధరింపఁబడిన కత్తులు-పొదులు -విండ్లు వీనిచేఁ బ్రకాశించు దేహములు గలవారై-

తాత్పర్యము.

శ్రీరాముఁడు గుహునితో నిట్లనియె. నామేలుకోరు మిత్రమా! నాకోరిక నెఱవేఱెను. గంప గడ్డపాఱ చీరలు మొదలగు వస్తువుల నన్నిటిని నోడపై నెక్కిం

పుము. అని నతఁడడ్లుచేయ శ్రీరామలక్ష్మణులు కత్తులు సమ్ములపొదులు - విండ్లు దేహమున ధరించినవారై -

కం. రాముఁడును లక్ష్మణుఁడు సీ, తామహిళాయుక్తి గంగ • డాయఁగఁ గని నా
కేమి సెల వింకఁ జెపుమా, ప్రేమంబున ననుసుమంత్రుఁ • బ్రియమునఁ గనుచున్. ౧౩౪౧

సీతామహిళాయుక్తిన్ = సీతాదేవితో - డాయఁగన్ = సమీపింపఁగా - సెలవు=ఆజ్ఞ.

తా త్ప ర్య ము.

సీతాదేవితోడ శ్రీరామలక్ష్మణులు గంగసమీపమునకుఁ బోఁగాఁ జూచి సుమంత్రుఁడు నాకేమియిఁకనాజ్ఞయని ప్రేమతో నడుగఁగా నతనిఁ బ్రీతితోఁ జూచుచు.

చం. తనకుడికేల నాతని య • థామతి నంటి సుమంత్ర! యింక వే
చనుము నృపాలుపాలికిని • జాగరితృత్వముఁ బాయఁ బోకుమీ
చనుదుము కాల్నడన్ వనికి • స్యందనముల్ విడి, మద్వివాసనా
ర్తిని గదుర్సుకున్నతండ్రిని న • తిస్థిరభక్తిని గాచి యుండుమీ. ౧౩౪౨

యథామతిన్=మనసార- వే=త్వరగా, జాగరితృత్వము=హెచ్చరిక, స్యందనము=తేరు, మద్వివాసనార్తిని=నావియోగదుఃఖమును.

తా త్ప ర్య ము.

తనకుడిచేత నాతని భుజముపైఁ జేయివైచి మనసారఁ దాఁకి సుమంత్రా! యింక నీవు త్వరగారాజునొద్దకుఁ బొమ్ము. హెచ్చరిక వదలకుము. మేము రథము విడిచి నడచి యడవికిఁ బోయెదము. నేను దమ్ము విడిచి పోయితినన్న దుఃఖముచే మిగుల శోకించు తండ్రిని మునుపటికంటె మిక్కిలి స్థిరమైన భక్తిని గాచియుండుము.

కం. ఇందాఁక మమ్ముఁ గూర్మిని, స్యందనమునఁ దెచ్చి మేలు • సలిపితి కడు నా
నందించితి నీకఁ బురికిం, బొందుగఁ జనుమా శతాంగ • ముం గొని సరగన్. ౧౩౪౩

కూర్మిని=ప్రేమచే- స్యందనమునన్ = తేరియందు- శతాంగముల్ = తేరిని- సరగన్=శీఘ్రముగ- ఇంత+దనుకన్=ఇందాఁక.

తా త్ప ర్య ము.

ఇంతవఱకుఁ బ్రేమతో రథముపై దెచ్చి మాకెంతో యుపకారము చేసితివి - చాలసంతోషించితిని- ఇఁక నీవు జాగుచేయక తేరిని దీసికొని యూరికిఁ బొమ్ము.

—•{ సుమంత్రుఁడు తన్నరణ్యమునకుఁ దోడ్కొని పోవ శ్రీరాముని వేఁడుకొనుట. }•—

చం. అన విని నాతఁ డిట్టు లను • నక్కట లోకములోన నొక్కఁడే
    దనమది సమ్మతింపఁడు గ•దా భవదీయవనీనివాసమున్
    మనమున బ్రహ్మచర్యమును • మార్దవ మార్జవ వేదపాఠముల్
    గనుఁగొనువాఁడ నిష్ఫలమ•కా నిఁక నీ వరుగంగఁ గానకున్. ౧౩౪౪

భవదీయవనీనివాసమున్=నీవరణ్యమున వసించుటను-మార్దవము=మెత్తనితనము అర్జవము=ఋజుత్వము- వేదపాఠముల్ = వేదాధ్యయనము- నిష్ఫలమకా = ఫలము లేనిదేయని-

తా త్ప ర్య ము.

అని శ్రీరాముఁడు చెప్పఁగా విని సుమంత్రుఁ డిట్లనియె. రామచంద్రా! నీవరణ్యమునకుఁ బోవుటను సమ్మతించినవాఁడు లోకమున నొక్కఁడైన లేఁడుగదా అట్లుండియు నీవిటు లడవులకుఁ బోవలసినట్లు లేర్పడుట చూడఁగా బ్రహ్మచర్య వ్రతము, మెత్తనితనము, వంచన లేమి వేదాధ్యయనము లివి యన్నియు శ్రమముపడు టకై సాధింపవలసినవేకాని వానివలనఁ బ్రయోజనము లేదని తలఁచుచున్నాను.

భాగ్యవంతం ప్రసూయేథా మాశూరం మాచపండితమ్।
శూరాశ్చ కృతవిద్యాశ్చ మమపుత్రా వసంగతాః॥

క్రొత్త పెండ్లికూఁతురు ద్రౌపది యత్తగారికి నమస్కరింపఁగాఁ గల్యాణీ నీవు భాగ్యవంతుని గుమారునిఁ గనుము అనఁగా నేను క్షత్రియకన్యను వైశ్యకన్యకను దీవిం చునట్లు దీవించెదవేల యందువేని శూరులు పండితులైన నాకొడుకు లరణ్యములపా లయిరి. అదృష్టవంతులైన దుర్యోధనాదులు రాజ్యసుఖ మనుభవించుచున్నారు. అను కుంతీవాక్యము స్మరించునది.

కం. ప్రాకృతులట్టులు వనమున, నీకరణిన్ నీవు తమ్ముఁ • డిల్లాలును దుః
    ఖాకులుల రగుట భువి న, వ్యాకులుఁ డై కడచి బ్రదుకు• వాఁ డెవ్వఁ డొకో.
    ౧౩౪౫

ప్రాకృతులట్టులు=సామాన్యజనులవలె- దుఃఖాకులులరు=దుఃఖముచేఁ గలఁత నొందినవారు- అవ్యాకులుఁడై=విచారముచే మనసుచెదరనివాఁడై-కడచి = అతిక్ర మించి-

తా త్ప ర్య ము.

సామాన్య క్షుద్రజంతువులవలె నీవు నీకంటెఁ జిన్నవాఁడు నీతమ్ముఁడు అంత కంటెఁ జిన్నది ఆఁడుపిల్ల నీభార్య యీప్రకారము దుఃఖముచేఁ గలఁత చెందుట చూడ విచారములేక కాలముగడచి జీవించువాఁడును లోకమునఁ గలఁడా.

ఉ. తమ్ముఁడు భార్యయుం గొలువ • దండక నీవు వసించి మూఁడులో
కమ్ములు గెల్చునంత ప్రథఁ • గాంతు మహాత్మక! నీవు మమ్ము ఛ
ద్మమ్మున నిట్లు గాల్చితి గ•దా! యెటు లేగి దురాత్మురాలు పా
పమ్ముల కిక్క కైకవశ•పాటున నుందుము దుఃఖ మందుచున్. ౧౩౪౬

ప్రథ=కీర్తి- ఛద్మమ్మునన్=వంచనచేత-కాల్చితి=చంపితివి- ఇక్క=స్థానము; వశపాటున = వశపడి యుండుటచే-

తా త్ప ర్య ము.

తమ్ముఁడు భార్య సేవింపఁగా నీవు దండకలో వసించి మూఁడు లోకమ్ములు గెలిచినంత కీర్తిని సంపాదింపఁగలవు. మహాత్మా! నీ కేలోటును లేదు గాని పాపాత్మురాలగు కైకచేసిన మోసముచాలక యింకను శ్రీరాముఁడు రాజగును రామరాజ్యమున నింతకంటె విశేషముగ సుఖింతుమని కొండంతయాశతో నీ ప్రభుత్వమున కెదురుచూచు మమ్మందఱను నిమిషములో మోసగించి మాయాస వ్యర్థము చేసి యిటువచ్చితివిగదా. ఇంక మారికి నెట్లుపోదుము. పోయినిని చెడుమనసుగలిగి పాపములకు స్థానమైన కైకకులోఁబడి కష్టములుపడుచు నెట్లుజీవింతుము. (ప్రజల పక్షమున సుమంత్రుఁడు చెప్పుమాట - ఇచ్చట మోసమనునది నిద్రించు ప్రజల విషయమై వర్తించినవిధమనియైనఁ జెప్పవచ్చును.)

చం. అని తన ప్రాణతుల్యుఁ డగు•నామహనీయునిఁ గూర్చి బిగ్గ రో
దన మొనరించి హా యనుచు • ధారగ నశ్రులు గాఱఁ గొంతసం
బనిమొయి నిబ్బరించుకొని • మార్జనముం బొనరింప నీట న
య్యనఘునిఁ గాంచి రామవిభుఁ • డాదట నెయ్యము మీఱ ని ట్లనున్. ౧౩౪౭

ప్రాణతుల్యుఁడు = ప్రాణముతో సమానమైనవాఁడు- అంతటి ప్రియుఁడు = విడువరానివాఁడు, మార్జనము=కడుగుట- ఆదటన్=ప్రీతితో-నెయ్యము=స్నేహము కన్నీరు అపరిశుద్ధము. దాఁకరానిది-దానిని దాఁకినపుడు నీటఁ గన్నులు దుడుచుకొని చేయికడుగుకొని యాచమింపవలయునని శాస్త్రము కావున నిచటఁ గన్నులు కడుగుకొనుట యాచమించుట కుపలక్షణము.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారముచెప్పి యావలఁ బలుకలేక తన ప్రాణములతో సమానమై ప్రియమై విడువరానివాఁడగు నామహాత్ము నుద్దేశించి గట్టిగ హా యని కన్నీరు గాఱుచుండ నేడ్చి కొంతసేపటికిఁ బ్రయత్నముచే నిబ్బరించుకొని కన్నులు కడుగుకొనఁగా నిర్దోషియయి భక్తుఁడగు నతనిఁజూచి శ్రీరామచంద్రవిభుఁడు ప్రేమతో స్నేహాతిశయమున నిట్లనియె.

— శ్రీరాముఁడు సుమంత్రుని సమాధాన పఱుచుట. —

కం. అయ్యా నినుఁ బోలినకడు. నెయ్యుఁడు రఘువులకు నెందు • నేఁ గలఁడే, మా
యయ్య యెటు గుంద కుండునో, యయ్యనువు ఘటింప నీవ • యగునఁహితాత్మా. ౧౩౪౮

కడునెయ్యుఁడు = మిక్కిలి స్నేహముగలవాఁడు- రఘువులకు=రఘువంశరాజులకు=వంశమువారను నర్థమున బహువచనము, హితాత్మ = మేలుగోరు మనస్సు గలవాఁడా -

తాత్పర్యము.

అయ్యా! నీవంటి మిక్కిలి స్నేహముగలుగువాఁడు రఘువంశ రాజులకు నెందైన లభించునా? కావున మామేలుగోరు మనస్సుకలవాఁడ వగుటచే మాతండ్రి యెట్లు వ్యసనపడకుండునో యాయుపాయము చేయుటకు నీవే తగినవాడవు.

ఉ. ఇంతగఁ జెప్పఁగా వలసె • వృద్ధు మదీయవియోగదుఃఖిత
స్వాంతుఁడు కామభారచలి • తాత్ముఁడు గావుటఁ జేసి, యాధరా
కాంతుఁడు నైక ప్రీతి కయి • కార్యము నెయ్యది చెప్ప దాని నా
వంతఁ దిరస్కరింప వల • దయ్య ఘటింతువు గాక ప్రీతితోన్. ౧౩౪౯

వృద్ధు = ముసలివాఁడు- సూ. వృద్ధుఁడు- నీచమూర్ఖధూర్త- వృద్ధగృహస్థ భ్రష్టఖార్వాక శబ్దంబులకు ఉత్తుగు డుక్ విభాషనగు- సు. వ్యా. తత్స. ౨౦ సూ. మదీయ వియోగదుఃఖితస్వాంతుఁడు = నన్ను నెడఁబాసిన దుఃఖముగల మనస్సుగలవాఁడు- కామభారచలితాత్ముఁడు = కామాతిశయముచే స్వస్థచిత్తము లేనివాఁడు- కావుటఁజేసి=అయినకారణమున- ధరాకాంతుఁడు = రాజు- ఆవంత=కొంచెమైనను-

తాత్పర్యము.

ఏమి శ్రీరామచంద్రా? నీతండ్రి ప్రభువు. ఆయన మమ్ముఁగాపాడుచు రావలయునా. ఆయనను మేముగాపాడవలయునా విపరీతములు చెప్పెదవేమి యందువేమో ఆయనవిషయము నీకింతదూరము చెప్పవలసివచ్చిన కారణము చెప్పెద వినుము. ఆయన ముసలివాఁడు చపలచిత్తుఁడగుటకు నాయొక కారణమే చాలును. దానిపై నన్నెడఁబాసిన దుఃఖముచేఁ జీకాకుపడిన మనస్సుగలవాఁడు. దానికిఁదోడు కామాతిశయముచే స్వాధీనముతప్పిన మనస్సుగలవాఁడు. ఇట్టివానిస్థితి యెంతపరాధీనమో నీవే యాలోచింపుము. ఆకారణముచే రాజు నైకసంతోషమునకై యేపని చెప్పినను దానిని గొంచెమైనను నిరాకరింపక ప్రీతితోఁ జేయుచుండుము.

తే. ఏతదర్థంబ గా దొకో • నృపతివరులు, రాజ్యపరిపాలనము సేఁత • రాగకరిమ
నెట్టిపనియందు నేఁ దమ • పట్టెపట్టె,పట్టు సాధింపఁ జూచెద • రెట్టు లైన. ౧౩౫౦
ఏతదర్థంబ = ఈనిమిత్తమే.

తా త్ప ర్య ము.

రాజులు రాజ్యపరిపాలనమున నాసక్తులగుటకుఁ గారణమిదియొకదా. ఏదందు వేమో యేపనియందైనను నదియల్పమైనను గొప్పదైననుఁ దప్పైనను ఒప్పైనను న్యాయరీతినో యన్యాయరీతినో తాముపట్టినపట్టే సాధింపఁ జూచెదరు.

ఆ. ఎట్టులైన నలని • కేయప్రియంబును, నుదిలిపాటు లేక • యుండునట్టు
లప్రమాదవృత్తి • నరయుచు నుండుమా, యిదియ నాదుకోర్కి • యనఘశీల. ౧౩౫౧

ఉదిలిపాటు = పరితాపము - అప్రమాదవృత్తిన్ = హెచ్చరికతోఁ గూడిన వ్యాపారముచే- అనఘశీల=పుణ్యచరిత్రా!

తా త్ప ర్య ము.

ఏవిధముగనైన నతని కప్రియంబును బరితాపము కలుగక యుండునట్లు హెచ్చరికతో నీవు విచారించుకొనుచుండుము- పుణ్యశీలా- నిన్ను నేను గోరునది యిదియే-

కం. అద్ధరణీశుఁడు మిక్కిలి, వృద్ధుండును నార్యశీలుఁ • డెఱుఁగఁడు దుఃఖం
బిద్ధజితేంద్రియుఁ డతనికి, శ్రద్ధగ నామాటు నలిపి • సాష్టాంగనతుల్. ౧౩౫౨

అద్ధరణీశుఁడు = అధరణీశుఁడు- ఆరాజు. త్రికంబునకు నసంయుక్తంబులును ఋకారంబును నూష్మరేఫేతరంబులు నైన హల్లులు పరంబులైనపుడు వానికి ద్విత్వంబు బహుళంబుగానగు. బహుళగ్రహణముచే పరంబైన వర్గద్వితీయ చతుర్థములు తత్పూర్వవర్గ విషమంబులతో సంయుక్తములగు సు. వ్యా. సమాజ ౩౬ సూత్రము. అద్ధిర్వాగ్రణి గెల్పుటుల్లనముసందయ్యె న్నభమ్మంతయున్ అని ఆముక్తమాల్యద- ఆంధ్రలక్షణానభిజ్ఞులు అద్ధరణీశుఁడు అద్ధిర్వాగ్రణి యని వ్రాయుదురు. వ్రాసభంగము. ఉచ్చారణమున కసాధ్యము.

తా త్ప ర్య ము.

ఆ రాజు మిగుల ముసలివాఁడు సాధువర్తనము గలవాఁడు. ఇంతవఱకు దుఃఖ మెట్టిదో యెఱుఁగఁడు. జితేంద్రియుఁడు. అతనికి నీవు నాప్రతినిధిగ సాష్టాంగ నమస్కారములు గావింపుము.

మ. అనుమీ నావచనంబుగాఁ బతి కయోధ్యం బాయఁగా నయ్యెఁగా
వనవాసం బొనరింపఁగా వలసెఁగా • బాధల్ పడ న్వచ్చెఁగా
యని నేఁ జింతిల, లక్ష్మణుండు మదిలో•నార్తిం గొనం, దుర్వ్యరా
తనయారత్నము దుఃఖముం గొనదు. త•థ్యం బింత భూమీశ్వరా. ౧౩౫౩

తా త్ప ర్య ము.

ఇట్లు సాష్టాంగ నమస్కారములు గావించి రాజుతో నామాటగా నిట్లనుము అయోధ్యను విడువవలసి వచ్చెఁగదా వనవాసము చేయవలసి వచ్చెఁగదా కష్టపడ

వలసివచ్చెఁగదా యని నేనాలోచించుటలేదు. లక్ష్మణుఁడు దుఃఖింపఁడు. సీతయు వ్యసనపడదు. రాజా యిది నిశ్చయము.

కం. ఈరే డబ్దంబులు సం, చారముఁ గావించి వనులఁ • జయ్యన రా, నన్
ధారణిశ నన్ను లక్ష్మణు, గారామునఁ జూడఁ గలవు • గ్రమ్మఱఁ దండ్రీ. ౧౩౯౪

ఈరేడు=ఇరు+ఏడు=పదునాలుగు. అబ్దంబులు = సంవత్సరములు. గారామునన్=ప్రేమతో-క్రమ్మఱఁ జూడఁగలవు. ఇది లంకలో వాస్తవపడినను.

తా త్ప ర్య ము.

పదునాలుగు సంవత్సరము లడవులందుఁ దిరిగి త్వరగా రాఁగా నన్ను-లక్ష్మణుని సీతను మరలఁ జూడఁగలవు.

కం. అని చెప్పుము జనకునకున్, జననికిఁ గైకకును దక్క-•జనయిత్రులకున్
గొనకొని మఱి మఱి చెప్పుము, యనఘ కుశల మడిగినాఁడ • నందఱ ననుచున్. ౧౩౯౫

జనయిత్రులకున్ = తల్లులకు-

తా త్ప ర్య ము.

అని మాతండ్రికిఁ జెప్పుము. నాజననికిఁ గౌసల్యకుఁ గైకకుఁ దక్కినతల్లులకుఁ బనిపూని వారినందఱ కుశలమడిగినాఁడనని మఱి మఱి చెప్పుము.

ఆ. అవల నేను సీత • యార్యుండు లక్ష్మణుం, డమలసూక్తులఁ మ•దంబఁ గుశల
మడిగినారమనుచు • నంఘ్రులపై వ్రాలి, మ్రొక్కినార మనుచు•నొక్కి యనుము ౧౩౯౬

ఆర్యుండు=శ్రేష్ఠ భ్రాతననుసరింపవలయునను గొప్ప ధర్మమును జేయుటచేఁ బూజ్యుఁడు. ఆర్యుఁడు లక్ష్మణుఁడు అనుటచేఁ దనధర్మమునందుఁ దానుండి నాకుసేవ చక్కఁగాఁ జేయుచున్నాఁడని తెలియఁజెప్పుమని భావము. అమలసూక్తులఁ = వంచనలేని మాటలచే- మదంబన్=నాతల్లిని- అంఘ్రులపై వ్రాలి=పాదములమీఁదఁ బడి- తల్లికిఁ గౌసల్యకుమాత్రము పాదములంటి నమస్కరింపుమనుటచేఁ దక్కిన సవతితల్లు లట్టి నమస్కారమునకు యోగ్యులుకారు. "ఆచార్యవ దాచార్యదారే వృత్తిః పాదసంవాహనవర్జ"మ్మని శాస్త్రముకలదు. ఆచార్యవిషయమున నెట్లు వర్తింపవలయునో ఆయనభార్యయందు నట్లే వర్తింపవలయునుగాని పాదము లంట రాదు. ఈ నిషేధము సవతితల్లులయందును నన్వయించును. నొక్కి=వత్తి.

తా త్ప ర్య ము.

కౌసల్య కైక మొదలయినవారిని గుశల మడిగిన తరువాత నేను సీత యార్యుఁడగు లక్ష్మణుఁడు వంచనలేని మాటలచే నాతల్లికుశల మడిగినారమని మఱియు వడిగి యామెపాదములపైఁబడి మ్రొక్కినారమని యొత్తి యొత్తి చెప్పుము.

చం. పిలువఁగఁ బంచి కైకసుతు • వేగ యథామతి యావరాజ్యమున్
నిలుపుము వానియందు; నతఁ•నిం గవుఁగింటను జేర్చి రాజ్యసం
కలితునిఁ జేయు మత్కలిత•గాఢతరార్తి దొలంగు నంచు న
ర్మిలి వచియింపు తండ్రికిని • బ్రీతి చెలంగెడునట్లు మిత్రమా! ౧౩౫౭

ఈప్రకారము కుశలప్రశ్నాదులు జరిగినపిమ్మటఁ దండ్రికిఁ జెప్పుమని కొన్ని విషయములు చెప్పుచున్నాఁడు: యథామతి = తనయభిప్రాయప్రకారము- రాజ్యసంకలితుని=రాజ్యముతోఁ గూడినవానిని- మత్కలిత=నా వియోగమువలనఁ గలిగిన-గాఢతరార్తి=మిక్కిలి యధికమైన దుఃఖము, అర్మిలిన్=ప్రేమతో-

తాత్పర్యము.

కైకకుమారుఁడగు భరతునిఁద్వరగాఁ బిలిపించి తనయభిప్రాయ ప్రకారము వానికి యావరాజ్యమిమ్ము-వానిని కౌఁగిలించి రాజ్యముతోఁ గూడినవానిఁ జేయఁగా నన్ను విడనాడుటచేఁ గలిగిన దుఃఖము తొలఁగిపోవును. అని తండ్రి సంతోషించునట్లు నాయందుఁ బ్రేమయుంచి చెప్పుము.

సీ. భరతుండు పురమున • కరుదెంచి నంతట, ననుము నామాటగా • నతనితోడఁ
దండ్రియం దేరీతిఁ • దగవు వర్తింతువో, తల్లుల కారీతిఁ • దగవు సలుపు
నీతల్లికైకయీ•మాతకు మిన్నగా, నలసుమిత్రాదేవిఁ • దలఁపు మనుము
నాతల్లి కౌసల్య • నయగతిఁ బ్రోవు వి,శేషంబుగా నని • చెప్పు మయ్య
ఆ. అప్ప చెప్పినట్లు • యావరాజ్యంబును, బూను నీవు రెండు•భువనములను
నుండువారి సౌఖ్య• మొందింపఁ జాలెద,వవని నేలు మనుము • న్యాయ్యముగను. ౧౩౫౮

కైకయీమాతకున్=తల్లికైకకంటె- అన్యదూర సమీపేతరోత్తరాద్యర్థయోగంబునఁ గంటె కువర్ణకంబులగు- సు. వ్యా. కారక. ౧౯-సూ. మిన్నగా = ఎక్కువగా- అప్ప = తండ్రి

తాత్పర్యము.

భరతుఁ డయోధ్యాపురమునకు వచ్చినతరువాత నేను చెప్పితినని యీమాటలతనితో ననుము.

తండ్రియం దేన్యాయమున వర్తింతువో తల్లులందఱియం దారీతినే న్యాయముగ వర్తిల్లుమనుము- నీకన్న తల్లికంటె నెక్కువగా సుమిత్రాదేవిని దలఁపుమనుము. నీతిమార్గమున నాతల్లిని విశేషముగఁ బ్రోవుమని చెప్పుము- తండ్రి చెప్పినట్లు రాజ్యభారము వహించి నీవు రెండులోకముల నుండువారిని సౌఖ్యపడఁ జేయఁగలవు. కావున న్యాయ్యమార్గమున రాజ్యమేలు మనిచెప్పుము.

—• సుమంత్రుఁడు శ్రీరాముని విడిచి పోలేక పరితపించుట. •—

ఉ. పొమ్మనుచుఁ మరల్ప రఘు•పుంగవుమాటల నాలకించి దుః
ఖమ్మున నిట్లు పల్కు- ననఘా! యుపచారము కాదు, దేవ! నె
య్యమ్మునఁ జెప్పువాఁడ భయ • మందక, భక్తుఁడకా యటంచు స్నే
హమ్మున నట్టి క్షమింపుము, ద•యాకర! నామనవిన్ గ్రహింపుమీ. ౧౩౫౯

ఉపచారము = గౌరవార్థము చెప్పునది - వాస్తవము కానిది. దయాకర = దయకు స్థానమైనవాఁడా- తాత్పర్యము.

అనిచెప్పి పోయిరమ్మనఁగా, శ్రీరాముని వాక్యములనువిని దుఃఖపడుచు సుమంత్రుఁ డిట్లనియె. దేవా! నేను జెప్పఁబోవునది గౌరవార్థము చెప్పుమాటగాదు. భయములేక స్నేహభావమ్మునఁ జెప్పుచున్నాఁడను. నీవు నాయందు స్నేహముంచి వీఁడు మనభక్తుఁడే కదా యని నాతప్పును క్షమింపుము. నీవు దయావంతుఁడవు కావున నామనవి నంగీకరింపుము.

తే. కడుపుదుఃఖంబునను గ్రాఁగు•పడఁతిఁ బోలి, తావకీనవియోగార్తిఁ • దత్తఱించు
నాయయోధ్యకు ని న్నిటఁ•బాయఁబెట్టి, యెట్లుచనువాఁడన గతి • యేమితండ్రి!
౧౩౬౦

తావకీన వియోగార్తిన్=నీ వెడఁబాయుటవలనఁ గలిగిన దుఃఖముచే-

తాత్పర్యము.

• పుత్రశోకముచేఁ గాలిపోవుచున్న స్త్రీవలె నిన్నువిడనాడుటచేఁ గలిగినదుఃఖముచేఁ దత్తఱపాటుచెందుచున్న యీయయోధ్యకు నిన్ని చటవదలి నే నెట్లుపోవఁ గలను. పోయితినా తండ్రీ నాగతియేమి!

కం. మును రామయుక్త మగురథ, మును గనినపురంబు నేఁడు • మొగిఁ దద్హీనం
బును గనిన లేటమొగమై, మునుఁగదె దుస్సహపుశోక•మునను మహాత్మా! ౧౩౬౧

రామయుక్తము=శ్రీరామునితోఁ గూడినది- తద్హీనంబును=శ్రీరాముఁడు లేని దానిని. తత్+హీనము = తద్హీనము. వర్గము తొలి నాలుగక్షరములకుఁ బరమైన హకారమునకు నావర్గ చతుర్థాక్షరము వైకల్పికముగ నగు- తత్+హీనము = తద్ధీనము- తద్హీనము. సు. వ్యా. సంస్కృత సంధిపరిచ్ఛేదము ౨౯-వ సూ. లేటమొగము=పెడమొగము. తెల్లవోయినముఖము.

తాత్పర్యము.

ముందు శ్రీరామునితోఁ గూడిన రథమును జూచిన పురము నేఁడు శ్రీరాముఁడు లేని రథమును జూడఁగానే వెలవెలపాటునఁ జూడఁజాలక పెడమొగము పెట్టి సహింపరాని శోకమున మునుఁగదా. ఇచ్చట పురమనఁగాఁ బురమునందలి జనులుగాక తక్కిన జీవజంతువులని గోవిందరాజులు. పురజనులవిషయము క్రింది పద్యమునఁ గలదు.

కం. ఈరిత్తరథముఁ గనుఁగొని, పౌరులు సూతావశేష • బాధితసేనా
 వారము హతవీరముగతి, వారక కని బహుళదుఃఖ•వశు లగు టరుదే. ౧౩౬౨

రిత్తరథము = నీవులేనిరథము- పౌరులు = పురజనులు- సూతావశేష బాధిత సేనావారము = సారథియొక్కఁడు మాత్రము మిగులునట్లుగా శత్రువులచే బాధింపఁబడిన సేనాసమూహము- హతవీరము=చంపఁబడిన వీరులఁగలది.

తాత్పర్యము.

నీవులేని రథమును నేను దోలుకొనిపోఁగా నూరిజనులు శత్రువులచే వీరులందఱు చావఁగా సారథిమాత్రము మిగులునట్లుగా బాధింపఁబడిన సేనాసమూహమును జూచినట్లుచూచి యధికదుఃఖమునకు లోపడుట యాశ్చర్యమా.

ఉ. దూరనివాసి వైననినుఁ • దోయజనేత్ర! తలంచి లోకులుౕ
 గూరినకూర్మిఁ బల్లటిలి • కూడును నీరును బాసియుౕ నిజో
 దారసుభావనాగతి స•దాగతిగా నిను నెంచి నీశుభా
 కారముఁ జూచు చుండెదరు•కన్నులఁ గట్టినయట్లు రాఘవా. ౧౩౬౩

దూరనివాసివి=దూరమందు నివసించువాఁడవు- తోయజనేత్ర = కమలముల వంటి కన్నులుగలవాఁడా- పల్లటిల్లి=విరవిరఁబోయి- నిజోదారసుభావనాగతిౕ=తమ గొప్పధ్యానవిధమున- సదాగతిగాౕ = నిత్యరక్షకునిఁగా- శుభాకారము = దివ్య మంగళ విగ్రహము.

తాత్పర్యము.

కమలాక్షా- దూరదేశవాసివైన నిన్నుఁదలఁచుకొని లోకులును కూర్మిచేత విరవిరఁబోవు మనస్సులతోఁ గూడు నీళ్లు వదలి తమవిశేషధ్యానమార్గమున నిన్నుఁ దమకు సర్వరక్షకుఁడవనియెంచి నీ దివ్యమంగళవిగ్రహము కన్నులకుఁ గట్టినట్లు రామచంద్రా చూచుచుండెదరు.

ఉ. నీవును గంటివే కద య•నిందితశీల! భవత్ప్రవాసవే
 ళావిలలోకశోకము వి•లాపవిధంబును నన్ను నారథం
 బీవిధిఁ జూచి వెండియును • నేడ్చెడివారలు వార లంతకు
 న్వేవిధముల్, సహింప నగు•నే ననుబోఁటికి దానిఁ జూచినన్. ౧౩౬౪

అనిందితశీల = నిందింపఁబడని యాచారముగలవాఁడా- భవత్ప్రవాసవేళా విలలోకశోకము = నీవరణ్యమునకుఁ బ్రయాణమైనకాలమందుఁ గలఁతచెందిన మనస్సులుగల జనులదుఃఖము- విలాపవిధంబును=వారేడ్చిన తీరును- ఈవిధిౕ = నీవులే నట్టి యీవిధమును- అంతకంటె=మునుపేడ్చినదానికంటె- వేవిధముల్=వేయి తెఱఁగుల్ౕ- నేను బోవునప్పుడు మరల వచ్చెదవేమో యని యాశగలవారై యుండి నేను నొంటరిగాఁ బోఁగానే యిఁక నాశలేదని మునుపటికంటె నెక్కువగా నేడ్తురు- ననుబోఁటికిన్ = నావంటివానికి-

### తా త్ప ర్య ము.

శ్లాఘ్యచరిత్రా నీవరణ్యమునకై బయలుదేఱినపుడు గుండెలు చెదఱి లోకు లేడ్చినయేడ్పు నీవే కన్నారఁ జూచితివికదా నేను నిన్నుఁ బిలుచుకొని వత్తునేమో యని యాశతోనుండువారు నీవులేని శూన్యరథమును నేనొకఁడనే తోలుకొని పోఁగా నిఁక రాఁడని నీ యాశమాని మునుపటికంటె వేయంతలెక్కువగా నేడుతురు. నావంటి వాఁడు దానిని జూచి సహింపఁగలఁడా.

సీ. అక్కటా! మీతల్లి ♦ యయ్యా నాపుత్రకుం, డేడినా నే మను♦వాఁడ నేను
మేనమామింటికి ♦ నేను దోడ్కొనిపోయి, విడిచితి నీ వింక ♦ నడల వలదు
తల్లిరో యందునా ♦ తగ వెఱింగియు నెట్టు, లనృతంబు రోయక ♦ యాఁడువాఁడ
ననృత మాడఁగ నేల ♦ యనెదవా నే నెట్లు, పాపపుసత్యంబుఁ ♦ బలుకువాఁడ

తే. నిన్ను సీదేవి లక్ష్మణు ♦ నీరజాక్షి
నెమ్మి వహియించుహయములు ♦ నేఁ డ వెట్లు
మన్ని యోగంబునను దాము ♦ మరల నేర్చు!
రమ్యగుణసాంద్ర దయఁ జూడు ♦ రామచంద్ర. ౧౩౬౫

అడలవలదు=వ్యసనపడవలదు- తగవు=ఉన్నవిధము- అనృతంబు= అసత్యము రోయక=అసహ్యించుకొనక-పాపపుసత్యంబు = బాధాకరమైనయథార్థమును- హయములు=గుఱ్ఱములు- మన్ని యోగంబునను= నాప్రేరణముచేత- రమ్యగుణసాంద్ర = మనోహరములైన గుణములచే దట్టమైనవాఁడా.

### తా త్ప ర్య ము.

అయ్యో! నేను మరలి యూరికిఁబోఁగానే మీతల్లిని జూడక తప్పదుగదా! చూడఁగానే "సుమంత్రా! నాచిన్ని కుమారుఁడు శ్రీరామచంద్రుఁడేఁడయ్యా" యని తప్పక యడుగునుగదా! అడిగిన నామెకు నేనేమని ప్రత్యుత్తరము చెప్పుదును! అమ్మా మేనమామయింట విడిచి వచ్చినానమ్మా నీవేడువకుము అని చెప్పుదునా. అసత్యమాడరాదని ధర్మము తెలిసితెలిసి యసహ్యించుకొనక నెట్లసత్య మాడుదును. అసత్యమేలచెప్పవలె నున్నదున్నట్లు చెప్పరాదాయంటివేని నరక బాధవంటి బాధను గలిగించు సత్యము నేనెట్లు చెప్పుదును. ఇదంతయుఁ బురమునకుఁ బోయిన నాఁటిముచ్చటలు. ముందు పురమునకుఁ బోవుటెట్లు! నిన్ను సీతాదేవిని లక్ష్మణుని మోచితెచ్చిన గుఱ్ఱములు నీవులేక నేను మరలించినను నడలించినను గొట్టినను నవి పురమువైపు మరలునా! నీవెంతోరమ్యగుణ సాంద్రుఁడవే. రామచంద్రా యింత కఠినచిత్తుఁడవై యిండఱ బాధించుచున్నావు కదా.

కం. సాధ్యంబు గాదు మరలి య, యోధ్యకుఁ బోవంగ నాకు ♦ నూరక నా శా
రాధ్యుఁడవు పరపి కరుణా, నిధ్యాన మనుజ్ఞ నిమ్ము♦నీతో వత్తున్. ౧౩౬౬

ఆరాధ్యుఁడవు = ఆరాధింపఁ దగినవాఁడవు- కరుణానిధ్యానము = దయతోఁ గూడిన యాలోచనను- పరపి=వ్యాపింపఁజేసి- అనుజ్ఞ యిమ్ము-సమ్మతింపుము.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రా! నీవులేక యయోధ్యకుఁ బోవ నాకు సాధ్యముకాదు. ఏలన నీవాఁదఁజెప్పిన కారణములే కాక మఱియొక ముఖ్యకారణముగలదు. అదియేదన :- నీవు నాకారాధింపఁదగిన దేవుఁడవు - ఆరాధించువాఁ డొకచోట నారాధింపఁబడు దైవమొకచో నుండిన నారాధకుఁ డేమిచేయఁగలఁడు. నీవు నాతోడ రానొల్లవేని దయయుంచి వీఁడు నాయారాధకుఁడు వీనిని రక్షింపవలసిన భారము నాది కావున నాయొద్ద వీనినుంచుకొందమని యాలోచించి నీతోవచ్చుట కనుజ్ఞనిమ్ము.

ఆ. కాదు కూడ దనుచుఁ • గరుణమాలుచు నాదు, ప్రార్థనంబు వ్యర్థ • పఱిచె దేని రథముతోడనేను • బ్రజ్వలదగ్నికి, మే నొసంగువాఁడఁ • జూ నిజంబు. ౧౩౬౭

ప్రజ్వలదగ్నికిఁ=మండుచున్న యగ్నిహోత్రమునకు- చూ=సుమా- 'చూడుమా' ప్రహస్వరూపము.

తా త్ప ర్య ము.

నేను నీతోవచ్చుటకుఁగాదు నీవు నాతో రాఁగూడదని దయవిడిచి నాప్రార్థనము వృథాచేసితివా నీయనుగ్రహమునకుఁ బాత్రముగాని యీదేహము వ్యర్థము కావున నిన్నారాధించుటకు సాధనమైన యీరథముతోడ నేను మండెడు మంటకు నాదేహమును నీకుఁ బ్రీతిగ నాహుతి చేయుదును. ఇది నిజము సుమా.

కం. వనముల నీదుతపంబున, కును విఘ్నముఁ గూర్పఁ గలవు • క్రూరపుజంతుల్ గొనకొని వానిని రథమున, వినిహతములు చేయువాఁడ • వివరింపు మెదన్. ౧౩౬౮

వినిహతములు=నిశ్శేషముగాఁ జంపఁబడినవి.

తా త్ప ర్య ము.

అయ్యా! నీవు నాతోడవచ్చి నాకేమిసేవ చేయఁగలవందువేమో. నాకైంకర్యవిధము నేనుజెప్పెద వినుము. అడవులందు నీవుచేయు తపస్సునకుఁ గ్రూర జంతువులు పులులు మొదలయినవి విఘ్నములుచేయఁగలవు. అట్టివానిని రథమెక్కిపోయి నిశ్శేషముగా వధించెదను. ఇది తగినసేవయగునో కాదో యాలోచింపుము.

కం. నీరథముఁ గడపుసౌఖ్యముఁ, గూరెడిభాగ్యంబు లేకు • కోమలగాత్రా ఘోరారణ్యముల న్నీ,తో రా సుఖ నొదు నన్నుఁ • ద్రోవకు తండ్రీ. ౧౩౬౯

కూరెడి=పొందెడి-ఘోరారణ్యములఁ=భయంకరమైన యడవులందు.

తా త్ప ర్య ము.

నీవు కోమలగాత్రుఁడవు- ఎన్నఁడు నడిచి తిరిగినవాఁడవుకావు. ఇట్టినీకుఁ గష్టములోఁ పకుండ నీకు సారథినై సుఖించు నదృష్టము నేనయోధ్యకుఁ బోయిన నాకుఁగలుగదు. నీవు పట్టాభిషిక్తుఁడవైనచో నీకు రథముగడపి కడతేఱుదమనుకొం

టిని. అదియు లభించినదికాదు. మఱి యేవిధమైనసుఖము గోరెదవందువా. ఈ భయంకరారణ్యములలో నీతోడ వచ్చితినేని సుఖింతును. కావున నేను సుఖింపం దంచ్రీ నీకు నాయందు దయగలదేని నన్నుం ద్రోచివైవకుము.

కం. సమ్మతి నీభయదార,ణ్యమ్ముల నీ పజ్జ నుండ • నాశ గొలిపెడిఁ
    జిమ్మా యల్లె కాని, ర మ్మని యొకమాట యనవె • రాజీవాక్షా.    ౧౩౦

సమ్మతిన్=నిండు మనస్సుతో- భయదారణ్యమ్ములన్=భయముకలిగించు నడవులందు- పజ్జన్=అంచున-

తా త్ప ర్య ము.

నిండుమనస్సుతో నీభయంకరములైన యడవులందు నీయొద్దనుండ నాశయగుచున్నదిసుమా. కావున సరియ నీవుకోరినప్రకారము రమ్మని యొకమాటమాత్రము కమలాక్షా యనుము నేనుగోరునది యింతియ.

కం. మిట్టలఁ బల్లంబుల నీ, గుజ్జంబులు నిను వహించి•కొని పోయి శ్రమం
    బిట్టింక నీకుఁ గొలుచుచు, నిట్టీయలం బరమగతికి • నేగెదు రామా.    ౧౩౧

ఇట్టింకన్=ఇంకన్+ఇంకన్=ఇట్టింకన్=పూర్ణముగా నింకిపోవ- ఇట్టీయలన్ = ద్రక్క-ల నిత్యబహువచనాంతము- పరమగతికిన్=పరమపదమునకు.

తా త్ప ర్య ము.

• నేనడిగిన నొకమాటయనితివా- బాగుపడువాఁడను నేనొకఁడనే కాను. నీసేవచేసి యీగుజ్జములు ముక్తికిఁబోవును. మిట్టలయందుఁ బల్లములయందు నీ గుజ్జంబులు నిన్ను మోచికొనిపోయి నీకు శ్రమములేకుండునట్లు నీపార్శ్వంబులం దుండి నీసేవచేసి పరమపదమునకుఁ బోఁగలవు. వారివారి శక్తికొలఁది భక్తితో నెవ రెట్టి నీసేవచేసినను నన్నుగ్రహింతువుగదా.

కం. తలఁగక నీశుశ్రూషను దలతోఁ జేయుచు వసింతు • దండక నీతో
    మలయుచు నయోధ్య యేటికి, నిలింపతల మైన నేల • నినుఁ గొలువంగన్.
    ౧౩౨

తలఁగక=తొలఁగిపోక- శుశ్రూషనుఁ=సేవను- మలయుచున్=సంచరించుచు- నిలింపతలము=స్వర్గము దేవతలుండు ప్రదేశము.

తా త్ప ర్య ము.

వదలిపోక నీపరిచర్యను దలతోఁ జేయుచు దండకారణ్యమందు నీతో సంచరించు చుందును. అంతటి నీసేవాభాగ్యము నాకుఁ గలిగెనేని యయోధ్య యేల స్వర్గమేల!

నీసేవ తుచ్ఛములైన యైహిక స్వర్గ, కైవల్య ఫలములకంటె హెచ్చగు మోక్షఫలమునే యిచ్చును.

క౦. దురితాత్ములు సురనగరముఁ, జొరఁజాలనియట్లు లెట్లు ♦ చొరఁగా నేర్తుర్
ధరణీశసుత యయోధ్యాపుర మే నొంటిగను గోలు♦పోయియు నిన్నున్. ౧౩౭౩

దురితాత్ములు=పాపాత్ములు- సురనగరము=స్వర్గము చొరఁజాలనియట్లు; ప్రవేశింప సాధ్యపడని విధమున- కోలుపోయియు=విడనాడియు- పోఁగొట్టుకొనియు-

తా త్ప ర్య ము.

పాపాత్ములు స్వర్గమునఁ బ్రవేశింప సాధ్యపడని విధమున నీయాశ్రయమును వదలి యొంటిగఁబోయి యయోధ్యానగర మెట్లుప్రవేశింపఁగలను. ఎంత ఘోర పాపము చేయకుండిన నీతోడ నుండకుండుట లభించునా?

ఉ. ఉల్లుట లూఁగెడిన్ హృదయ ♦ మొందుతలంపున నాసఁ జేసి, యీ
గుఱ్ఱములన్ శతాంగమునఁ ♦ గూరిచి నే రథచోదకుండ నై
చిఱ్ఱునఁజేద కీవు గడ♦చేయఁగఁ గానఁ జతుర్దశాబ్దముల్
పట్టెలు వాఱ భూమి యదరు♦వన్ మిముఁ దోడ్కొనిపోవ నూరికిన్. ౧౩౭౪

ఉల్లుటలూఁగెడిన్ = ఉల్లూఁతలూఁగుచున్నది- ఊఁగు+ఊఁగు = ఉల్లుటలూఁగు- అనఁగా మిక్కిలి తొందరపాటున నేకారుచున్నవి. ఒందుతలంపునన్ = ఒకానొక యాలోచనతో- ఆసఁజేసి=ఆశచేత- చేసి ఇది చేతవిభ క్త్యర్థ కావ్యయంబు ఆది తత్ప్రత్యయార్థక వర్ణకంబులకును, వలనకు, దఱుచుగ నన్యప్రయుక్తమగును. ఇది క్త్వార్థకముకాదు. శతాంగమునన్ = రథంబునందు- రథచోదకుండనై = తోలు వడపువాఁడనై- చిఱ్ఱున ఇది చీదుటయందలి ధ్వన్యనుకరణము. కడచేయఁగన్ = ముగింపఁగ- కానన్=అడవియందు- చతుర్ద శాబ్దములు=పదునాలుగు సంవత్సరములు పట్టెలువాఱన్=పగుళ్లుపాఱఁగా- అదరువన్ = అదరఁగా- అదరువన్ = ఇందలి అకారము గురువుకాదు. చుక్కరక రు వర్ణంబునకు ముందటి దు వర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు- అగుచోఁ దత్పూర్వంబు గురువుగాదు. సు. వ్యా. ప్రకీ. 15-వ సూ. సంయుక్తాక్షరమునకు ముందటియక్షరము గురువను ఛందశ్శాస్త్ర సూత్రమున కిది యపవాదము. ఇట్లు అదరుచు విదరుచు ఎదరుచు గదరుచు కుదరుచు ఇందలి మొదటి వర్ణములు గురువులుగావు. ఇట్లే ఇగురుచు చిదురుపలు అను వానిలోని ప్రథమాక్షరములు గురువులు కావు

చం. ఎదిరిచిన కాల పాకమున నీగతి నీముదిఁ గ్రోధవల్లికన్
బ్రదిచినవారు మన్నిశిత బాణపరంపరలై మిడుంగుఱుల్
విదురుపఁగఁ దత్ఫలంబుల చవింజరితార్థులుగా శరీరపుం
బిదురుపలు చేయఁ దత్సుతులచేతులఁ గాకకులంబు వాఱులన్. నాచ. ఉహ.

ఇది చంపకమాలావృత్తము. ఇగురుచుకోర్కులఁ దనడెందమువతళింప- కవికర్ణ.

తాత్పర్యము.

రామచంద్రా! ఒకానొక యాలోచనగలిగినది- దానియందలి యాసచేత హృదయ మదియెప్పుడెప్పుడు నెఱవేఱునా యని యేశారుచున్నది. అది యేమంటివా వినుము. నీవు పదునాలుగుసంవత్సరములు చిత్తునఁజేయక నాంతముచేయఁగా నిన్ని రథమందే కూర్చుండఁబెట్టుకొని దాని కీగుఱ్ఱములనే కట్టి నేనేసారథినై భూమి గడగడలాడుచు బ్రద్దలువాఱుచుండ మిమ్ము నయోధ్యకుఁ దోడుకొని పోవలెను. ఇది నాయాశ. దీనిని నెఱవేర్పఁజేయుము.

కం. నీసంగాతంబున వన, వాసంబున నేండ్లు నాల్గు•పది యొకత్రుటి యౌ
నీసంగతిఁ బాసిన త్రుటి, గాసిం బడఁ జేయు నొక్క•కల్పము వోలెన్. ౧౩౫

సంగాతంబునన్ = సాంగత్యంబున- కూడియుండుటచే- నాల్గుపది = పదునాలుగు- త్రుటి = నిమిషకాలము- అల్పకాలము- నీసంగతిఁబాసిన = నిన్ను విడిచిపోయిన- కల్పము=బ్రహ్మజీవితకాలము.

తాత్పర్యము.

రామచంద్రా! నీసాంగత్యముచే వనవాసము పదునాలుగేండ్లను నొకనిమిషకాలమే యగును. నీ విడిచిపోయిన త్రుటికాలమే కల్పమై యాయాస మును గలుగఁ జేయును.

కం. భక్తుఁడ భృత్యుఁడ నీ కను,రక్తుఁడ మత్స్వామిసుతచ•రణయుగసేవా
సక్తుఁడ దృఢశక్తుఁడ నో,భక్తావనశీల నన్నుఁ • బాయఁగఁ దగవే. ౧౩౬

భక్తుఁడన్=నీయందు భక్తిగలవాఁడను- భృత్యుఁడను=సేవకుఁడను-అనురక్తుఁడన్ = నీయందనురాగము గలవాఁడను- మత్స్వామిసుత = నాప్రభువు కుమారుని యొక్క- చరణయుగ=రెండుపాదములయొక్క- సేవా=పరిచర్యయందు-సక్తుఁడన్ = ఆసక్తిగలవాఁడను- దృఢశక్తుఁడన్=దృఢమైన శక్తిగలవాఁడను-భక్తావనశీల=భక్తుల రక్షించు స్వభావముగలవాఁడా- తగవే=న్యాయమే.

తాత్పర్యము.

రామచంద్రా! నీకు భక్తుఁడను సేవకుఁడను. నీయందనురాగము కలవాఁడను. నాప్రభుకుమారుని పాదయుగముల సేవయం దాసక్తిగలవాఁడను. సేవచేయుటయందు దృఢమైన దేహశక్తిగలవాఁడను. ఈ విధముగ నీసేవ కన్ని విధముల యోగ్యుఁడను. నీవో భక్తుల రక్షించు నాచారము గలవాఁడవు. ఇట్టి నీ వట్టినన్ను విడనాడ ధర్మమా. దీనివలన భక్తుఁడు భృత్యుఁడు ననురక్తుఁడునగు నాశ్రితుని నిష్కారణముగ విడువరాదని సూచితము.

శ్లో. భక్తంచ, భజమానంచ, తవాస్మీతి చ వాదినమ్
త్రీనేతాన్ విషమప్రాయాన్, విషమేప్యపి నత్యజేత్.

భక్తుని, సేవించువానిని నీవాఁడననువానిని ఈముువ్వురను గష్టదశయందైనను విడువరాదు. (ఇది సూర్యునితో జమదగ్ని చెప్పినమాట అనుశాసనిక పర్వము)

శ్లో. బ్రహ్మహత్యా గురోర్ఘాతో, గోవధః స్త్రీవధ స్తథా
తుల్యమేభిర్మహాపాపం, భక్తత్యాగా దుదాహృతమ్
భజంతం భక్తమత్యాజ్య, మదుష్టం త్యజతస్సుఖమ్
నేహానాముత్ర పశ్యామి తస్మాచ్ఛక్ర దివంవ్రజ. మార్కండేయుఁడు.

భక్తుఁడై సేవచేయువానిని దుర్గుణములు లేనివానిని విడిచినవానికి నీలోకమునఁ బరలోకమున సుఖము లేదు. పై పెచ్చు బ్రహ్మహత్య- గోహత్య- స్త్రీహత్య చేసిన పాపము లభించును. ఇట్లుండ నెట్లు శ్రీరాముఁడు సుమంత్రుని వదలెను.

సుమంత్రుఁడు దశరథుని సేవకుఁడుగాని శ్రీరాముని సేవకుఁడు గాఁడు. అట్టివానిని దశరథునాజ్ఞ లేక కూడఁబిలుచుకొని పోరాదు. శ్రీ రామ చంద్రు ని నాల్గు పల్లెలు దాఁటి వెలుపల విడిచిరమ్మని రాజాజ్ఞ: అవలఁ బొమ్మని రాజాజ్ఞ లేదు.

కం. పౌనఃపున్యంబుగ నిటు, దీనాలాపములఁ దన్ను • ధృతి చెడి వేఁడం
గా నిజసారథి కనియెన్, మానుగభృత్యానుకంపి•మహిజావిభుఁడున్. ౧౩౬౮

పౌనఃపున్యముగన్=పునఃపునః = మఱిమఱి- దీనాలాపములన్ = ఏడుపుమాటలతో- ధృతి=సంతోషము- భృత్యానుకంపి = భృత్యులయందు దయగలవాఁడు- మహిజావిభుఁడు = సీతాపతి = శ్రీరాముఁడు- "ధృతిర్యోంగాంతరే ధైర్యే ధారణే ప్రీతిసౌఖ్యయోః. ॥నానా॥ ॥౪॥

తా త్ప ర్య ము.

ఈవిధముగఁ బలుమఱు శోకముతోఁగూడిన మాటలచే సంతోషముచెడి తన్నుఁ బ్రార్థింపఁగా- భృత్యులయందు దయగలవాఁడయ్యెను శ్రీరాముఁడు తన సారథి కిట్లనెను.

సీ. పరమభక్తుఁడ నీవు • భర్తృవత్సల! నేను, నిజ మింతె యెఱుఁగని•నిష్ఠురుఁడనె?
యేనిమిత్తము పురి • కేగు మంటిని నిన్ను,వివరింతు నయ్యది • వినఁగదయ్య
నీయురుగుట చూచి • పోయెఁ బో రాముఁ డం,చును నమ్మినావిన్న•జనని కైక
నావనిపోక శా•నందించి ధర్మజ్ఞుఁ, డంద్రీఁ గల్లరి యని • తలఁప కుండు

తే. భరతుఁ డేలెడిరాజ్యంబుఁ•బడయువలయుఁ,గైక యనినాదుముఖ్యసం•కల్ప మయ్యె
రాజునకు నాకుఁ బ్రియముగ•రథముతోడ. నగరికిని జని చెప్పుమా•నాదునుడులు
౧౩౬౯

భర్తృవత్సల=భర్తయగు రాజునందుఁ బ్రేమగలవాఁడా- నిష్ఠురుఁడనే=కఠినుఁడనా- కల్లరి=అసత్యవాది- నుడులు=మాటలు-

తా త్ప ర్య ము.

భర్తయందుఁ బ్రేమగలవాఁడా! నీవు భక్తమాత్రుఁడవేకావు. పరమభక్తుఁడవు. ఇది సత్యము. ఈమాత్ర మెఱుఁగని యంత కఠినచిత్తుఁడనా. నిన్నేమిం కారణమున నయోధ్యకుఁ బొమ్మంటినో యది వివరించెద వినుము. ఊరికివచ్చిన నిన్నుఁ జూచి నిజముగ రాముఁ డడవికిఁబోయెనని నాపినతల్లి కైక నమ్మును. నీవు పోకపోయినచో నే నడవులకుఁ బోలేదనియు నేయూరనో దాఁగియున్నాననియు నామె సందేహించును. నీవు పోయినయెడల సంతోషించి రా జసత్యమాడలేదు. శ్రీరాముని నిజముగానే యడవులకుఁ బంపెనని యసత్యవాదికాఁడని యామె తలఁచును.

భరతుఁ డేలురాజ్యంబు కైక యనుభవింపవలయు నని నా ముఖ్యాభిలాష. కాఁబట్టి నీవు నాకును రాజునకుఁ బ్రియమగునట్లు రథముతోడఁబోయి నేను జెప్పిన మాటలఁ జెప్పుము.

—• శ్రీరామలక్ష్మణులు జడలు ధరించుట. •—

సీ. అని యూరడించి యి•ట్లను గుహుఁ గనుఁగొని, జనయుతం బిచ్చోటఁ•జనదునిలువ
నాశ్రమవాసి నై • యర్హవిధంబుగ, మునిజనభూషణం • బనఁగఁ దగిన
వరనియమంబున • వర్తిలి తండ్రికిఁ, గరము హితంబుగ • ధరణిసుతకు
సౌమిత్రికిని హిత•కాముఁడ నై జడల్, దాల్చెద మఱ్ఱిపాల్ • త్వరగఁ దెమ్ము
తే. నాఁగ నతఁ డట్లు సేయ సౌం•దర్యధాముఁ డైన రాముండు తనకును•ననుజునకును
జడలుగావించె నిబ్బంగి • జటిలుఁడయ్యె, దీర్ఘబాహుండు గుణనిధి • దేవనిభుఁడు.
౧౩౭

ఊరడించి = సమాధానపఱిచి- జనయుతంబు = మనుష్యులతోఁ గూడినది - ఆశ్రమవాసినై = ఆశ్రమ మేర్పఱుచుకొని యందు వసించువాఁడనై; అర్హవిధంబుగన్ = తగినవిధముగ- మునిజనభూషణంబు = మునులకు నలంకారమైనది- వర నియమంబునన్ = శ్రేష్ఠమైన నియమముతో- కరము = మిక్కిలి- హితకాముఁడనై = హితముఁగోరినవాఁడనై - జటిలుఁడు = జడలుగలవాఁడు- దీర్ఘబాహుఁడు = నిడివిచేతులు గలవాఁడు.

సీతాలక్ష్మణులకు హితముఁగోరువాఁడనై = శ్రీరాముఁడు జడలుధరించి వానప్రస్థ నియమంబున నుండెనేని యందలి ఫలమున సగభాగ మాయన యర్ధాంగలక్ష్మి సీత పంచుకొనుటచే నామెకు హితము. అడవికివచ్చి నాగరులవేషమున గృహస్థువలె నుండుట సరిగాదు. కావునఁ దాను జడలుధరించిన లక్ష్మణుఁడును జడలు ధరించును. కావున నాయనకు హితము.

సౌందర్యధాముఁడు దేవనిభుఁడిత్యాది విశేషణములచే నిట్టి మహానుభావునకుఁగూడ నిట్టివేషము ధరింపవలసివచ్చెఁగదా యని కవి పరితాపపడుచున్నాఁడు.

## తాత్పర్యము.

శ్రీరామచంద్రుఁడు సుమంత్రు నిట్లూరార్చి గుహుఁడు తన్నచ్చటనే వసింపు మనియు నదియు నరణ్యమే కావున ప్రతిహానిలేదనియుఁ బ్రార్థింపఁగా నాయనను జూచి యిట్లనియె. మిత్రమా! యిది జనుల సందడిగల ప్రదేశము కావున నరణ్య ప్రదేశమయినను నిందు నిలువరాదు. జనులు లేనిచోట నాశ్రమము నేర్పఱచు కొని యందు వానప్రస్థుఁ డుండఁదగిన విధంబుగ ముని జనుల కలంకారంబగు నేల పడక బ్రహ్మచర్యము లోనగు నుత్తమ నియమంబున వర్తించుచుఁ దండ్రికి హితమైన రీతి సీతకు లక్ష్మణునకుఁ బ్రియముఁగోరిన వాఁడనై కాదు. హితముఁగోరినవాఁడనై జడల ధరించెదను. మఱ్ఱిపాలు త్వరగఁ దెప్పింపుము. అనిన నతఁడట్లు చేయఁగా దేవనిభుఁడు సౌందర్యధాముఁడు సుందరకాముఁడైన శ్రీరామచంద్రమూర్తి తాను జడలుధరించి లక్ష్మణుని ధరింపఁ జేసెను. ఈరీతిగ నిడివిచేతులు గలవాఁడును కల్యాణ గుణనిధియు విష్ణువిభుఁడైన శ్రీరాముఁడు జడధారియయ్యెను.

శ్రీరాముఁడు తనకును లక్ష్మణునకును జడలు గావించె ననుటచే లక్ష్మణు నందుఁ బ్రయోజ్య కర్తృత్వము తెలియవలెను.

కం. నారలవసనంబులు నిల, జీరాడెడునిడుదజడలు ♦ చెలు వొసఁగంగా
శ్రీరామలక్ష్మణులు చెన్నారిరి సాత్త్వికమునీంద్రు♦లట్టుల యంతన్. ౧౩౪౦

## తాత్పర్యము.

. నారచీరలు నేలజీరాడు నిడుపులైన జడలు నందగింపఁగా శ్రీరామలక్ష్మణులు సాత్త్వికమునీంద్రులఁ గాంతిగలవారైరి.

కం. వసిగొని యావల వైఖానసమార్గస్థుండు నగుచు ♦ వశినాథుఁడు దా
వెస సహలక్ష్మణుఁడై గుహు, దెసఁ గని యిట్లనియెఁ బ్రీతి ♦ దెప్పలు దేలన్. ౧౩౪౧

వసిగొని=పూని (వసి+కొని). విఖనస్సు అనునాయన బ్రహ్మగోటఁ బుట్టిన యొకఋషి. "యేనఖాస్తే వైఖానసాః యేవాలాస్తే వాలఖిల్యాః"యని ప్రమాణము. వినఖయనునది విఖనయని సింహాది శబ్దములవలె వర్ణవిపర్యయంబున నయ్యెను. అతఁడు చెప్పినది వైఖానసము. వైఖానస మార్గస్థుఁడు = విఖనస్సు చెప్పిన వానప్రస్థాశ్రమ మందుండువాఁడు. వైఖానస శబ్దచర్చ యరణ్యకాండమునఁ జేయఁబడును. శ్రీరాముఁడు వానప్రస్థాశ్రమ ధర్మమును బరిగ్రహించినటు లిచ్చటఁ జెప్పఁబడెనుగదా. ఆయన యాయాశ్రమ ధర్మమంతయు స్వీకరించెనా! కొన్నిటిని మాత్రమే స్వీకరించెనా? ఆయాశ్రమ ధర్మమంతయు గ్రహించెనేని యాయాశ్రమమే గ్రహించిన ట్లయ్యెను. అట్లయ్యెనేని మరల గృహస్థాశ్రమమునకు రాఁదగఁడు. శ్రీరాముఁడు మరల గృహస్థుఁ డగ్యెఁగదా. "ఆరూఢపతితోహిస"యని పై యాశ్రమమునకుఁ బోయినవాఁడు మరలఁ గ్రిందియాశ్రమమునకు వచ్చెనేని వాఁడు పతితుఁడు అని

కదా ప్రమాణము. అయాశ్రమ ధర్మములఁ గొన్నిటిని గ్రహించి సనుట యుక్తము కాదు. గృహస్థుఁడుగానుండి వానప్రస్థుల కసాధారణ ధర్మమైన జటాధారణాది కరణము శాఖారండత్వమువలె నాశ్రమరండత్వమునకుఁ గారణమగును. ఒకశాఖయందుండి మఱియొక శాఖాధర్మముల నాచరించువాఁడు శాఖారండ యనియు నొకయాశ్రమమందుండి మఱియొక యాశ్రమ ధర్మముల నాశ్రయించువాఁడు "ఆశ్రమరండ" యనియుఁ జెప్పఁబడును. కావున శ్రీరాముఁడు వానప్రస్థధర్మ మంగీకరింపరాదని పూర్వపక్షము.

సిద్ధాంతము :— శ్రీరాముఁడు వానప్రస్థధర్మముల నన్నిటిని గ్రహించి సనుటయే యుక్తము. కొన్ని సంకటసమయముల నాపద్ధర్మముగ నీవిధముగ సంకల్పించుకొనవచ్చును. ఆ యాపత్తు దీరిపోయిన మరలఁ బూర్వాశ్రమమునకుఁ బోవచ్చును. "అల్పుఁ డధికవృత్తినున్న దోషవిధముగాదు" భారతము. ఇది యాపద్ధర్మవిషయము. అట్లులే యాపదలందుఁ దనయాశ్రమమునకంటెఁ గొంతకాల ముత్తమ యాశ్రమమందుండ సంకల్పించుకొనవచ్చును.

ఇచ్చట శ్రీరాముఁడు స్వబుద్ధిపూర్వముగ వానప్రస్థాశ్రమము స్వీకరించినవాఁడుకాఁడు. జనకునియాజ్ఞ- జననియాజ్ఞ- పదునాల్గు వర్షముల్ బహుకాటవులయందు సంచరింపఁగనిష్ట చనఁగదయ్య, పట్టాభిషేక సంభ్రమ మంతయును వీడి జడలుఁ జర్మముదాల్చి నడువవయ్య" యనికదా కైక శ్రీరామునకుఁ జెప్పెను.

"నారలుగట్టి జింకయజినంబు ధరించి- జడల్ వహించి సంచారము చేయఁగావలయు సంయమివై పదునాలుగేండ్లు సీతారమణుండు దండకను" అని కదా కైక దశరథునిఁ గోరెను. కావున నీవానప్రస్థాశ్రమ స్వీకారము తండ్రిని సత్యవాదిని జేయు తలంపుతో నాయనయాజ్ఞ నిర్వహింప నంగీకరించినదే కాని విరాగినై యావజ్జీవము నేను వానప్రస్థుఁడుగా నుండెదనని సంకల్పించి శాస్త్రోక్త విధిపూర్వకముగ గ్రహించిన వానప్రస్థముగాదు. విరాగినై గృహస్థాశ్రమమును వదలి నేనిక వానప్రస్థుఁడనో సన్న్యాసినో యయ్యెద ననిసంకల్పించి శాస్త్రోక్తపద్ధతి యాయాశ్రమము స్వీకరించి దాని నిర్వహించు శక్తిలేక మరలఁ బూర్వాశ్రమమునకు వచ్చినవాఁ డారూఢపతితుఁడు. అట్టివాని 'నారూఢపతితో హిస' యని శాస్త్రము నిందించుచున్నది. శ్రీరాముఁ డట్టివాఁడుకాఁడు. ఆపద్ధర్మపరులయెడ నీశాస్త్రమున కవకాశమేలేదు. కావుననే యుధిష్ఠిరాదులు సన్న్యాస మాపద్ధర్మముగాఁ దత్కాలమున కంగీకరించి పిదప నాపదదీఱఁగానే మరల గృహస్థాశ్రమము నొందిరి. దీనికి "సమ్యక్సంకల్పజః కామో ధర్మమూల మిదంస్మృతమ్" మ్మని మనుస్మృతి వాక్యము ప్రమాణము.

సహలక్ష్మణుఁడై =లక్ష్మణునితోఁ గూడినవాఁడై - దేశః =దిక్కు- దిశాశబ్దభవము- తెప్పలు దేలఁ=ఉప్పొంగుచుండఁగా-

## తాత్పర్యము.

తల్లిదండ్రులయాజ్ఞ నిర్వహించు పనిపూని శ్రీరామచంద్రుఁడు వానప్రస్థాశ్రమమం దుండఁగోరి లక్ష్మణునితోడఁ గలసి సంతోషాతిశయముచే గుహునితో నిట్లనియె.

కం. బలకోశదుర్గజనపద, ములపట్టుల నప్రమాదమున వర్తిలుమా
చెలి! యేమఱకుము లేనవా,రలను దురారక్షితమము రాజ్యంబరయన్. ౧౩౮౨

బల, కోశ, దుర్గ, జనపదములపట్టులన్ = చతురంగసేనలు లోనగువానియందును, ధనకోశము ధాన్యకోశము లోనగు బొక్కసములందును, జలాది దుర్గములందును ఊళ్లజనులవిషయము నందును. అప్రమాదమున్ = హెచ్చరికతప్పక; వర్తిలుమా = నడచుకొనుము- లేనవారలను = తనకనుకూలురైన వారలను, దురారక్షితమము=మిక్కిలి కష్టముచే రక్షింపఁ దగినది.

## తాత్పర్యము.

సేనలు- బొక్కసములు- దుర్గములు- ఊళ్లు- పల్లెలు మొదలగు వానివిషయమందు జాగ్రత్తతోఁ బ్రవర్తింపుము. స్నేహితుఁడా! యేమఱకుము. ఆలోచించిచూడ రాజ్యము మిగులఁ బ్రయాసముచే రక్షింపఁదగినది.

సీ. అని యాన తిచ్చి సర్వాగ్రణి వడిఁ జని, జానకీ సౌమిత్రిసహితుఁ డగుచు
గంగాతటంబునఁ గన్గొని నావను, నది వేగ తరియింప మదిని గోరి
యున్న లక్ష్మణ నీవు మున్ను నావికఁ బట్టి, కదలకుండఁగ దానిఁ బదిలపఱిచి
యీ మనస్విని మెల్ల నెక్కించి యనుపదం,బున నీవు నెక్కుమీ పొమ్మటన్న
తే. నాత్మవంతుండులక్ష్మణుం డట్ల సీత,మున్న యెక్కించి తానెక్కి యున్నఁజూచి
సరసిజాక్షుండు నెక్కె నిషాదనేత, జ్ఞాతులనుజూచి నడపుఁడీ నావ యనుడు.
౧౩౮౩

గంగాతటంబునన్ = గంగాతీరమందు- నావిక=ఓడ-మనస్విని = నిందయుండు మనుష్యు (1) ధైర్యముగలదానిని అని పరిహాసవచనము- అనఁగాఁ బిఱికిదానిని - (2) ధీరను- అనుపదంబునన్ = వెంటనే- ఆత్మవంతుఁడు = (1) శ్రీరాముని యభిప్రాయ మెఱిఁగినవాఁడు- (2) జితేంద్రియుఁడు- నిషాదనేత=బోయరాజు- జ్ఞాతులను =బాంధవులను- అనతి=ప్రకృతి అజ్ఞప్తి.

## తాత్పర్యము.

ఈ ప్రకారము గుహునకు శ్రీరామచంద్రమూర్తి యాజ్ఞ యిచ్చి సీతాలక్ష్మణులతోడఁ ద్వరగాఁబోయి గంగాతీరముఁజేరి నావనుజూచి యాలస్యములేక నదిని దాటఁగోరి యన్నా! లక్ష్మణా నీవు నావను ముందుగాఁ గదలకుండఁ బదిలముగఁ బట్టుకొని యీ పిఱికిదానిని మెల్లగ నెక్కించి వెంటనే నీవు నెక్కుము. పొమ్మనిన జితేంద్రియుఁడును నన్నయభిప్రాయ మెఱిఁగినవాఁడును నగు లక్ష్మణుఁడు శ్రీరా

మాజ్ఞచొప్పున సీతను ముందుగా నెక్కించి పిదపఁ దా నెక్కియుండఁగాఁ జాది శ్రీరామచంద్రుఁడును నెక్కఁగా గుహుఁడు తనబంధువులతో నావ నడుపఁడనెను.

ఎక్కించి = ఎక్కునట్లుచేసి- సీతచేతిని లక్ష్మణుఁడు పట్టుకొని యెక్కించి యనియు నర్థము చెప్పవచ్చును. సీత మనస్విని = దృఢమైన మనస్సుగలది యని చెప్పుటచేతను లక్ష్మణుఁడాత్మవంతుఁడని చెప్పుటచేతను దాఁకినను దోషములేదు. కామమునఁ దాఁకిననే దోషము. అయినను నావ కదలకుండ రెండుచేతులఁ బట్టిన వాఁడేచేత సీతను బట్టుకొని యెక్కించెను? కావున సీత తనంతటఁ దానే నావ యెక్కుట కనుకూలపడునట్లు లక్ష్మణుఁడు నావను బట్టుకొనె ననియే గ్రహింపనగును.

ఆ. రామచంద్రుఁ డంత • బ్రాహ్మణక్షత్రయోగ్యంబు మంత్రవరము•నాత్మహితము
పొందఁగ జపముఁ జేసి • భూమిజాలక్ష్మణయుక్తి నాచమించి•యుల్లసించి. ౧౩౭౮

బ్రాహ్మణక్షత్రయోగ్యంబు = బ్రాహ్మణులకు క్షత్రియులకు యోగ్యమైనది. "సుత్రామచామ్పృచా నావమారోహకప ఉత్తిరేత్త"ని క్షత్రియాధికారము. మంత్రవరము = శ్రేష్ఠమైన మంత్రము; "దైవీంనావ"మను బ్రాహ్మణ క్షత్రియ సాధారణ మంత్రమును- ఆత్మహితముపొందఁగన్ =తనమేలుకొఱకు-భూమిజాలక్ష్మణయుక్తిన్ = సీతాలక్ష్మణులతోడ- ఆచమించి=ఆచమనముచేసి- ఉల్లసించి=సంతోషించి-

దీనివలన మహానదిని దాఁటునపుడు ఆచమించి జపింపవలయునని సూచన.

ఉత్తరోదకమాచామే దవతీర్య తదైవచ, ఏవంస్యాత్తేజసాయుక్తో, వరుణోపి సుపూజితః॥ ఆశ్వలాయనుఁడు. పడవయెక్కి, పడవదిగి, ఈరెండు సమయంబుల నాచమింపవలయును. దీనివలనఁ దేజస్సతిశయించును. వరుణుఁడు పూజింపఁబడును.

## తా త్ప ర్య ము.

అంతట ననఁగా నావ కదలఁబోవు నపుడు నావలోనుండి నావయెక్కి ప్రయాణము చేయవలసినపుడు బ్రాహ్మణులు క్షత్రియులు జపింపఁదగిన శ్రేష్ఠమైన మంత్రమును శ్రీరామచంద్రమూర్తి తనమేలునకై జపించి శ్రీసీతాలక్ష్మణులతో నాచమించి సంతోషించి.

చం. సబలు నిషాదనాథు గుహు • సారథిసత్తము నాసుమంత్రునిన్
నిబిడదయాతిరేకమున • నిల్వఁ డ టంచు ననుజ్ఞ యిచ్చి నౌ
కబరులఁ దీవరింప దృఢ•సారసమాహితకర్ణధార మై
సొబగుగ నేగె నోడ రయ•సుందరమై స్ఫ్యహతాంబుపూర మై. ౧౩౭౯

సబలున్ - సేనతోఁగూడినవానిని- శ్రీరాముని సగౌరవముగఁ బంపుటకై గుహుఁడు తనసేననుగూడఁ బ్రయాణసమయమునకు రప్పించెను. నిషాదనాథున్ = బోయనాయకుని- నిబిడదయాతిరేకమునన్ = దట్టమైన దయయొక్క యతిశయముచే- అనుజ్ఞ=అనుమతి- నౌకబరులన్ = నావనడపు బోయలను-తీవరింపన్= వేగ

నడపుఁడని తొందరపెట్టఁగా- దృఢసార సమాహిత కర్ణధారమై=దృఢమైన బలము హెచ్చరికతో సిద్ధపడి నావ నడపువారిని గలదై- సొబగుగన్ = అందముగ- ఇటు నటు కదలక- రయసుందరమై=వేగముచే నందమై- స్ఫ్యహతాంబుపూరమై = తెడ్డు కఱ్ఱలచేఁ గొట్టఁబడిన జలప్రవాహము గలదై.

తా త్ప ర్య ము.

సేనలతోడి బోయనాయకుని గుహుని నుత్తమసారథియైన సుమంత్రుని నిండు దయతో నిలువుఁడని యనుజ్ఞ యిచ్చి యోడనడపు బోయలను త్వరగాఁ బోనిండని తీవరింపఁగా దృఢమైన బలముగలదై హెచ్చరికగల నావ నడపువారిని గలదై యిటు నటు లోపలి మనుష్యులు పొరలునట్లు కదలక వేగముగఁ దెడ్డుకఱ్ఱలచేఁ గొట్టఁబడుచున్న జలప్రవాహముగలదై, యోడపోయెను.

—• సీతాదేవి గంగను బ్రార్థించుట. •—

తే. ఏటినడుమంతరంబున • కేగియచటఁ, దోయజాక్షి తనకేలు • దోయిలించి
 మ్రొక్కి- భాగీరథీదేవి•దిక్కుఁ జూచి, భక్తిపూర్వకముగఁ జల్పెఁ • బ్రార్థనంబు.
౧౩౮౭

నడుమంతరంబునకున్ = నడిమిభాగమునకు- తోయజాక్షి = కమలముల వంటి కన్నులుగల సీత- దోయిలించి = దోసిలివలె చేతులుజోడించి- భాగీరథీదేవి = గంగాదేవి- భక్తిపూర్వకముగన్=భక్తి ముందుండునట్లు- ప్రార్థనము=వేడికోలు.

తా త్ప ర్య ము.

ఏటి నడిమిభాగమునకు నోడపోఁగానే యచట సీతచేతులు జోడించి గంగా నది దిక్కుఁజూచి భక్తితో నిట్లు ప్రార్థించెను.

కం. అమ్మా భాగీరథి! నెయ్యమ్మున నీదాశరథి వ•నాంతరవాసం
 బిమ్మగఁ దీరుచు నట్టుగ. నమ్మతి రక్షింప వమ్మ•సాగరుకొమ్మా! ౧౩౮౮

వనాంతరవాసము=అడవులలోఁ గాఁపురము- ఇమ్మగన్ = కొఱఁతలేకుండఁ జక్కఁగ- సాగరుకొమ్మా=సముద్రుని యిల్లాలా! నెయ్యమ్మునన్=స్నేహముచే- నీవు భాగీరథివి = భగీరథునాఁడుబిడ్డవు- ఈశ్రీరాముఁ డాయన మనుమఁడు. కావున నీయున మనవాఁడుగదా యను భావమున-

తా త్ప ర్య ము.

తల్లీ! గంగాదేవీ! యీ దశరథరాజ కుమారుఁడు శ్రీరాముఁడు వనవాస దీక్ష యేకొఱఁతలేకుండ నెఱవేర్చునట్లు లోసాగరుదేవీ! భగీరథుని కూఁతురా నీకు నీయునకుఁగల సంబంధము దల్చఁచినైన స్నేహభావమున నీయునను రక్షింపుము.

కం. ఈరే డబ్దంబులు వనిఁ, దీరిచి తాఁ దమ్ములోడ • దేవీ నాతో
 వారక నిను మఱి గానఁగఁ, జేరఁగఁ గనవమ్మ చంద్ర•శేఖరుకొమ్మా! ౧౩౮౯

ఈరేడబ్దంబులు =పదునాలుగేండ్లు- వనే=అడవియందు- వారక=విఘ్నము లేక- చంద్రశేఖరశోభ్యా=చంద్రునిఁ దలయందు ధరించిన శివునిదేవీ- కనవమ్మా = సంకల్పింపుము.

తాత్పర్యము.

శంకరుదేవీ! అడవిలోఁ బదునాలుగేండ్లుండి ప్రతిజ్ఞ దీర్చి యీ రామచంద్రుఁ డావలఁ దాను దనతమ్మునితోడను, నాతోడను నిర్విఘ్నముగ మరల నిన్నుఁ జేరు నట్లు లనుగ్రహింపుము.

కొందఱు తత్త్వజ్ఞానహీనులు జాలకు- గుట్టలకు- చెట్లకు- నదులకు హిందువులు నమస్కరింతురని యాక్షేపించుచుఁ దమయజ్ఞానమును బ్రకటించు కొందురు. వాస్తవముమున వాసుదేవస్సర్వమ్- సర్వంఖల్విదంబ్రహ్మ-హరిమయముగాని ద్రవ్యము పరమాణువు లేదన్నట్లు నీశ్వరుఁడొకఁడే యంతర్యామి యగుటయే కాక రూపం రూపం ప్రతిరూపో బభూవ యన్నట్లు మన్నొక్కటియే చుట్టి బొవ పిదుత యును వేలువేలు పేర్లచే నానారూపములు వహించినట్లు తానే సర్వరూపములు సర్వనాములునై యున్నాఁడు. కావున సర్వము భగవన్మయమే భగవత్స్వరూపమే కాని యితరపదార్థమేదియు లేదు. కావున నెవరు దేనికి నమస్కరించినను నారూపము వహించి యందంతర్యామిగా నుండు భగవంతునకే నమస్కరించుచున్నారు గాని వేఱుదేనికి నమస్కరించుటలేదు. ప్రణమే దీశ్వరకలా మాశ్వచండాల గోఖరమ్మ న్నట్టు సర్వము నీశ్వరభావముచే నమస్కరించుట తత్త్వజ్ఞ లక్షణము. తెలియక నైన నమస్కరించుట మధ్యముల లక్షణము. దాని నిషేధించుట మూఢులగు బాహ్యుల లక్షణము. మనదేహములం దీశ్వరుఁ డెట్లున్నాఁడో యన్నిట నట్లే యున్నాఁడనియు స్థూలదృష్టికిఁ గానవచ్చునది యాయనకు శరీరమగు ప్రకృతి యనియు గ్రహింపవలయును. జగత్సర్వం శరీరం తే=సమస్తజగము నీశరీరము త్వం ధారయసి భూతానివసుధాంచ సపర్వతామ్ అంతే పృథివ్యా సలిలే దృశ్యసేత్వం" నీవే భూతములను బర్వతములోడి భూమిని ధరించెదవు. భూమిలో నీళ్లలో నీవే కానవచ్చెదవు అని యుద్ధకాండమున ౧౨౦-వ సర్గమునందలి బ్రహ్మస్తుతియందుఁ గలదు. దృశ్యతే శ్రూయతేపివా అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థిత యన్నట్లు కానవచ్చునవి వినవచ్చునవి లోపల వెలుపల నుండునవి సర్వమును వ్యాపించి నారాయణుఁ డున్నాఁడను శ్రుతివాక్యము స్మరించి భక్తిపరులై యుండువారు బుద్ధిమంతులు. శరీర వికారములు ప్రకృతివేకాని యాత్మలవికావు.

ఈసందర్భమున నీవాక్యములు స్మరణీయంబులు-

ఆబ్రహ్మస్తంబపర్యంతం, పరమాత్మస్వరూపకమ్
స్థావరం జంగమంచైవ, ప్రణమామి జగన్మయమ్॥

బ్రహ్మమొదలు గడ్డిగంటవఱకు చరాచరములందు సర్వము పరమాత్మస్వరూపము కలదే. కావున జగన్మయుఁడైన భగవంతునకు నమస్కారము.

యత్కించి త్సృజ్యతేయేన, సత్త్వజాతేనవై ద్విజ
తస్య సృజ్యస్య సంభూతౌ, తత్సర్వం వై హరే స్తను ॥
విష్ణుపురాణము. ౧ అం. ౨౨ అ. ౩౫ శ్లో.

ఖం వాయురగ్నిం స్సలిలం మహీంచ, జ్యోతీంషి సత్త్వాని దిశో ద్రుమాదీన్
సరి త్సముద్రాంచ హరేశ్శరీరం, యత్కించ భూతం ప్రణమే దనన్యః ॥
భాగ. ౧౧-౨. ౪-౧.

ఆకాశము- వాయువు- అగ్ని- జలము- భూమి- నక్షత్రాదులు- జంతువులు- దిక్కులు- చెట్లు మొదలైనవి నదులు సముద్రములు మొదలైన వేవేవి కలవో యన్నియు విష్ణువు శరీరమే కావున ననన్యబుద్ధి నమస్కరింప వలయును.

కం. క్షేమముగ మరలినప్పుడు, నేమంబుగ సర్వకామ॰నిచయముచేరన్
వ్యోమధునీ నినుఁ బూజా, స్తోమంబుల ముదితఁ జేయు॰దుం గడుభక్తిన్. ౧౩౯

క్షేమముగన్=కుశలముగ- నేమంబుగన్ = నియమముతో- సర్వకామనిచయము=అన్నికోరికల సమూహము- వ్యోమధునీ = ఆకాశమునందుఁ బ్రవహించు నదీ- పూజాస్తోమంబులన్=పూజాపదార్థముల సమూహములచే- ముదితన్=సంతోషించినదానిఁగా-

తా త్ప ర్య ము.

ఏవిఘ్నము అపాయములేక శ్రీరామలక్ష్మణులు నేను మరలి వచ్చినపుడు మా కోరికలన్నియు నెఱవేఱఁగా నియమముతో నిన్ను బహువిధంబుల నీవు సంతోషించునట్లు పూజింతును.

సీ. దేవి! నీ వనఁగను ॰ కేవలనదివౌకో, త్రిపథగా ఖ్యాతిని ॰ దేజరిల్లి
బ్రహ్మలోకంబునఁ ॰ బరఁగుచు నీలోక, మందుఁ గంధీశుని॰ల్లాల వగుచు
క్షాళితకల్మష॰స్నాతకపుంజ వై, యలరు ని న్నిట్లుకొం॰డాడ నేర్తుఁ
గరముల మోడ్చెదఁ ॰ గాకుత్స్థతిలకుండు, గ్రమ్మఱి యే తెంచి ॰ ప్రాప్తరాజ్యుఁ

తే. డగుడు నీప్రీతిగాఁగ బ్రా॰హ్మణులకిచ్చు, దాన మూర్వేలు గోవులు॰మాని తాన్న
వస్త్రములు నీకు వేసురా॰భాండములును, గరుఁడాడము పూసి గం॰గాభవాని. ౧౪౦

కేవలనదివౌకో=సామాన్య నదీమాత్రమవా- త్రిపథగాఖ్యాతిని = త్రిపథగ యనుకీర్తిచేత- ఈవిషయము బాలకాండమున విస్తరింపఁబడినది- కంధీశు=సముద్ర రాజు- ఇల్లాలవు=భార్యవు- క్షాళిత స్నాతక కల్మషపుంజవై=కడిగివేయఁబడిన స్నానముచేయువారి పాపసమూహము గలదానవై- కొండాడన్ = స్తుతింప- సురాభాండములు=కల్లుకుండలు- భవాని=భవునిభార్య భవాని- బ్రహ్మలోకంబునఁ బరఁగుచున్ = బ్రహ్మలోకంబున బ్రహ్మదేవుని కమండలువునం దుండునది- దీనిలోనే త్రివిక్రమావతారమున బ్రహ్మదేవుఁడు విష్ణుపాదములు కడుగఁగా నాతీర్థము గంగయై

బయలు వెడలినది. ఈవిషయమే ౧౩౦౦-వ పద్యమున "హరిపాద సంభూత నైన దాని"నని చెప్పఁబడియె.

తాత్పర్యము.

దేవీ! నీవనిన సామాన్యనదివా యేమి! త్రిపథగ యని మూఁడు త్రోవలఁ బాఱి కీర్తి గాంచినదానవు. బ్రహ్మలోకమం దుండుచు నీలోకమున సముద్రరాజు భార్యవై నీయందు స్నానము చేయువారి పాపములనెల్లఁ గడిగినదానవై యొప్పు నిన్ను నే నేమని పొగడఁగలను! చేతులు జోడించి నమస్కరించెదను. శ్రీరామచంద్రుఁడు మరలివచ్చి రాజ్యమును బొందినవాఁడాయెనా నీకు సంతోషముగ లక్ష గోవులను బ్రాహ్మణుల కిచ్చెదను. నీకు మంచియన్నము వస్త్రములు వేయి కల్లు కుండలు సమర్పింతును. కావునఁ దల్లి గంగాభవానీ దయచూడుము.

కం. నీతీరంబుల నుండెడి, పూతక్షేత్రములఁ దీర్థములఁ దేవతలన్
　నీతముగాఁ బూజించెదఁ, బ్రీతిం గను గంగ కలుషవిసరవిభంగా. ౧౩౯౧

పూతక్షేత్రములన్=గంగాద్వార (హరిద్వార) కాశీ ప్రయాగాది పవిత్ర క్షేత్రములను-నీతముగాన్=నియతముగ - కలుషవిసరవిభంగా = పాపముల సమూహములను భంగించుదానా- ఇందు పూత శబ్దము తీర్థముతోడను దేవతలతోడను నన్వయించును.

తాత్పర్యము.

గంగాదేవీ! నీ యొడ్డులందుండు కాశీ మొదలగు పవిత్ర క్షేత్రములను మణికర్ణికాది పవిత్రములయిన తీర్థములను అట్టిదేవతలను నియమముగాఁ బూజించెదను. పాపచయములఁ జెఱచుదానా నన్ను దయతోఁ జూడుము.

సమాసంబునందలి పూర్వపదంబు వ్యవహితంబైన యుత్తరపదంబుతోడ నన్వయించును. "పరులధనమునకు విద్యాపరిణతికిం దేజమునకు మనంబెరియఁగ నసహ్యపడు నన్నరుఁడు." భారతము. పరుల ధనమునకుఁ, బరుల విద్యాపరిణతికిఁ బరుల తేజమునకని యన్వయము.

కం. తనతమ్మునితో నాతో, ననఘుఁడు శ్రీరామచంద్రుఁ డామోదమునన్
　వనవాసముఁ దీరిచి మఱి, చనుదేరఁగఁ గుశలిగాఁ బ్రసాదింపు దయన్. ౧౩౯౨

ఆమోదమునన్ = సంతోషముతో - కుశలిగాన్ = క్షేమముతోఁ గూడిన వానిఁగా; ప్రసాదింపుము=అనుగ్రహింపుము.

తాత్పర్యము.

దోషమెఱుఁగని శ్రీరామచంద్రుఁడు వనవాసము ముగించి సంతోషముతోఁ దమ్మునితోడను నాతోడను క్షేమముగా మరలి వచ్చునట్లు దయతో ననుగ్రహింపుము.

కం. అని వేడుచు నుండఁగ భూ,తనయ వడిఁ నావ గంగ•దక్షిణతటముఁ
జనుచు నట డిగ్గి రందఱుఁ, దనతమ్మునిఁ బల్కెఁ దశర•థప్రభువుండున్. ౧౩౯౩

దక్షిణతటముఁ=దక్షిణపుటొడ్డు – చనుచున్= చనిన యనంతరము – దశరథ ప్రభువుండున్=శ్రీరాముఁడు–

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము సీత ప్రార్థించుచుండఁగ వేగముగఁ బోయి నావ యావలి యొడ్డు చేరెను. అచట నందఱు దిగిరి. అప్పుడు శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె.

శా. సౌమిత్రీ! యిఁక నేమఱం దగదు ర•క్షాప్రక్రియన్, నిర్జనం
బే మానుష్యసమేత మేదినియును నేర్మిన్ మున్నుగా నీవు పో
మ్మా మార్గమ్మును జూచికొంచు, బడి నీ•త్మాప్రుత్రియే తెంచు, నే
నో మీఁయిద్దఱఁ గాచుచున్ వెనుక నై • యుర్వీజకున్ వచ్చెదన్. ౧౩౯౪

సౌమిత్రీ=సుమిత్రనందనా– సుమిత్రనామము స్మరించుటచే నీతల్లి నీకేమని బుద్ధిచెప్పెనో దానిని స్మరింపుము. “ఏమఱెదవుసుమీ యెప్పుడైన నీమనంబున నేని” యని చెప్పలేదా. ఆమాటలు స్మరింపు మని భావము. రక్షాప్రక్రియన్ = రక్షించు కార్యమునందు; నిర్జనంబేన్=జనములేని ప్రదేశమైనను– మానుష్యసమేతమేదినియున్ =మనుష్యులతోఁగూడిన ప్రదేశమైనను – నేర్మిన్ = నేరిమిన్=నేర్పుతో –హెచ్చరికతో– బడి=వెంబడి– క్ష్మాపుత్రి=సీత– ఉర్వీజకున్=సీతకు-

తా త్ప ర్య ము.

సౌమిత్రీ! యిఁక రక్షించుకార్యమందు మన మేమఱరాదు. జనములుగల ప్రదేశమందైనను జనములులేని ప్రదేశమందైననునీవుత్రోవచూచుకొని ముందుగాఁ బొమ్ము, నీవెంట నీసీతవచ్చును. నేనో మీఁయిద్దఱ రక్షించుచు సీతకు వెనుక ప్రక్కఁగా వచ్చెదను.

ఈపద్యమునందు విలోమముగాఁ బ్రణవము చెప్పఁబడినది. అనులోమముగా నరణ్యకాండమందలి ౧౭౭౯-వ పద్యమునఁ జెప్పఁబడెను. లక్ష్మణుఁడు మకారమును సీత– ఉకారమును– శ్రీరాముఁ డకారమును సూచించెడిని. మకారో జీవవాచక యన్నట్లు లక్ష్మణుఁడు జీవుని, ఉకారము=లక్ష్మిని– అకారార్థో విష్ణువని అకారము శ్రీరాముని సూచించును. ప్రపంచము (లీలావిభూతి) యీ యరణ్యమే. ఇందుఁ బ్రవేశించిన ప్రతిదేహమునం దీమూఁడు తత్త్వములు గలవు.

ఈ యరణ్యమందు సంచారముచేయువారు సీతను అనఁగాఁ బ్రకృతిపరిణామమైన దేహమును ముందుంచి యనఁగా దానిని మార్గదర్శిగాఁ గొని యుఁడిపోయిన త్రోవ లక్ష్మణుఁడు అనఁగా జీవుఁడు పోయెనా యిరువురకు నపాయము తప్పదు. కావున దేహరక్షాభారము అవ్యవధానముగ జీవునందు, సవ్యవధానముగ నీశ్వరు

యందుఁ గలదు. జీవుఁడు చేతనుఁడు జ్ఞానస్వరూపుఁడు. కావునఁ దాను ముందు పోయి ప్రకృతిని దేహము తనవెంటవచ్చునట్లు చేసికొనినా యిరువుర కపాయము లేదు. నేను వీరా యిద్దఱఁ గాచుచున్ వచ్చెద ననుటచేఁ బ్రకృతిని జీవుని రక్షించు వాఁ డీశ్వరుఁ డగుచున్నాఁడు. భగవంతుఁడు ప్రయోజకకర్త- జీవుఁడు ప్రయోజ్య కర్త- 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతన' యను భగవద్గీతా వాక్యము. బాలకాండము ౧౮-వ సర్గమందలి- అథ లక్ష్మణ శత్రుఘ్నౌ సుమిత్రాజనయత్సుతౌ వీరౌ సర్వాస్త్రకుశలౌ విష్ణోరర్థసమన్వితౌ అను వాక్యము ననుసంధించిన యెడల లక్ష్మణుని జీవస్థానమునఁ జెప్పుట యందలి సమంజసత్వమును సీత పృథ్వీతనయ యని చెప్పుటచే నామెను బ్రకృతి పరిణామమైన దేహముగఁ జెప్పుటయందలి సమంజసత్వము గ్రహింపనగు.

భారతయుద్ధమందలి యర్జునునిరథము దేహముగను (రథశబ్దమునకు దేహ మనియు నర్థముగలదు.) నరుని జీవునిగను (నరశబ్దమునకు జీవుఁడనియు నర్థము గలదు.) కృష్ణుని భగవంతునిగను గ్రహింపవలయును శరీరమాద్యంఖలు ధర్మసా ధనమన్నట్లు శరీరమును జక్కఁగ రక్షించిననే జీవునకు నీశ్వరునకు సంతోషము. ఈ మూఁడు తత్త్వముల గుఱించి యరణ్యకాండమందు విపులముగఁ జెప్పఁబడును.

కం. కాననినిర్మానుష్యపుఁ,గానన మిది కాన మనము ♦ కడు హెచ్చరికన్
బూని పరస్పరరక్షను, మానక కావించుటయె స♦మంజసవిధ మా. ౧౩౫

కానని=మనమెన్నఁడెఱుంగని; నిర్మానుష్యపుఁ గాననమిది=ఇది మనుష్యులు లేని యడవి- పరస్పరరక్షన్ = ఒకరినొకరు కాపాడుకొనుటయే- సమంజసవిధము = యోగ్యమైన మార్గము.

తాత్పర్యము.

వాస్తవ మాలోచించిన శ్రీరామలక్ష్మణులకు సీతాసాహాయ్య మనావశ్య కము. ఆమెచేయఁగల దేదియులేదు. అయినను నరణ్యమున క్షేమముగ సంతోష ముగ సంచరింపవలయుననిన సీతను క్షేమముగాఁ గాపాడుట యవశ్య కర్తవ్యము. ఆమెనుపేక్షించుట తమయుగచాల్ల కే. అట్లులేజీవాత్మ పరమాత్మలకు దేహ(ప్రకృతి) సాహాయ్య మనావశ్యకమైనను లోకయాత్ర నలుపవలసివచ్చినప్పుడు దేహరక్షణ మవశ్యక రవ్య మగుచున్నది దేహము నుపేక్షించిన జీవుఁ డుభయములోక భ్రష్టుఁడే. ఈయుద్దేశముతోఁ 'బరస్పరరక్ష' యని చెప్పఁబడెను. అటుగాక పరస్పర మనునది రామలక్ష్మణులకే యన్వయించిన సీత నుపేక్షించిన దోషమొదవును. వాల్మీకి యీ యర్థమును మనసునం దుంచుకొనియే దానికిఁ దగిన పదములఁ బ్రయోగించెను.

కం. కడచినకార్యము చక్కఁగ, బడుట యరిది కానఁ గడవఁ♦బడుటకు మున్నే
కడుకొని యవధానుల మై, జడనేమియు లేక రక్ష♦నలుపఁగ వలయున్. ౧౩౬

కడచినకార్యము = మించిపోయిన కార్యము; చక్కఁబడుట = మరలబాగు పడుట- అరిది=అసాధ్యము- కడవఁబడుటకుఁ=మించిపోవుటకు-కదుకొని = పూని- అవధానులమై=హెచ్చరికగలవారమై-జడను=సోమరితనము- ప్రమాదము-

## తా త్ప ర్య ము.

మించిపోయినకార్యము మరలఁ జక్కఁజేయుట యసాధ్యము. కావున మించి పోవుటకు ముందే మనము ప్రయత్నించి హెచ్చరికగలవారమై, సోమరితనములేక రక్షింపవలయును. ఈజీవున కీదేహము పోయిన వేఱొకదేహము రాదా? యందు రేమో. ఒకటిగాదు కోటియైన నొకటివెంట నొకటివచ్చును. అట్లు జన్మములెత్తుచు నీ ప్రపంచారణ్యమం దుండఁగోరువాఁడు బుద్ధిమంతుఁడా. ఈ యొకదేహముతోనే యీ యరణ్యమునకు మరల రాకుండ వైకుంఠము (అయోధ్య) చేరువాఁడు బుద్ధిమంతుఁడా. ఈసీతపోయిన వేఱొకభార్యరాదా లోకములో స్త్రీలకు దారిద్ర్యము వచ్చినదా యని శ్రీరాముఁ డనలేఁడుకదా. శ్రీరాముఁ డేకపత్నీవ్రతుఁడై యేల యుండెను. కావున 'పతిర్దేహావసానే మాం త్వత్పాదం ప్రాపయస్వ' యన్నట్లు వైకుంఠముచేరు యత్న మీయొకదేహముతోనే చేయవలయునుగాని వేఱొక దేహమునకై కాచుకొనరాదు. ఒక్క దేహముతో ముక్తిగాంచు మార్గమే రామాయణము బోధించునది. కావున దేహము నుపేక్షింపరాదు. దానిని రక్షించుచు మరల జన్మమునకు రానిగతి వర్తింపవలెను.

మ. జనసమ్మర్ద మొకింత గానక మనోజ్ఞంబుల్ మహారామము
లొగ్గొనబౌ క్షేత్రము లేమి లేకయును గండ్లుం గుండ్లు ముం డ్లొప్పి భీ
జనకం బై నయరణ్యదేశ మిదె కంజాక్షీ వైదేహియు
న్వనవాసశ్రమ మింకిటం దెలిసెదో నా లక్ష్మణుం డాదటన్. ౧౩౯౭

మహారామముల్=గొప్పతోఁటలు- ఒనబు=అందము- క్షేత్రములు = పంటలుగల ప్రదేశములు- భీజనకంబు=భయమును బుట్టించునది- కంజాక్షీ= కమలములవంటి కన్నులుగలది- వైదేహి=విదేహరాజు కూఁతురగు సీత-వనవాసశ్రమము =అడవులయందు వసించుటయందుఁ గల ప్రయాసము-నా = అనఁగా - ఆదటన్ = ప్రేమతో -

## తా త్ప ర్య ము.

మనుష్యులగుంపుల రాపిడి కొంచెమైనను లేక మనోహరములైన గొప్పతోఁటలుగాని యందమైన పంటభూములుగాని యేదియులేక గుండ్లు గండ్లు ముండ్లుగలిగి భయమును గలిగించు నరణ్యప్రదేశ మిదియే. ఇఁకమీఁద వనవాసమునఁ గల ప్రయాసము సీత తెలిసికొనఁ గలదు. ఇంతసేపు రథముమీఁదఁ బ్రయాణము చేసినట్లు గాదు. అని చెప్పఁగాఁ బ్రీతితో లక్ష్మణుఁడు.

కం. మున్నుగఁ జనుడును నాతని, వెన్నంట సుమాలినూజ • వెలఁదికిఁ బిఱుఁదన్
సన్నుతవీర్యుఁడు రాముఁడు క్రన్నన చనుచుండె వారిఁ • గాచుచుఁ గడఁకన్. ౧౩౯౮

తా త్ప ర్య ము.

ముందుగాఁబోఁగా నాయనను సీత వెంబడించెను. ఆమెకు వెనుక వీర్యవంతుఁడై యాయిరువురను గావ సమర్థుఁడైన శ్రీరాముఁడు ధనుర్ధరుఁడై హెచ్చరికతో మెల్లగాఁ బోవుచుండెను.

ముందుపోవువారికి వెనుకవారు గానరానట్లు జీవుఁడు దేహముతమ్మురక్షించు భగవంతునిఁ గనుఁగొనఁ జాలరు. వారికి గానవచ్చినను గానరాకున్నను భగవంతుఁడు తనరక్షాకార్యమును జేయుచునే యుండును. అది యెఱిఁగి తనరక్షాభారమాయనయందు నైచి ప్రకృతిని వెనుకనైచికొని సరియైన మార్గము చూచుచు హెచ్చరికతో నిర్భరుఁడు నిర్భయుఁడు నై లోకయాత్రచేయు జీవి కేభయము లేదు. హానిలేదు.

కం. గంగాపరపారము నరు,గంగఁగని తెప్ప వ్రాల్ప • కయ కడుద వ్వే
గంగా వారు సుమంత్రుఁ డ,భంగార్తిని జెందె గళిత • బాష్పుం డగుచున్. ౧౩౯౯

గంగానదియొక్క- అపరపారము = ఆవలియొడ్డు-అరుగంగాన్ = పోఁగా - అభంగార్తిని=విడువని దుఃఖమును- గళితబాష్పుఁడు=జాఱు కన్నీళ్లుగలవాఁడు-

తా త్ప ర్య ము.

వారు మువ్వురు గంగానది యావలియొడ్డునకుఁ బోఁగా తెప్పవ్రాల్పక చూచి చూచి వారు మిగులదూరము పోఁగా సుమంత్రుఁడు కన్నీరు గార్చుచు మిగుల దుఃఖించెను.

కం. [ఆలోకపాలనిభులు స,మాలోకితచారుసస్య • మహితావను లై
యాలోకబాంధవుఁడు మం,దాలోకుం డగుచు నిలిచి • యవ్వత్సమునన్.] ౧౪౦౦

లోకపాలనిభులు=ఇంద్రాదిదేవతలతో సమానులు- (2) వాస్తవమైన లోకపాలుఁడు భగవంతుఁడే గనుక నాయనతో సమానులు- అవతార దశనుబట్టి సమత్వము. సమాలోకిత= చక్కఁగాఁ జూడఁబడిన, చారు = మనోహరమైన, సస్య = ధాన్యముల పైరులచే; మహిత=గొప్పదైన, అవను లై=భూములు గలవారై - లోకబాంధవుఁడు=సూర్యుఁడు- మందాలోకుఁడు=మందమైన కాంతిగలవాఁడు- అగుచున్ =కాఁగా- అవ్వత్సమునన్ = ఆవత్సదేశమందు- మందాలోకుఁ డనుటచే నపరాహ్ణకాలము ముగియవచ్చెనని యెఱుఁగనగు. శ్రీరాములకాలమునాఁటికి వత్సదేశము లేదనియు నాకారణముచే దీని మూలశ్లోకము ప్రక్షిప్తమనియుఁ గొందఱ యభిప్రాయము. మత్స్యదేశమనునది యపపాఠము- గంగా యమునలకు నడిమి ప్రదేశము వత్సదేశము- దానికిఁ బడమటిదేశము పాంచాలము- యమునకు దక్షిణ తీరమున

తూరసేనదేశము. దానికి బడమట మత్స్యదేశము. గంగా యమునల నడిమిప్రదేశమంతయు నరణ్యముగాదు. కొంత జనవాసప్రదేశము లున్నట్లు ౧౪౦౯-వ పద్యమువలనఁ దెలియుచున్నది. ఆకాలమున నీదేశమునకు వత్సమనుపేరు లేదందురేని మఱియొకపేరైన నుండియుండవచ్చును. శ్రీరామాయణమందు 'అయోధ్యకు సాకేతమని లంకకు సింహళమని పేర్లు కానరావు.

చం. నళినదళాక్షు లొండొక వ•నస్పతినీడను జేరి [యిర్వురుం
దొలుత వరాహ ఋశ్యములఁ • దొడ్డరురుం బృషతంబు నా మృగం
బుల వధియించి నాల్గిటి, బు•భుక్షితు లౌట భుజించి రంద,] అ
య్యలఘుపరాక్రముల్ తరణి • య స్తమితుండుగ వార్చి రయ్యెడన్. ౧౪౦౧

నళినదళాక్షులు = తామరఱేకులవంటి కన్నులుగలవారు- సీతారామలక్ష్మణులు- వనస్పతి=వృక్షము, వనస్పతినీడ యనిచెప్పుటచే నింకను నెండ గాయుచున్నదని భావము. ఇర్వురున్=రామ లక్ష్మణులు, వరాహ=పందిని ఋశ్యము=మనుబోతును- రురున్=నల్లచారలుగల దుప్పిని- పృషతంబున్=సాధారణమైన దుప్పిని- వధియించి=చంపి- బుభుక్షితులౌటన్=ఆఁకలిగొన్న వారగుటచేత- అలఘుపరాక్రముల్ = గొప్ప పరాక్రమము గలవారు.

• ఇర్వురున్- మొదలు భుజించిరంద అను వంతువఱకుఁ బ్రక్షిప్తమని రొకరు వ్రాసిరి. ప్రక్షిప్తమనఁగాఁ దొలుతఁ గవి వ్రాసినది గాదనియు నడుమ నెవరో క్రొత్తగా నిఱికించిరనియు నర్థము. ఇది యట్టిదె- సీతాదేవి రక్షణ విషయమందన్ని హెచ్చరిక మాటలు కొంచెముముందు చెప్పిన శ్రీరాముఁడు, దాని నంగీకరించిన లక్ష్మణుఁడు నిరువురు సీత నొంటిగా విడిచి వేఁటకుఁబోయిరనుట విశ్వాసార్హము గాదు. అదియునుగాక వారిముగ్గురకు నాలుగుమృగము లేల ?

ఆపద్ధర్మమైనను 'నాకు వేఁటయం దంత యిచ్ఛలే'దని చెప్పిన శ్రీరాముఁడు వ్యర్థముగా నాలుగు జీవజంతువులఁ జంపెననుట నమ్మఁదగినదికాదు. అదియునుగాక వనస్పతి=ఫలవృక్షము ఈశబ్దప్రయోగముచే దత్కాలమున నది ఫలించి యుండెననియే గ్రహింపనలయును. కావున వారు మూఁడుదినము లుపవసించి ఫలవృక్షము క్రిందనుండియు ఫలములను దినక 'వ్యాఘ్రాణా ముపవాసంతు కారణం పశు మారణ'మ్మన్నట్లు నాలుగు మృగముల మాంసముతోఁ బారణచేసిరనుట వారి స్వభావమునకు విరుద్ధము. ఉద్దిష్ట పట్టాభిషేకదినమునకు ముందురాత్రి యుపవాసము. పట్టాభిషేక దినమంతయు నుపవాసము. రాత్రి తమసానది జలము మాత్రము గ్రోలిరి. ఆవల గంగాతీరమున గంగద్రావిరి. ఈదిన మింతవఱకు భోజనములేదు. తరణి=సూర్యుఁడు. అస్తమితుండు=అస్తమించినవాఁడు, వార్చిరి=సంధ్యవార్చిరి. ఇది

యూరువిడిచిన మూఁడవరాత్రి- 'అపుష్పా ద్వనస్పతిః' పుష్పములు లేక ఫలించు పనస మేడి మొదలైనవి వనస్పతు లనఁబడును.

తాత్పర్యము

సీతా రామ లక్ష్మణు లొక వృక్షమునీడఁ జేరిరి. అచట సీతను నొంటరిగ విడిచి శ్రీరామ లక్ష్మణులుపోయి పందిని- మనుబోతును- చారులదుప్పిని- దుప్పిని నాలుగు మృగములఁ జంపి తెచ్చి యాఁకలిగొన్న వారగుటచే భుజించిరి. అవల సూర్యాస్తమానము కాఁగా సంధ్యవార్చిరి.

—• ౫౩-వ సర్గము. శ్రీరాముఁడు తల్లిదండ్రులఁ దలంచి దుఃఖించుట. •—

సీ. జానకీనాథుండు • సౌమిత్రిఁ గనుఁగొని, పల్లెల దాఁటివె•ల్పలిపొలంబు
నందు వసించుట • యాసుమంత్రుండును, నెడఁబాయఁ దొలిరేయి• యిదియకాదె
కావునఁ గడిచిన• కార్యంబు దలపోసి,కొనుచు విచారంబు•గొనక మయ్య
నిద్దురఁ జాలించి • నెఱజాగరూకత, నీ రేయి మొదలుగ • నిద్దఱమును

తే. సీత రక్షింపవలయును • రాత్రులను,లలన క్షేమంబు మనయంద • నిలిచెఁ గాదె
మనము తెచ్చిన యాకుల•మహిని బఱచి,పండుకొనఁదగుశిలయొండు•దిండుగాఁగ. ౧౮౦౨

వెల్పలిపొలంబు=మనుష్యులు వాసముచేయు ప్రదేశములకు వెలుపలనుండు భూమి. నెఱజాగరూకత=పూర్ణమైన హెచ్చరికతో- నిద్దురలేక.

తాత్పర్యము.

శ్రీరామచంద్రుఁడు లక్ష్మణునిఁజూచి "లక్ష్మణా! పల్లెల నన్నిటిని దాఁటి జనులు నివసించు ప్రదేశమునకు వెలుపల నుండు భూమియందు వసించుట సుమంత్రుఁడుకూడ వదలిపోవుట యీరెండు జరగిన మొదటిదిన మిదియే కదా. (ఇది వనవాసకాలమున మొదటినాఁడు కాదు.)

కావునఁ గడచిపోయినదాని నాలోచించుచు విచారపడకుము- నిద్దురవదలి నిండుహెచ్చరికతో నీరాత్రిమొదలు మనమిద్దఱము రాత్రులందు సీతను రక్షింపవలయును. ఆమె యోగక్షేమము మనయందే నిలిచియున్నది. మనముతెచ్చిన యాకులు భూమిపైఁబఱచి తలక్రింద దిండుగా రాతినుంచుకొని పండుకొనఁదగును.

కం. అని సుఖశయ్యాయోగ్యుం, డనఘుఁడు కూర్చుండి నేల • నవరజునకుఁ దా
విన నింపగుశుభకథలం, జనవున వినిపించుచోఁ బ్ర•సంగవశమునన్. ౧౮౦౩

సుఖశయ్యాయోగ్యుండు = సుఖమిచ్చు పానుపునందుఁ బండుకొన యోగ్యుఁడైనవాఁడు, అవరజునకున్=తమ్మునికి, ప్రసంగవశమునన్=మాటలపోఁకడని.

## తాత్పర్యము.

ఈ ప్రకారముచెప్పి సుఖశయ్యమీఁదఁ బండుకొనఁ దగినవాఁడు, నేలపైఁ గూర్చుండి ప్రొద్దుపోవువఱకుఁ గష్టము మనస్సునకుఁ దెలియకుండుటకు నింపైన మంచికథలను ప్రేమతో వినిపించునపుడు మాటల ధోరణియందు-

సీ. అన్న లక్ష్మణ! ధ్రువం • బమ్మహారాజేంద్రుఁ, డడలుచు నాసుతుం•డడవి కేగెఁ
గా యని పడియుండుఁ • గైకయుఁ దనకోర్కి, తుదదాఁకెఁగాయని•తుష్టినొందుఁ
గాదె యామెయుఁ దన•గాదిలిపుత్రుండు, క్రమ్మఱుడును రాజ్య•కారణమున
నమ్మహారాజప్రా•ణమ్ముఁ దీయదు గదా, యేమి సేయఁగలాఁడు • వృద్ధు కైక
తే. వలపువలత్రాళ్ళఁ జిక్కిన•వాఁడు దిక్కు,మాలినాఁ డేను దూర విూ•లీల వచ్చు
కతనఁ దెరువేమి తెలియకే• వెతలఁబడునొ,యేమి సేయుదుఁదమ్ముఁడా• యిప్పుడేను.
౧౪౦౪

ధ్రువము=సత్యము, అడలుచుఁ=దుఃఖించుచు తుష్టి = సంతోషము, గాదిలి పుత్రుండు=ప్రియకుమారుఁడు, క్రమ్మఱుడును=మరలివచ్చినపిమ్మట- కలాఁడు = కల వాఁడు, వలపు=మోహము,దిక్కుమాలినాఁడు=దిక్కులేని వాఁడైనాఁడు, కతనఁ= కారణముచేత.

## తాత్పర్యము.

అన్నా! లక్ష్మణా! యీమహారాజు నాకొడుకు అడవులకు దుఃఖపడుచుఁ బోయెఁగదా యని నేలకఱచుకొని పడియుండును ఇది సత్యము. ఇఁకఁ గైకయో నాకోర్కి నెఱవేఱెను అని సంతోషపడుచుండును గదా. ఆకైక తనముద్దుకొడుకు మేనమామయింటినుండి మరలిరాఁగానే నాకొడుకు యువరాజుగా నుండనేల? ఈ ముసలివాఁడు రాజుగానుండువఱకు నాకొడుకు పెద్దరాజు గాఁజాలఁడు. రాముఁడు మరలివచ్చువఱకు వీఁడు బ్రదికియుండెనా రామునిఁ పెద్దరాజుగాఁ జేయును. వీఁ డిప్పుడు చచ్చెనా నాకొడుకు పెద్దరాజేయగును. అని యీ ప్రకార మాలోచించి రాజ్యమునిమిత్తముగ మహారాజును జంపదుగదా. చంపిన నేమిచేయఁ గలఁడు. చంపకుండిన నేమిచేయఁగలఁడు. ఏలన:- ముసలివాఁడు కనుకనే యేమిచేయుటకు ధైర్యము చాలనివాఁడు. దానికి తోడు కైకయందలి మోహమను వలత్రాళ్ళలోఁ జిక్కుకొన్నాఁడు తాను విడిపించుకొని రాలేఁడు విడిపింపఁగలవాఁడు లేఁడు. నేను విడిపింపఁగలను గాని దూరమందున్న వాఁడను. నేనిట్లు దూరముగ వచ్చినకారణముచే నేమిచేయుటకుఁ దెలియక యేబాధపడునో యేమో. తమ్ముఁడా నేనేమి యిప్పుడు సేయుదును రా-

శ్రీరామునివంటివాఁడు కైక విషయమై యింత పరుషముగ మాటలాడ వచ్చునా యని సందేహము. ఇది నిండుమనస్సుతోఁ జెప్పినమాటగాదు. లక్ష్మణుని మనస్సు పరీక్షించుటకై చెప్పిడిమాటయే. అవును కైక యటువంటిదే యని

లక్ష్మణుఁ డనియుండెనా వెంటనే చీవాట్లు పెట్టియుండును. లక్ష్మణుఁడు భరతునివంటి ధర్మాత్ముఁడు కైకవంటిదాని కెల్లుపుట్టి నన్నంత మాత్రముననే వడిమితల్లిని నీచిట్లు తిట్టకుమని చెప్పెనుగదా. "అనవిని కైక నేల దురుసాడఁగ రాఘవవంశనాథుఁ డత్తినయుచరిత్రి చెప్పుము ముదంబగు"నని చెప్పెను. అరణ్య ౨౭౫-వ పద్యము.

కం. పేర్మి చెడ మనకు వ్యసనా,శర్మము మతివిభ్రమంబు • జనపతి కగుటన్
 ధర్మార్థంబులకంటెను, ధర్మజ్ఞా కామ మెంచె•దన్ బలితముగన్. ౧౭౦౫

పేర్మి= గొప్పతనము- వ్యసనాశర్మము=వ్యసనమువలనికీడు-మతివిభ్రమంబు= కామమే సేవ్యమనుభ్రాంతి-ధర్మార్థంబులకంటెన్=ధర్మముకంటెను-అర్థముకంటెను-బలితంబుగన్=బలముకలవానిగా నెంచెదను.

తా త్ప ర్య ము.

మనగొప్పతనము చెడునట్లు వ్యసనమువలనఁ గలుగు కష్టము మనకును, కామమే సేవింపఁదగినది యనుభ్రాంతి రాజునకును, గలుగుటచేత నర్థముకంటెను ధర్మముకంటెను గామమే బలమైనదని తలంచెదను.

రాజు కామవశుఁడై యధర్మమని భయపడక మనకుఁ గష్టముగలిగించి తా నును గష్టపడుటచేతను, తన్నుఁగట్టుకొన్నట్లు తాను తెచ్చుకొన్నట్టు తనప్రభుత్వము తానే పోఁగొట్టుకొనుటచేతను, ఈరెంటిని సహించినయైనఁ గామభోగమునందాసక్తుఁ డగుటచేత నా రెండింటికంటెఁ గామమే బలవత్తరమని తలఁచెదను.

ఉ. కాదని దేని లక్ష్మణ ని•కారముచే నెటువంటిమూఢుఁడే
 గాదిలిపుత్రునిన్ మనసుఁ • గన్గొని వర్తిలువానిఁ బ్రాయపుం
 బైదలిమాటఁబట్టి యిటు • పాయునొకో ననుఁ దండ్రి పాసి న;
 ట్టేది గనంగఁ జాలుఁ గుసు•మేషుశరాహతచిత్తుఁ డేయెడన్. ౧౭౦౬

అటుగాదు ధర్మమే బలిష్ఠమందువా. నికారముచేన్=మోసవిధముచేత - గాదిలిపుత్రునిన్ = ప్రియుఁడైనకుమారుని- ప్రాయపుంబైదలి = వయస్సుస్త్రీ- కుసుమేషు=మన్మథునియొక్క - శర = బాణములచే- ఆహత=కొట్టఁబడిన, చిత్తుఁడు= మనస్సుగలవాఁడు, 'కామాంధోపి నపశ్యతి' కామముచేఁ గన్నులు గానివాని కేదియుఁ గనఁబడదు. అని కలదుగదా.

తా త్ప ర్య ము.

నీవుచెప్పినది సరిగాదు. ధర్మమే బలీయమని నీవందువా? లక్ష్మణ! యటులైన మోసవిధముచేత నెంతటి తెలివిమాలినవాఁడైనను, దనప్రియకుమారునిఁ, దాను చెప్పకముందే తనమనస్సులోని విషయము తెలిసికొని యాప్రకారము వర్తించువా నిని, వయస్సు పెండ్లము మాటవిని, నన్ను, మనతండ్రి వదలినట్లు వదలునా? కావునఁ గామమే బలీయము. మన్మథబాణములచేఁ గొట్టఁబడిన మనస్సుగలవాఁ డేది మంచి యో యేది చెడ్డయో యెట్లు తెలిసికొనఁగలఁడు.

కం. జాయాయుక్తం డాకై. కేయీసుతుఁ డొకఁడె సుఖతఁ • గెరలెడి నౌరా
మాయురె కోసలు లేలెడు, నాయతధరణీస్థలమున • కధ్యక్షుండై. ౧౮౦౭

జాయాయుక్తుండు=భార్యతోఁ గూడినవాఁడు- సుఖత=సుఖమున- కెరలెడిన్ = ప్రకాశించెడిని- కోసలులు = కోసలవంశపురాజులు- ఆయత=విస్తారమైన- ధరణీస్థలమునకున్=భూమికి- అధ్యక్షుండై=ప్రభువై-

తా త్ప ర్య ము.

భార్యతోడి భరతుఁడొకఁడె హాయిగా నుండువాఁడు ఔరా! కోసలరాజులేలెడి రాజ్యమంతయు వాఁడొకఁడే యేలువాఁ డయ్యెఁగదా- ఏమిచిత్రము.

ఆ. తండ్రి ముసలివాఁడు • దాసగాటవులందు, నే వసించి మిడుకు • చిట్టు లుంట
నేకముఖముగాఁగ • నేఁడే రాజ్యంబు, నెల్లఁ గైకతనయుఁ • డేమి చెప్ప. ౧౮౦౮

తా త్ప ర్య ము.

తండ్రి ముసలివాఁడు- అవును గాదనిచెప్ప సామర్థ్యములేనివాఁడు- చెప్పినను బరులు వినకున్న నేమియుఁ జేయలేనివాఁడు- భయంకరములైన యడవులందు నేను దుఃఖపడుచు నున్నాఁడను. పెద్దవారిరువురు రెండుత్రోవలు పట్టుటచే భరతుఁ డొకఁడే యేకముఖముగ రాజ్యమంతయు నేలునుగదా. ఈచిత్రమేమనవలయును.

కం. సార్థక మగుధర్మంబును, నర్థంబును విడిచి కామ • మనువర్తించున్
వ్యర్థుం డెవ్వం డాతఁ డ, నర్థంబులు దశరథువలె • ననుభోగించున్. ౧౮౦౯

సార్థకము=ఇహలోకసుఖము పరలోకసుఖములను ప్రయోజనముగల- అనర్థంబులు= కీడులు- దశరథుని చర్యవలన లోకమెఱుఁగవలసిన నీతి యిదియే.

తా త్ప ర్య ము.

ఇహపరలోక సాధనములైన ధర్మమును నర్థమును విడిచి యెవఁడు కామమును సేవించునో ఆవ్యర్థుఁడు దశరథునివలెఁ గీడులపాలగును.

ఇచట నొకసందేహము. దశరథుఁడు ధర్మార్థముల విడిచి కామమును సేవించెనా? తాను ధర్మపాశబద్ధుఁడనని దశరథుఁడు చెప్పెను. తనతండ్రి సత్యధర్మస్థితుఁడని శ్రీరామచంద్రమూర్తి చెప్పెను. ఇచ్చట దశరథుఁడు ధర్మాధర్మముల వదలి కామమునే సేవించె ననుట యెట్లుపపన్నము?

రాక్షసులతోడ యుద్ధమునకుఁ బోవునప్పుడును గైకేయిని దోడుకొనిపోవుట కామాతిశయముచేతనేకదా. భర్తను రక్షింపవలసినది భార్యకు విధియై యుండఁగా నామెకు రెండువరము లిచ్చుట కామాతిశయముచేతనేకదా. ఇవట్టిలుండ "చంపఁదగనివానిఁ జంపింతు- సీకుఁగాఁ జంపఁ దగినవానిఁ జావ విడుతు ధనికుఁ బేదగాఁగ ద్రవాఢ్యుఁగా నిజుచేద నేనొస్తుఁ ద్రేమఁజెపుమ" అయో. ౨౨౭ ఇవి కామము కన్నులకుఁ దట్టినవాని మాటలా: ధర్మస్మృతి కొంచెమైన నున్న వాని మాటలా? కావున శ్రీరామచంద్రమూర్తి సత్యమే చెప్పెను.

కం. తననాథుని వధియింపఁగ, ననునీగతిఁ గానసముల • నవయం జేయున్
ఘనరాజ్యమెల్లఁ గూర్పఁగఁ, దనసుతునకుఁ గైక మనసు • దాపుర మయ్యెన్. ౧౪౧౦

తాత్పర్యము.

తనభర్తను జంపుటకు, నన్నడవులపాలుచేసి కృశింపఁజేయుటకుఁ దనకొడుకునకు రాజ్యము లభింపజేయుటకుఁ గైక మనసు దాపరించెను.

తే. అతులసౌభాగ్యమదమోహి • తాత్మయగుచు, నాపయినికోపమునఁ జేసి • పాపబుద్ధి
యెంత బాధించునో కదే • శాంతలైన, నాదుతల్లిని నీతల్లి • నయమువిడిచి. ౧౪౧౧

అతుల సౌభాగ్య మదమోహితాత్మయగుచున్ = అసమానమైన యైశ్వర్య సౌందర్య మదముచేఁ దెలివితొలఁగిన మనస్సుగలదై.

తాత్పర్యము.

నేను సవతికొడుకను, రాజ్యపాలనమందుఁ దనకొడుకున కడ్డమువచ్చువాఁడ, నను కోపమునఁ బాపకార్యము చేయ నాలోచనగల కైక నాతల్లిని, నా కనుకూలుఁ డగు నీతల్లిని, వారు శాంతచిత్తలై యేకీడైన సయిరించువారైనను న్యాయము దప్పి యెంత బాధపెట్టునోకదా.

కం. నాకయి జనని సుమిత్రయు, జీకాకుపడంగ నేల • చెపుమా వేగన్
వే కానఁగఁ జను మాయము, నీకడ, నుండియు యయోధ్య • కీవు కుమారా ! ౧౪౧౨

చీకాకుపడఁగన్=చిక్కులలోఁబడఁగ- వేగన్=తెల్లవాఱఁగా - వే=త్వరగా- ఈకడనుండి యె=ఇచ్చటనుండియే.

తాత్పర్యము.

లక్ష్మణా! నానిమిత్తమైనీతల్లి సుమిత్రాదేవి యేలకష్టపడవలయును జెపుమా. తెల్లవాఱఁగానే నీవు త్వరగా నిచ్చటనుండియే యయోధ్యకుఁ బొమ్ము.

మీఁదఁజెప్పిన వగలమాటలన్నియు నీపర్యవసానమునకే. లక్ష్మణుఁ డయోధ్యకుఁబోవుట యావశ్యకమని చెప్పుటకై శ్రీరాముఁ డిన్నిపోకలఁ బోయెను. ఇవి మనఃపరీక్షావాక్యములు.

కం. దిక్కేదినకౌసల్యకు, దిక్కఁగుమీ నీవు తండ్రి • ధృతిఁ గావల కే
నొక్కండఁ జనుదుఁ దోడ్కొని, యిక్కమలేక్షణను దడ విఁ • కేలాయనుజా ౧౪౧౩

దిక్కేదిన=దిక్కులేని, దిక్కు=రక్షకుఁడవు, ధృతిన్=ధైర్యములో, తడవు= అలస్యము.

తా త్ప ర్య ము.

ఏల నిన్నుఁ బొమ్మనుచున్నానో తెలియునా! దిక్కు-లేని కౌసల్యకు దిక్కై-యి యామెను రక్షింతువనియే. నాగతియేమందువా నేను సీతను దోడ్కొ-ని యొకఁడనే యడవులకుఁ బోదును.

కం. క్షుద్రక్రియాచరణరత, రౌద్రగతిం గైక పగఁ బ•రాభవమును సో
పద్రవగతిఁ గావించును, భద్రమునాతల్లి యనుచు • భరతున కనుమా. ౧౪౧౪

క్షుద్రక్రియాచరణరత = నీచకార్యములు చేయుటయందుఁ బ్రీతిగలది - రౌద్రగతిన్=క్రూరమైనవిధమున, పగ=విరోధమును, పరాభవము = అవమానము, సోపద్రవగతిన్=ఉపద్రవముతో గూడినట్లు-

తా త్ప ర్య ము.

నీచకార్యములు చేయుటయందుఁ బ్రీతిగలకైక దయలేనిదై నాతల్లికి విరోధమును నవమానమును గావించునుజుమీ. కావున నాతల్లిని జాగ్రత్తగాఁ గాపాడుమని భరతునకుఁ జెప్పుము.

కం. నాతల్లియుఁ దొలిబాముస, నేతల్లినిఁ బుత్రకునిని • నెడఁబాపెనో యా
హేతువునఁ జూవె యిటు లా,పూతచరిత్రకును దుఃఖ•ములు ప్రాప్తించెన్.
౧౪౧౫

తొలిబామునన్=పూర్వజన్మమందు, పుత్రకునిన్ = చిన్నబిడ్డను, పూతచరిత్రకున్=పరిశుద్ధమైన నడవడిగలదానికి-

తా త్ప ర్య ము.

పూర్వజన్మమునందు నాతల్లి యేచిన్నకొడుకును దల్లినుండి యెడఁబాపెనో-ఆపాపము కారణముగ నిపు డాపవిత్రమైన నడవడిగల యామెకు నిటువంటి పుత్రశోకము లభించెను.

కం. ఏవాసరమున నెద్దెస నేవయసున నెట్టికర్మ•మెవఁ డొనరించున్
ఆవాసరమున నద్దెస నావయసున నట్టికర్మ•మతఁడు భుజించున్. ॥పంచ॥

కం. కని పెంచి పెద్దఁ జేసెను, మనిచెను బహుకష్టములను • మలయుచు నన్నా
జనని యిటు ఫలమువేళకు, గొనకొని విడిచితిని నేటి•కొడుకను ఛీఛీ. ౧౪౧౬
మనిచెను=బ్రదికించెను, మలయుచున్=బాధపడుచు, గొనకొని=ప్రయత్నించి-

తా త్ప ర్య ము.

నన్నుఁగనిపెంచి పెద్దవానిని జేసెను. అనేకవిధములయిన బాధలు పడుచు నన్ను బ్రదికించెను. అట్టికన్నతల్లిని నావలన సుఖమనుభవించవలసిన సమయమునఁ బ్రయత్నపూర్వకముగ వదలిపెట్టితిని. ఛీఛీ నేనొక కొడుకనా?

తే. కన్నతల్లికి దరిలేని•గడుసుదుఃఖ, మిడితిఁ గంటివె నే నట్టి•కొడుక నయ్యు
పుడమిలోపల నాయట్టి•పుత్రకునిని, గనక యుండెడిఁ గాక యే•జననియేని. ౧౪౧౭

దరిలేని=మితిలేని, గడుసుదుఃఖము=సహింపరానిదుఃఖమును– ఇడితిన్ = కలిగించితిని.

తాత్పర్యము

కడుపారఁ గన్నతల్లికి నేనెటువంటి తీవ్రదుఃఖమును గలిగించితినో చూచితివా! ఆహా! యెటువంటికొడుకను నేనును.! భూమిమీఁద నావంటికొడుకును నే తల్లియేని కనకయుండునుగాక.

చం. అటమట మయ్యె నాజనన • మంతయు లక్ష్మణ! యేమి చెప్ప, న
చ్చటఁ దలికిన్ ముదం బిడును • శారిక కీరముఁగాంచి యల్లదే
కుటిలవిరోధిపాదమున • గొబ్బునఁ గా టిడు మంచుఁ బల్కెఁ యేన్;
గటకట యంతమాత్రమును•గానయితిం గద మానవుండ నై. ౧౪౧౮

అటమటము=వ్యర్థము– శారిక=గోరువంక– కీరమున్=చిలుకను–కుటిలవిరోధిపాదమునన్=వంచనప్రవర్తనముగల శత్రువుకాలియందు (౧) తన శత్రువగు పిల్లికాలియందు (౨) కౌసల్యాశత్రువుకాలియందు, గొబ్బునన్ = త్వరగా – కాటు = గాయము.

మోక్షమనునట్టి బ్రహ్మానందము నొందుటకు భగవంతుఁ డొకయుపాయమై యున్నను నాచార్యుఁడతనికంటెను సులభోపాయుమని యీ పద్యము సూచించుచున్నది.

నహ్యమ్మయాని తీర్థాని, న దేవా మృచ్ఛిలామయాః
తే పునం త్యురుకాలేన, దర్శనా దేవసాధవః॥ భాగ. ౧౧.

జలమయములైన తీర్థములు మృచ్ఛిలామయములైన దేవతలు దీర్ఘకాలము నకుఁగాని భక్తులఁ బవిత్రులఁ జేయఁజాలవు. సాధువు దర్శనమాత్రముననే పవిత్రుని జేయును. అనికదా యాచార్యుఁడు సులభోపాయమనుటకుఁ బ్రమాణము. ఇచ్చట శారికయే యాచార్యుఁడు. శారికకు రెండు ఱెక్కలవలెనే యాచార్యునకు జ్ఞానకర్మములను రెండు ఱెక్కలుగలవు. శారిక స్త్రీలింగస్వారస్యమునుబట్టి స్త్రీప్రాయమితరత్సర్వమ్మని యుండుటచే నాచార్యుఁడు భగవత్పరతంత్రుఁడని సూచితము. ఆచార్యునికి భగవత్పారతంత్ర్యముండుటంబట్టియు జ్ఞానకర్మములను రెండు ఱెక్కలుండుటఁబట్టియు శారికయనుపదమునకు నాచార్యుఁడని యర్థము చేయఁబడియె. తల్లికిన్=లోకులకు, ముదంబు=మోక్షానందము నిడును. 'పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః । తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమంపదమ్' ॥ అనునది దీనికిఁ బ్రమాణము వైష్ణవునాశ్రయించిన పశువుగాని మనుష్యుఁడుగాని పక్షిగాని వానితోడ విష్ణువుయొక్క పరమపదమునకుఁబోవును అని యర్థము. ఆచార్యుఁ డెట్టివాఁ

డనఁగాఁ జెప్పుచున్నాఁడు. కీరముఃకా=చిలుక సమానవర్ణముగల భగవంతునిఁ గాంచి- కుటిలవిరోధి పాదముఃకా=కుటిలవిరోధి=దుర్బుద్ధిగల సంసారమనెడి విరోధి యొక్క, పాదముఃకా=అధారములగు నహంకార మమకారములందు- అహంకార మమకారములు సంసారవృక్షమునకు నాధారములు. అనాత్మన్యాత్మబుద్ధిర్యా అస్వే స్వమితియామతిః। అవిద్యాతరుసంభూతి బీజమే తద్ద్విధాస్థితమ్" "నాత్మవస్తువగు దేహమందు నాత్మభ్రాంతియు తనసొత్తుగాని దానిని దనసొత్తని తలంచుటయు అవిద్యావృక్షమునకు సంభూతికారణములైన రెండు బీజములు రెండునుగానైయున్నవి. గొబ్బునకా కాటిడుము=త్వరగా నశింపఁజేయుము. అనుచుఁబలికి యాచార్యుఁ డిట్టి కృత్యములను జేయుచుండును అని భావము. అంతమాత్రమును గానయితినిగదా. ఆచార్యునివలె మోక్షలాభమున శ్రీరాముఁడనెడి భగవంతుఁడు సులభోపాయము కాఁడని భావము, శ్రీరాముఁడనెడి భగవంతుఁడు అయోధ్యయనెడి వైకుంఠమునుండి బయలుదేఱి విరజానదియనెడి తమసానదినిదాఁటి 'ద్వాసుపర్ణా సయుజాసఖాయా సమానంవృక్షం పరిషస్వజాతే। తయోరన్యః పిప్పలంస్వాద్వత్త్యన శ్నన్నన్యోఽభి చాకశీతి=ఈ రెండు మంచిఱెక్కలుగల పక్షులు సయుక్కులు సఖులు నొక్కవృక్షమందేయున్నవి. ఆ రెంటిలో నొకటి తియ్యని పిప్పలిఫలమును దినునది. రెండవది తినక ప్రకాశించునది - వృక్షము దేహము - పక్షులు జీవాత్మపరమాత్మలు-కర్మఫలములు తినునది జీవాత్మ-తినకయుండునది పరమాత్మ - వేదాంతమునఁ జెప్పఁబడినట్టి 'ఋతంపిబంతౌ సుకృతస్యలోకే గుహాంప్రవిష్టౌ పరమేపరార్థ్యే' యని శ్రుతిచెప్పినట్లు కర్మఫలమును జీవునిచేఁ దినిపించుచుఁ దాను సంసారములో దిగినది మొదలు తన యనుభవములేని నిత్యసూరులనువదలఁచి చింతించుచుఁ డా నీసంసారమును జొచ్చి సంసారులను విశేషముగాఁ జిక్కఁబఱుపకపోవుటచేతఁ దానై వచ్చి జనులఁ జిక్కదిద్దుటకంటె నాచార్యపూర్వకముగా జనుల సంసారమునుండి యుజ్జీవింపఁజేయుట యుత్తమపక్షము అపుడే జనులు విశేషముగాఁ జిక్కఁబడుదురని తలఁచి యట్లు చేసెనని యీకథాసందర్భమువల్ల నేర్పడిన సంగతికాన నాచార్యుఁడే భగవంతుని కంటె సులభోపాయమని యీ పద్యము ముఖ్యతాత్పర్యము.

తా త్ప ర్య ము.

లక్ష్మణా! నాజన్మము వ్యర్థము. ఏలయుండువా? యేమని చెప్పుదును. మాతల్లి నన్నుఁ బెంచినట్లు చిలుకను గోరువంకనుగూడఁ బెంచెను. తనకు శత్రువగు పిల్లి వచ్చిన గోరువంక చిలుకనుజూచి కుత్సితపు నడవడిగల విరోధికాలియుండుఁ గాటు పడఁగొఱుకుము మరల నిచ్చుటకిరాకుండును. అని చెప్పును. అక్కా పిల్లివచ్చెఁ గొట్టుకొట్టుమనుట పెంపుడు చిలుకలకు గోరువంకలకు స్వభావము. మనుష్యుఁడనైన నేనామాత్రమును జెప్పనైతినిగదా.

చ. ఎలమి మదంబ యేమి సుఖ • యించె నను న్గని పుత్రు, సౌఖ్యముల్
కలుగక యున్న మానెడిని • గాక యయో యెటువంటిదుఃఖముల్
గలిగెను నానిమిత్తముగఁ • గల్గియు నేమిఫలంబు చెప్పుమీ
యిలపయి నిట్టిపుత్రకుఁ, డ • దృష్టవిహీన మదంబ చూడఁగన్. ౧౮౧౯

మదంబ=నాతల్లి, అదృష్టవిహీన=నిర్భాగ్యురాలు.

తా త్ప ర్య ము.

నాతల్లి నన్నుఁగొడుకుగాఁగని యేమిసుఖించెను? సౌఖ్యములులేక మానెడినిగాక యయ్యో! నానిమిత్తమై యెటువంటి దుఃఖము లనుభవించుచున్నది. నావంటి కొడుకుండియు నేమిమేలు, మాతల్లి నిర్భాగ్యురాలుసుమీ.

ఆ. అడలు చుండుదాని • కల్పభాగ్యకు గొడ్డు, రాలిఁబోలి యున్న • యమలమతికిఁ
గొడుకుగాఁగఁ బుట్టి • కూర్చిన మే లేది, పలుకవయ్య నీవ • లలితచరిత. ౧౮౨౦

అడలుచుండుదానికిన్=దుఃఖించుచుండు దానికి, అల్పభాగ్యకున్=కొంచెపు భాగ్యముగలదానికి, మగఁడని యొకఁడుండియు లేనివానివలె నుండుటమాత్రమే యల్పభాగ్యము. గొడ్డురాలిఁ బోలియున్నదానికిన్ = కొడుకుండియు లేనిదానివలె నుండుదానికి, అమలమతికిన్=నిర్మలమైన మనస్సుగలదానికి, లలితచరిత=మనోహరమైన గుణములు గలవాఁడా.

తా త్ప ర్య ము.

"దుఃఖముల పాలుపడినదానికి, మగఁడైదువుగానుండుట యను భాగ్యము మాత్రముగలదానికిఁ గొడుకుండియు లేనిదానివలెనుండు దానికి (కదళీవంధ్యకు) నేను గొడుకుగాఁబుట్టి యామెకుఁ జేసినమేలేదియో.

కం. నిర్భాగ్యురాలు గద నను, గర్భంబునఁ దాల్చి కనిన • కౌసల్య మహా
దుర్భరతరశోక ప్రాదుర్భావంబున నలంగి • దూపిలు చుండున్. ౧౮౨౧

దుర్భరతర=మిక్కిలి భరింపరాని, శోకప్రాదుర్భావంబునన్ = శోకము కలుగుటచే, నలంగి=రాపిడిపడి, దూపిలుచుండున్=వ్యసనపడుచుండును.

తా త్ప ర్య ము.

నన్నుఁ దనగర్భమునఁ దాలిచి కనుటచేఁ గౌసల్య నిర్భాగ్యురాలే. కనుక నే సహింపరాని దుఃఖముకలదై బాధపడి వ్యసనపడుచుండును.

ఉ. ఏనొకరుండనే పుడమి • నెల్ల నయోధ్యను శాతబాణసం
తానవిదారితంబుగ నొ • నర్పఁగఁ జాలనొ కారణంబు లే
కేను బరాక్రమింపఁ దగు • నే? పరలోకభయంబు ధర్మధీ
జ్ఞానము మాన్పెడి న్నను న • సాధ్యమె పట్టము కట్టుకొంటయున్. ౧౮౨౨

శాతబాణ సంతానవిదారితంబుగన్=పదునైనబాణముల సమూహములచేఁ జీల్పఁబడినదిగా, ధర్మధీజ్ఞానము=ధర్మము చెడు నేయనుభయమునకుఁగారణమైనజ్ఞానము

## తాత్పర్యము.

అట్లైనఁబోయి పట్టముకట్టుకొనరాదా నేను సహాయపడెదనందువా నేను బట్టముగట్టుకొనవలెనని తలఁచినయెడల నితరులసాహాయ్యము నాకేల! నేనొక్కఁడనే భూమినంతయు నయోధ్యను గఱుకు ములుకుల వరుసలచే నఱికివైవలేనా! అట్లైన నిట్లేల యడవులకు వచ్చితివందువా! కారణములేక నేను బరాక్రమముఁజూప వచ్చునా? చూపిన నేమియందువా? నిరపరాధులను జంపిన పాపముచేఁ బరలోక ప్రాప్తి నాకు లేకపోవునను భయము, రాజ్యకాంక్షధర్మము చెఱిచితినని యపనింద వచ్చునే యనుభయము, వీనియొక్క జ్ఞానము నన్నాపనిచేయకుండఁ జేయుచున్నది కాని పట్టము కట్టుకొనుటకూడ నొక యసాధ్యకార్యమా.

దీనివలన నెంత బలవంతునకైనను సమర్థునకైనను నధర్మప్రవర్తనము తగదని యేర్పడుచున్నది.

శ్లో. నృపాశ్చనాభాగ భగీరథాదయోమహీ మిమాం సాగరాంతాం విజిత్య
సత్యేన తేప్య జయంస్తాతలోకాన్నైకే బల్యస్యేతి చరే దధర్మమ్॥
అలర్కమాహు ర్నరవర్యసంతం సత్యవ్రతం కాశికరూశరాజమ్
విహాయరాజ్యాని వసూనిచైవ నేకే బలస్యేతి చరేదధర్మమ్॥ మార్కండే॥

నాభాగ భగీరథాదిరాజులు సత్యముచే సముద్రాంతభూమిని సాధించి పాలించిరిగాని బలవంతులమని యధర్మము ననుష్ఠింపలేదు.

తోటకము. అని పెక్కు తెఱంగుల • నశ్రుయుతా
ననుఁడై విజనంపువ • నంబున నా
యనఘాత్ముఁ డేడిచి • యానిశ యం
దొవరన్ మునిపోలికి • నున్న యెడన్. ౧౭౨౩

అశ్రుయుతాననుఁడై = కన్నీళ్లతోఁగూడిన ముఖముగలవాఁడై, విజనంపువనంబునన్ = జనములులేని యడవియందు.

అనఘాత్ముఁడు = పాపమెఱుఁగని మనస్సుగలవాఁడు, ఛందస్సు. తోటకమునకు నాలుగు సగణములు. ౯-వ యింట యతి.

## తాత్పర్యము.

అని తనవలనఁ దల్లికి లోకులకుఁ గలిగిన దుఃఖము దలఁచి యనేకవిధములఁ గన్నీళ్లతోఁగూడిన కన్నులు కలవాఁడై యూరార్చుటకు జనులులేని యడవియందు నేపాపమెఱుఁగని శ్రీరామచంద్రుఁ డారాత్రియేడిచి మౌనవ్రతమూనిన వానివలె నూరకుండెను.

తోదకము. అలలు చలింపని • యంబుధినా వం,టలపెను పాఱ ధ • నంజయునట్టుల్
నిలిపి విలాపము • నిశ్చలు నుండెన్, లలితవచనంబుల • లక్ష్మణుఁ డాడెన్.
౧౭౨౪

అంబుధి=సముద్రము, పెనుపు=అభివృద్ధి- అఱ్ఱ=అణఁగిపోఁగా, ధనంజయు నట్టుల్=అగ్నిహోత్రునివలె-ధనంజయోర్జునే శ్రేదహనే దేహమారుతే. నానా. ర. నివ్వెఱ్ఱ=నిండు+వెఱ = నిండువెఱగుపాటున, లలివచనంబుల్ = ఉత్సాహము కలిగించు మంచిమాటలచే.

తా త్ప ర్య ము.

అలలు కదలని సముద్రమువలె, మంటలు చల్లాఱిన యగ్నిహోత్రునివలె నేమ్రు నిలిచి వెఱగుపడినట్లుండఁగా నుత్సాహకరములగుమాటల లక్ష్మణుఁడి ట్లనియె. నిలిచి విలాప మనుటచేఁ దనంతటఁదానే యుపశమించుకొనెనని భావము. అలలు చలింపనియంబుధి=విశేషించి యలలు చలించుటకు ముఖ్యకారణము వాయువు. వాయువు ప్రేరితములై యల లెగయును. అట్లులే దుఃఖము ప్రేరించువారెవ్వరు లేక యుండిరని భావము.

ఈ యుపమానము పూర్ణముగ శ్రీరామున కన్వయింపదు. ఏలన - అలలు కలుగుటకుఁగారణము వాయువు మాత్రమేకాదు. భూభ్రమణము సూర్యచంద్రా కర్షణము మూలకారణము. గాలి ప్రేరణముచేఁ బెద్దయలలు లేకున్నను గ్రహాకర్ష ణమువలనఁ జిన్నయలలైన నుండును. అట్లులే శ్రీరామునందు శోకముండెనని యర్థ మగును. ఈ సందేహము తొలఁగింప మంటలు చల్లాఱిన నగ్నియని చెప్పెను. అగ్ని నిశ్శేషముగ నాశమైనట్లు శ్రీరాముని వ్యసనము నిశ్శేషముగ నశించెనని భావము.

—• లక్ష్మణుఁడు శ్రీరాముని నూరార్చుట. •—

ఉత్సాహము. నిక్కమింత రామచంద్ర • నీవు వీడి వచ్చుటన్
దిక్కుమాలి యీయయోధ్య • తేజ మాసి యుండెడిన్
జక్కఁడేఁడు లేని రేయి•చొప్పునన్; వ్యథామతిన్
ప్రుక్కఁదగున నేను సీత • ప్రుక్కమే నినుం గనన్. ౯౭౨౪

ఇట్లు దుఃఖించుచున్న శ్రీరాముని లక్ష్మణుఁ డిట్లూరార్చుచున్నాఁడు.

నిక్కము = నిజము-నిశ్చయశబ్దభవము, చుక్కఱేఁడు = చంద్రుఁడు, లక్ష్మ ణుని యుత్సాహవాక్యము లుత్సాహవృత్తమందుఁ జెప్పఁబడినవి. ఉత్సాహమునకు నేడు సూర్యగణములు, ఒక గురువు. ఐదవగణము మొదటి యక్షరము యతి. ఇందు నగణమురాక యన్నియు హగణములే యగునేని సుగంధివృత్తమగును. నగణ హగణములకు సూర్యగణములని పేరు.

తా త్ప ర్య ము.

రామచంద్రా నీవు చెప్పినమాటలందు నింతమాత్రము నిజము. నీవు వదలి వచ్చినకారణమున దిక్కులేనిదై యీ యయోధ్యకాంతిహీనమై చంద్రుఁడులేని రాత్రివలెయుండుటయందు సందేహములేదు. కాని వనవాసమునకు రాకముందు చేయవలసిన యాలోచన వనవాసమునకై నిశ్చయించుకొనివచ్చిన పిమ్మట నిష్ప

డిక్కడ నాలోచించి దుఃఖపడుట తగినకార్యముగాదు. ముందుచేసిన కార్యముఁగూర్చి వెనుక నాలోచించువాఁడు బుద్ధిమంతుఁ డనిపించుకొనఁబడఁడు. వెనుకఁ జింతించుట వెఱ్ఱితనము. నీవు ధైర్యముతో నున్న కారణముచే నాయన ధైర్యములో నుండఁగా మనము దుఃఖించిన నాయనకు సంకటమగునేమోయని మేము నీ నిమిత్తమై నిబ్బరించు కొనియున్నారము. నీ విట్లు దుఃఖపడితివేని నీకై మే మెంత దుఃఖింపవలసియుండునో యాలోచింపుము.

మత్తకోకిలము. నిన్నుఁ బాసి ధరాతనూజయు • నేను నొక్కముహూర్తమే
నీ న్నిలం గలవారమే తమ•నీటిఁ బాసినచేపల
ట్లన్న! యీజనకాఖ్యుఁ డేటికి • నంబ యేటికిఁ దమ్ముఁడేన్
నిన్నుఁ బాసిన స్వర్గ మేటికి•నిక్క మియ్యది రాఘవా. ౧౮౨౬

ధరాతనూజ=సీత.

తాత్పర్యము.

రామచంద్రా! నీ విచ్చట దుఃఖపడుచునుండి నన్నూరికిఁ బొమ్మంటివిగాని నా మనస్థితి యాలోచింపనైతివి. నేనుగాని సీతగాని మా సుఖముగోరి నీవెంటరాలేదు. సుఖమును గోరినవారమైతిమేని యయోధ్యయందే యుండియుందుము. నీసేవ గోరి వచ్చినారము. ఆసేవ నీవూరనుండినను జేయుదుము. అడవియందుండినను జేయుదుము. కాలదేశములు మాకుఁ బ్రధానములుగావు.

యన్ముహూర్తం క్షణంవాపి, వాసుదేవో న చింతితః
సాహానిస్తన్మహాచ్ఛిద్రం, సాభ్రాంతి సాచవిక్రియా
ఏకస్మిన్నప్యతిక్రాంతే, ముహూర్తే ధ్యానవర్జితే
దస్యుభి ర్ముషితానైవ, యుక్తమాక్రందితుం భృశమ్॥
అను వాక్యము లిచ్చట ననుసంధింపఁదగు.

మా కుత్తమపురుషార్థము నీతోడనుండి నీకు సేవచేయుటయే. అదియే మాకు సుఖము. అదియే మాకు లాభము అదియే మాకు స్వభావసిద్ధము. మాయభిప్రాయ మిట్లుండ నిన్ను వదలి సీతయు నేను నొక్క ముహూర్తకాలమైన నుండఁజాలము. నీటిలోని చేపను బైటవేసిన బ్రతుకఁగలదా నిన్నాశ్రయించి జీవించియుండువారము. ఒకవేళ సీతాదేవి స్త్రీగావున స్త్రీలమనస్సు కఠినముగావున నిన్ను విడిచి కొంతకాలమైన నుండఁగలదేమో కాని నేనుమాత్రముండఁజాలను. వాస్తవమిట్లుండ నిన్ను విడిచినపిమ్మట నాకు జనకుఁడేల; జననియేల; తమ్ముఁడేల; ఆ స్వర్గమే యెదురుగవచ్చినను నేల?

దీనికే పరమభక్తియనిపేరు. అట్లు చేయవలసివచ్చెనేని సమస్తసోపాధిక బాంధవులవదలియైన భగవత్సేవ చేయవలయును. "పునర్విశ్లేష భీరుత్వం పరమాభక్తి రుచ్యతే" యని భగవంతునితో వియోగమువచ్చునేమోయని భయపడుటయే పరమ

భక్తి. ఇదియే ముక్తికారణము. భక్త్యా పరమయావాపి ప్రపత్త్యావా మహామునే! ప్రాప్యోహం నాన్యథాప్రాప్యః మమకైంకర్య లిప్సుభిః" పరమభక్తిచేఁగాని ప్రపత్తి చేఁగాని నా కైంకర్యపరులకు నేను బ్రాప్యుఁడనేకాని యితరమార్గములచే నేను లభింపను అని యర్థము.

ధరాతనూజయు వని ముందు చెప్పుటచే నీ యర్ధాంగలక్ష్మి, యనపాయిని యగు సీతయెట్టిదో నేను నట్టివాఁడనే యని భావము. అరణ్యమునకు వచ్చెదనని నేను నిన్నుఁగోరినపుడు సీతాదేవిని బురస్కరించుకొని యామె పురుషకార మూలమున నీకు శరణాగతి చేసితిని. ఇప్పుడు నీవు నన్ను వదలితివా నాశరణాగతి వ్యర్థమైనట్లే తన పురుషకారము వ్యర్థమయ్యెనుగదా యని నాగతికే యామెయు వచ్చును.

ఇందు మర్కటకిశోరన్యాయము చెప్పఁబడినది. క్రోఁతిపిల్ల తల్లి యెన్ని గంతులుపెట్టినను ఏమిచేసినను తల్లినివదలక కఱచుకొనియే యుండును. నీవు తల్లిని వదలిపొమ్మన్నఁ గ్రోఁతిపిల్ల యెందుఁబోఁగలదు? నాగతియు నంతే.

కం. అనుచు మును వున్నవృక్షంబున క్రిందను సెజ్జఁ గూర్చఁ • బోరి సుఖముగ నా
సనములు గొని రందఱుఁ దమ్ముని మాటల రామవిభుఁడు • మోదంబు గనెన్.
౧౪౨౭

వృక్షంబునక్రిందన్=చెట్టుయొక్కక్రింద, సమాసంబున షష్ఠీసప్తమ్యర్థంబున నకారంబు వైకల్పికంబుగనగు. సెజ్జ=పడుక, శయ్యాశబ్దభవము.

తాత్పర్యము.

అని ముందుండిన చెట్టుక్రిందనే పడుకపఱుపఁగా చిక్కలి సుఖముగా వారు కూర్చుండిరి తమ్ముని మాటలకు రామచంద్రుఁడును సంతోషించెను,

కం. గిరిసానుగోచరము కేసరియుగ్మము మాడ్కి రామ•సౌమిత్రులు లో
దరసంభ్రమములు పాయుచు, గురుశౌర్యులు నిర్జనవనిఁ•గొలిరి రేయిన్.
౧౪౨౮

గిరిసానుగోచరము=కొండచరులయందుఁ గానవచ్చునది. కేసరియుగ్మము = సింహములజంట, మాడ్కిన్ = వలె, దరసంభ్రమములు = భయముతోటుపాటు, గురుశౌర్యులు = గొప్ప శౌర్యముగలవారు, నిర్జనవనిన్ = మనుష్యులులేని యడవియందు, కొలిరి=ఉండిరి.

తాత్పర్యము.

కొండచరులయందుఁ గానవచ్చు రెండు సింహములవలె భయము తొట్రుపాటువదలి పరమపరాక్రమవంతులగు శ్రీరామలక్ష్మణు లారాత్రి మనుష్యులులేని యడవియందుండిరి.

—• ౫౪-వ సర్గము. శ్రీరాముఁడు భరద్వాజాశ్రమంబునకుఁ బోవుట. •—

కం. అంతట నిర్మలనళినీ,కాంతునిబింబంబు దోఁప • గంగాయమునో
పాంతపు దేశము భీకర,కాంతార మదృష్టపూర్వ•క్రమ విషయముల్. ౧౪౨౯

నిర్మల నళినీకాంతుని బింబంబు = మలినములేని సూర్యబింబము. అనుటచే సూర్యునిబింబ ముదయించిన వేఁకువ నిహిమములవలన నెఱ్ఱగానే యుండును. అవలఁ దెలుపగును. సూర్యుఁడు స్పష్టముగాఁ దెలియవచ్చువఱకుఁ గాచియుండుటకుఁ గారణ మా మహారణ్యములో మార్గము లేమి. ఉన్నను దెలియరామియని యెంచవలయును. గంగాయమునోపాంతపుదేశము = గంగకు యమునకు మధ్యమున నుండు దేశము,భీకరకాంతారము = భయంకరమైన యడవి,అదృష్టపూర్వ=ముందుచూడని, క్రమవిషయముల్ = ఇంపైన దేశములు, ఇవి వత్సదేశమందలి యవాంతర దేశములు. ఇది యూరువిడిచిన నాలుగవనాఁటిచర్య.

తా త్ప ర్య ము.

అంతట సూర్యబింబము నిర్మలమై స్పష్టముగఁ గానరాఁగా గంగా యమునా నదుల నడిమిదేశమునందు భయంకరమైన యడవిని మునుపెన్నఁడు చూడని మనోహరములైన దేశములు.

కం. కనుఁగొనుచు యథాక్షేమము,గను వివిధధరారుహాళిఁ • గాంచుచు దివసం
బున నర్థమండలసమయ,మున లక్ష్మణుఁ జూచి పురుష•ముఖ్యుఁడు పలుకున్. ౧౪౩౦

వివిధ ధరారుహాళిన్=అనేకవిధములైన చెట్లవరుసలను, దివసంబునన్=పగటియందు, అర్ధమండల సమయమునన్=సూర్యబింబము సగమస్తమించి సగము కానవచ్చు సమయమందు, యథాక్షేమము=క్షేమము నతిక్రమింపని విధముగ.

తా త్ప ర్య ము.

చూచుచు క్షేమముగ నానావిధములైన చెట్లవరుసలు పరికించుచుఁ బగట నర్ధాస్తమాన సమయమున లక్ష్మణుఁజూచి పురుషశ్రేష్ఠుఁడగు శ్రీ రామచంద్రుఁ డిట్లనెను.

కం. అల్లదె ప్రయాగచుట్టును, బెల్లుగ దహనధ్వజంబు•విధమున ధూమం
బుల్లాసంబుగఁ గడురా,జిల్లెడి ముని యచట నెలవు • చేకొనఁ బోలున్. ౧౪౩౧

అల్లదె=అదిగో దూరమునఁ గానవచ్చుచున్నది. ప్రయాగ=ప్రయాగము, ఈ ప్రయాగమునకు సమీపమందే భరద్వాజాశ్రమ మిప్పటికి నున్నది. అచ్చుగఁ బ్రయాగలోపల భోజరాజీయము. ౧౭౨ గయాప్రయాగములనే సేవింపక, మను చరిత్ర. ప్రయాగఁ జేసిన ఆది. ౭౭౭-౨ అ. అని ప్రయోగములుండుటచే ప్రయాగ-ప్రయాగములని రెండు రూపములు గ్రాహ్యములు. దహనధ్వజంబు విధమునన్ =

పొగవలె, అగ్నిహోత్రుని ధ్వజమువలె, అగ్నికి ధూమధ్వజుఁడనిపేరు. ధూమధ్వజుఁడాజ్యవృష్టిఁ బ్రుంగుడుపడునే, భార. ధూమము=పొగ, రాజిల్లెడిన్=ప్రకాశించుచున్నది. ముని=భారద్వాజుఁడు, నెలవు = స్థానము, గంగా యమునా సంగమము పుణ్యప్రదేశమగుటచే ననేకు లనేకములగు యజ్ఞములు చేయుటచేఁ బ్రయాగము అను పేరుగాంచెను.

తా త్ప ర్య ము.

లక్ష్మణా! యిదిగోఁ జూడుము. అగ్నిహోత్రుని ధ్వజమువలె సంతోషముతోఁ బొగవెగయుచున్నది. అచట భరద్వాజముని యుండనోపు.

కం. గంగాయమునాతటినీ, సంగమమునఁ జేరితిమి ని•జం బదె వింటే
భంగాన్యోన్యవిఘట్టనఁ, బొంగారు రవంబు వినఁగఁ • బోలెడి నిటకున్. ౧౪౩౨

సంగమము=కలియుప్రదేశము, భంగాన్యోన్య విఘట్టనన్ = అలలొకదానినొకటికొట్టుటచే, పొంగారు=అతిశయించు, (పొంగు+ఆరు) రవము=ధ్వని.

తా త్ప ర్య ము.

లక్ష్మణా! మనము గంగా యమునా నదులుకలియు ప్రదేశమునకు వచ్చితిమి. అది యెట్లు తెలిసెననిన అల లొకదానితో నొకటి కొట్టుకొనఁగాఁ గలిగిన ధ్వని వినవచ్చుచున్నది వింటివా.

కం. రాజితవన్యపదార్థము, చే జీవిక నడపువారు • చీర్చినకట్టెల్
భూజవిశేషములు భర,ద్వాజాశ్రమమందుఁ గంటె • తమ్ముఁడ యనుచున్. ౧౪౩౩

రాజితవన్యపదార్థము = ప్రకాశించు వనములయందుఁ బుట్టిన వస్తువులచే, జీవిక=దేహయాత్ర, భూజవిశేషములు=పలువిధములైన చెట్లు-

తా త్ప ర్య ము.

అడవులయందుఁ బుట్టిన వస్తువులచే జీవనము చేయువారు చీల్చినకట్టెలు పలువిధములయిన చెట్లు భరద్వాజాశ్రమమందు లక్ష్మణా చూచితివా.

ఆ. అంత నపరకుభృదు•పాంతదేశంబున, లంబమానరక్త•బింబుఁ డగుచు
నరుణకిరణుఁ డమర • నాధన్వులరిగిరి,యమున గంగఁ గలియు•నట్టిచోట. ౧౪౩౪

అపరకుభృత్+ఉపాంతదేశంబునన్ = పడమటికొండ సమీపంబున- లంబమాన=వ్రేలాడుచున్న- రక్తబింబుఁడు=ఎఱ్ఱని బింబముగలవాఁడు, అగుచున్-అరుణకిరణుఁడు=ఎఱ్ఱని కిరణములుగల సూర్యుఁడు, ధన్వులు=ధనుస్సుల ధరించినవారు.

తా త్ప ర్య ము.

పడమటికొండ సమీపంబున సూర్యుఁ డెఱ్ఱని బింబముగలవాఁడై వ్రేలుచుండఁగా ధనుర్ధరులైన యా శ్రీరామలక్ష్మణులు గంగాయమునలు కలియు స్థలమునందు.

కం. వెలయుభరద్వాజాశ్రమ, తలముం జేరంగ బెదరఁ • దన్మృగపక్షుల్
బలియురు ముహూర్తమాత్రం, బెలమిం జని చొచ్చి రాశ్ర•మేలన్ మెల్లన్. ౧౪౩౫

తన్మృగపక్షిణ్=అందలి జింకలు, పక్షులు బలియురు = బలవంతులు, ఆశ్రమేలన్=ఆశ్రమ+ఇలన్=ఆశ్రమభూమిని.

తా త్ప ర్య ము.

ఉన్న భరద్వాజమహాముని యాశ్రమభూమిని జేరఁగా విల్లు బాణములు ధరించిన బలవంతులైన శ్రీరామలక్ష్మణులఁ జూచి యాశ్రమమందలి మృగములు పక్షులు భయపడి బెదరఁగా నాశ్రమ విచిత్రములఁజూచి సంతోషించుచుఁ గొంచెముసే పాశ్రమభూమిని మెల్లఁగాఁ జని ప్రవేశించిరి.

భరద్వాజ శబ్దమునకు వ్యుత్పత్త్యర్థ మాయనయే యిట్లుచెప్పెను.

శ్లో. భరేఽసుతాన్ భరే శిష్యా, న్భరేదేవాన్ భరేద్విజాన్
భరే భార్యా మహం ద్వాజా, ద్భారద్వాజోస్మి శోభనే.

వ్యాఖ్య. అను. ౧౪౨వ అధ్యా.

ప్రజా వై వా జస్తాఏవ బిభర్తీతి శ్రుత్యనుసారేణ స్వనామాభరే ఇతి। అసుతాః=అపుత్రాన్-ఉదాసీనాన్ దీనా నదీనాన్ పాలయామి

అ ర్థ ము.

నాపుత్రులు గానివారిని నుదాసీనులను దీనుల నదీనుల ద్విజులను భార్యను భరింతును. కావున నాపేరు సుందరీ! భరద్వాజుఁ డందురు.

సీ. ఆయాశ్రమస్థలి • నటు చేరి జానకీ,సహితులై తపసిద • ర్శనము సేయఁ
గోరి యదను వేచి • దూరంబునందున, నిలిచి తచ్ఛాత్రుల • వలన వార్తఁ
బుచ్చి లోఁజొచ్చి స • తూర్వాతశిష్యావృతు, సంశితవ్రతునిఁ బ్ర • శస్తచరితు
నేకాగ్రచిత్తు న • స్తోకతపోలబ్ధ, చక్షు మహాత్ముని • సన్నిధిఁ గని

తే. యగ్నిహోత్రవిధానంబు • సాంత మగుడు,నొయ్యలక్ష్మణజానకీ • యుక్తుఁడగుచు
నళినలోచనుఁ డభివాద • నం బొనర్చి, పేరుకొనుచును దనపేరు • వెండి పలుకు. ౧౪౯౬

ఆశ్రమస్థలిన్=ఆశ్రమప్రదేశమును,అదను=సమయము,తచ్ఛాత్రులవలనన్ = ఆయనశిష్యులవలన, సతూర్వాతశిష్యావృతున్=మిగులఁ బవిత్రులైన శిష్యులచేఁ జుట్టుకొనఁబడినవానిని, సంశితవ్రతునిన్ = చక్కఁగా ననుష్ఠింపఁబడిన వ్రతములు గలవానిని, ప్రశస్తచరితున్=లోకులచేఁ బొగడఁబడిన నడవడిగలవానిని,ఏకాగ్రచిత్తున్=ఒక్కలక్ష్యమునందే నిలిపిన మనస్సుగలవానిని, అస్తోక=గొప్పదియగు, తపస్=తపస్సుచే, లబ్ధ=పొందఁబడిన, చక్షున్=కన్నులుగలవానిని, ఒయ్యన్=మెల్లగా, ఈ భరద్వాజుఁడు వాల్మీకి శిష్యుఁడగు భరద్వాజుఁడు కాఁడు. ఈయన వేదోక్తమహర్షి అస్మద్గోత్ర మూలపురుషుఁడు.

## తాత్పర్యము.

ఆవిధముగా నాశ్రమప్రదేశముఁ జేరి జానకీదేవితోఁ గూడినవారై శ్రీరామలక్ష్మణు లమ్మహామునిని దర్శింపఁగోరి యది సాయంకాలమున నగ్నిహోత్ర సమయమగుట నదిముగియువఱకుఁ గాచికొని దూరమందేయుండి తరువాత నాయన శిష్యులవలనఁ దమరాక చెప్పిపంపి రావచ్చునని శిష్యులువచ్చి చెప్పఁగా లోపలికిఁ బోయి తపములచేఁ బవిత్రులయిన శిష్యులతోఁ గూడినవాఁడును, చక్కఁగ ననుష్ఠింపఁబడిన వ్రతములు గలవాఁడును, లోకులచేఁ గీర్తింపఁబడిన నడవడి గలవాఁడును, ఏకలక్ష్యమునందు మనస్సుంచినవాఁడును, గొప్పతపస్సుచే సంపాదించిన యోగదృష్టిగలవాఁడును, గొప్ప మనస్సు గలవాఁడునునగు భరద్వాజుని నెదుట సమీపమునఁ జూచిరి. అగ్నిహోత్రకార్యము పూర్తిగాఁగా మెల్లగ శ్రీరాముఁడు జానకీలక్ష్మణులతోఁ దనపేరు చెప్పుచు నమస్కరించెను. సీతాలక్ష్మణులు నట్లేచేసిరి. ఇట్లు నమస్కరించిన పిదప శ్రీరామచంద్రుఁడు మునీశ్వరులతో నిట్లనియె.

సమి త్పుష్ప కుశా జ్యాంబు, మృదన్నాక్షత పాణికమ్
జపం హోమం చ కుర్వాణం, నాభివాద యతే ద్విజమ్.

ఆపస్తంబులు.

సమిధలు- పుష్పములు- దర్భ- నేయి-నీళ్లు - మృత్తు-అన్నము- అక్షతలు- చేతియందుఁ గలట్టియు, జపము హోమము చేయునట్టియు బ్రాహ్మణునకు నమస్కరింపరాదు.

నోదకుంభహస్తోభివాదయే, న్నభైక్షం చరన్, న్నపుష్పాజ్యహస్తో, నాశుచిః, నదేవ పితృకార్యంకుర్వ, న్నశయాన, ఇతి.　　శంఖుఁడు.

జలకుంభము చేతియం దుండువానికి, భిక్షకై తిరుగువానికి, పూలు. నేయి చేతియందుఁ గలవానికి అశుచిగా నుండువానికి దేవ పితృకార్యములు చేయువానికి శయనించి యుండువానికి నమస్కరింపరాదు. అని యుండుటచే సమక్షమునఁ బోయిన నమస్కరింపరాదు. నమస్కరింపక యుండరాదు కావున హోమము సాంతమగువఱకు శ్రీరామచంద్రమూర్తి వెలుపలఁ గాచియుండెను.

సీ. దశరథ సుతులము • వశిచంద్ర! శ్రీరామ,లక్ష్మణులము నాదు • లలన జనక
నందన కల్యాణి • నావెంటఁ జనుదెంచె, నిర్మలవ్రత యయి • నిశ్చలుండు
నాచిన్నదమ్ముఁడు • న న్ననుగమించెఁ దండ్రి కౌసలకు న• న్దరలు మనినఁ
దండ్రియాదేశంబుఁ • దలఁ దాల్చి వనభూమి, కేతెంచితిమి ముని•వృత్తినుండఁ

తే. గాయలును గూర లశనంబు•గాఁగ ధర్మ,గతిని జరియించువారము • హితమనీష
యనుడు గోపును నర్ఘ్యంబు•నంబువులను, నన్నరసముల ఫలముల•నాలి నొసఁగె.
౧౪౩౭

వశిచంద్ర = ఇంద్రియములను వశపఱుచుకొనినవారిలో శ్రేష్ఠుఁడా, లలన= స్త్రీ, భార్య, కల్యాణి=మంగళకరములైన గుణములుగలది, నిర్మలవ్రత = మలినము లేని పాతివ్రత్యధర్మము ననుసరించినది, నిశ్చలుండు = చలింపని మనస్సుగలవాఁడు, అనుగమనించెన్=వెంటవచ్చెను, తరలుము=ప్రయాణమైపొమ్ము, ఆదేశంబు=ఆజ్ఞ, అశనము=ఆహారము, ధర్మగతిని=వానప్రస్థధర్మము ప్రకారము, హితమనీష=మేలు కోరు బుద్ధిగలవాఁడా, గోవున్=మధుపర్కాంశమైన యెద్దును, "మధుపర్కార్హో వేదాధ్యాయీ ఆచార్య ఋత్విక్ స్నాతకో వా రాజా వాధర్మయుక్త" అని స్మృతి.

బ్రాహ్మణుఁడు రాజునకును ధర్మప్రకార మాతిథ్యమీయవలయును.

రాజర్త్విక్ స్నాతక గురూన్ ప్రియశ్వశురమాతులాన్
అర్హయే న్మధుపర్కేణ పరిసంవత్సరా త్పునః॥ మను. 3-౧౧౯.

అర్ఘ్యంబు = చేతికి నీళ్లు మొదలయిన పూజాద్రవ్యములును, అంబువుల్ = పాద్యమును, అన్నరసములన్=హవిస్సును, హాళిన్=ప్రీతితో.

తా త్ప ర్య ము.

ఇంద్రియములను వశపఱుచుకొనిన వారిలో శ్రేష్ఠుఁడా, మే మిరువురము దశరథు కుమారులము, నేను శ్రీరాముఁడను పేరుగలవాఁడను. ఈతఁడు లక్ష్మణుఁ డను పేరుగలవాఁడు. ఇది నా భార్య. జనకరాజకూఁతురు. శుభగుణములు కలది కావునఁ బాతివ్రత్యధర్మము ననుసరించి నావెంట వచ్చెను. కష్టములందు మనస్సు చలింపనివాఁ డీ లక్ష్మణుండు నా చిన్నతమ్ముఁడును నావెంట వచ్చెను. మా తండ్రి యడవులకుఁ బొమ్మని యాజ్ఞాపించుటచే నాయనయాజ్ఞ దలఁదాల్చి యడవులకు మునులవలెఁ జరింపవచ్చితిమి. మామేలుగోరువాఁడా- వానప్రస్థధర్మము ననుసరించి కూరగాయలు దినియుండుము అనిన భరద్వాజుఁడును నర్ఘ్యమును బాద్యమును నెద్దును హవిస్సును ఫలములును బ్రీతితో నిచ్చెను.

కం. ముని మృగపక్షిసమేతుఁ, డనఘుని శ్రీరామచంద్రు • నర్చించి మఱిన్
ఘనుఁడు భరద్వాజుఁడు రా,ముని కుశలప్రశ్న మడుగ • ముదితుం డగుచున్.
౧౪౩౭

ముని మృగపక్షిసమేతుండు = మునులతోడను మృగములతోడను పక్షుల తోడను గూడినవాఁడు అనుటచే, భరద్వాజుని మహిమవలన నాయనయొద్దనున్న మునులు మృగములు పక్షులుకూడ శ్రీరాముమహిమ నెఱిఁగినవై శ్రీరాముని నర్చించెనని భావము. అనఘునిన్=పాపస్పర్శ లేనివాని; అర్చించి=పూజించి, కుశల ప్రశ్నము=క్షేమసమాచారము, ముదితుండు=సంతోషించినవాఁడు.

తా త్ప ర్య ము.

భరద్వాజుఁడు తనతోడనున్న మునులతోడను, మృగములతోడను, పక్షుల తోడను, శ్రీరామచంద్రుని బూజించి యాలెటువాత గొప్ప తపోమహిమ గల భర

ద్వాజుఁడు శ్రీరామునితో మీతండ్రి బాగున్నాఁడా మీతల్లి క్షేమమా యని క్షేమ సమాచారము విచారింపఁగా శ్రీరాముఁడు సంతోషించినవాఁడై.

కం. వా రిచ్చినయర్ఘ్యముల రఘు,వీరుఁడు గైకొని సుఖోప•విష్టుం డయినన్
గూరిమిని భరద్వాజుం, డారాముని కనియె ధర్మ్య•మగువాక్యములన్. ౧౪౩

వారు=భరద్వాజుఁడును ఆయనతోడి మునులు మొదలగువారు, అర్ఘ్యలన్=పూజలను, కైకొని=అంగీకరించి, సుఖోపవిష్టుండు=సుఖముగఁ గూర్చుండినవాఁడు, కూరిమిన్=ప్రేమతో, ధర్మ్యము=ధర్మముతోఁ గూడినది.

తా త్ప ర్య ము.

భరద్వాజుఁడు లోనగువా రొసఁగిన యర్ఘ్యాదులను గ్రహించి వీరుఁడగు శ్రీరామచంద్రుఁడు సుఖముగాఁ గూర్చుండఁగాఁ బ్రేమతో నాయనను జూచి భరద్వాజమహాముని ధర్మయుక్తములయిన మాటలతో నిట్లనెను.

ఉ. ఎన్నిదినాల కేను నిను • నిచ్చటఁ గంటిని రామ. నీదు నీ
బన్నముఁ, దండ్రి శేర కిటు•పంపుటయున్, వనిఁ జేరు టీకథల్
మున్నుగ వింటిఁ, బుణ్యతల•మున్ విజనంబు మహాపగోరుసం
పన్నము కమ్ర మియ్యది, ని•వాసముఁ గైకొను మిందు నెమ్మదిన్. ౧౪౪

బన్నము=భగ్నశబ్దభవము, రాజ్యవిఘాతము; శేరకున్ = నిష్కారణముగ, వనిన్=అడవిని, మున్నుగన్=నీవిచటికి రాకముందే, విజనంబు=జనములేనిది, మహాపగా=మహానదులచే, ఉరుసంపన్నము = మిక్కిలి భాగ్యవంతమైనది, కమ్రము = మనోహరమైనది, ఇందున్=ఈ యాశ్రమమందు.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రా! నిన్నుఁ బ్రత్యక్షముగ నిచటఁ జూడవలయునని యెన్ని దినాలుగనో యెంతో కోరుచుంటిని. నాయోగాభ్యాస సమయంబున హృదయంబునఁ గనుపించు పరంధాముని యాకారమును గన్నులార నీప్రాకృతచక్షువులతోఁ జూచు భాగ్యము నా కెపుడు కలుగునాయని యెంతో యాశపడి యేకారుచుంటిని. (భక్తులందఱును గోరెడి కోరిక యిదియే. ఇదియే పరిత్రాణాయసాధూనా మ్మన్న చోటఁ జెప్పఁబడిన ముఖ్యరక్షామార్గము.) ఇచ్చట ననుటచే దేహమును విడిచిన పిమ్మట వైకుంఠమునకు వచ్చి యచ్చట నిన్నిరీతిగాఁ జూచుటగాదు. నాతపఃఫలముగా నీవే యిచ్చటికి వచ్చి దర్శనమీయవలయునని కోరుచుంటినని భావము. ఈ సాధురక్షణము భగవంతుఁడు సంకల్పముచే నీవిధముగఁ దప్ప మఱియొక విధముగఁ జేయఁజాలఁడు. కావుననే యవతరించుట. (అని యవతార రహస్యము వెల్లడింప రాదు గావున లోకమర్యాద ననుసరించి చెప్పుచున్నాఁడు.) నీకుఁ బట్టాభిషేకము విఘ్నమగుటచేఁ గలిగిన యవమానము కారణములేకయే మీతండ్రి నిన్ను నిట్టు లడవులకుఁబంపుటయు నీవు వనములందుఁ బ్రవేశించుటయు నీ కథలన్నియు నీవు

రాకముందే వింటిని, నీవరణ్యమున వసించుట కెక్కడికో పోనేల? ఇది పుణ్యభూమి. జనులు లేనిది. గొప్ప నదులనే యైశ్వర్యముగాఁ గలది. నీ వింద వసింపుము.

తన నియమప్రకారము పరంధాముఁడగు శ్రీరాముఁడు తానై పోయి దర్శన మిచ్చి యనుగ్రహించిన భక్తులలో మొదటివాఁడు. మద్గోత్ర మూలపురుషుఁడైన భరద్వాజమహర్షి యే. అట్టి మహానుభావుని గోత్రమందుఁబుట్టుట మహాపుణ్యవిశేష మననే యని యాగోత్రజులందఱు శ్రీరామునందు నట్టి భక్తివిశ్వాసములు కలవారై యుందురుగాక. ఈ విషయమున విశ్వామిత్రగోత్రజులు కలహమునకు వత్తురేమో. శ్రీరాముని వెదకుచుఁబోయినవాఁడు విశ్వామిత్రుఁడు. శ్రీరాముఁడు తానై పోయి దర్శనమిచ్చినవాఁడు భరద్వాజుఁడు. ఇది తారతమ్యము.

సీ. అనుచు భరద్వాజుఁ • డాడ నాతనిఁ గని, యనియె శ్రీరాముఁడు • మునివరేణ్య
కడు సుదర్శుఁడ నంచుఁ • గనుఁగొన వత్తు రా,సన్నపౌరులు మఱి • జానపదులు
మాజానకిని నన్ను • మఱి మఱి గావున, నిచ్చట నిల్వంగ • నిచ్చగింప
సుకుమారి జానకి • సుఖముగావర్తింప, నేకాంతతల మొండు • నెఱుఁగఁ జెపుమ
తే. యచటికిని బోవువార మం • చనిన లోక,వీరు నిటకు దశక్రోశ • దూరమునను
గంధమాదననిభ ఋక్ష • కపిసమేత,వాటి సుఖదర్శనము చిత్ర • కూట మమరు.

౧౨౪.౧

సుదర్శుఁడు = (౧) సులభముగఁ జూడఁదగినవాఁడు, (౨) నేత్రసాఫల్యము గలిగించు లోకైకసుందరుఁడు, ఆ సన్నపౌరులు = సమీపముననుండు పురములవారు, జానపదులు=పల్లెటూళ్లవారు, ఏకాంతతలము=జనములు లేనిచోటు, దశక్రోశదూరమునన్=పదికోసులదూరము, కోసునకు రెండుమైళ్లు రెండున్నరమైలనియుఁగలదు. గంధమాదననిభ=గంధమాదనపర్వతముతో సమానమై.ఋక్షకపిసమేతము = ఎలుఁగు బంటులతోను గపులతోను గూడినది, వాటి=ప్రదేశము, సుఖదర్శనము = దర్శనము చేతనే సుఖము గలిగించునది. (౨) సుఖముగాఁ జూడఁదగినది.చిత్రకూటము = చిత్ర కూటమను పేరుగల పర్వతము. చిత్రకూటము సుఖదర్శనమని చెప్పినవాఁడు చిలుకలు గోరువంకలు నెమిళ్లు జింకలు లోనైనవి కలదని చెప్పక యెలుఁగులు క్రోఁతులు గల వని చెప్పుటకుఁ గారణము. భవిష్యత్కాలమున నాయనకు వానితోఁ గలుగఁగల స్నేహము సూచించుటకే, నీయవతార ప్రయోజనము సాధింప సహాయులు కాఁగల వారు నీకై యచటఁ గాచియున్నారని సూచించుటకే. అనాప్తులగు సుందరుల దర్శ నము సుఖదర్శముకాదు. ఆప్తదర్శనమే సుఖదర్శనము.

తాత్పర్యము.

అని భరద్వాజుఁడు చెప్పఁగా నాయనను జూచి శ్రీరాముఁ డిట్లనియె. మునీంద్రా నేను సుందరుఁడననియు, సులభముగా నిపుడైనఁ జూడవచ్చుననియు, నిది వఱకు నా దర్శనము దుర్లభమని తలంచుచుండిన వారందఱు సమీపముననుండు

పల్లెలవారు పట్టణములవారు నన్ను సీతాదేవిని దర్శింపఁ బలుమాఱువచ్చుచుందురు కావున నిచ్చట నిల్వవలదనుచున్నాను. సుకుమారియగు జానకి యీ జనుల రాయిడి లేక సుఖముగా నుండుటకు యోగ్యమైన స్థలము నొకటి చెప్పెదము. అందుఁబోయి యుండుము. అనిన లోకైకవీరుఁడై రాక్షసులనెల్ల వధింపఁజాలిన శ్రీరామునకుఁ గాఁగల కార్యమాలోచించి యిచ్చటికి రెండామడదూరమునఁ జిత్రకూటమను పర్వతము గలదు. అది గంధమాదనపర్వతముతో సమానమై సువాసనగల వృక్షములు గలది. అచ్చట నెలుఁగులు క్రోఁతులు గలవు. చూచుటకు సుందరమైయుండును. ఆహ్లాదకరమైయుండును.

తే. రామ తచ్చిత్రకూటప•ర్వతముశిఖర,వితతు లెందాఁకఁ గనఁబడుఁ • బృథివి నంత
దాఁకఁగలప్రాణికోటుల•తలఁపులందుఁ,గలుషముండదు పుణ్యంబ•సలుపఁబడును.
౧౪౪౨

శిఖరవితతులు=శిఖరముల సమూహములు, కలుషము=పాపము.

తా త్ప ర్య ము.

రామచంద్రా! ఆ చిత్రకూటపర్వతముయొక్క శిఖరము లెంతదూరము కనఁబడునో యంతదూరము లోపలఁగల జీవజంతువుల హృదయములందుఁ బాప చింత యుండదు. అవి పుణ్యమునే చేయుచుండును

తే. అందు నూఱులకొలఁది లేం•డ్లనఘశీలు,రైనఋషిసత్తములు పెక్కు•రాచరించి
ఘోరతపమును దివమును • గూడఁ జనిరి, సహకపాలశిరస్కులై • జగము లెన్న.
౧౪౪౩

అనఘశీలురు = పాపములేని స్వభావముగలవారు, ఋషిసత్తములు = ఋషిశ్రేష్ఠులు, సమాసంబున శ్రేష్ఠార్థమునఁ దల్లజశబ్దము నుపయోగింపఁబడును. సహకపాలశిరస్కులై =కపాలముతోను శిరస్సుతోను గూడినవారై, కపాలము కానవచ్చుచున్న శిరస్సుగలవారై, (౨) కపాలశిరస్సను ఋషితోఁ గూడినవారై, శిరస్సు నేల మోపి విపరీతకరణిని గపాలాసనము దీర్ఘకాలమవిచ్ఛిన్నముగ సాధింపఁగా వెండ్రుకలు చర్మముపోయి పుఱ్ఱె కానవచ్చుచుండెనని యర్థము. శిరస్సును నది దేహమున కుపలక్షణముగా గ్రహించిన సశరీరులై స్వర్గమునకుఁ బోయిరని నైనఁ జెప్పవచ్చును. ఎన్నన్=మహాత్ములని లెక్కింపఁగా, (తలక్రిందమోపి కాళ్లుపైకెత్తి నిలఁబడుట విపరీతకరణియగును.)

తా త్ప ర్య ము.

అందు నూర్లకొలఁది సంవత్సరములు పుణ్యాచారపరులైన ఋషిశ్రేష్ఠులు శిరస్సునేలమోపి వెండ్రుకలు, చర్మము నమసిపోవువఱకు విపరీతకరణిని దపస్సుచేసి స్వర్గమునకుఁబోయిరి.

క. అది విజన మగుటచే మీ, కొదవించు ముదం బటంచు • నూహించెద; నీ
యెదకొప్పిన నట నే నిట, సదయత నాతోడ నేని • చను నిలువంగన్. ౧౮౪౪

విజనము=జనములేనిది, ఒదవించున్=కలిగించును, ముదంబు = సంతోషము, ఎదకొప్పినన్ = మనస్సునకు రుచించినట్లు, అటనేన్=అచ్చటనైనను, ఇటనేన్ = ఇచ్చటనైనను. సదయతన్ = దయతోఁగూడిన మనస్సుచే, నాతోనేని = నాతోనైనను, చనున్=తగును.

తాత్పర్యము.

ఆ పర్వతమందుఁ బామరజనములులేరు. కావున మీకు సంతోషము గలిగించునని యూహించెదను. అయినను నీయిష్టానుసారముగ నందైనను నిందైనను నాతోడనైనను దయయుంచి నిలువనగును.

క. అనుచు భరద్వాజుం డా, యనఘాతిథి సద్వితీయు • సానుజు నుపచా
రనియతి సంతుష్టుఁగఁ జే, సెను మఱి రాముండు కథలు • చెప్పుచు నుండన్. ౧౮౪౫

అనఘాతిథిన్ = నిర్దోషుఁడైన యతిథిని, సద్వితీయున్ = భార్యతోఁ గూడిన వానిని, ద్వితీయ యనఁగా భార్య. ద్వితీయాసహధర్మిణ్యాం, నానార. సానుజున్ = తమ్మునితోఁ గూడినవానిని, అను+జుఁడు = వెనుకఁబుట్టినవాఁడు, తోడఁబుట్టినవాఁడు, ఉపచారనియతి = నియమముగఁ జేయవలసిన యుపచారములచే, సంతుష్టుగన్=సంతోషించిన వానిగ.

తాత్పర్యము.

అని యీప్రకారము భరద్వాజమహర్షి భార్యతోడను తమ్మునితోడను గూడియుండు పుణ్యాత్ముఁడైన యతిథిని శ్రీరామచంద్రుని నుపచారములచే సంతోషింపఁ జేసెను. అవల శ్రీరాముఁ డయోధ్యయందు జరిగినవిషయములను జెప్పుచుండెను.

తే. సంజకెంజాయ లపరది • శాతలంబు, నావరించెను జనపతి • యనుజుతోడ
సీతతోడఁ దదాశ్రమ • సీమ విభుఁడు, సమ్మతి వసించి వ్యథ వాయ • సౌఖ్యముగను. ౧౮౪౬

సంజకెంజాయలు=సంధ్యవేళయందలి యెఱ్ఱనికాంతులు, సంధ్యాశబ్దభవము సంజ - కెంపు + చాయ-కెంజాయ - కెంపుశబ్దములోని 'ంపు'లోపించి దానిస్థానంబునఁ గొన్నియెడలఁ బూర్ణబిందువగు, అపరదిశాతలంబు = పడమటి దిక్ప్రదేశము.

తాత్పర్యము.

సాయంకాల సంధ్యాసమయమందలి యెఱ్ఱనికాంతులు పడమటి దిక్ప్రదేశములందుఁ గ్రమ్ముకొనెను. అవలఁ దమ్మునితోడను సీతతోడను ఆ యాశ్రమమందే వెతదొలఁగిపోవ సుఖముగ సంతోషముతో నుండెను.

కం. వేవిన మేల్కని మానిఁ ద,పోవిభవుం దావకీన•పుణ్యాతలమునన్
రే వుచ్చితి హాయిగ నీకఁ, బోవఁగ సెలవిచ్చెదర ప్ర•భూతపుఁగరుణన్. ౧౪౪౭

వేవినన్=తెల్లవాఱఁగా, వేగినన్ అనుదానిలో 'క్వచిద్గకారోవః' అను సూత్ర ప్రకారము గకారమునకు వకారము వచ్చెను. గకారమునకు వకారము వచ్చును గాని వకారమునకు గకారమురాదు. తపోవిభవున్ = తపస్సంపదగలవానిని, తావకీనపుణ్యాతలమునన్=నీయొక్క పుణ్యప్రదేశమందు, రే = రాత్రి, ప్రభూతపుఁగరుణన్ = అధికదయతో, రే+పుచ్చితినా=రేవుచ్చితిన్.

తాత్పర్యము.

ఊరువిడిచిన నైదవనాఁటి యుదయమున శ్రీరామాదులు మేలుకని తపస్సంపదగల భరద్వాజ మునీంద్రునిఁజూచి నీ పుణ్యప్రదేశమున రాత్రి సుఖముగఁ గడపితిని. ఇఁకఁబోవ దయాతిశయమునఁ ననుజ్ఞ యిచ్చెదరా.

సీ. అనుడు భరద్వాజుఁ • డారఘూత్తముతోడ, ననుఁబోయి రమ్మని పు•ణ్యప్రభావ
చిత్రకూటంబు ప•విత్రమధురమూల, ఫలమధుయుత మగు• స్థలము వెండి
నానానగోపేత•మానితకిన్నరో,రగసేవితము మయూ•రనదకలిత
మిభరాజసేవిత • మెంతయుఁ బుణ్యంబు, రమణీయ మగుఁ గాన•రామ పొమ్ము
ఆ. నీకుఁ దగిననెలవు • నిక్కంబ యచ్చోటఁ, గనుఁగొనంగఁ గలవు • కరిఘటలును
మృగసమూహములును•క్రీడావిలోలంబు, లగుచుఁ దిరుగు చుండ • నంబుజాక్ష.
౧౪౪౮

పుణ్యప్రభావ = పుణ్యమువలనఁ గలిగిన ప్రభావముగలవాఁడా! పవిత్ర.... యుతము=పరిశుద్ధములై తియ్యనైనవేళ్లు పండ్లు తేనెతోఁ గూడినది. నానా.... సేవితము=అనేకములైన, నగోపేత=పలువిధములైన చెట్లతోఁ గూడినదియు, గౌరవింపఁబడిన కిన్నరులచేతను, సర్పములచేతను సేవింపబడినది. మయూరనదకలితము = నెమిళ్ల కేకా రావములతోఁ గూడినది. ఇభరాజసేవితము = గొప్ప యేనుఁగులచేం గొలువఁబడినది నిక్కంబ=నిజము, కరిఘటలు=ఏనుఁగుల గుంపులు, క్రీడావిలోలంబులు=ఆటల మరగినవి

తాత్పర్యము.

ఈ ప్రకారము శ్రీరామచంద్రుఁ డడుగఁగా భరద్వాజుఁ డాయనతో నిట్లనెను. ధర్మమువలనఁగలిగిన ప్రభావముగలవాఁడా, చిత్రకూటపర్వతము పవిత్రములై తియ్యనైన కందమూలఫలములచేతను తేనెలచేతను గూడిన స్థలము. మఱియును అనేకవిధములయిన చెట్లతోఁగూడి కిన్నరులచేతను సర్పములచేతను ఏనుఁగులచేతను ఆశ్రయింపఁబడినది. నెమిళ్ళకేకలచేఁగూడినది. మిక్కిలి పుణ్యప్రదేశము అందమైనదియగును. కావున శ్రీరామచంద్రా! యచటికిఁ బొమ్ము అది నీవు నిలువఁదగిన

స్థలము. అచ్చట నేనుఁగుల గుంపులు, మృగసమూహములు ఆటయం దాసక్తిగలిగి తిరుగుచుండఁ జూడఁగలవు.

చిత్రకూటమహిమ భారతంబున నిట్లు చెప్పఁబడెను.

తతోగిరి వరశ్రేష్ఠే, చిత్రకూటే విశాంపతే
మందాకినీం సమాసాద్య, నదీంపాప ప్రమోచనీమ్
తవాభిషేకం కుర్వాణః, పితృదేవార్చనే రతః
అశ్వమేధ మవాప్నోతి, గతించ పరమాంవ్రజేత్॥ వనపర్వము.

పర్వతశ్రేష్ఠమైన చిత్రకూటమందలి పాపనాశకమైన మందాకినీ నదియందు స్నానముచేసి దేవపితృకార్యములు దీర్చినవారికి నశ్వమేధయాగఫలము పరమగతియుఁ గలుగును.

కం. ఝరులుం జరులుం దిరిగెడు, కరులున్ నిర్ఝరచయంబుఁ గందరతతులున్
దరులున్ శుకపికనాదిత, తరులున్ నీసతికి హర్ష దములగు ననుడున్. ౧౪౪౯

ఝరులున్=ప్రవాహములు, చరులున్=కొండలోయలు, కరులు=ఏనుఁగులు, నిర్ఝరచయంబు=చీలినరాలసందుల సమూహములు, కందరతతులున్ = గుహలసమూహములు, దరులు=రాలొక దానితో నొకటి సంధించిన స్థలములు, శుకపికనాదిత తరులున్=చిలుకల కోకిలనాదములుగలచెట్లు, హర్షదములున్=సంతోషమిచ్చునవి.

తాత్పర్యము.

నీటిప్రవాహములు, కొండలోయలు, సంచారముచేయు నేనుఁగులు, చీలిన రాలసందులు గుహలు రాలసంధులు చిలుకలు కోవెలలు ధ్వనించు చెట్లు ఇవన్నియు నీ భార్యకు సంతోషమును గలిగించును.

—• { ౫౫-వ సర్గము. భరద్వాజముని శ్రీరామునకుఁ జిత్రకూటమార్గముఁ దెలుపుట. } •—

ఉ. బల్లునఁ దెల్లవాఱుటయుఁ బార్థివపుత్రులు నిండుఁ బ్రీతి సం
ధిల్లఁగ మ్రొక్కి మౌని కవనీధ్రముచాయను బోవఁ బూనఁగా
నల్లలితోక్తి వారలకు స్వస్త్యయనంబు ఘటించి సత్యవా
గ్వల్లభుఁ డేగె వెంట సుతవర్గముతోఁ జనుతెంచిపోలికన్. ౧౪౯౦

అవనీధ్రము=కొండ, నల్లలితోక్తిన్=మంచి యింపైనమాటలచే, స్వస్త్యయనంబు=స్వస్తి+అయనంబు=ఆశీర్వాదము, సత్యవాగ్వల్లభుఁడు = మునిశ్రేష్ఠుఁడు, ఋషులకు సత్యవచనులని పేరు, వెంట=వెంబడి.

తాత్పర్యము.

బల్లునఁ దెల్లవాఱఁగానే రాజకుమారులు భరద్వాజునివంటి మహర్షి యనుగ్రహమునకు మనము పాత్రులమైతిమిగదా యని పరిపూర్ణసంతోషముతో మౌనికి నమస్కరించి చిత్రకూటమునకుఁ బోవుమార్గమున నరుగఁ బ్రయత్నింపఁగా వార

లను నింపై నవాక్యముల నాశీర్వదించి యాముని బిడ్డలవెంటఁబోవు తండ్రివలె. ఇచట సుతయనునది యేకశేషముగ గ్రహింపవలెను. సుతా+సుత=సుతులు.

సీ. రామునిఁ గని ముని • రాజేంద్రుఁ డిట్లను, జాహ్నవీసూర్యజా • సంగమంబు
　చేరి యాదిశఁ బ • శ్చిమముఖ మై పాఱు, యమునతటం బట • ననుసరించి
　చని చని యానది • సత్వరంబుగఁ బాఱు,కడ రాకపోకలఁ • గరము వాడఁ
　బడుట శీర్ణం బైన • బాటను గని యందుఁ, దెప్పఁ గట్టికొని మీ • రొప్పమీఱి

తే. యమున నట దాటి యచ్చోట • శ్యామ మనెడి
　పెద్దమఱిచెట్టు బహుతరు • వృద్ధ మగుచు
　సిద్ధసేవిత మగుదానిఁ • జేరి మేలి
　దీవన లొసంగ మ్రొక్కుఁడు • తీవఁబోణి.　　౧౮౯౧

జాహ్నవీసూర్యజాసంగమంబు=గంగా యమునలు కలయుచోటు, కాళిందీ సూర్యతనయా యని నిఘంటువు, యముని సోదరి. పశ్చిమాభిముఖమై = పడమటి ముఖముగా. యమునానది తూర్పు ముఖముగాఁ బాఱునదియైనను గంగానది వచ్చి కలియుటచే నా వేగమునకు యమున తూర్పుగాఁ బోక వెనుకకు మరలి పశ్చిమ ముఖమై కొంచెము దూరము పాఱును. అనఁగా మీరును బడమటి ముఖముగానే ప్రయాణముచేయుఁడని యర్థము. సత్వరంబుగన్ = త్వరతోఁ గూడినట్లు, అనుటచే గంగాప్రవాహమడ్డుపడుటచే యమున నీళ్లు మెల్లగాఁ బాఱుచోటుగాదని యర్థము. రాకపోకలన్ = రాక+పోక = రాకపోకలు, ద్వంద్వసమాససమాసంబునఁ బదంబు కంబుఁ బరంబయిన పరుషములకు గసడదవలు ప్రాయికంబుగ నగు సు. వ్యా. సూ. సంధి ౨౨ ప్రాయిక గ్రహణముచే 'ప'కారమునకు 'వ'కారము రాలేదు. శీర్ణము= నలఁగినది, శ్యామము=నల్లగానుండుటచే శ్యామమను పేరుగల, బహుతరువృద్ధము= అనేక వృక్షములచే వృద్ధిపొందినది. ఊడలు పెక్కులు దిగి భూమిలోనికిఁ బోయి మరల నవి చెట్లగుటచేఁ బెరిఁగినది. తీవఁబోణి-తీఁగఁబోఁడి = తీఁగవంటి పోణిమి గలది.

## తాత్పర్యము.

శ్రీరామునిఁజూచి భరద్వాజమహాముని యిట్లనియె. గంగా యమునలు కలియుచోటు చేరి యచ్చట యమున పడమటిముఖముగాఁ బాఱుచోట మీరును బడమటిముఖముగానె యేటియొడ్డు వెంబడి పోయిపోయి గంగనీరడ్డపడకుండుటచే యమున నీరెచ్చట త్వరగాఁ బాఱునో యాచోట జనులరాకపోకల త్రొక్కుడులచే నలఁగిన బాటనుజూచి యచ్చటఁ దెప్పకట్టుకొని మీరు యమునను దాటిపోయి పచ్చని యాకులుగలదగుటచే శ్యామమని పేరుగాంచిన పెక్కు చోట్లతోఁ గూడిన వృక్షమును జూచి యది మంచిదీవన లిచ్చునట్లు సీతచే మ్రొక్కింపుఁడు.

చం. నిలిచిన నిల్వఁ డందుఁ, దమి • నెక్కొను నేనియుఁ బోవ నేగుఁ డా
వల, నట కొక్క క్రోశము న•వర్తిలు నీలవనంబు వెండి రే
గులు వెదురుల్ మనోజ్ఞము ల•గున్, బహు వారము లేగినాఁడ, నీ
చెలువపుఁ ద్రోవ మార్దవము • చిచ్చుభయంబును లేదు రమ్యమా. ౧౮౫౨

తమి=కోరిక, నెక్కొననేని=కలిగెనేని, బహువారములు=పెక్కుతడవలు.

తాత్పర్యము.

ఆశ్యామవృక్షమునొద్ద సీత బడలియుండుటచే నిల్వఁదలఁచిన నిలువుండు. అటుగాక యావలఁబోవఁదలఁచినఁ బొండు, అక్కడి కొక కోసుదూరమున నీలవనముగలదు. అందు రేఁగులు వెదుళ్లు మనోహరములై యుండును. ఈత్రోవ నేను బలుమాఱు పోయినాఁడను. ఈత్రోవ యందముగా నుండును. ఱాలు రప్పలు లేవు. కాఱుచిచ్చు భయములేదు.

చం. అని ముని జాడఁ దెల్పి యన•ఘాత్మక! నిల్తునె యన్న రాముఁడున్
వినయము మీఱ లెస్స యన • నిర్మలశీలుఁడు పోవ లక్ష్మణుం
గనుఁగొని మానినాథుఁ డను•కంపకుఁ బాత్రుల మాటఁ దమ్ముఁడా!
మనము సుపుణ్యు లంచు నర•మండనుఁ డాడుచుఁ బోయి యావలన్. ౧౮౫౩

జాడ=పోవుమార్గము, నరమండనుఁడు=మనుష్యులందు నలంకారమైనవాఁడు.

తాత్పర్యము.

ఈ ప్రకారము భరద్వాజుఁడు చిత్రకూటమునకుఁ బోవుమార్గము దెలిపి శ్రీరామచంద్రా యింక నేను నిలుతునా యనఁగా శ్రీరాముఁడును వినయముతో మంచిదియని యంగీకారము దెలుపఁగాఁ బరిశుద్ధచరిత్రుఁడైన భరద్వాజుఁడు మరలి పోయెను. అంత లక్ష్మణునిఁగనుఁగొని శ్రీరాముఁడు తమ్ముఁడా! మనము మునీశ్వరు దయకుఁ బాత్రులమాటచే మిగులఁ బుణ్యముచేసినవారమని నరుల కలంకారమైన శ్రీరాముఁడు చెప్పుచుఁబోయి యావల

అట్టి మహానుభావు గోత్రమున బుట్టినవారు తామెంతో ధన్యాత్ములని తలఁచి యిప్పటికిని దమయందుఁ బ్రసరించుచుండు నాయన దివ్యతేజస్సును దుష్టాహారము దురాచారము దుర్విచారములచే నాశముచేసికొనకుందురు గాక.

కం. సీతాసతి మున్నుగ యము•నాతటముం బట్టి పోయి • నది వడిఁ జనుచో
టాతరణికులులు గని చిం•తాతత్పరులై రి యెట్లు • దాఁటుద మనుచున్. ౧౮౫౪

సీతాసతిమున్నుగన్=అనుటచే శ్రీరాముఁడు ముందుగను ఆవల సీతయును ఆవల లక్ష్మణుఁడు పోయిరని తెలియవలెను. భార్యాభర్తల నడుమ మఱియొకఁడు పోరాదుకదా. ఇచటఁ బ్రణవార్థము అనులోపముగా సూచింపఁబడెను. యమునాతటముఁబట్టి=యమునాతీరము వెంబడి, ఆతరణికులులు = సూర్యవంశమునఁ బుట్టిన శ్రీరామలక్ష్మణులు, చింతాతత్పరులు=ఆలోచనగలవారు.

తా త్ప ర్య ము.

అంతవఱకు వెనుకఁబోవుచున్న శ్రీరాముఁడు ముందుగా యమునాతీరము వెంబడిపోయి యానదివేగముగఁ బాఱుచోటుగని శ్రీరామలక్ష్మణు లీనది యిచ్చట నెట్లుదాఁట సాధ్యమగునా యని యాలోచించిరి.

ఉ. కట్టెలమ్రోవుఁ దెచ్చి, యెస•కంబుగఁ దెప్ప బిగించి రాఘవుల్
గట్టిని మెండుబొంగులును • గట్టి, యుశీరము పైచి, మీఁదటన్
నెట్టన ప్రబ్బలిదీవెలను • నేరెడుకొమ్మలఁ గూర్చి, సీతకున్
దిట్టము సత్సుఖాసనముఁ • దీర్చె సుమిత్రతనూజుఁ డంతటన్. ౧౭౫౯

ఎసకంబుగన్=మిక్కిలి. ఉశీరము=వట్టివేరు, ప్రబ్బలిదీవెలన్ = తీగలవంటి సన్నని ప్రబ్బకొమ్మలను, దిట్టము = దృఢము, సత్సుఖాసనము = మంచిసుఖమైన యాసనము.

తా త్ప ర్య ము.

కట్టెలమోపుదెచ్చి శ్రీరామ లక్ష్మణులు తెప్పబిగించిరి. ఇది యిరువురు చేయఁదగినకార్యము కావున నిరువురు చేసిరనిభావము. అట్లుకట్టినతరువాత మెండిన గట్టి వెదురు బొంగులనుగట్టి దానిపై వట్టివేళ్లుపఱచి యామీఁద సన్నని ప్రబ్బ కొమ్మలను నేరేడుకొమ్మలను గూర్చి సుఖముగాఁ గట్టెలొత్తుకొనక యుండ నాసనము లక్ష్మణుఁడు కుదిర్చెను.

కం. ఇందిరమాడ్కి నచింత్యను, సుందరి దరలజ్జమాన•సుదతిని సీతన్
ముందుగ రాముండుడుపము,నం దెక్కఁగఁ జేసిపిదప • నవనిజుఁడెక్కన్ ౧౭౬౦

ఇందిరమాడ్కిన్=లక్ష్మీదేవివలె, అచింత్యన్ = మనస్సుచేనాలోచించి తెలిసి కొనరాని మహిమగలదానిని, “యస్యాస్తే మహిమాన మాత్మన ఇవ త్వద్వల్లభోపి ప్రభుర్నాలంమాతు” మన్నట్లు “మీమహిమ మీరలెఱుఁగరు శ్రీమహిళానాథ” యన్నట్లు సర్వజ్ఞత్వముగల లక్ష్మీనారాయణులగు సీతారాముల మహిమ వారే తెలిసికొనలేకుండఁగా నితరులనేమిచెప్ప! దరలజ్జమాన = కొంచెముగా సిగ్గుపడు చున్నదానిని, శ్రీరాముఁడు తనచేతిని బట్టుకొని తెప్పపై లక్ష్మణునెదుట నెక్కించు టచే వదినెశక్తి యింతమాత్రమా యని మఱఁది నవ్వునని సిగ్గు. ఉడుపము=తెప్ప.

తా త్ప ర్య ము.

లక్ష్మీదేవివలె నచింత్యమహిమగల సీతను సుందరిని గొంచెముగా సిగ్గుపడు చున్నదానిని గొంచెపు జఱునవ్వుగలదానిని సీతను శ్రీరాముఁడు ముందుగఁ దెప్ప పైఁ జేతిని బట్టుకొని యెక్కించెను. లక్ష్మణుఁడు నీళ్లలోదిగి పడవ కదలకుండఁ బట్టు కొన్న కారణముచే శ్రీరాముఁ డీపని చేయవలసివచ్చెను.

కం. ఆమెపరిష్కారంబులు, నామెవసనములును నాయు•ధావళి మఱియున్
రాముండు కఠినకాజము, లామహిత ప్లవమునందు • నారోపించెన్. ౧౭౬౧

పరిష్కారంబులు=సొమ్ములు, వసనములు = వస్త్రములు, కటకాజములు= కటక + అజములు=గడ్డపాఱ తోలుగప్పిన గంప మొదలయినవి, మహాప్లవము నందున్=పెద్దతెప్పయందు, ఆరోపించెన్=ఉంచెను.

తా త్ప ర్య ము.

ఆమెసొమ్ములు, చీరలు తమయాయుధముల సమూహములు గడ్డపాఱ, తోలు గప్పిన గంప, వీనినెల్ల శ్రీరాముఁడు సీతప్రక్కనుంచెను.

సీ. కదలక యుండఁగఁ • గాకుస్థు లాతెప్పఁ, బదిలంబుగాఁ బక్కఁ•బట్టుకొనుచు
సీత నెక్కించి ని•ర్భీతిఁ దరించుచోఁ, గాళింది మధ్యభా•గంబుఁ జేరఁ
గరములు ముకుళించి • ధరణీతనూభవ, యావాక హేవాక • నదిని నిట్లు
నిన్నుఁ దరించుచు • నున్న వారము దేవి, నాపతివ్రతము సాం•తంబుఁ జేసి
ఆ సౌఖ్యముగను వెండి • చనుదేర దయఁ గన,వమ్మ మరలి పురికి • నరిగినపుడు
గవులు వేయుఁ గల్లు•ఘటములు వందయు, నిచ్చెదాన నీకు • మెచ్చు గదుర. ౧౭౫౮

ఆవాకన్=అనదిని, హేవాకన్=ఉత్సాహముతో, పతివ్రతము=పతి ననుస రించియుండు వ్రతము, సాంతంబు=తుదముట్టినది, గవులు=ఆవులు, వంద=నూఱు, గదురన్=కలుగఁగా.

జనులు రాకపోకలుగల రేవని భరద్వాజుఁడు చెప్పుటచేతను శ్రీరామలక్ష్మణు లెక్కరని యందుఁ జెప్పకుండుటను ౧౭౫౯-వ పద్యమునందు జనకజ నటడించి యని మాత్రము చెప్పి శ్రీరామలక్ష్మణులు దిగిరని చెప్పకుండుటచేతను శ్రీరామ లక్ష్మణులు పడవపై నెక్కలేదనియుఁ బడవను బట్టుకొని నడచి వచ్చిరనియు గ్రాహ్యము.

ఏటిలోదిగి నడచియైనఁ బోవవలయును. పడవమీఁదనైనఁ బోవలయును గాని చేతులతో నీది పోరాదు. "న బాహుభ్యాం నదీంతరే" త్తని మనువు.

తా త్ప ర్య ము.

శ్రీరామలక్ష్మణులు కదలకుండఁగ నా తెప్పను బట్టుకొని సీత నెక్కించి భయములేక దాటునపుడు న. మధ్యమునకుఁ బడవరాఁగా సీతాదేవి చేతులు జోడించి యానదినిగూర్చి సంతోషముతో నిట్లనియెను. దేవీ యమునానదీ! నిన్ను దాటి పోవుచున్నారము. నాపాతివ్రత్యము భంగముగాకుండ వనవాస వ్రతము ముగించి సుఖముగ మరలివచ్చున ట్లనుగ్రహింపుము. మరల నయోధ్యాపురికిఁ బోయినపుడు వేయావులు బ్రాహ్మణుల కిచ్చెదను. నూఱు కల్లుకుండలు నీవు మెచ్చు కొనునట్లు నీ కిచ్చెదను.

కం. అని మ్రొక్కు చుండఁ దెప్పయుఁ, జనె దక్షిణతటమునకును • సరసకుజానం
దనమునకు నంతె వారలు, జనకజ నటడించి వదలి • చయ్యనఁ దెప్పన్. ౧౭౫౯

దక్షిణ తటమునకున్ = దక్షిణ తీరమునకు, సరస కుజానందనమునకున్ = రసవంతములయిన చెట్లచే నానందింపఁ జేయుదానికి.

తా త్ప ర్య ము.

ఈప్రకారము సీతాదేవి నమస్కరించుచుండఁగనే తెప్ప మంచి రసవంతములైన చెట్లచే నానందింపఁజేయు దక్షిణతీరమునకుఁ బోయెను. అంత శ్రీరామలక్ష్మణులు సీత నక్కడ దిగఁజేసి చయ్యన పడవకట్లు విప్పిరి.

—• సీతారామలక్ష్మణులు శ్యామవటంబుఁ జేరుట. •—

కం. యమునాతీరవనంబులఁ, గ్రమముగఁ గనుఁగొనుచు నరిగి • కమ్రమహారితప
త్రములఁ బహుశీతలం బగు,విమలశ్యామాఖ్యవటము•వీరులు డాయన్. ౧౮౦

యమునాతీరవనంబులన్ = యమునానది యొడ్డునందలి వృక్షములను వరుసగఁ జూచుచుఁ బోయి మనోహరమైన యాకుపచ్చ రంగుగల యాకులచే మిగులఁ జల్లనయి నిర్మలమైన శ్యామమను పేరుగల మఱ్ఱివృక్షమును సమీపింపఁగా.

కం. న్యగ్రోధముఁ గని జానకి, వ్యగ్రత నిట్లనియె భూజ•వంశోత్తమ! స
మ్యగ్రతి నాపతి నియమస, మగ్రతఁ గనఁ జేయుమా న•మస్కృతిఁ గొనుమా. ౧౮౧

న్యగ్రోధము=మఱ్ఱిచెట్టు, వ్యగ్రతన్=దృఢమైన మనస్సుతో - భూజవంశోత్తమ=వృక్షముల వంశములఁ బుట్టినవానిలో శ్రేష్ఠమైనదానా- భగవంతుఁడు వటపత్రశాయిగదా. అట్టభాగ్యము మఱియేచెట్టునకుఁ గలిగెను. సమ్యక్ + రతిన్ = నిండుప్రీతితో, నియమసమగ్రతన్=వనవాసనియమము పూర్ణముచేయుటచే, నమస్కృతిన్=నమస్కారమును.

తా త్ప ర్య ము.

మఱ్ఱిచెట్టునుజూచి జానకీదేవి దృఢమనస్సుతో నో వృక్షరాజమా! నాపతి వనవాసవ్రతము సాంతముచేయునట్లు నిండుప్రీతితో ననుగ్రహింపుము, నా నమస్కారమును గ్రహింపుము.

కం. నాయత్తలఁ గౌసల్య న,మేయచరిత వినుతగుణ సు•మిత్రను మరలన్
వ్యాయతముదమునఁ గనఁ గుజ,నాయక దయఁ జూడుమన్న•నానతిఁగొనుచున్. ౧౮౨

అమేయచరిత = కొలఁదిచెప్పరాని సాధుగుణములఁ గలది, వినుతగుణ = స్తోత్రముచేయఁబడిన గుణములుగలది, వ్యాయతముదమునన్=విస్తారమైన సంతోషముతో, కుజనాయక=వృక్షపతీ, నతిన్=నమస్కారమును.

తా త్ప ర్య ము.

పరిమాణములేని మంచినడవడిగల కౌసల్య సాధువులచేఁ బొగడఁబడిన గుణములుగల సుమిత్ర యను నాయత్తలను మరల దర్శించునట్లు వృక్షనాయకా నానమ

సాకారము గొని యనుగ్రహింపుము. ఇట్టికార్యములను, శాస్త్రశ్రద్ధ దెలుపుచు, లోకసంగ్రహార్థము మర్యాదాస్థాపనార్థము చేయఁబడెనని యెఱుఁగనగు.

సీ. అని వలగొన్నధ•రాత్మజఁ గనుఁగొని, సౌమిత్రితో రామ•చంద్రుఁ డనియె
నీవు మున్నుగ సీత • నెమ్మిఁ దోడ్కొని భర,తాగ్రజా! చనుము నే•సాయుధుండ
నగుచు వెంబడి వత్తు • నరుగుత్రోవను సీత, లలితపుష్పం బైన • ఫలమునైనఁ
గోరె నేనియు నీవు • గొనివచ్చి యిమ్మనా, నట్ల కావించి యతఁ•డరుగుచుండ

తే. మత్తమాతంగ యుగళంబు•మధ్యమునను, జను కరేణుకభంగిని • జనకతనయ
వార లిరువుర నడుమను • వఱలు ప్రీతిఁ, జనుచునుండెను వింతలఁ • గనుచు నచట. ౧౮-౩

వలగొన్న = ప్రదక్షిణించిన, ధరాత్మజన్=సీతను, భరతాగ్రజా = భరతుఁ డన్నగాఁగలవాఁడా, ఇది బహువ్రీహి సమాసము. జన్మముచే భరతుఁడు లక్ష్మణు కంటెఁ బెద్దవాఁడు, కావున భరతునకు + అగ్రజా యని తత్పురుష సమాసము చెప్పరాదు. సాయుధుండన్=ఆయుధములను ధరించినవాఁడను, లలితపుష్పం బయి నన్=అందమయిన పుష్పమైనను. మత్తమాతంగయుగళంబు = మదించిన యేనుఁగుల జంట, కరేణుక=ఆఁడేనుఁగు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము ప్రదక్షిణముచేసిన సీతను జూచి శ్రీరామచంద్రుఁడు లక్ష్మణు నితో నిట్లనియె. సీతను నీవు వెంటఁదీసికొని ముందుపొమ్ము. ఆయుధముల ధరించిన వాఁడనై నేను వెనుకవచ్చెదను. ఇట్లుపోవుత్రోవలో నందమైన పుష్పముగాని పండు గాని సీత కోరెనేని దానిని నీవు తెచ్చియిచ్చుచుండుము. అని చెప్పిన నట్లులే కాని మ్మని చేత విల్లు బాణములులేక ముందుపోవుచుండెను. అట్లు వారియిరువురినడుమఁ బోవుచుండు సీత రెండు మదించిన యేనుఁగుల నడుమఁబోవు నాఁడేనుఁగువలె నుం డెను అట్లామె వింతలు చూచుచుఁ బోవుచుండెను.

ఉ. ఎన్నఁడు మున్ను చూడనిమ•హీస్థవినోదకరంబు వృక్షమేన్
గ్రొన్నన యేనియుం గుసుమ•కుంజమ యేనియుఁ గానరాఁగ నా
చిన్నది దానిపేరు రఘు• శేఖర యెయ్యది? రామచంద్ర యీ
క్రొన్నన నేమి యందు? రని•కూరిమిఁ బ్రశ్న మొనర్చు వల్లభున్. ౧౮-౪

మహీస్థవినోదకరంబు = మిక్కిలి వింతనై యాశ్చర్యకరమైన క్రొన్నన = క్రొత్త+నన=క్రొత్తపుష్పమైనను, కుసుమకుంజము = పూలపొద.

తా త్ప ర్య ము.

పూర్వమేనాఁడును జూడనట్టి మిక్కిలి యాశ్చర్యకరమైన చెట్టునుగాని క్రొత్త పుష్పముగాని పూఁబొదగాని కనఁబడఁగా సీతాదేవి రామా! దాని పేరేమి? రామ చంద్రా! దీనిపేరేమి? యని ప్రేమతో భర్తను బ్రశ్నించుచుండెను.

ఉ. నల్లనో! యెంతవింత ఛద•నం బది, యీకుసుమంబు సొం పహో,
పల్లవ ముల్లముం గరఁచె • బాపురె యీనుసుమోళశీవి నా
నల్లలనామనంబుఁ గని • యంతన యంతన తెచ్చిదార్ధముల్
పెల్లుగఁ దెచ్చి యిచ్చు నవ•లీల సుమిత్రసుతుండు భక్తిపై. ౧౪౬౫

నల్లనో=బలే,ఆశ్చర్యార్థకమైన యవ్యయము,ఛదనంబు=ఆకు, కుసుమము=పుష్పము,పల్లవము=చిగురు, ఉల్లము=మనస్సు,కరఁచెన్=కరఁగించెను, ననుమోళ=ననుపైన మొక్క, లలనా=స్త్రీ, పెల్లుగన్=విస్తారముగ, అవలీలన్ = అనాయాసముగ.

తా త్ప ర్య ము.

బలేబలే, రామచంద్రా! యీయాకు చూడుము. ఎంత వింతగా నున్నదో, రామా! యీపుష్పముచూడుము. ఏమిదీనిసౌందర్యము. అహో చిగురు హృదయము గరఁగించుచున్నది. సెబాసు యీనునుపైన మొక్కవిభవము. అని సీతాదేవి యనఁగా, నామె మనస్సాయాదానిపైఁ బోయెనని యెఱింగి లక్ష్మణుఁడు దాని దాని దండిగఁదెచ్చి భక్తితో నిచ్చుచుండెను.

తే. వింత యిసుమయి జలము ల•త్యంతహృద్య
హంససారసరవము లై • యమలమైన
యమునఁ గ్రోశంబు చని కని • యచట హరిణ
మాంసమునఁ బూఁటఁ గడపి రా•మహీపసుతులు. ౧౪౬౬

ఇసుము=ఇసుక, అయి=కలిగి, అత్యంత=మిక్కిలి, హృద్య=హృదయరంజకములైన, హంససారసరవము=హంసలయు బెగ్గురులయు ధ్వనిగలవై, వర్ణాగమముచే హంస యయ్యెను. హరిణమాంసమునన్=జింకమాంసముచే, మీఁదఁ జెప్పిన వృత్తివర్ణనమునుబట్టిచూడ సీతతోవలో భుజింపఁదగిన పండ్లుగల చెట్లు లేకుండెననియు, ఆకారణమున జింకమాంసము భుజించి కాలక్షేపము చేసిరనియుఁ దోఁచెడిని.

తా త్ప ర్య ము.

వినోదకరమైన యిసుకయు మిగుల మనోజ్ఞములైన హంసలయు బెగ్గురులయు ధ్వనులుగల బలముగలిగి నిర్మలమైన యమున వెంటఁ గోసు దూరముపోయి యచట జింకమాంసము భుజించి రాజకుమారు లాపూఁట గడపిరి.

తే. కేకికేకలుఁ గ్రోతుల•కిచ కిచలును, హస్తిఘీంకారములుఁ బర్వ • యామునోప
వనమునందు ధరాత్మజ•వలచుచోట, నీటిసొమ్ముగ నిలిచిరి•మేటిబలులు. ౧౪౬౭

కేకికేకలు=నెమిళ్ళ ధ్వనులు, యామునోపవనమునన్=యమునానది తీరమున నుండు వనమునందు.

తా త్ప ర్య ము.

నెమిళ్ళకేకలు - క్రోఁతుల కిచకిచలు ఏనుఁగుల ఘీంకారములు వ్యాపించి

యుండు యమునాతీరవనంబునందు సీత మెచ్చిన నీటియొడ్డున నా బలశాలులు రామ లక్ష్మణులు నిలిచిరి

—•{ ౫౬-వ సర్గము. శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటమునందలి చిత్రములం జూపుట. }•—

సీ. ఆరేయి యంతయు • నచ్చోటఁ గడపి వేఁగిన రాముఁ డవసుప్తు • ననుజు మెల్ల
మేల్కొల్పి యనియె సౌ•మిత్రి! వింటె వన్య,శుకపిక శారికా•సుందరస్వ
నము లింకఁ బయనింప • సమయంబు నా నిద్ర, మత్తను గాసియు • నొత్తివైచి
లేచె నందఱు నిట్లు •లేచి యాయేటిని రముల స్నానాదికా•ర్యములఁ దీర్చి.

తే. చిత్రకూటంబునకు ముని•సింహదిష్ట
మార్గమునఁ బోవు చుండఁగ • మానవేంద్రుఁ
డాసరోజాక్షిఁ గనుఁగొని • యచటి చిత్ర
ములను నెల్లను దెలుపుచుఁ • బోవు చుండె. ౧౪౬౭

వేఁగినన్=ఉదయముకాఁగా, అవసుప్తున్ = కొంచెముగా నిద్రించువానిని, అనుజున్=తమ్ముని, మేల్కొల్పి=నిద్రలేపి, శుకపిక శారికా=చిలుకలయు కోవెలలయు గోరువంకలయు, సుందరస్వరములు=ఇంపైన ధ్వనులు, గాసి=బడలిక, ఒత్తివైచి=తొలఁగఁద్రోచి, స్నానాదికార్యములు=స్నానము సంధ్య మొదలయిన పనులు, మునిసింహదిష్టమార్గమునన్=మునిశ్రేష్ఠుఁడైన భరద్వాజమహర్షి యుపదేశించిన మార్గమున, నిద్రపోవుచున్న లక్ష్మణుని శ్రీరాముఁడు నిద్రలేపెననియు లక్ష్మణుఁడు నిద్రమత్తు తొలఁగఁద్రోచెననియుఁ జెప్పుటచే లక్ష్మణుఁడు పదునాలుగు సంవత్సరములు నిద్రాహారములు లేకయుండెననియు నట్టివానిచేఁగాని యింద్రజిత్తు చావఁడనియుఁ జెప్పెడి వింతకథలు వినవింపైనవే కానివాల్మీకిమతము ననుసరించినవి మాత్రము కావు.

తాత్పర్యము.

ఆ రాత్రియంతయు నాయేటియొడ్డుననే కడపి యుదయము కాఁగాఁ గొంచెము నిద్రించిన లక్ష్మణుని మెల్లగా నిద్రలేపి సౌమిత్రీ యడవియందలి చిలుకలు కోవిలలు గోరువంకలు కిలకిలమని విన వింపుగాఁ గూయుచున్నవి. వింటివా? యింకఁ బ్రయాణము సేయు సమయము. అనఁగా లక్ష్మణుఁడు నిద్రమబ్బును దానివలచిన బడలికను దొలఁగఁద్రోచి లేచెను. అందఱు నిట్లు లేచి యాయేటి నీళ్ళయందు స్నానముచేసి సంధ్యాదులు తీర్చికొని భరద్వాజముని చెప్పినమార్గమునుబట్టి చిత్రకూటమునకుఁ బోవుచుండఁగా రామచంద్రుఁడు సీతాదేవికి నచటి చిత్రములను దెలుపుచుఁ బోవుచుండెను.

ఉ. అల్లవెకంటె జానకి! ప•లాశ మహీరుహకాననంబు లు
త్ఫుల్లసుమాంచితంబు లయి • పోణిమి దీప్తము లైనయట్లు గా

జెల్లుచు నున్న వెల్లమెక • స్వీయమనోహరసూనపంక్తులన్
వెల్లుగ మాలికావితతి • వేడ్క ధరించినభంగి నామనిన్. ౧౪౬౯

క్రింది పద్యములందు సీతాదేవికి శ్రీరామచంద్రుఁడు చెప్పినవి చూపినవి చెప్పఁబడుచున్నవి. పలాశమహీరుహకాననంబు=మోదుగుచెట్ల యడవి, ఉత్ఫుల్ల=వికసించిన, సుమ=పూలచేత, అంచితంబులయి=ప్రకాశించునవియై. దీప్తములు = మండుచున్నవి, మోదుగు పూవెఱ్ఱగా నుండును గావున మండుచున్నట్లు చెప్పఁబడినవి, స్వీయ=తనదైన, మనోహర=మనస్సు నాకర్షించు, సూనపంక్తులన్=పూలవరుసలచే, వెల్లుగన్=విస్తారముగా, మాలికావితతిన్=పూలదండల సమూహములచే, ఆమనిన్ = వసంతకాలమునందు, పలాశము=ప్వపుష్పైః పలంమాంసం అశ్నాతీవ, తిష్ఠతీతివాపలాశః=పుష్పముచేత మాంసమును భక్షించుదానివలెనుండునది, పల + అశ=స్వరప్రధానయతి.

## తాత్పర్యము.

సీతా! యదిగో మోదుగుచెట్ల యడవులు కానవచ్చుచున్నవి చూచితివా. అవి వికసించిన పూలచే నెఱ్ఱనై మండుచున్నట్లున్నవి. ఈ వసంతకాలమందుఁ దమ మనోహరములైన పూలదండలచే నలంకరించుకొన్న విధముగ నున్నవి.

"నిర్గంధా ఇవకింశుకా" యన్నట్లు మోదుగుపూలు వాసనగలవికావు చూచుటకుమాత్ర మెఱ్ఱగా నందముగానుండును. ఈ వృక్షములు తమ్ముఁ దామ లంకరించుకొన్నట్లు చెప్పఁబడుటచే విద్యాగంధములేక, యితరులు బహూకరించి యిచ్చినవిగాక, తమంతటఁదామే దంభార్థముగ బిరుదులచేతను, నలంకారముల చేతను నలంకరించుకొన్న మూఢులస్థితి ధ్వనించుచున్నది.

కం. కనుమిగా పూచినజీడులు, జనములఁ జేరంగనీక • సరసన్ ఫలప
త్రనిచయభరమున వంగెను, మనుగడ నేఁ గంటి నిట్టి•ప్రమాఁకులు గలుగన్.
౧౪౭౦

సరసన్=సమీపమున, ఫలపత్రనిచయభరమునన్ = పండ్లయొక్కయు, ఆకుల యొక్కయు సమూహముల బరువుచేత. మనుగడ=జీవితము.

## తాత్పర్యము.

పూచినజీడిచెట్లు తమ సమీపమునకు జనులను దమచుట్టు కంపలను బొదలను బెంచుటచే రానీయక పండ్లయొక్కయు, యాకులయొక్కయు; బరువుచే వంగి యున్నవి చూచితివా. ఇట్టి జీవనసాధనమైన చెట్లుండుటచే నేను బ్రతుకఁగలిగితిని.

ఇది సర్వసంపత్తులు సమృద్ధిగనుండియుఁ బరులను యాచకులను దగ్గఱ రానీయని లోభులను సూచించుచున్నది. "ధర్మోరక్షతి రక్షితః" యన్నట్లు ధర్మాత్ములను వారి ధర్మమే రక్షించుచున్నది. వారికై నేను శ్రమపడవలసిన పనిలేదు. ఈ చెట్ల పండ్లు రాలఁగొట్టి నేను దిని దీనికిఁ బుణ్యము సమకూర్చినట్లు దుష్టులను శిక్షించి

రైనవారలను బాగుపఱుపవలయుననికదా నాయవతారము నుద్దేశ్యము. ఇట్టివారు లేకున్న నాకవతారకారణమేకలుగదు. మఱియును శ్రీరామునకు ముఖ్యాహారము ఫలమే యని యేర్పడుచున్నది.

తే. తేనెటీఁగల గూర్చిన • తేనెపెరలు, రెండుతూముల తేనెతో • నిండి వ్రేలి
యాడుచున్నవియవెభారు • హాగ్రములను, గొండకొండను ననుజ! క • న్గొమ్మువాని. ౧౪౭౧

తేనెటీఁగలు- తేనె+ఈఁగలు-కర్మధారయంబులం దుత్తున కచ్చుపరంబగు నపుడు టుగాగమంబు బహుళంబుగ నగు. సు. వ్యా. సంధి ౯౭ సూత్రము. ఈ సూత్రమున కిశబ్దమపవాదము. బహుళగ్రహణముచే నుత్తుగాకున్నను టుగాగమము వచ్చెను. ఇట్టివే దుక్కిటెద్దు మిద్దెటిల్లు పల్లెటూరు లోనైనవి.

తా త్ప ర్య ము.

తేనెటీఁగలు గూర్చిన తేనెపెర టొక్కొక్కటి రెండు తూముల తేనెతో నిండి గ్రహించువాఁడు లేక కొండ కొండయందుఁ జెట్టులకొనలయందు వ్రేలాడు చున్నవి. తమ్ముఁడా వానిని గనుఁగొమ్ము.

సరఘల్ గూర్చిన తేనెమానవులకున్ సంప్రాప్తమైనట్లు లోభరతుల్ గూర్చిన విత్తముల్ పరులకుం బ్రాప్తించునుగదా.

కం. అల్లవిగో! నత్యూహము, లుల్లసితమనోజ్ఞకాన • నోద్దేశములన్
బల్లవసుమతల్పంబులఁ, గొల్లగఁ గూయంగ మాఱు • కూసెన్ నెమిళుల్. ౧౪౭౨

నత్యూహములు=నీటియిఱ్ఱులు, ఉల్లసితమనోజ్ఞకాననోద్దేశములన్=మిక్కిలి ప్రకాశించు రమ్యమైన వనప్రదేశములందు, పల్లవసుమతల్పంబులన్ = చిగుళ్ళయు పూలయు పానుపులందు, కొల్లగన్=విస్తారముగ, నత్యూహో జలరంకుస్స్యాత్ - హలా.

తా త్ప ర్య ము.

లక్ష్మణా! నత్యూహములు, పూలచేఁ బ్రకాశించు రమ్యమైన యడవిప్రదేశ ములందుఁ బూలచిగుళ్ళ పానుపులందు విస్తారముగఁ గూయఁగా నెమిళ్లు మాఱు కూయుచున్నవి.

ఇది వేదాధ్యయనము చేయువారిని సూచించుచున్నది.

ఉ. వారణయూథరాజితము • వల్గుశకుంతనితాంతకూజితో
దారము చిత్రకూట మదె • తమ్ముఁడ కంటివె తన్నగంబునన్
జారుసమప్రదేశమున • సారధరారుహవారమండితం
బై రహిఁ బీూఱుపుణ్యులల • మందు వసింపుద మన్న లక్ష్మణా. ౧౪౭౩

వారణయూథ రాజితము=ఏనుఁగుల గుంపులచేఁ బ్రకాశించునది,వల్గు శకుంత నితాంత కూజితో దారము=మనోహరమైన పక్షులయొక్క యతిశయించిన ధ్వనిచే గొప్పదైనది, తన్నగంబునన్=ఆపర్వతమందు, చారుసమప్రదేశమునన్ = మనోహ

రమై గుంతలు మిట్టలు గండ్లు గుండ్లులేని సమభూమియందు, సారవద్రారుహ మండితంబై=సారవంతములైన చెట్లసమూహముచే సొగసై, రహిమీఱు=కాంతిచే నతిశయించు.

### తాత్పర్యము.

ఏనుఁగుల గుంపుచేఁ బ్రకాశించునదియు మనోహరములైన పక్షుల గొప్ప ధ్వనులుగలదియు నగు చిత్రకూటపర్వత మిదిగోఁ గానవచ్చుచున్నది. లక్ష్మణా చూడుము. ఆపర్వతమున రమ్యమైన సమప్రదేశమున నాకులు బలసిన చెట్లచే నందమైనచోట మనము వసింతము.

సీ. అని పల్కి శ్రీరాముఁ • డనుజుండు సీతయుఁ, దనతోడ రాఁ జని • ఘనముదమున
నానావిహంగమ • నాదసంకులమును, బహుఫలమూలసం • పన్నమగుచు
సరసోదకంబును • జారుతరంబును, మంజులశాద్రుమ • మండితంబు
వరతపోధనగణ • వాసస్థలంబు నౌ, చిత్రకూటనగంబుఁ • జేరి యిచట

తే. మనకు సుఖజీవనం బగు • మంజులంబు, బహులఫలమూలయుక్తంబు • ప్రమదకరము
వివిధపుష్పితవల్లికా • విటపియుతము, నగుచు నున్నది లక్ష్మణా • నగతలంబు.
౧౪౭౪

ఘనముదమునన్ = అధికసంతోషముతో, నానావిహంగమ=అనేకవిధములైన పక్షులయొక్క, నాద=ధ్వనులయొక్క. సంకులము=కలఁతచెందినది, బహుఫలమూల సంపన్నము=అనేకములైన పండ్లచే సమృద్ధమైనది, సరసోదకంబును = మంచి రుచిగల నీళ్లుగలదియు, చారుతరంబును = మిగుల సుందరమైనదియు, మంజులశాద్రుమ మండితంబు=మనోజ్ఞములైన తీఁగలచేతను చెట్లచేతను నలంకరింపఁబడినది. వరతపోధన గణవాసస్థలంబును=గొప్పతపస్వుల గుంపులయొక్క కాఁపురముండు తావును, బహులఫలమూలయుక్తంబు=విస్తారముగ పండ్లతోడను వేళ్లతోడను గూడినది, ప్రమదకరము = మిక్కిలి సంతోషముకలిగించునది, వివిధపుష్పిత వల్లికావిటపియుతము=అనేకవిధములుగఁ బూచిన తీఁగలతోను చెట్లతోను గూడినది, నగతలంబు=పర్వతప్రదేశము.

### తాత్పర్యము.

ఈప్రకారముచెప్పి శ్రీరామచంద్రుఁడు లక్ష్మణుఁడు సీతాదేవి తనతోడ రాఁగా గమ్యస్థానము చేరితిమికదా యను సంతోషమున ననేకపక్షుల ధ్వనులచే కలఁతచెందినదియు విస్తారముగ పండ్లు దుంపలుగలదియు, తియ్యని రుచిగల జలము గలదియు, సుందరమైనదియు మనోజ్ఞములైన తీఁగలు చెట్లు వీనిచె నలంకరింపఁ బడినదియు తపస్సుచేసికొను గొప్పమునులకు నివాసభూమియైనదియు నగు చిత్రకూట పర్వతము చేరి లక్ష్మణా యిచ్చట మనము సుఖముగ జీవింపవచ్చును. ఏలన స్థలము

మనస్సునకు సమ్మతమైన యింపై యున్నది. ఫలమూలములు విస్తారముగ నున్నవి. నానావిధములైన తీఁగలు చెట్లు పుష్పించి యున్నవి.

కం. పరమతపోవిభవులు మునివరు లీశైలంబునందు • వాసము గొని నా
రిరవుగ మనమును నీక్షితిధర మందె వసింప వచ్చుఁ • దలఁగని ప్రీతిన్. ౧౪౭౫

పరమతపోవిభవులు=గొప్ప తపస్సే సంపదగాఁ గలవారు, శైలంబునందున్ = పర్వతమునందు, క్షితిధరమందె=పర్వతమందే.

తా త్ప ర్య ము.

గొప్ప తపోధనులగు మునిశ్రేష్ఠు లీ పర్వతమందే వాసము చేయుచున్నారు. మన మీపర్వతమే వాసస్థానముగాఁ జేసికొని సంతోషముతో నుండవచ్చును.

—• శ్రీరాముఁడు వాల్మీకిమహర్షిని సందర్శించుట. •—

కం. అని సీతయు రాముండును వినయంబున లక్ష్మణుండు • వెనువెంటను రాఁ
జనిరి మహాత్ముని వాల్మీకిఁ గన ముని కభివాదనంబుఁ•గావించి రొగిన్. ౧౪౭౬

అభివాదనంబు = నమస్కారము.

తక్కిన ఋషీశ్వరులకడకుఁ బోయినపుడు శ్రీరాముఁడే ముందుపోయి నమస్కరించెను. వాల్మీకిని జూడఁబోయినపుడు సీత ముందుగఁబోయి మ్రొక్కెను. రాఁగల కాలమున వాల్మీకితోడఁ బనియుండుటచేఁ గాఁబోలు బాలకాండమున వాల్మీకి తమసాతీరమున నున్నట్లు చెప్పఁబడెను. ఇచ్చటఁ జిత్రకూటమున నున్నట్లు చెప్పఁబడెను. శ్రీసీతారామలక్ష్మణులు చిత్రకూటమునకు వచ్చినపుడు వాల్మీకియందే యుండెను. భరతదర్శనానంతరము మునులందఱు చిత్రకూటము విడిచిపోయినపుడు వాల్మీకియుఁ దమసాతీరముఁ జేరెను. అగస్త్యునివలె నొక్కఋషియే పెక్కుతావుల నుండుట గలదు. ఇది యాఱువిడిచిన యేఁబదినము.

తా త్ప ర్య ము.

తమ వెనుక వినయంబున లక్ష్మణుఁడు రాఁగా శ్రీసీతారాములు ముందుపోయి మహాత్ముఁడైన వాల్మీకినిఁ జూచి వరుసగ నమస్కారముఁ గావించిరి.

ఉ. ఆయనఘుండు వారలకు • హర్షమునం దగుపూజ సల్పి వి
శ్రేయుఁ డటంచు స్వాగతము • క్షేమము ప్రశ్న యొనర్ప రాముఁడున్
న్యాయముఁ దప్పకుండఁ దమ•నామములుం దమరాక హేతు వ
త్యాయతభక్తిఁ దెల్పి ముని • యాజ్ఞను గాంచి వచించెఁ దమ్మతోన్. ౧౪౭౭

తా త్ప ర్య ము.

ఆ పుణ్యాత్ముఁడైన వాల్మీకి వారలకు సంతోషముతోఁ బూజగావించి రండు కూర్చుండుఁడని చెప్పుచు వారి సుభాగమనము క్షేమము ప్రశ్నసేయఁగా శ్రీరాముఁడు శాస్త్రప్రకారము దమ పేరులును దమరు వచ్చినకారణమును మిగుల భక్తితోఁ దెల్పి మునియొద్ద సెలవుకీసికొని తమ్మునితో నిట్లనెను.

కం. గట్టివి వరదారువులం, గట్టుమ యొకయాకుటిల్లు • కడురమ్యముగా
దిట్టమ్ముగ వన నాతఁడు, కట్టెఁ గుటీరం బొకండు • తన్మారుహాతతులన్. ౧౪౭

వరదారువులన్=శ్రేష్ఠమైన కొయ్యలచే, దిట్టముగాన్ = దృఢముగా నుండు నట్లు, కుటీరము=గుడిసె, తన్మారుహాతతులన్=చెట్లసమూహములచే.

తా త్ప ర్య ము.

గట్టివిగాను, శ్రేష్ఠమైనవిగాను జూచి కొయ్యలు దెచ్చి యొక్క పర్ణశాల సుందరముగా గాలికి వానకుఁ జెడక దృఢముగనుండువట్లు నిర్మింపుమనిన లక్ష్మణుండును చెట్ల కట్టెలు దెచ్చి గుడిసె యేర్పాటుగావించెను.

—• శ్రీరామలక్ష్మణులు చిత్రకూటంబున బర్ణశాల నిర్మించుట. •—

సీ. గాలికి వానకుఁ • గంప మొందనిదాని. బాహ్యావరణముల • బద్ధ మగుచు
భద్ర మై యొప్పెడు•పర్ణశాలను గాంచి, శుశ్రూషమాను఼డై •చూచు చున్న
యేకాగ్రు లక్ష్మణు • నెలమిఁ గాంచి వచించె. శ్రీరామచంద్రుఁ డా•ర్జింప వయ్య
జింకమాంసంబును • జేయంగఁ దగుఁ బూజ, శాలకుఁ దగవాస్తు•శమన విధియుఁ

తే. బెక్కునాళ్లిల బ్రతుక న•భీష్ట మైన, వారలకుఁ గరణీయ మా•వశ్యకముగఁ
గాన హారిణంబు నొక్కటిఁ•గానఁ జంపి, తెమ్ము స్మరియించుకొమ్ము వి•ధిప్రవృత్తి. ౧౪౮

కంపమొందనిదానిన్ = ఊఁగులాడనిదాని, కదలనిదాని, బాహ్యావరణములన్=గోడలు మొదలగు వెలుపలి కప్పులచే, బద్ధము=కట్టఁబడినది, భద్రమై=శుభకరమై, పర్ణశాలఁ=ఆకులతో నిర్మింపఁబడిన యిల్లు, శుశ్రూషమానుఁడు=ఎప్పుడే పని చెప్పునా చేయుదమా యని కోరుచుండువానిని ఏకాగ్రున్ = మనస్సు శ్రీరామకైంకర్యమందే నిలిచి యితరపదార్థములపైఁ బోనీయనివాని, ఎలమిన్=సంతోషముతో, ఆర్జింపవయ్యా=సంపాదింపుమా, శాలకున్=ఇంటికి, వాస్తుశమనవిధి=గృహదేవతలకుఁ జేయు శాంతికార్యము, కరణీయము = చేయఁదగినది, హారిణంబున్ = జింకను, విధిప్రవృత్తి=శాస్త్రమునఁ జెప్పఁబడిన విధానము, దీనివలన వాస్తుశాంతి సేయక గృహప్రవేశము చేయరాదని యేర్పడుచున్నది.

తా త్ప ర్య ము

గాలికివానకుఁ జలింపనిదాని గోడలు మొదలయిన బయటి యావరణములు దృఢముగాఁ గట్టఁబడినదియై పదిలముగానుండు నాకుటీరంటిని జూచి యింక నేపని చెప్పునా యెట్లుచేయుదమా యని మనస్సంతయు నితరకార్యములకై పోనీయక తమ కైంకర్యమందే నిలిపియున్న లక్ష్మణు సంతోషించి చూచి శ్రీరామచంద్రుఁ డిట్లనెను. లక్ష్మణా జింకమాంసమును సంపాదింపుము, గృహదేవతలఁ బూజించి శాస్త్రప్రకారము శాంతిచేయవలయునుగదా. ఇది భూమిమీఁదఁ జిరకాలము బ్రతుకఁ

గోరినవారికి నవశ్యము చేయఁదగినకార్యము. కావున శాస్త్రమునఁ జెప్పఁబడిన విధానము స్మరణమునకుఁ దెచ్చికొమ్ము. జింక నొకదానిఁ జంపి తెమ్ము.

'శయ్యాదేశే కామలింగేన దేహాళ్యా మంతరితలింగేన' యని యింటికి నొక్కొక్క దిక్కున నొక్కొక్క యధిష్ఠానదేవతయుండును. వీరిని బూజింపవలయును. ఆ పూజకుఁ బూర్వము ఇంటిభూమి ప్రదేశమున నుండెడి భూతపిశాచాదులకు శాంతికరమగు కార్యమును జేయవలయును. ఇది గృహప్రవేశార్థమైన కార్యము.

ఈశాంతి చేయక యింటిలోఁ బ్రవేశించెనేని యజమానునికి నాయువుక్షీణించును. భూతపిశాచాదులు యజమానుని బాధించుచుండును. "నచవ్యాధి భయం తస్య, నచబంధు జనక్షయం,జీవేద్వర్ష శతంస్వర్గ,కల్ప మేవం వసేన్నరః"అని బ్రహ్మాండపురాణవాక్యము గలదు. గోవిందరాజీయము. వాస్తువు = గృహము, "ధిష్ణ్యంధామ నికేతనంచ సదనంవస్త్యంచ వాస్తుక్షయ" యని నిఘంటువు. "వాస్తురస్త్రీ గృహంసీమా సురంగా గృహభూః పురీ" నానా. ర. కావున గృహపర్యాయమైన వాస్తుశబ్దము గృహాధిష్ఠాన దేవతలను దెలుపును. వారు శిఖపర్జన్యుఁడు మొదలగువారు నలువదియైదుగురు. యజ్ఞార్థమైన పశువునుజంపిన దోషముకాదా యని బోధాయను లాక్షేపించిన యాక్షేపమునకు శాస్త్రప్రయోగము స్మరించుకొమ్మని సమాధానము చెప్పుచున్నాఁడు. శాస్త్రప్రకారము చేయుట మనపనికాని శాస్త్రము తప్పుచెప్పినదా ఒప్పుచెప్పినదా యని విచారించుట మనపనికాదు. మనశ్రేయస్సు కోరువాఁడని మనము నమ్మినరాజు చేయునాజ్ఞ యేదియైనను మన యభిప్రాయప్రకారమది యిష్టమైనను గష్టమైనను ఆప్రకారము మనము నడువవలసినది మనకు విధికాని దాని నాక్షేపించుట మనపనికాదు. ఆ ప్రకారము నడువకుండిన శిక్షకలుగును. శాస్త్రవిధి యట్టిది. కావున శాస్త్రవిశ్వాసముకలవారు దాని నాక్షేపింపరాదని తెలిసికొనుము. రాజన్యాయమైన శాస్త్రముచేసినాఁడనితోఁచిన నారాజ్యము విడిచి వెలుపలఁబొమ్ము. అట్లులే శాస్త్రవిశ్వాసములేనివారు ఆమతము విడిచి వేఱొక వేదబాహ్యమతమునకుఁ బోవలయునని భావము. మతమందుండి మతవిరుద్ధకార్యములు చేయరాదు. యజ్ఞార్థమై చేయు పశుహింసదోషముకాదు. ఈహింస పశువునకుఁ జేటుకలిగించెనేని యది మనకు దోషమే. యజ్ఞమునఁజంపఁబడిన పశు వధోలోకము నకై పోక యుత్తమలోకమునకుఁ బోవుచున్నది. కాఁబట్టి పుండు మాన్పుటకై చేయబడు శస్త్రచికిత్సవలె నుత్తమలోక ప్రాప్తికై చేయఁబడు హీనదేహహింస దోషకారి కాదు. ఈ విషయమున శాస్త్రమిట్లు చెప్పుచున్నది. "నవా ఉవేతన్మ్రియసే నరిష్యసిదేవాన్ ఇదేషిపథి భిస్సుగేభిః। యత్రయంతి సుకృతోనాపి దుష్కృతస్తత్రత్వా దేవస్సవితాదధాతు" అని వేదము. కావున యజ్ఞమునందలి వధవధకాదు అని స్మృతి. తీర్థీయము.

యజ్ఞార్థా త్కర్మణోఽన్యత్ర, లోకోఽయం కర్మబంధనః। తదర్థం కర్మకౌంతేయ ముక్తసంగ సమాచర॥ భ. గీ. ౩-౯ అర్జునా భగవదారాధనరూపమైన యజ్ఞాది శాస్త్రీయకర్మములకొఱకుఁ జేయఁబడు కర్మము శ్రేష్ఠము. అట్లుగాక స్వప్రయోజనము కొఱకైన కర్మము బంధహేతువు. కావున నీవు స్వప్రయోజనముకొఱకనియెడి సంగమును విడిచి యజ్ఞార్థమగు కర్మము చేయుము.

యజ్ఞశిష్టాశినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః

యజ్ఞశేషము భుజించునట్టి సత్పురుషుల సమస్తపాపములనుండి విడివడుచున్నారు. యజ్ఞార్థమనఁగా యజ్ఞోవై విష్ణుర్నియుండుటచే విష్ణు నుద్దేశించి చేయు నారాధనమనియు యజ్ఞశిష్టాశనమనఁగా విష్ణువునకు నివేదించిన ప్రసాద శేషమనియు నెఱుఁగ నగు. భగవద్గీత బోధించునది యంతయు నిదేకదా. స్వధర్మ నిర్వహణమందు శాస్త్రవిశ్వాసముంచి దానియందుఁ జెప్పఁబడిన ప్రకారము చేయు సంగరహితున కేపాపభయములేదు. సమాధానముమాత్ర మిదిచెప్పుచు మాంసాభిలాషులై దేవపూజ నిమిత్తమాత్రముగ నుంచుకొని నాకుఁదల, నీకుఁబిక్క, యని కలహించు వారికి హింసాదోష మంటకపోదు. అహింసా పరమోధర్మయను వేదమే యజ్ఞములందుఁ బశువధ విధించుచున్నది. ఇందేవాక్యము ప్రమాణము? అను సందేహము వచ్చినపుడు భగవత్కైంకర్యభావముతో, శాస్త్రప్రకారము సమంత్రకముగఁ బరమార్థబుద్ధితోఁ జేయవలయుననియుఁ దదితరకారణముల నా కార్యము చేయరాదనియు, సందిగ్ధవిషయముల శిష్టాచారము గ్రాహ్యమనియు నిర్ణయసింధ్వాది ధర్మశాస్త్రకారులు వచించిరి.

చం. అనవుడు నాతఁ డట్టులె ర•యంబునఁ జల్పఁగ వెండి పల్కెఁ గ
  స్నన హరిణామిషంబుఁ బచ•నం బొనరింపు ధ్రువంబు మూ ర్తముస్
  దినము నటన్న లక్ష్మణుఁడు • చెప్పిన కృష్ణమృగంబుమాంస మ
  గ్నిని బచనంబు సేసి కల•నెత్తురు పోయెడిదాఁక, నిట్లనున్.      ౧౮౦

హరిణామిషంబున్=జింకమాంసమును, పచనంబు=పక్వము, ధ్రువము=స్థిర లగ్నము.

తాత్పర్యము.

అని శ్రీరామచంద్రుఁడు చెప్పఁగా నట్టులే చేసెదనని శీఘ్రముగ నట్లు చేయఁగా మఱియును శ్రీరాముఁ డిట్లనియె. ఈజింకమాంసమును బక్వమగువఱకు వండుము. ఈ దినము ముహూర్తము స్థిరమైనది అని చెప్పఁగా లక్ష్మణుఁడు శీఘ్రముగ నల్లజింకమాంసమును నెత్తురుపోవువఱకు వండి యిట్లనియె.

కం. పరిపూర్ణాంగంబులతోఁ, బరిపక్వం బగుట రామ•భద్రా! కంటే
  హరిణము తొల్లిటిభంగిన, కరమొప్పెను దీర్పు దేవ•కార్యముఁ గుశలా. ౧౮౧

పరిపూర్ణాంగంబులతోన్=నిండిన యవయవములతో, పరిపక్వంబగుటన్=పచ

నము చేయఁబడిన దగుటచే, హరిణము=జింక, తొల్లిటిభంగిన = పూర్వవిధముననే, జీవించియున్నప్పటివలె, కుశలా = సమర్థుఁడా = చేయవలసిన విధాన మంతయుఁ దెలిసినవాఁడా.

### తా త్ప ర్య ము.

రామచంద్రా! యవయవములం దేదియు విచ్ఛిత్తి లేక వండఁబడుటచేఁ జాచితివా పూర్వము జీవించియున్నప్పు డెట్లుండెనో యట్లేయిప్పుడునున్నది. చేయవలసిన కర్మవిధానమందు నీవు నేర్పరివి కావున దేవకార్యము దీర్పుము.

సీ. అనవుడు శ్రీరాముఁ • డంబువులను దోఁగి, నియతి జపించి యా•నిఖిలవిధులఁ
దీర్చి దేవగణాళిఁ • దృప్తిగాఁ బూజింప, నందఱు నిలు సొచ్చి • రంత ముదితుఁ
డయి వైశ్వదేవబ•లియు రౌద్రవైష్ణవం,బులువాస్తుదోషముల్•పోవఁ బ్రోయు
పుణ్యాహవాచనం•బును శాంతిజపము లో,నగుమంగళ క్రియ • లాచరించి

తే. యాపగాజలంబుల స్నాన • మాడి పిదపఁ గ్రూరభూతప్రశాంతిపొ•ల్పారబలుల
నిచ్చె శ్రీరామచంద్రుఁడు • హితము చెలఁగ, శాస్త్రనిగదితరీతిఁ బ్ర•శస్తగతిని. ౧౪౮

అంబువులన్=నీటియందు, తోఁగి=స్నానముచేసి, ముదితుఁడయి=సంతోషించినవాఁడై, నియతిన్=ఏర్పాటుతో, జపియించి=వాస్తుశాంతిమంత్రములను జపము చేసి, నిఖిలవిధులన్ = సమస్తకార్యములను, దేవగణాళిన్ = గృహాధిష్ఠాన దేవతల సమూహముయొక్క వరుసను, వైశ్వదేవబలియున్ = వైశ్వదేవమను క్రియయందు చేసెడి బలియు, అందురౌద్రవైష్ణవంబులు = రుద్రునిబలియు, విష్ణుబలియు, వాస్తుదోషముల్=గృహమునందలి దోషములను, మంగళక్రియలు = శుభకార్యములు, ఆపగాజలంబులన్ = ఏటినీటియందు, స్నానమాడి = "తతస్సర్వావధీస్నానం యజమానస్యకారయే" త్తనెడి స్మృతివాక్యము ప్రకారము మరల స్నానముచేసెను. క్రూరభూతప్రశాంతి=పాపిష్ఠములగు పగలు సంచారముచేయునవియు రాత్రులందు సంచరించునవియునగు భూతము లడఁగునట్లు, శాస్త్రనిగదితరీతిన్ = శాస్త్రమునఁ జెప్పఁబడినప్రకారము. ప్రశస్తగతిన్=ప్రశంసింపఁదగిన విధముగ.

### తా త్ప ర్య ము.

లక్ష్మణుఁ డిట్లు చెప్పఁగా శ్రీరాముఁడు వారుణస్నానముగావించి వాస్తుదేవతల మంత్రముల జపించి చేయవలసినకార్యములు దీర్చి గృహదేవతలఁ దృప్తిగాఁ బూజింపఁగా నందఱు శ్రీసీతారామలక్ష్మణులు లోపలఁ బ్రవేశించిరి. అంత శ్రీరామచంద్రుఁడు సంతోషించి వైశ్వదేవముగావించి బలివేసి రౌద్రబలియు వైష్ణవబలియు నేసి వాస్తుదోషములు పోవునట్లు పుణ్యాహవాచనము శాంతిజపము మొదలయిన శుభకార్యము లాచరించి మరల నేటిలో మునిఁగి పిదపఁ గ్రూరభూతములకు శాంతిగలుగ బలులునైచి యీప్రకారము తమమేలునకై శాస్త్రమునఁ జెప్పఁబడిన

ప్రకారము రాజకుమారుఁడైన నెంతచక్కఁగ శాస్త్రవిధానము తప్పకుండఁ గావించె నని ఋషులు మెచ్చుకొనునట్లు సర్వము దీర్చెను.

(౧) యజనము = యజ్ఞముచేయుట (౨) యాజనము=యజ్ఞముచేయించుట (౩) అధ్యయనము=వేదముచదువుట(౪)అధ్యాపనము=చదివించుట (౫) దానము= ఒకరికిచ్చుట (౬) ప్రతిగ్రహము=ఒకరిచేఁ బుచ్చుకొనుట ఇవి యాఱును బ్రాహ్మణ కర్మములు. ఇందు ౧-౩-౫ - నకు మాత్రమే క్షత్రియుఁడధికారి. ఇట్లుండ బ్రాహ్మణుఁడు చేయవలసిన యాజనకార్యము క్షత్రియుఁడైన శ్రీరామచంద్రుఁ డెట్లుచేసెను? అని సందేహము.

యాజనము - అధ్యాపనము - ప్రతిగ్రహము ఈ మూఁడు బ్రాహ్మణునకు జీవనాధారముగ నేర్పఱుపఁబడిన వృత్తులు గాని యివిచేయకుండినఁ బ్రత్యవాయము లేదు. వర్ణాశ్రమ ధర్మవిధుల ననుసరించి యొకరి వృత్తిచే మఱియొకఁడు జీవింప రాదు కావున నితరజీవనోపాయముగల క్షత్రియునకు యజనాధ్యయనదానము లందే యధికారముగలదు. తక్కినవానియందు లేదు. అయినను వీనిని క్షత్రియుఁడు వృత్తిగా నుంచుకొని గాని లోభితనముచేఁగాని చేయరాదని శాస్త్రభావమే కాని యక్కఱ లవసరములందుఁ దాను జేయరాదనిగాదు. ఇల్లుకట్టుట వడ్రంగికార్యము దానిని శ్రీరామ లక్ష్మణు లెట్లుచేసిరి?

విశ్వామిత్రుఁడు క్షత్రియుఁడై యెట్లు త్రిశంకునిచే యజ్ఞము చేయించెను? ఇందును విశ్వామిత్రుఁడు వృత్తిగాఁ జేసినవాఁడుకాఁడు. బ్రాహ్మణు లెవ్వరు పూను కొనమిని గృతజ్ఞత బాధింపఁగా నాకార్యము చేసెను. అట్లున్నను నది సరిగాదని వాసిష్ఠు లాక్షేపించిరి.

తే. ఆశ్రమంబున కనురూప • మైనవేది, చైత్యములునాయతనములుఁ•జక్కఁ దీర్చి
వన్యమాల్యఫలాదులఁ • బక్వమాంసములను దీర్థంబులను వేద•కలితములను, ౧౪౮౩

తే. జపములను దర్భవిలతుల • సమిధలను యథావిధిగ జానకీయుక్తిఁ •బావనం బొనర్చి శాలాప్రవేశంబు • నడపి దేవ,సభనువారివోలె శ్రీరామ•చంద్రుఁ డొప్పె. ౧౪౮౪

అనురూపము=తగిన, వేదిచైత్యములు = అగ్నిహోత్రకార్యములకుఁ గావల సిన యరుఁగురూపములయిన బలిపీఠములు,ఆయతనములు=విష్ణుపూజాగృహములు, వన్యమాల్యఫలాదులన్= అడవియందుఁబుట్టిన పూలదండలు ఫలములు మొదలయిన వానిని; పక్వమాంసములన్=వండినమాంసము లను, తీర్థంబులన్ = వేదమంత్రములచే మంత్రించిన జలములను, యథావిధిగన్=శాస్త్రము నతిక్రమింపకుండు విధమున, జానకీయుక్తిన్=సీతతోడ. ఇంచుఁ గొన్ని దంపతులుచేయు కారములు

పావనము=పవిత్రము, శాలాప్రవేశంబు=ఇంటిలోఁ జొచ్చుటను, దేవసభన్=సుధర్మ యను పేరుగల దేవసభయందు, హరివోలెన్ = ఇంద్రునివలె.

౧౮౪౩-౧౮౪౪ పద తాత్పర్యము.

ఆశ్రమమునకుఁ దగినట్టి యరుఁగులవంటి బలిపీఠములు విష్ణుమందిరములు చక్కఁగా నేర్పఱిచి యడవిపూలదండలు పండ్లు మొదలైన వానిచేతను బక్ష్యమాంసములను వేదమంత్రములచే మంత్రించిన తీర్థములను మంత్రజపములను దర్భల సమూహములను సమిధలను శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము సీతతోఁడఁగూడి పవిత్రములఁజేసి యింటియందుఁ బ్రవేశించి దేవతల సభయగు సుధర్మయందు నింద్రునివలె శ్రీరామచంద్రుఁడొప్పెను.

శా. నానాపక్షిమృగాకులంబు సుమనో • నవ్యద్రుమభ్రాజితం
బై నాగేంద్రమృగానునాదితము నై • హారిప్రతీరాఢ్య మా
శావన్ మాల్యవతీతటంబునను జో•షన్ జానకీ రాఘవుల్
సానందంబుగఁ గ్రీడ సల్పిరి ప్రవా•సాయాసపంవిస్మృతిన్. ౧౮౪౫

నానాపక్షిమృగాకులంబు=అనేకవిధములైన పక్షులచే మృగములచేఁ గలఁత నొందినది, సుమనోనవ్యద్రుమభ్రాజితంబు=పూలచే నందమైన చెట్లచేఁ బ్రకాశించునది, నాగేంద్రమృగానునాదితము=పెద్దయేనుఁగులు లోనగు మృగముల ధ్వనులు గలది. హారిప్రతీరాఢ్యము = మనోజ్ఞమైన మంచితీరములచే సంపన్నముగాఁ జేయఁబడినది, మాల్యవతీతటంబునన్=మాల్యవతియనెడి నదిరొడ్డున, జోషన్ = ఉల్లాసముగా, సానందంబుగన్=సంతోషముతోఁ గూడినట్లుగ, క్రీడసల్పిరి = విలాసముగాఁ గేళిసలిపిరి, అనఁగా నీవనవాసము వారికి నుద్యానవన కేళివలె నుండెనుగాని వనవాసముగా నుండలేదని భావము. ప్రవాసాయాస సంవిస్మృతిన్=పరదేశమునకు వచ్చిన బడలికను బూర్ణముగ మఱచుటచే అయోధ్యయందున్న సుఖముకంటె నిచ్చట నెక్కువ సుఖముగ నుండెనని భావము.

తాత్పర్యము.

అనేకవిధములైన మృగములచేతను బక్షులచేతను గలఁతనొందినదియుఁ బూలచే నందమైన చెట్లచేఁ బ్రకాశించునదియు, నేనుఁగులు మొదలగు మృగముల ధ్వనులుకలదియు మంచితీరములు గలదియు నగు మాల్యవతి యను నదిరొడ్డున నుల్లాసముగ శ్రీసీతారాములు తమ పరదేశవాసమునఁ గలుగు కష్టములను బూర్ణముగ మఱచి క్రీడసలుపుచుండిరి.

ఇంతతో శ్రీరాముని వృత్తాంతము చాలించి యయోధ్యయందు జరిగిన విషయము కవిచెప్పుచున్నాఁడు.

—♦ ౫౭-వ సర్గము. సుమంత్రుఁడు మరల నయోధ్యకుఁ బోవుట. ♦—

సీ. దుఃఖార్తులై సుమం♦త్రుండుగుహుఁడు రాముఁ, గనుచూపుమేర దాఁ♦కను దదీయ
కథ ముచ్చటించుచుఁ♦గనుఁగొనుచుండి యాఁవల నింటికేగి రా♦యలఘుమతులు
చని ప్రయాగమునందు♦మునిభరద్వాజ ని,లోఁ డ నుండుటయు సం♦తోస మార
నాగిరిగమనంబు ♦ నానిషాదాధిపు, చారులవలనను ♦ జక్కఁ నెఱిఁగి

ఆ. గుహునిచే ననుజ్ఞఁ♦ గొని సుమంత్రుం డయో,ధ్యాపురంబునకె ర♦థంబుఁ దోలు
కొనుచు నరిగె వనటఁ♦ గోమలగంధవ, నాపగానగరము ♦ లరసికొనుచు. ౧౮౪౬

దుఃఖార్తులై=దుఃఖముచేఁ బీడింపఁబడినవారై, తదీయకథ = శ్రీరాముని చరితంబు, ముచ్చటించుచున్ = చెప్పుచు, అలఘుమతులు =గొప్ప మనస్సులుగలవారు, శ్రీరామలక్ష్మణులు -ఆగిరిగమనంబు=చిత్రకూట పర్వతమువఱకుఁబోవుటయు, నిషాదాధిపు చారులవలనన్ = గుహుని వేగువాండ్రవలన, కోమలగంధవనాపగా నగరములు = మంచివాసనగల వనములు నదులు పట్టనములు, అరసికొనుచున్ = విచారించుచు.

## తాత్పర్యము.

దుఃఖపీడితులై సుమంత్రుఁడు గుహుఁడు తమ కన్నులకుఁ గనవచ్చుదాఁక శ్రీరామునిఁజూచుచు నా ముచ్చటలే చెప్పుకొనుచుండి యాయన కానరాక పోఁగా వారింటికేగిరి. ఆ శ్రీరామలక్ష్మణులు గంగ దాఁటిన దిన మొక చెట్టువఱకుఁబోవుటయు, రెండవ దినము భరద్వాజాశ్రమమున నుండుటయు, మూఁడవదినము యమునాతీర మునఁబరుండుటయు, నాల్గవ దినము చిత్రకూటమునకుఁ బోవుటయు, నీ సమాచార మైదవదినము చారులు గుహునితోఁ జెప్పుటయు, సుమంత్రుఁడు విని శ్రీరాముల వృత్తాంతమంతయు నెఱిఁగినవాఁడై గుహునిచే ననుమతిగొని చక్కఁగ నయోధ్యాపురమునకే రథము తోలుకొని దుఃఖించుచుఁ ద్రోవలో సువాసనగల వనములు నదులు పట్టణములు చూచుచుఁబోయెను. ఈ దిన గణనమందు భిన్నాభిప్రాయములు గలవు. అవి ౧౮౪౭-వ పద్యవ్యాఖ్యానమందుఁ జర్చింపఁబడును.

మ. చనుచున్ మూఁడవనాఁటి సంజ గతహా♦ర్షం బౌట నిశ్శబ్దమై
కన శూన్యంబుగఁ దోఁచు చున్న పురముం♦ గన్నిటితోఁ జొచ్చి దు
ర్మనుఁడై వాజులు వారణంబులు ప్రజల్ ♦ రాజుల్ గనన్ రాక భూ
తనయావల్లభశోకహవ్యవహదగ్ధం బైనచందంబునన్. ౧౮౪౭

మూఁడవనాఁటి సంజ = (౧) మూఁడవనాఁటి సాయంకాలము, (౨) మూఁడవ+నాఁటిసంజ = దినమునందలి మూఁడవ సంధ్యాకాలము, అనఁగా సాయంకాలము. ఏదినమునుండి మూఁడు దినములను విషయము ౧౮౪౭-వ పద్యవ్యాఖ్యయందుఁ జర్చింపఁబడును. గతహర్షంబు = పోయిన సంతోషముగలది, సంతోషము

లేనిది. నిశ్శబ్దమై=శబ్దములేనిదై, శూన్యంబుగన్ = పాడుపెట్టినట్లుగ, దుర్మనుఁడై = దుఃఖముతోఁగూడిన మనస్సుగలవాఁడై, వాజులు=గుఱ్ఱములు, వారణంబులు=ఏనుఁగులు భూతనయావల్లభ=సీతాపతియైన శ్రీరామునియొక్క, శోక = శోకమనెడి, హవ్యవహ=అగ్నిచే, దగ్ధంబైన=కాలిన, చందంబునన్=విధముగా.

తా త్ప ర్య ము.

సుమంత్రుఁడు పోవుచు మూఁడవనాఁటి సంధ్యాకాలమున సంతోషహీనమౌటచే శబ్దములేనిదై సూచుటకుఁ బాడుపడినట్లు దోఁచుచున్న పట్టనమును గన్నీళ్లు గార్చుచుఁ బ్రవేశించి శోకముతోఁగూడిన మనస్సుగలవాఁడై గుఱ్ఱములుగాని యేనుఁగులుగాని ప్రజలుగాని రాజులుగాని కానరాక శ్రీరామశోకాగ్నిచేఁ గాలినట్లున్న విధముగ.

ఉ. తోఁచుచు నున్నదంచుఁ బురి • ద్వారముఁ జేరుచు వేగఁ జొచ్చి లోఁ
 గ్రాఁచుచు నున్న దుఃఖమునఁ • గ్రన్నన పోవ సుమంత్రుఁ డార్తిమైఁ
 బూఁచి పురీజనంబు రఘు • పుంగవుఁ డేఁడి య టంచు నాతనిన్
 వాఁచినయట్లు దుఃఖమున • వాఁచినమోములఁ దడ్డగించినన్. ౧౭౮౫

తోఁచుచున్నది=కానవచ్చుచున్నది. దోరము=ద్వారము, ద్వారశబ్ద భవము దోరము, గ్రాఁచుచున్=కాల్చుచు, క్రన్ననన్=శీఘ్రముగా, ఆర్తిమై=శోకముచే, వాఁచినయట్లు=కాళ్లు ముఖము వాఁచిన వారి విధముగ, వాఁచిన=ఉబ్బిన.

తా త్ప ర్య ము.

కానవచ్చుచున్నదని పురద్వారము చేరుచు వేగ లోపలికిఁబోయి లోపలఁ గాల్చుచున్న శోకముచే సుమంత్రుఁడు త్వరగాఁ బోవఁగాఁ బురజనులు శోకముచే వాఁచిన మోములతో వాఁచినవారివలె రథమున కడ్డమువచ్చి శ్రీరాముఁ డేఁడీయని యడుగఁగా.

కం. గంగాతీరమునన్ రఘు, పుంగవుచే నాజ్ఞఁ గొంటిఁ • బోయిరి వారున్
 గంగాతరణ మొనర్చి య, నంగా హా రామ యని జ • నంబులు వనటన్. ౧౭౮౬

గంగాతరణము = గంగనుదాఁటి, సీతారామలక్ష్మణులు చిత్రకూటమందున్నారని చెప్పినఁ బౌరులందఱు బయలుదేఱుదురని తలఁచి వారెక్కడ నుండునది తెలుపఁ దెలియనట్లు గంగదాఁటి పోయిరనిమాత్రము చెప్పెదను.

తా త్ప ర్య ము.

గంగాతీరమునందు శ్రీరాముచే నాజ్ఞఁగొంటిని. వారును గంగదాఁటిపోయిరని చెప్పఁగా జనులు హా రామా యని.

—• సుమంత్రునిరథముం జూచి పౌరులు దుఃఖించుట. •—

ఉ. హా యనువారు భూపతన • యా యనువార లిఁ కేటిజీవ ని
 స్సీ యనువారు గుంపు లయి • చేసెడి దే మిఁక బచ్చినారమే

హో యనువారు దానసవ•పుణ్యసమాజవివాహవేళలం
దాయనఘాత్ము నింకఁ గన • నౌ నెటు లం చనువారు నైరటన్.　　౧౪౯౦

భూపతినయా=రాజకుమారా, దానసవపుణ్యసమాజ వివాహవేళలందున్ = దానము, యజ్ఞము, పుణ్యసమాజములు గూడు సమయము పెండ్లి జరుగు కాలము లందు, అనఘాత్మున్=పాపరహితమైన మనస్సుగలవానిని, దీనివలన నెక్కుడనే శుభ కార్యము జరిగినను వారికి సహాయుఁడై శ్రీరామచంద్రమూర్తి కానుండి యాకా ర్యము జరిగించుచుండెనని భావము.

తాత్పర్యము.

హోయనువారును రాజకుమారా యనువారాను నిఁకేటి బ్రదుకనువారును గుంపులుగూడి యిఁక మనమేమి చేయఁగలము, బ్రదికియుఁ జచ్చినవారితో సమా నమే యనువారును, దానములు యజ్ఞములు పుణ్యసభలు పెండ్లిండ్లు చేయుకాలము వీనియిందిఁక నాయకమణివలె నాయనను జూడలేముగదా యనువారునైరి. ఎవరో దానముచేయుచోట నీయనకేమి పనియనిన దేశము కాలము పాత్రము తెలిసి చేయుచున్నారా లేదాయని కనిపెట్టి చెప్పుటకు. యజ్ఞముల కేలపోవును? న్యాయార్జిత ధనముచేఁ జేయుచున్నారాలేదా, దక్షిణలు సరిగా నిచ్చుచున్నారా లేదా యని కనిపెట్టుటకు, ఆయా కర్మములందు సందేహములు వచ్చినయెడల వానిని బరిష్క రించి మఱచినవానిని జ్ఞాపకమునకు వచ్చునట్లుచేసి యే లోపములేక సాంతము చేయిరాముటకు. పెండ్లిండ్ల కేలపోవును? తాంబూలము నిమిత్తముగాదు వియ్యములో నేదైనఁ గలహములు ప్రాప్తించెనేని యిరువురకుఁ జెప్పవలసిన మాటలు చెప్పి సమాధానపఱుచుటకు, లేనివారికి ధనమిచ్చుటకు, ఇట్లుచేయుటకుఁ గారణము తా నవఘాత్ముఁడగుటచే నితరులకును గృత్యాకరణము అకృత్యకరణమునను పాపముల నుండి విడివడఁజేయుటకే.

సీ. ఆరామచంద్రుఁ డెవో • మాదటఁ గన కున్న,మన కేది సుఖకర • మనఘులార
యాలోకహితుమోము•నాలోకనము లేక,యుగ్రప్రియుం బిఁక నెద్ది•యార్యులార
యానళినాక్షుఁ డా•యంగ లేకయు యున్నఁ, జోరి సుఖావహ మెద్ది•పుణ్యులార
మన తండ్రివలెఁ బ్రోచు•నవఘుఁడు పెడఁబాయ, దిక్కెది మనకింక • దీనులార
తే. యెంతనిర్భాగ్యులమొకదా•చింత సేయ,నట్టిధర్మాత్ముఁ డటువంటి•యనఘమూర్తి
యట్టిహృదయాళుఁడట్టిడ•యాపరుండు,విడిచిపోయిన మనియిట్లు•మిడుకుచుండ
　　౧౪౯౧

అదటన్=ప్రీతితో, లోకహితున్=(౧)లోకమునకు మేలుగోరు వానియొక్క, (౨)సూర్యునియొక్క, ఆలోకహితున్= (౧)చూపునకుఁ జంద్రునివలె హితమైనవాని యొక్క, ఆలోకనము = దర్శనము, సుఖావహము = సుఖము కలిగించునది. పెడఁ బాయన్=ఎడఁబాయఁగా. మని=బ్రదికి, మిడుకుచుండన్=దుఃఖపడుచుండుటకు.

తా త్ప ర్య ము.

ఆ శ్రీరాము మోమును ప్రీతితో మనము చూడఁ జాలమేని మన మెంత పాపరహితుల మైనను మనకేమి సుఖముగలదు. (పాపరహితుఁ డైనను భగవత్సా క్షాత్కారము లేక ముక్తి సుఖము లేదు.) మన మెంత యార్యుల మైనను ఆ చంద్రుని వలెఁ గన్నులకుఁ బ్రీతి గలిగించువానిని సూర్యునివలె లోకహిత మొంచువానిని జూడ కున్న మన కేమి ప్రియము గలదు? సూర్యుని జంద్రునిఁ జూచుటకుఁ గన్నులు లేనివాఁడు ప్రియవస్తువు దేనిని జూడఁగలఁడు? మన మెంత పుణ్యుల మైనను ఆ కమలాక్షు సమీపింపమేని మనకు సుఖము గలిగించునది యేది కలదు? సాయుజ్యము కలిగినఁగాని శాశ్వతసుఖము లేదు. దీనుల మై యుండు మనకుఁ దండ్రివలె రక్షించు శ్రీరామ చంద్రమూర్తి విడిచిపోఁగా నిఁక దిక్కెవ్వరు? దీనదశయందుఁ గన్నతండ్రియే రక్షకుఁడు. అట్టివాఁడు విడిచిన నితరు లెవ్వరు కావఁగలరు? ఇంతయేల యాలోచించి చూడఁగా నటువంటి ధర్మాత్ముఁడు అటువంటి పుణ్యమూర్తి అట్టి మంచి హృదయము గలవాఁడు అట్టి దయావంతుఁడు విడిచిపోవఁగా నిట్లు దుఃఖించుచు నుండుటకు మన మెంత భాగ్యహీనుల మోకదా. ఒకసారి జపపూజాదులచే భగవత్సర్వసాన్నిధ్యము గలిగియు మరల దానిని విడుచువాఁడు నిర్భాగ్యుఁడే.

కం. ఏది సుఖంబు నొసంగునొ, యేది యొకో ప్రియము జనుల • కెల్లను క్షేమం
బేదియొ కూర్చు పని సీ,తాదయితుఁడు మనలఁ బ్రోచెఁ • దండ్రియపోలెన్. ౧౮-౨

తా త్ప ర్య ము.

శ్రీరాముఁడు మనకేది సుఖము కలిగించునో యేది ప్రజలకుఁ బ్రియమో యేది జనులకందఱకు క్షేమకరమో యని యాలోచించి యవియే చేయుచు మనలఁ దండ్రివలె రక్షించుచుండెనుగదా.

హేయగుణరహితుఁడు కల్యాణగుణ సహితుఁడునగు భగవంతుఁడు సర్వదా చేయుచుండు పని యిదియేకదా. ఎవని నెవని నెట్లెట్లు రక్షింతునాయని వానికి వానికి హితమైనకార్యమే చేయుచుండును.

కం పరసిజలోచన లంగడి, తెరువులఁ గిటికీలనుండి • తేరిం గనుచున్
బరిదేవన మొనరించిరి, ధరణీసుతానాథశోక • తాపార్దితలై. ౧౮-౩

అంగడితెరువులన్=బజారువీధులందు, పరిదేవన మొనరించిరి=ఏడ్చిరి, ధరణీసుతానాథ శోకతాపార్దితలై = రామశోకమువలనఁ గలిగిన తాపముచే బాధింపఁబడినవారై.

తా త్ప ర్య ము.

శ్రీరాముఁడు వెడలిపోయిననాఁడు శోకముచేఁ జాఁపచుట్టలవలె నేలఁబడి పోయినవారును సుమంత్రుఁడు తేరిని దెచ్చినవాఁడని విని శ్రీరామచంద్రమూర్తి

మరలి వచ్చునేమోయని లేచి వీథులలోకి రాలేక కిటికీలనుండియే తేరిని జూచి మరల రామవియోగ శోకతాపముచే బాధపడిరి.

కం. సారథి పిహితాస్యుం డై, తేరిం దోలుకొని చనియెఁ • దెప్పున భూపా
గారమునకు నట డిగ్గి మ,హారయమున సర్వజనస•మాకుల మగుచున్. ౧౪౮

పిహితాస్యుఁడై = వస్త్రముచేఁ గప్పఁబడిన ముఖముగలవాఁడై, తెప్పునన్=శీఘ్రముగా, భూపాగారమునన్ = రాజునింటికి, మహారయమునన్ = మిగుల వేగముతో.

తా త్ప ర్య ము.

జనులదుఃఖము తాను జూడలేక, శ్రీరామునడవులపాలు చేసి యేమనివచ్చితి వని లోకులందు రేమోయను సిగ్గుచేత, వారు నేయుప్రశ్నలకుఁ బ్రత్యుత్తరము చెప్పఁజాలక, వస్త్రముచే ముఖముకప్పుకొని జను లెఱుగకుండునటులు మిగుల వేగముగాఁ దేరిని దోలుకొని సుమంత్రుఁడు రాజునింటికిఁబోయి యచట దిగి మెల్లగాఁబోయిన జనులు ముసుకుకొందురను భయముతో మిగుల వేగముగ సుమంత్రునిరాక విని రామవార్త వినుటకై రాజుగతి తెలిసికొనుటకై గుంపులు గుంపులు చేరియున్న యన్ని తెఱఁగుల మనుష్యులచే వ్యాకులమై.

సీ. దిట్టంబు లగునేడు•తొట్టికట్టులు దాఁటి, యరుగ సౌధవిమాన•హర్మ్యరాజ
మందిరాగ్రంబుల • మందయానలు నిల్చి, రామశూన్యంబైన•రథముఁ జూచి
విపులహాహాకార•వికృతస్వరంబుల, నొంతొరుఁ గనుఁగొని • యుల్ల మెరియ
నాయతవిమలనే•త్రాంతంబు లం దుండి, కాల్వలు వాఱంగఁ • గంటినీరు

తే. పొక్కుచును నేడ్వఁ బ్రాసాద•ములను వంత, టంతటను నిల్చి దశరథు•నింటులెల్ల
మహిపసాన్నిధ్యమునఁ జేసి • మందమంద,ముఁగను నీరీతి నేడ్చిరి • మొగములుబ్బ ౧౪౯

దిట్టంబులు = దృఢములు, సౌధవిమాన హర్మ్యరాజమందిరాగ్రంబులన్ = సాధారణములైన మేడలయు నేడంతస్తులయు. "విమానోస్త్రీ దేవయానే సప్తభూమి గృహేపిచ" వైజయంతి. ధనికుల యిండ్లయుఁ బ్రాసాదములయుఁ బైభాగములందు, మందయానలు=స్త్రీలు,ఇదివఱకుఁ గటికుచకచ భారముచేతనే మెల్లగ నడచువారిప్పుడు ప్రబల శోకభారముకూడఁ జేరినకారణమున మిక్కిలి మెల్లగా నడచిరనిభావము. విపుల=విస్తారమైన, హా హా కార=హా హా యను, వికృతస్వరంబులన్=వికారధ్వనులచే, ఉల్లము=హృదయము, ఎరియన్ = మండిపోవ, ఆయత=దీర్ఘములైనట్టియు, విమల=కన్నీటిచేఁ గాటుక కరిఁగిపోఁగాఁ దెల్లనైనట్టియు, నేత్రాంతంబులందుండి = కనుఁగొనలనుండి, ప్రాసాదములు=రాజులమేడలు, మహిపసాన్నిధ్యమునన్ = రాజు సమీపముననున్న కారణముచే, మందమందముగన్=మెల్లమెల్లగా.

### తా త్ప ర్య ము.

దృఢములైన తోట్లికట్టు లేకుండుదాటి కొంటిమేడలు, ఏడంతస్తుల మేడలు, ధనికులయిండ్లు, రాజులయిండ్లు వీనిపై భాగములందు స్త్రీలు నిలిచి శ్రీరామచంద్రమూర్తి లేని రథమునుజూచి పెద్దగా హా హా యని విశారధ్వనులతో నొకరి నొకరు చూచుచు హృదయము మండుచుండ దీర్ఘములై కన్నీటివఱదచేఁ గాటుక కరఁగి పోవుటచేఁ దెల్లనైన కన్నుల కొలుకులయందుండి కన్నీరు కాల్వలు పాఱనేడ్చుచుండఁగా నంతఃపురస్త్రీలుండు ప్రాసాదములందు సమీపమునకు రాక దూరమందందందు నిలిచి దశరథుని భార్యలందఱు రాజు సమీపముననున్న కారణమున మెల్ల మెల్లగ నిట్లేడ్చిరి.

ఉ. రామునితోడ నేగి యిటు • రామునిఁ గానలపాలు సేసి తా
నే మని కోసలాత్మజకు • నీతఁడు చెప్పెడి వాఁడొ, యెట్లు లిం
కేము మనంగ సాధ్య మొకో • యీగతి నామెయు రాముఁ బాసి మే
నోమెడి నట్లె దుష్కర మ•హో యెటు లోర్చు దురంతతాపమున్. ౧౪౭

మనంగన్=బ్రదుకుటకు, మేనోమెడినట్లె = దేహమును రక్షించుకొనుచున్నది కదా, దుష్కరము=మిగులఁగష్టకార్యము, దురంతతాపము = అంతములేనితాపము.

### తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తితోడఁ బోయి యాతనిని నడవులపాలుచేసి వచ్చి తానేమని కౌసల్యకు సమాధానము వీఁడు చెప్పఁగలఁడు. ఆమె కేమైనఁ జెప్పనిండు-చెప్పక పోవనిండు మనమేమని బ్రదుకను? ఎట్లు బ్రదుకను? ఇది సాధ్యమా. అయ్యో శ్రీరాముని బాసియుఁ గౌసల్య యింకను దేహము రక్షించుచున్నదికదా. ఎంత యసాధ్యమైనకార్య మామె చేయుచున్నది. దేహము రక్షించిన నేమి లాభము. ఈ సహింపరాని దుఃఖతాపమెట్లు భరింపఁగలదు.

•— సుమంత్రుఁడు దశరథుఁ జూచుట. •—

సీ. అనుచు రాచపడంతు • లాడు చుండఁగ విను, దమితశోకహుతాశ•నార్చిఁ గ్రాఁగు
చున్నదో యన నొప్పు • చున్న రాజగృహంబు,నం దెనిమిదవకక్ష్యను సదీన
మానసు నాతురు • మహితపుత్రవ్యథా,మ్లానుఁ బాండరగృహ•మధ్యమునను
గాంచి నమస్కృతిఁ • గావించి శ్రీరాము, వాక్యంబు లెల్లను • వరుసఁ జెప్ప
తే. మానిమై విని విభ్రాంత•మానసమున, నేలపైఁ బడి మూర్ఛిల్లి • నేలతేఁడు
బాహువుల నెత్తి హాయని • భామ లెల్ల, రోదనముసేయ సాగిరి • క్రూరగతిని. ౧౪౮

రాచపడంతులు = రాజస్త్రీలు- అమితశోక హుతాశనార్చిన్=మితిలేని శోకమను నగ్నిజ్వాలలచే, క్రాఁగు = కాలు, సదీనమానసున్ = శోకముతోఁ గూడిన మనస్సుగలవానిని, ఆతురున్=బాధపడువానిని, మహితపుత్రవ్యథామ్లానున్ = గొప్ప

దగు పుత్రశోకముచే వాడినవానిని, పాండరగృహమధ్యమునన్=తెల్లయింటినడుమ, కళాకాంతులు లేకుండుటచేఁ దెల్లఁబోయినదని భావము. విభ్రాంతమానసమునన్ = విశేషముగఁ గలవరపడిన మనస్సుతో, నేలఱేఁడు=రాజు.

## తాత్పర్యము.

ఈ ప్రకారము రాజస్త్రీలు మాటలాడుకొనుచుండ వినుచు విస్తారశోకాగ్నిచేఁ గాలిపోవుచున్నదో యన్నట్లున్న రాజగృహమం దెనిమిదవ కక్ష్యయందు దీనమైన మనస్సుగలవానిని బాధపడువానిని పుత్రశోకముచే వాడినవానిని, తెల్లని యింటి యందున్నవానిని దశరథునిజూచి నమస్కరించి శ్రీరాముని వాక్యములన్నియుఁ జెప్పఁగా బదులు చెప్పక విని కలఁతపడిన మనస్సుతో నేలమీఁదఁబడి రాజుమూర్ఛ పోఁగా స్త్రీలు తమ చేతులచే నాయనసెత్తి హాయని తీవ్రముగ నేడువసాగిరి.

సీ. కౌసల్యయు సుమిత్ర • బాసటగా నాథు, నెత్తి యి ట్లనియె భూ•మీశ! యీతఁ
డఘటనఘటనాస•మర్థునిదూత కా,నడవులయందుండి • యరుగుదెంచె
నింత యన్యాయంబు • నేఁ జేసితిని గదా, యని యేల లజ్జించె • దధిప యిపుడు
శోకమ్ము పుణ్యంబు•చాల నీకు లభించు, నేడ్చిన ఫలమింక • నేమి గలుగు

తే. నెవ్వతెకు నీవు జడిసి నీ• కేసువార్త, నైన నడుగవో యట్టినీ•ప్రాణదయిత
కైక యిట లేదు సత్యంబు • గాన దిటము, దెచ్చుకొని మాటలాడంగ•వచ్చునీకు.
౧౨౫

బాసటగాన్=సహాయముగా, అఘటనఘటనా సమర్థునిదూత=ఇతరుల కసాధ్యములైన కార్యములను సాధించు నేర్పుగల శ్రీరాముని దూత, జడిసి = భయపడి. ప్రాణదయిత = ప్రాణమువలెఁ బ్రియురాలు, దిటము=దార్ఢ్యము అఘటనఘటనా సమర్థుని దూత గావున సుమంత్రునియందును నఘటనఘటనా సామర్థ్యము కొంత గలదని భావము. సీతారామలక్ష్మణులను బుద్ధిపూర్వకముగా నడవులందు విడిచి వారు నడచిపోవఁజూచి ప్రాణముధరించి మరల నింటికిరాఁగల రాతిగుండెవాఁడు సుమంత్రుఁ డొక్కండే. ఇది యితరులకు సాధ్యమగు పనిగాదు. వారచ్చటనే ప్రాణము విడిచియుందురు.

## తాత్పర్యము.

సుమిత్రాదేవి సహాయపడుచుండఁ గౌసల్య నేలమీఁదఁబడిన దశరథు లేవనెత్తి యిట్లనియె. రాజా యితఁడు అసాధ్యకార్యముల సాధించు శ్రీరామచంద్రుని దూత, అడవులనుండి వచ్చినాఁడు. ఇంత యనర్థకార్యము నేను జేసితినిగదా యని యిపుడేల సిగ్గుపడెదవు? నీకుఁజాలఁ బుణ్యమువచ్చునుగాని శోకమ్ము. కార్యము మించినతరువాత నిపుడేడ్చిన రాఁగల లాభమేమి? ఎవతెకు నీవు భయపడి నీ కొడుకు వార్తనైన నడుగనోల్లవో యట్టి నీ ప్రాణప్రియురాలు కైక యిచ్చట లేదు. ఇది సత్యము. కావున ధీరుఁడవై మాటలాడవచ్చును.

మ. అని కౌసల్య నితాంతదుఃఖమున మూ•ర్ఛాక్రాంత యై నేల వ్రా
లిన శుద్ధాంతసరోజపత్రనయన • ల్వీక్షించి హాహారవం
బున స్వేదం గని చుట్టుఁ బ్రక్కఁ గలపూ•వుంబోండ్లు వృద్ధాళి యౌ
వనవంతుల్ విలపించి రంతిపురి మ్రో•వన్ హల్లకల్లోల మై. ౧౪౯

నితాంతదుఃఖమునన్ =అధికమైన దుఃఖముచే, మూర్ఛాక్రాంతయై = మూర్ఛచే నాక్రమింపఁబడినదై, శుద్ధాంతసరోజపత్రనయనల్ = అంతఃపురస్త్రీలు, పూవుంబోండ్లు=స్త్రీలు, వృద్ధాళి=ముసలివారి సమూహము, యౌవనవంతుల్ = వయస్సునందుండువారు, అంతిపురికిన్ = అంతఃపురమందు, హల్లకల్లోలమై = అల్లకల్లోలము గందరగోళము. మ్రోవన్=ధ్వనింపఁగా.

## తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చెప్పి కౌసల్య యధిక దుఃఖమున మూర్ఛపోయి నేలపైఁ బడఁగా నంతఃపురస్త్రీలు చూచి హాహాయని యేడువఁగా నంతలంతలనున్న స్త్రీలు ముదుసల్లు ప్రాయపువారు నంతఃపుర మల్లకల్లోలమగు నట్లేడ్చిరి.

## —•{ ౫౮-వసర్గము. దశరథుఁడు సుమంత్రుని శ్రీరామలక్ష్మణుల వృత్తాంత మడుగుట. }•—

ఉ. అంతట మూర్ఛఁ దేఱి మను•జాగ్రణి యాత్మసుతాగ్రగణ్యవృ
త్తాంత మెఱుంగఁ గోరుమతిఁ • దాల్చిన సూతుఁడు కేలు మోడ్చి య
త్యంతవిషాదచిత్తుఁ బరి•తప్తు నవగ్రహ మైనరోగ మా
దంతిని బోలువాని వసు•ధాపతి డాసిన నంత నాతఁడున్. ౧౫౦

ఆత్మసుతాగ్రగణ్య వృత్తాంతము = తన పెద్దకొడుకు చరిత్రము, అత్యంతవిషాదచిత్తున్=మిక్కిలి దుఃఖించు మనస్సుగలవానిని, పరితప్తున్=మిక్కిలి తాపము నొందినవానిని, నవగ్రహము=క్రొత్తగాఁ బట్టుపడినదగుటచే రోగముగల, దంతిన్ = ఏనుఁగును.

## తా త్ప ర్య ము.

అంతట రాజు మూర్ఛనుండి లేచి తన పెద్దకొడుకువార్త తెలియఁగోరఁగా సూతుఁడు కేలుమోడ్చి మిక్కిలి విషాదముతోఁ గూడిన మనస్సుగలవానిని, పరితాపము చెందువానిని, క్రొత్తగాఁబట్టుపడి రోగముచేఁ బీడింపఁబడు నేనుఁగువలె నుండువానిని రాజును సమీపింపఁగా దశరథుఁడును.

కం. ధూళిని ద్రుంగినమేనును, గాలువలై పాఱుబాష్ప•కణములు మున్నే
వ్రాలినతలయును నార్తిం, దూలినమో మైన సూతు•తోడం బలికెన్. ౧౫౧
సీ. అత్యంతసుఖ యయి • యలరు ధర్మాత్ముఁ డే, చెట్టుమొదళ్ల న•సించె నయ్య
రాచబిడ్డఁడు శయ•నోచితుం డతికోమ,లుండు నేనేలపైఁ • బండె నయ్య

యెవ్వనిబడి నేగు • నిభరథభటతతి, వాఁ డేవసంబున • వసరె నయ్యొ
లేలిహానమృగావ•ళీనిషేవితకాన, నమునఁ గొండిక లెట్లు • నవసి రయ్యొ

ఆ. బాల ముద్దరాలు • పరమపతివ్రత, యన్నపున్న మెఱుఁగ•నట్టిసీత
వెంట నంటఁ బుత్రు • లొంటి మైఁ గాల్నడ, నరదము డిగి యెట్లు • లరిగి రయ్యొ
౧౫౦౨

అత్యంతసుఖ=మిగుల సుఖముననుభవించువాఁడు, శయనోచితుండు = పాన్పుపైఁ బండుటకుఁదగినవాఁడు, అతికోమలుఁడు = మిగుల మృదువైన దేహముగలవాఁడు, ఇభరథభటతతి = ఏనుఁగులయుఁ దేరులయు భటులయు సమూహము, లేలిహాన=పాములచేతను, మృగావళీ = మృగముల వరుసలచేతను, నిషేవిత =సేవింపఁబడిన; కూడిన, కాననమునన్=అడవియందు, కొండికలు = పిల్లవాండ్రు, అన్నపున్నము=అన్యము. పుణ్యము=పాపము పుణ్యము, ఒకానొకచో ద్వంద్వంబునం బూర్వపదంబు క్లీబసమంబగు, అగుచో నా మువర్ణకంబునకు లోపంబగు. త్రి. సమా. ౫౯ ద్వంద్వం బప్రాణివాచక కృదంతఘటితం బేకవచనాంతంబునగు, త్రి. సమా. ౩౦.

## తా త్ప ర్య ము.

అయ్యా! మిక్కిలి సుఖమనుభవించు ధర్మాత్ముఁ డేచెట్ల మొదళ్ల వసించెను! రాజకుమారుఁడై మృదువైన హంసతూలికాతల్పమందుఁబరుండ యోగ్యతగలిగి మిగుల మృదువై యొంటినఁగండు దేహముగలవాఁ డేనేలపైఁ బండుకొనెను! ఎవ్వని వెంట నేనుఁగులు గుఱ్ఱములు తేరులు కాలిభటులు పోవుచుండురో యట్టివాఁ డొంటిగ నేయడవియందు దుఃఖించుచున్నాఁడు. పాములయు మృగములయు గుంపులతోఁగూడిన యడవియందుఁ బిల్లవాండ్రెట్లు బాధపడి కృశించిరి! చిన్నది సుందరి మిగులఁబతిభక్తిగలది, యిది కష్ట మిది సుఖము ఇది సత్యము, ఇది మోసము అని తెలియనిది. ఇట్టి సీత తమ వెంటరాఁగా నాపుత్రులొంటరిగా నడచుచు రథము డిగి యెట్లు పోయినారు.

కం. కన్నారఁ గాంచినాఁడవు, మన్నందనయుగ్మ మడవి • మందర మశ్వుల్
చన్నగఁ జొచ్చినగతిఁ జొరఁ,గ న్నీవే ధన్యతముఁడు • కావె సుమంత్రా. ౧౫౦౩

నందనయుగ్మము=ఇరువురు కొడుకులు, మందరము=మందరపర్వతమునందు, సప్తమ్యర్థమునఁ బ్రథమ, అశ్వుల్=అశ్వనీదేవతలు, అశ్వనీదేవత లిరువురు వీరు దేవవైద్యులు. వీరు స్వర్గమున నుండువారయ్యు, నోషధులకై మందరపర్వతమునందుఁ బ్రవేశించినట్లు. జడంబైన సప్తమికిఁ బ్రథమ వైకల్పికంబుగ నగు, సు.వ్యా. కారక ౩౩. ధన్యతముఁడు = ధన్యతముఁడవు, కొన్ని యెడల మధ్యమోత్తమ పురుషంబులకుఁ బ్రథమపురుష మగు, సు. వ్యా. కారక ౪౦.

## తా త్ప ర్య ము.

సుమంత్రా! మందరపర్వతమం దశ్వనీదేవతలు ప్రవేశించినట్లు నాయిరువురు

కొడుకు లడవియందుఁ బ్రవేశింపఁగా నీవు కన్నులారఁ జూచితివి. అంతవఱకుఁ జూచు భాగ్యము నీకు లభించెను గావున నీజన్మమే సార్థకము.

ఉ. ఏ మనె రామచంద్రుఁడు మ • జే మనె నయ్య సుమిత్రపట్టియున్
భూమితనూజ యే మనియెఁ • జొ మ్మనువేళను నిన్నుఁ జెప్పుమా
మామహనీయుఁ డుండుతల • మాటఁడు దేని భుజించె నెట్లు లే
నీమెయిఁ దాల్చువాఁడ విని • యేనియు సాధులలో యయాతినాన్. ౧౯౦౪

ఈ మెయిన్=ఈ దేహమును, సాధులలో యయాతినాన్=యయాతి స్వర్గము నుండి భ్రష్టుఁడై భూమిమీఁదఁ బడునపుడు నన్ను సాధువులుండుచోట వేయుమని యింద్రునిఁగోరెను. ఆప్రకారమే కాఁగా సాధుసాంగత్యముచే మరల స్వర్గమునకుఁ బోవఁగలిగెను. అట్టులే నేను శ్రీరాముని కథలు వినుటచే నీ దేహము ధరింపఁ గలుగుదును. సాధుసాంగత్యము, సాధుసల్లాపము ప్రథమ తరణోపాయము. సాధు సంగంబు సర్వార్థసాధకంబు.

తా త్ప ర్య ము.

నిన్ను మరలిపొమ్మని చెప్పినపుడు శ్రీరామచంద్రుఁ డేమిచెప్పెను. లక్ష్మణుఁ డేమనెను. సీతాదేవి యేమనెను చెప్పుము. ఆ రామచంద్రుఁడుండు ప్రదేశ మెట్టి దియో దేనిని భుజించెనో చెప్పిదవేని యతని చరిత్రము వినినమైనను సాధువులలోఁ బడిన యయాతివలె నీ దేహమును ధరించియుండెదను. సాధుసాంగత్యము, సాధు సల్లాపము ప్రత్యక్షము లభింపనపుడు వారి చరిత్రలు వినుటయు శ్రేయస్కరమే.

కం. అని తన్ను నృపతి యడిగిన, విని కంఠగతోరుబాష్ప•వికలరవుం డై
వనరుచుఁ బలుకులు దడఁబడ. ననిమె సుమంత్రుండు రఘుకు•లాగ్రణితోడన్.
౧౯౦౫

కంఠగత=కంఠమునుబొందిన, ఉరుబాష్ప = విస్తారమగు కన్నీళ్లచేత, వికల రవుండై=గద్గదపాటొందిన ధ్వనిగలవాఁడై, వనరుచున్=దుఃఖపడుచు.

అని రాజడిగిన విని కన్నీళ్లు కుత్తుక కడ్డపడ గద్గదస్వరముగలవాఁడై మాటలు తడఁబడ. దుఃఖపడుచు దశరథునితో సుమంత్రుఁ డిట్లనియె.

—• సుమంత్రుఁడు దశరథునకు శ్రీరామవాక్యములఁ దెల్పుట. •—

సీ. నామాటువిదితాత్మ•నాతండ్రి క్రొమొక్కు-మీ, పదములఁబడిమొట్ట•మొదటనూత
వారికి వారికి • వల నగురీతిగా, నాకుఁగా నభివాద•నములు సేసి
శుద్ధాంతకాంతల • సుఖమెకా మీ కెల్ల, ననుచు నామాటగా • నడుగ నయ్య
మాతల్లిఁ గౌసల్య • మతిగాంచి కుశలాభి,వాదనంబులు సల్పి • పలుకు మిట్టు
ఆ. లెల్లకార్యములను • నేమఱ కోయమ్మ! ధర్మనిత్య వగుచు• తగినవేళ [౧౯౦౬
నగ్న్యగారపరత • నలయకు; పతిపాద,ములను గొలుము దేవుఁ • గొలుచునట్లు.

విదితాత్మన్ = నా మనస్థితి తెలిసినవానిని, అభివాదనములు=నమస్కారములు, శుద్ధాంతకాంతలన్ = అంతఃపుర స్త్రీలను, కుశలాభివాదనంబులు = కుశల ప్రశ్న చేసి నమస్కరించి, ధర్మనిత్యవు=ధర్మమందు స్థిరమైనమనస్సుగలదానవు,అగ్న్యగారపరతన్ = అగ్నుల రక్షించుటయందు. భర్తహోమాగ్నులను రక్షించుట పెద్ద భార్య కార్యము, ఆ యధికార మితరులకు లేదు. అలయకుము=ఉపేక్షసేయకుము.

తాత్పర్యము.

మొట్టమొదట నావిధము తెలిసిన నా తండ్రికి నామాఱుగా నేను మ్రొక్కితినని చెప్పి పాదములమీఁదఁబడి నమస్కరింపుము. తక్కినవారికి వారివారికిఁ దగినట్లు నాకుఁగా నమస్కారములు చేయుము. అంతఃపుర స్త్రీలనందఱను మీకుఁ గుశలమా యని నే నడిగితి ననుము. ఆవల నాతల్లి కౌసల్యను గుశలమడిగి సాష్టాంగ నమస్కారము గావింపుము. అట్లు గావించి యిట్లు చెప్పుము. తల్లీ! యన్ని కార్యములను మునుపటివలెనే యేమఱక చేయుము, వ్యసనముచే నేపనియు మానవలదు. ఎల్లప్పుడు పాతివ్రత్యధర్మమునందు స్థిరబుద్ధిగలదానవై యుండుము. నాకొడుకు వనకేగి కష్టము గలిగించెనని నాతండ్రి నుపేక్షింపకుము. ఆ యా సమయములందు నగ్నిహోత్రమును రక్షింపుము, భర్త పాదములను దేవునిఁ గొలుచునట్లు గొలువుము.

ఉ. మానముపొంతఁ బోక, యభి•మానము దూరముఁ జేసి, తేనిక
న్యానకుఁ గైకకున్ మనసు • నొవ్వక యుండెడుమైఁ జరింపు, త
త్సూనుఁడు నేలఱేఁ డనుచుఁ • జూడుము; రాజులు విత్తవృద్ధు లన్
నానుడి నీ వెఱుఁగవె? మ•నంబున నిల్పుము రాజధర్మముల్. ౧౧౦౭

మానము = నా సవతికి దాసుఁడై పెద్దభార్యను నన్ను నవమానించెఁ గదా యను కోపము. అభిమానము=నేనుత్తమ క్షత్రియవంశమున జనించినదానననుగర్వము, తేఁకన్యానకున్=రాజునకంటెఁ దక్కువగాని దానికి, నొవ్వక=నొప్పి కలుగక, మైన్=విధముగా, తత్సూనుఁడు=ఆ కొడుకు, నేలఱేఁడు = భూమికధిపతి, విత్తవృద్ధులు=ధనముచే గొప్పవారు, నానుడి=సామెత.

తాత్పర్యము.

నాసవతికి వశపడి నన్నవమానించె ననుకోపమును సమీపమున కైనఁబోక నేనుత్తమక్షత్రియ కన్యనను గర్వమువదలి రాజునకు సమానురాలైన కైక మనస్సునకు నొప్పి కలుగకయుండు విధముగఁ బ్రవర్తింపుము. ఆ కొడుకే రాజుగదా యని యాలోచింపుము. రాజులు విత్తముచే వృద్ధులేకాని వయస్సుచేతఁ గాదను నామెత నీకుఁ దెలియదా. కావున రాజధర్మములను మనస్సున నిలుపుము.

చం. భరతుఁడు వచ్చినం గుశల♦వార్తలు మద్వచనంబుగాఁగ నీ
వరయుము; యెల్లతల్లు లెడ ♦ న్యాయపువృత్తిన సంచరింపుమీ
ధరణిపతిత్వ మూని ముది♦తండ్రిని జిక్కులఁ ద్రోయఁ బోకుమీ
వరనృపభూరిభోగముల ♦ వాలుము తండ్రి వచించుపద్ధతిన్. ౧౫౦౮

తాత్పర్యము.

భరతుఁడు వచ్చినపుడు కుశలప్రశ్నలను నే నడిగినట్లు నీవడుగుము. సవతి కొడుకు నీనితో నేమి మాటలని యూరకుండకుము. నామాటలుగా నీ వీ మాట లతనికిఁ జెప్పుము. అందఱు తల్లులయందును న్యాయ్యమగు విధముగానే సంచరింపుము. ప్రభుత్వము చేతికిరాఁగానే ముసలి తండ్రిని జిక్కులలోఁ ద్రోయు నాలోచనలు సేయకుము. తండ్రి చెప్పినమార్గమున రాజభోగము లనుభవింపుము.

చం. అని వచియింపు మంచు నయ♦నాంబులు రాలఁగ వెండిఁ బల్కె నీ
జననిగఁ జూడవయ్య యను♦జా! సుతగర్ధిని నాదుతల్లి, నం
చును గనునీరు నించెఁ గడు♦శోకమునన్ ధరణీశ! ఫుల్లకో
కనదదళాక్షుఁడామహిజ♦కాంతుఁడు రాముఁడు మోము వ్రాల్చుచున్. ౧౫౦౯

వచియింపుము = చెప్పుము, నయనాంబులు=కన్నీళ్లు, అనుజా = తమ్ముఁడా! సుతగర్ధిని=తన కొడుకునందుఁ బ్రేమగలది, ఫుల్ల=వికసించిన, కోకనద = ఎఱ్ఱకమలమువంటి, అక్షుఁడు = కన్నులుగలవాఁడు, తొలుతనే యెఱ్ఱనికన్నులు శోకించుటచే మఱింత యెఱ్ఱనయ్యెను.

తాత్పర్యము.

అని చెప్పుమని చెప్పి కన్నుల నీళ్లుకాఱుచుండ మఱియును నిట్లు భరతునితోఁ జెప్పుమనెను. తమ్ముఁడా తన సుతునియందుఁ బ్రేమగల నాతల్లిని నీతల్లివలెఁ జూచుకొనుము. నీ తల్లికి నీయందువలె నా తల్లికి నాయందుఁ బ్రేమయుండుట తప్పుగా నెన్నకుము. అని మిక్కిలి శోకముతో తలవంచి యూవలఁ జెప్ప నిష్టములేక యెఱ్ఱ తామరలవంటి కన్నులుగల శ్రీరామచంద్రుఁడు కన్నులనిండ నీరునించెను.

ఇప్పుడింత యెక్కువ చెప్పుట యనుచితమని శ్రీరాముఁడు చెప్పఁడయ్యెఁ గాని "సుప్తప్రమత్త కుపితానాం వచనైర్భావ జ్ఞానం దృష్టవ్య" మ్మను న్యాయమున అనఁగా నిద్రపోవువానియొక్కయు, మత్తెక్కినవానియొక్కయుఁ గోపించువానియొక్కయు, మాటలచే మనస్సునందు దానిఁ గనుఁగొనవలయునని యర్థము. కావున మనస్సున నుండునది సీతాపహరణానంతరము బయలుపఱుచుచున్నాఁడు.

—♦ సుమంత్రుఁడు దశరథునకు లక్ష్మణువాక్యంబులఁ దెలుపుట. ♦—

సీ. సౌమిత్రియో రోష♦సంభ్రమంబున రోఁజు, చును నిట్లు లనియెను ♦వినుము దేవ
యేయపరాధంబుఁ ♦ జేయఁ గానలఁ ద్రోచె, రాజపుత్రాగ్రణి ♦ రామచంద్రు

మీరాజు చెప్పుమా • తేరకు మా కిట్లు, వ్యసనంబు గలుగంగ • వలచు కైక
తుచ్ఛశాసనమును • దొడ్డగాఁ దలఁ దాల్చి, చేయఁగా రానట్టి • చెనఁటి సేఁతఁ
ఆ. జేసెఁ గార్యబుద్ధి • వాసిగ వరదాన,లాభముననొ రాజ్య • లోభముననొ
యేమి హేతువైన • రాముని ఁబాయుటఁ నిష్కృతియును లేని • దుష్కృతంబు. ౧౪౧౦

సౌమిత్రియో = లక్ష్మణుఁడో - ఓ యనునది లక్ష్మణుఁడు శ్రీరామునివలెఁ బ్రియములు (ఇచ్ఛకములు) చెప్పలేదనియు మనస్సులో నున్నదున్నట్లు స్పష్టముగాఁ జెప్పెననియుఁ దెలుపుచున్నది- రోషసంభ్రమము = కోపమువలనఁ గలిగిన తొట్రుపాటుచే- రోఁజుచున్ = బుసకొట్టుచు- తేరకున్ = నిష్కారణముగా- తుచ్ఛశాసనమును = నీచమైనయాజ్ఞను- దొడ్డగాన్=గొప్పదిగా- చెనఁటిసేఁత =దుష్టకార్యమును- కార్యబుద్ధిన్=చేయఁదగినదను నభిప్రాయముతో- వరదానలాభముననో= వరము సఫలముచేయుటవలనఁ గలుగు లాభము- ఇది స్వర్గము రాజ్యలాభముననో=రాజ్యమునందుఁగల యాశచేతనో- ఏకారణముచేనయినను, నిష్కృతి=ప్రాయశ్చిత్తము- దుష్కృతము = పాపము

తాత్పర్యము.

ఇఁక లక్ష్మణుఁడో కోపముచేఁ గలిగిన తొట్రుపాటుచే రోఁజుచు నిట్లనియెను. ఓయీసుమంత్రా! మీరాజేమికోపము పెట్టి రాజు పెద్దకొడుకును శ్రీరామచంద్రుని నడవులలోఁ ద్రోచెనో చెప్పుము. సవతికొడుకులమైన కారణమున మాకు వ్యసనము కలిగింపఁగోరిన కైకయొక్క నీచమైన యాజ్ఞను గొప్పగా ననివార్యమైన దానిఁగా శిరసావహించి చేయరాని చెడ్డకార్యమును జేయఁదగినకార్యమని మీరాజు చేసెను. ఇచ్చినవరము నెఱవేర్చుట దోషమా యందువేని తొలుత వరములిచ్చిన సమయంబున శ్రీరాముఁడు కానలకుఁ బోవలయునని భరతుఁడు రాజుగావలయునని కోరలేదు. అప్పుడు కోరినవరములను నీవిప్పుడు కోరువరములేవి యని యడిగి తెలిసికొనక యొల్లిచ్చెదననెను. ఒకవేళఁ గోరెనుపో శాస్త్రవిరుద్ధములయి పరులకు బాధాకరములై లోకగర్హితములైన వరముల నెట్లిచ్చెను. ఒంటికొడుకును- పెద్దకొడుకును విడువరాదని శాస్త్రము చెప్పుచున్నదికదా. శాస్త్రవిరుద్ధవరము లీయవచ్చునా? అటుగాక పరులరాజ్య మపహరించుకోరికచే నందువా అట్టిదైనను దుష్టమే. శాస్త్రప్రకారము పెద్దవానికి రావలసినరాజ్యము చిన్నవాని కెట్టులీయుమనెదవు. ఇయ్యనని చెప్పియుండవచ్చునుగదా. మీరాజునకు శాస్త్రమర్యాద నుల్లంఘించి యేకారణముచేఁ జేసినను నీపాపమునకుఁ బ్రాయశ్చిత్తము లేదు.

"సత్యంవద" సత్యమును జెప్పుమను సామాన్యధర్మమును బురస్కరించుకొని విశేషధర్మమగు శ్రీరామాశ్రయమును వదలినవానికిఁ బ్రాయశ్చిత్త మెందుండి వచ్చునని వాస్తవార్థము.

కం. దైవప్రేరణమున నిటు. గావించె నటంచు ననెదె • కలుగఁగ వలదా
దైవమునకుఁ గారణ మొకఁ, డావిధ మే దైన నున్న • నాడుము వినెదన్. ౫౮॥౧౧

తా త్ప ర్య ము.

అయ్యా! దీనియం దాయనదోషములేదు. దైవము ప్రేరింపఁగా నిట్లుచేసెద నందువా? దైవమైనను గారణముపెట్టి చేయునుగాని నిష్కారణముగఁ జేయదుగదా. అట్టికారణమున్నఁ జెప్పుము వినెదను.

కం. ఆలోచింపక మతి లే, కీలోకవిరుద్ధకార్య•మిటు చేసెను భూ
పాలుం డనిమొదె దానికె, జాలిం గొనియెదము దాన • జనపతి యేడ్చున్.

తా త్ప ర్య ము. ౫౮॥౧౨

ఆయన సమ్మతించియే చేసినకార్యమైనయెడల నిపుడిటు లేడ్చునా యనెదవా ఆలోచనము కొంచెమైనను లేక యిట్టివంటి లోకవిరుద్ధకార్యము చేసెనుగదా యని యే మేమును నేడ్చుచున్నాము. ఆకారణముచేతనే రాజేడ్చుచున్నాఁడు. చేయఁ దగిన కార్యము చేసితినని తోఁచిన నేలయేడ్చును.

కం. రాముఁడె భ్రాతయు భర్తయు, రాముఁడె ప్రియబంధువరుఁడు• రాముఁడెచుమిత్రా
రాముఁడె నాజనకుండును, భూమిపునెడ లేదు జనక•బుద్ధి సుమంత్రా. ౫౮॥౧౩

అయ్యా! తండ్రివిషయమున నీవిట్లు కఠినముగ మాటలాడవచ్చునా యందువా? సుమంత్రా! రాజునందు నాకు జనకుఁడనుభావము పోయినది. ఇంతఘోరకార్యము చేసినవాఁడు తండ్రియెట్లగును? కావున నాకు నన్నయైనను శ్రీరాముఁడే- భర్తయై నను శ్రీరాముఁడే- ప్రియబంధువైనను శ్రీరామచంద్రుఁడే- తండ్రియైనను శ్రీ రామచంద్రమూర్తియే- శ్రీరాముడుగాక నాకు వేఱుగ సోదరుఁడు లేఁడు-భర్తయు లేఁడు- ఇష్టబంధువు లేఁడు- తండ్రియు లేఁడు- ఎవ్వరు లేరు. ప్రాకృతుఁడైనను తండ్రిని విడువవచ్చునా యనిన.

'గురోరవలిప్తస్య కార్యాకార్య మజానతః, ఉత్పథం ప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే." పద్యము ౧౯౯౩ అయోధ్య చూడుము. ఉచితముగోలఁది యట్టితండ్రిని విడువచ్చును దండింపవచ్చును. భీష్ముఁడిట్లు చేసినవాఁడేకదా.

ఇట్లుచెప్పుటచేఁ బరమైకాంతి ప్రాకృతులైన సమస్త బాంధవులను వారువిరోధించిరేని వదలి భగవత్కైంకర్యము చేయవలయునని యేర్పడుచున్నది. తనవలె భగవత్కార్య పరులైనవారిని విడువరాదు. ఇచట గోపికలవాక్యములు స్మరింపఁ దగినవి. "పతిసుతాన్వయభ్రాతృబాంధవా । నతివిలంఘ్య తేం త్యచ్యుతాగతా" భర్తను సుతులను తోడఁబుట్టినవారిని జుట్టములను నందఱినివదలి నిన్ను వదలలేక నీవు మమ్మువదలవని (అచ్యుత) వచ్చితిమనికదా యని వారు చెప్పిరి. భగవత్కార్యమున కనుకూలురఁ విడువరాదుగాని దానికడ్డమువచ్చు తక్కినవారి నెవ్వరినైనఁ విడువ వచ్చును.

పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్ । రత్నాని ధనధాన్యాని క్షేత్రాణిచ గృహాణిచ । సర్వధర్మాంశ్చ సంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్ । లోకవిక్రాంత చరణౌ శరణం తే వ్రజంవిభో।ఆత్మారాజ్యం ధనంచైవ కళత్రం వాహనానిచ । ఏతద్భగవతే సర్వ మితితత్ప్రేక్షితం సదా॥ యనికదా భగవచ్ఛరణార్థుల లక్షణము. వారికి విడువరానిది లేదు.

ఆ. సర్వలోకహితుని • సర్వలోకప్రియు, ననఘు ధర్మరతు జ•నాభిరాము
రాము విడిచి యెట్లు • రంజింపఁ జేసెదు, ధరణి నెల్ల ననుము•దశరథునకు.

తాత్పర్యము. ౧౪

నామాటగా రాజును నీ విట్లడుగుము. సర్వలోకములకు సమస్తభూతములకు మేలుకోరువాఁడును, సర్వజనులకు నిష్టుఁడైనవాఁడును నేదోషమంటనివాఁడును, ధర్మమందే యాసక్తిగలవాఁడును, జనులను సంతోషింపఁజేయువాఁడును నగు శ్రీరాముని విడిచి నీవు రాజనుపేరు సార్థకము చేసికొనఁదలఁచితివేని యెల్లప్రజల నెట్లు రంజిపఁ జేయఁగలవో చెప్పుమనుము. తండ్రి కనుటకు మనస్సొప్పక దశరథుఁడని చెప్పెను.

నీ కార్యమునకు నీకైక నీభరతుఁడు సంతోషింపవలయునుగాని మఱియెవ్వరు సంతోషింపరు. సర్వలోకములకు స్వాభావికజనకుఁడు బంధువునగు, శ్రీరాముని వదలి నిన్ను నేనాశ్రయింతునాయని భావము.

కం. ఇంతటిలోకవిరుద్ధపు, వింతలఁ బచరించు నీవు • విశ్వంభరకున్
గాంతుఁడ వెట్లగు దను సు,మంతా నామాటగాఁగ • మహిపున కనుమా.
౧౫

విశ్వంభరకున్=భూమికి, కాంతుఁడవు = మనోహరుఁడైన విభుఁడవు, సుమంతా=సుమంత్రశబ్దభవము సుమంత్రుఁడు, సుమంత్రాయనినను ప్రాసభంగము లేదు.

తాత్పర్యము.

నీవు ప్రజలను రంజింపఁజేసినను జేయలేకున్నను నీవు ప్రభువుగాఁ గూడ నుండఁదగవు. ఏలనఁ? ఏకాలమందైనను నెట్టి యధర్మిష్ఠుఁడును జేయని యంతటి లోకవిరుద్ధమైనకార్యమును జేయు నీవు భూమికి నెట్లు ప్రభువుగానుండ నర్హుఁడవు. కావున రాజ్యము వదలిపొమ్మని నేను జెప్పితినని రాజునకుఁ జెప్పుము. ఇట్లడుగునను భయముచేఁ గాఁబోలు సీతారామలక్ష్మణులు సెలవుతీసికొనుటకై పోయినపుడు దశరథుఁడు లక్ష్మణుని బలుకరించిన వాఁడుకాఁడు.

తే. అనియెఁ;జానకియో యూర్పు•లొనరఁ బోఁకు,పోఁకినట్టులు దిగ్భ్రమిఁ•జూచుచుండెఁ
గాని దుఃఖం బెఱుంగని•కమలనయన, యేడ్చుచుండె మహారాజ • యేమి యనక.
౧౬

పోఁకు=వయ్యము, పోఁకినట్టులు=ప్రవేశించినట్లు.

తాత్పర్యము.

శ్రీరాముఁడట్లు ప్రియము పలికెను. లక్ష్మణుఁ డిట్లు నిష్ఠురములాడెను. ఇఁక సీత యేమనినయ్యో యందువా యామె దయ్యము పట్టినదానివలె దిక్కులోఁపక యూరక చూచుచుండెనుగాని యెన్నఁడు దుఃఖమెఱుఁగని యామె యేమియుఁ జెప్పక యేడ్చుచుండెను.

కం. కనునీరు దొరఁగుచుండెడు, పెనిమిటిముఖపంకజంబు • వీక్షించుచు వా
డినమోముఁదమ్మితో నను, గనుచు మహిజ బాష్పవారిఁ • గార్చుచు నుండెన్. ౧౭

తాత్పర్యము.

కన్నీళ్లు గార్చుచున్న తనభర్త ముఖకమలమును జూచుచు వాడినముఖముతో నన్నుఁ జూచి సీతాదేవి కన్నీరు గార్చెను.

కం. సౌమిత్రి బాహుపాలితుఁడై మో మశ్రులను దడియ • నంజలితోడన్
రాముండు నిలిచి యుండెను, భూమిజ నను రథముఁగనుచుఁ • బొక్కుచు నిలిచెన్. ౧౮

బాహుపాలితుఁడై=బాహువులచే రక్షింపఁబడినవాఁడై, అనుటచే లక్ష్మణుఁ డాయుధము ధరించియుండెనని భావము. మోము = ముఖము, అశ్రులన్ = కన్నీటితో, పొక్కుచున్=దుఃఖించుచు.

తాత్పర్యము.

లక్ష్మణుఁడు శరచాపహస్తుఁడై యన్నను గాచుచు నిలచియుండెను. శ్రీరాముఁ డేడ్చుచుఁ జేతులుమోడ్చి నిలఁబడియుండెను. సీతాదేవి నన్ను రథముఁ గనుచు దుఃఖించుచుండెను.

ఎవరెట్లుపోయినను నేమైనను దనకుఁ గావలసినది రామసేవ. కావున నాయనను రక్షించుచు నాయనపై మనస్సు దృష్టియుంచి లక్ష్మణుఁడు నిలిచియుండెను.

తనమీఁద నింత ప్రేమగలవారి కింతకష్టము తన నిమిత్తము వచ్చెఁగదాయని శ్రీరామచంద్రమూర్తి యేడ్చుచుండెను. నీవు రథమును దోలుకొనిపోయిన శ్రీరాముఁ డెట్లు పాదచారియై యడవులందు నడువఁగలఁడని సీత నన్ను రథమును జూచుచుండెనని భావము.

## ౫౨-వ సర్గము.

చం. అనుడు నృపేంద్రుఁ డిట్లనియె • నావలి శేషకథాంశ మింక వా
కొనుము సుమంత్ర! యన్న రఘు•కుంజరు లంత జడల్ ధరించి గ్ర
క్కునఁ గుశచీరధారు లయి • గంగను దాఁటి ప్రయాగవంకగాఁ
జనిరి, సుమిత్రపట్టి రఘు•చంద్రముఁ గాచుచు మున్నుగాఁ జనెన్. ౧

శేషకథాంశము=మిగిలిన కథాభాగము, వాకొనుము = చెప్పుము, ప్రయాగవంకగాఁ=ప్రయాగప్రక్క.

తాత్పర్యము.

అనిన రాజు తరువాతి కథాశేషము చెప్పుమనిన సుమంత్రుఁడిట్లనియె. రామ లక్ష్మణు లిరువురు జడలు ధరించి కుశపవిత్రములను నారచీరలను గట్టినవారై (యిక్కడఁ గట్టుకొనిపోయినవి పరిత్యజింపలేదనుటకై మరలఁ జెప్పఁబడెను.) గంగను దాఁటి ప్రయాగకుఁ బోవుత్రోవను బోయిరి. లక్ష్మణుఁడు శ్రీరాముని రక్షించుచు ముందుగాఁ బోయెను.

కం. అతని వెంబడిఁ జని భూజాతయుఁ దన వెన్క రామచంద్రుఁడు రాఁగన్
తన్మాతలధవ! యింతయుఁ గని, చేతము దుఃఖార్ణవమునఁ • జిడిముడివడఁగన్. ౧౫౨౦

దుఃఖార్ణవమునన్=దుఃఖసముద్రమందు, చిడిముడిపడఁగన్=తొట్రుపడఁగా.

తాత్పర్యము.

ఆ లక్ష్మణుఁ వెంబడి సీతాదేవిపోయెను. ఆమె వెనుక శ్రీరాముఁడు పోయెను. ఇదంతయుఁ జూడఁగా నా మనస్సు దుఃఖసముద్రమునఁ దొట్రుపాటు పొందెను. ఈ రెండు పద్యముల మూలశ్లోకములు ప్రక్షిప్తములని వ్రాయఁబడినవి.

కం. మావుల మరలింపఁగ సీతావిభునేర్పాటు చూచి • తత ముష్ణాశ్రుల్ [౧౫౨౧]
నావుగఁ గాఱఁగ మరలవ. భూవల్లభ! యవియు శోక•పూర్ణములగుచున్.

మావులన్=గుఱ్ఱములను, వేర్పాటు-వేఱుపాటు=విడిచిపోవుట, ఉష్ణాశ్రుల్= వేఁడికన్నీళ్లు, లావుగన్=విశేషముగ బలముగ.

తాత్పర్యము.

గుఱ్ఱములను దేరికిఁగట్టి మరల వెనుకప్రక్కకుఁ ద్రిప్పఁగా శ్రీరాముఁడు తమ్ముఁ వదలిపోవుటఁజూచి శోకపూర్ణములై విస్తారముగ వేఁడి కన్నీరు కార్చుచు నవి యెంత త్రిప్పినను వెనుకకు మరలవు.

తీర్థీయము – బ్రహ్మరుద్రేంద్రాదులకును దుర్లభమైన శ్రీరామసేవ మాభాగ్య వశమున లభించెను. అట్టిది నిర్దయుఁడైన దైవముచే విఘ్నము గాఁబడెను. ఇఁక మేమేమి చేయవచ్చును. మాజీవనమే వ్యర్థము. అని గుఱ్ఱము లత్యంత దుఃఖముచేఁ గన్నీరు కార్చెను. అతి కఠినహృదయుఁడైన నేను మరల్చినను గుఱ్ఱములు మరలినవి కావు. ఎంతో కష్టముమీఁద మరల్చితినని భావము. శ్రీరాముల వియోగము సైఁపని పశువులకంటె ఆవియోగమందు వానిని బలవంతపెట్టిన నా జన్మము నికృష్ట మని తోఁచెను. భగవత్సేవ చేయువారి కష్టముఁబోవువారు నీచజన్ములని భావము

తే. ఇరువురకు రాజపుత్రుల • కేను మ్రొక్కి-
వగపు సహించి గుహునితో • వచ్చి యుంటి
బహుదినంబులు నే నంద • వార్త నంపఁ
డా రఘూద్వహుఁ డనియెడి•యాశఁ జేసి. ౧౫౨౨

వగపుసహించి=దుఃఖము నోర్చుకొని, భగవద్వియోగము కలిగినను భాగవత సాంగత్యమున్నయెడల శోకింపఁ గారణములేదు. కావున శ్రీరామ వియోగదుఃఖమును దదీయుఁడైన గుహుని సాంగత్యమున సహించితివని భావము. బహుదినంబులు=అనేకదినంబులు, వార్త=కష్టము తోఁచినపుడు నన్ను రమ్మనియో తాను వచ్చెద నిలువుమనియో నిషాదులచేఁ జెప్పి పంపకపోవునా యను నాశచేత;

ఇచ్చట బహు దినములనఁగా మూఁడు దినములనియే గ్రహింపవలయును. గుహునితో వటమూలమున నుండుట మొదటి దినము. శ్రీరామచంద్రమూర్తి గంగనుదాఁటుట రెండవ దినము. భరద్వాజాశ్రమమునందుండుట మూఁడవ దినము. అచ్చట భరద్వాజుఁడు శ్రీరామచంద్రునిఁ జిత్రకూటమున వసింపుమని చెప్పుటయు మూఁడవ దినముననే, నాఁడే సుమంత్రుఁడు బయలుదేఱి యయోధ్యకస్తమయకాలమునకుఁ జేరెను. ఇట్లు మూఁడు దినములని తీర్థీయులు.

దీనిపై నొక పూర్వపక్షము తోఁచుచున్నది.

గుహుఁడు సుమంత్రుఁడు గంగాతీరమునందున్న దినము సీతారామలక్ష్మణులు నుండిరి అదిన్నైన నొక రాత్రియే, కావున నదియు లెక్కకుఁ దీసికొనరాదు. కావున సీతారామలక్ష్మణులు గంగదాఁటిన దిన మొకటి. భరద్వాజాశ్రమమున నుండి నది రెండవ దినము. ఆ దినమే వీరికిఁ జిత్రకూటము తగినస్థలమని భరద్వాజుఁడు చెప్పెను. ఆ వార్తవిని చారులారాత్రి ప్రయాణముచేసి గుహ సుమంత్రులకుఁ దెలుపఁగా వెంటనే సుమంత్రుఁడు బయలుదేఱి యా మూఁడవనాఁటి సాయంకాలమున నయోధ్యఁజేరెను. ౧౮౭౭-వ పద్యమునందలి మూఁడవనాఁటి సంజయను లెక్క యిదియే.

౧౮౭౮-వ ఆగిరి గమనము అనునదియుఁ జిత్రకూటమున నున్నట్లు సుమంత్రుఁడు చెప్పకుండుటయు నివి శ్రీరామచంద్రమూర్తి చిత్రకూటము చేరువఱకు గుహునితో నుండెనని స్థాపింపఁజాలదు. మూఁడు ౧౮౭౮-వ అంకుఁ జిత్రకూటప్రస్తావనలేదు.

గోవిందరాజీయమున రెండభిప్రాయము లీయఁబడినవి. శ్రీరాముఁడు గంగనుదాఁటి వృక్షమూలమున నొకనాఁడు, రెండవ దినము భరద్వాజాశ్రమమున, మూఁడవ దినము యమునానదీ తీరమునసుండి, నాలవ దినము చిత్రకూటముఁ జేరెను. అయిదవ దినమున గుహుని దూతలు మరలివచ్చి యాసంగతి చెప్పిరి. ఆఱవ దినము సుమంత్రుఁడు బయలుదేఱి సాయంకాలమునకు నయోధ్యఁ జేరెను.

ఈ యభిప్రాయము సమంజసముగాఁ దోఁపదు. ౧౮౮౭.వ పద్యమున మూఁడు నాళ్లనియే యున్నది. చిత్రకూటమునకుఁ బోవ నిశ్చయించుకొన్న వార్త సుమంత్రునకుఁ దెలిసియుండునుగాని చిత్రకూటప్రాప్తిము చేరినవార్త తెలియదు. తెలిసియుండిన రాజతో నయోధ్యలోఁ జెప్పియే యుండును. అదియునుగాక సుమం

త్రుఁడు వచ్చి యయోధ్యచేరిన నాఁటిరాత్రి శ్రీరాముఁ డయోధ్యవిడిచిన యైదవ నాఁటి రాత్రియేయని ౧౫౪౮-వ పద్యమందలి కౌసల్యా వాక్యమువలనఁ దెలియ నయ్యెడిని. ఇఁక రెండవ యభిప్రాయము శ్రీరామచంద్రుఁడు రెండవ దినమున భరద్వాజాశ్రమమునకుఁ బోయి చిత్రకూటనివాస విషయము మాటలాడునపుడు మాటలు విని మూఁడవదినమునవచ్చి గుహునితోఁ జెప్పుట. నాలవదినమున సుమంత్రుఁడు బయలుదేఱుట యని.

నాలుగవదినము సుమంత్రుఁడు బయలుదేఱెననుట మూఁడవదినమే, సుమంత్రుఁడు సాయంకాలమున నయోధ్య చేరెననుటతో విరోధించును. కౌసల్య చెప్పిన యేను నిశలతోను విరోధించును. ఈ రెండవ పక్షమున గుహునితో సుమంత్రుఁడు మూఁడు దినములు పూర్తిగా నున్నట్లును దీర్ఘీయవ్యాఖ్యానప్రకారము మూఁడవ దినమునఁ గొంచెముకాలమే యుండెననియు నేర్పడును.

రెండవనాఁటి సాయంకాలమే శ్రీరాముని చిత్రకూట గమనము నిశ్చయింపఁబడెను. ఇది శుక్లపక్షము, సీతతోడ రామలక్ష్మణు లొకటిన్నరదినము మెల్లగ నడచినదూరము చక్కని దోవ తెలిసి నడక వాడుకపడిన బోయవాండ్రకు మూఁడు జాములకంటె నెక్కువ పట్టియుండదు. రెండవ దినము వెన్నెలరాత్రిలో బయలుదేఱినను చారులు మూఁడవదినము నుదయమున 7-8 గంటలకై న శృంగిబేరము చేరియుందురు. 9 గంటలకు సుమంత్రుఁడు బయలుదేఱినను సాయంకాలమునకు నయోధ్య చేరియుండును. ఇది యైదవరాత్రియు నగును. కావున సీతారామలక్ష్మణులు యమునాతీరమున నున్నరాత్రి సుమంత్రుఁ డయోధ్యఁ జేరెను.

ఇటు శ్రీరాముని నటు దశరథుని విడిచియున్న యొక్కొక్క గడియ సుమంత్రునిపాలికి నొక్కొక్క దినముగ నుండెననియు నా కారణమున బహు దినములని చెప్పెననియు నెంచఁదగు. సంస్కృతమున మూఁడు బహుత్వమును సూచించును.

—• సుమంత్రుఁడు తాను వచ్చుమార్గమునఁ జూచిన విశేషంబులఁ జెప్పుట. •—

చం.మలమల మాఁడి యుండె సుమ•మంజులకుట్మలకోరకావళుల్
సలసలఁ గ్రాఁగు చుండెను గో•లంకులు నేఁటులఁ బల్వలంబులున్,
గలగల లాడు చుండెను న•గంబుల నాకులు నెండి వత్తిలై,
విలవిల పోవు చుండెఁ బృథి•పీధవ! చిత్తము ద్రోవ వచ్చుచోన్.　　　౧౫౪.౨౩

సుమ=పూలయొక్కయు, మంజుల=మనోహరములైన, కుట్మల=సగము వికసించిన మొగ్గలయు, కోరక=ఏమియు వికసింపని కాయ మొగ్గలయు, ఆవళుల్ = సమూహములు, పల్వలంబులు=అల్పసరస్సులు,నగంబులన్=చెట్లయందు, వత్తిలై = వరుగులై, 'అన్నతవాడివత్తిలయి' యని మనుచరిత్ర. ద్రావిడమందు నీపదమునకిదియే యర్థము.

### తాత్పర్యము.

రాజా నేను మరలివచ్చునపుడు త్రోవల నున్న చెట్లయందలి పూలు, సగము విచ్చిన మొగ్గలు కాయమొగ్గలు మలమల మాఁడియుండెను. కొలంకులు, నదులు, చిన్నసరస్సులు వీనియందలి నీరు సలసల క్రాఁగుచుండెను. చెట్లయందలి యాకులు వాడి వసుగులై గలగల లాడుచుండెను. ఇవన్నియుఁ జూచిన నా మనస్సు విలవిల పోవుచుండెను. ఈప్రకార మంతస్సంజ్ఞములైన వృక్షాదులు కూడ రామవియోగమున శోకాగ్నిని మరగి పోవుచుండెను.

కం. మెదలవు కాకోదరములు కదలవు వన్యేభములును • ఘాతుకమృగముల్
రొద లైన వినఁగ రా దట, సదమలగుణశీల! రామ•చంద్రభృశార్తిన్. ౧౫౨౪

కాకోదరములు=పాములు, మెదలవు=బయట సంచరింపవు, వన్యేభములు=అడవి యేనుఁగులు, ఘాతుకమృగముల రొదలు=హింసించు స్వభావముగల క్రూరమృగముల ధ్వనులు, భృశార్తిన్=అధిక వేదనచే.

### తాత్పర్యము.

రామచంద్రునకుఁగలిగిన యధికమైన వేదన కారణముగ పాము లాహారనిమిత్తమైనను బయట సంచరింపవు. అడవి యేనుఁగు లున్న తావుల నట్లే పడియుండెను. గాని కదలినవికావు, క్రూరమృగములు ధ్వనించినవికావు.

శ్రీరాముని విరహమువలన సమస్త భూతములు పడెడి కష్టమును వర్ణించు నెపమున శ్రీరాముఁడు సర్వాంతర్యామి యను విషయము కవి విశదపఱుచుచున్నాఁడు. కాదేని కైకేయి మాటవిని నేనుచేసిన యకార్యమువలన నందఱకెంత దుఃఖము కలిగెనని దశరథునకుఁ దోఁచుటకైనఁ జెప్పుచున్నాఁడు.

సీ. లీనపుష్కరపత్ర•లీనమీనవిహంగ,తప్తపద్మమృణాళ•తతులఁ గంటిఁ
బూర్వంబునట్టులు • పారి జలజప్రసూనములేని స్థలజసు•మములు గాని
కమ్మవాసన లించు•కయు నీవు తోఁటలు, శూన్యంబు లైనవి • మాన్యచరిత
యెక్కడివిహగంబు • లక్కడనే సోలి,పడి యుంట నవియును • బాడు దోఁచె
ఆ. నేమి చెప్పవాఁడ • నీయూర నొకనికేన్, దేటమొగము లేదు • మాటిమాటి
కూర్పు పుచ్చువార • లుర్వీశధవులేమి, నిలువుగుండెతోడ • నిలిచి చూచి.

౧౫౨౫

లీన=అధికతాపముచే నీటిలో దాఁగిన, పుష్కరపత్ర = తామరాకులయొక్కయు, లీన=నీటిలోఁ డాఁగిన, మీన=చేఁపల, విహంగ=జలపక్షులయొక్కయు, తప్త=వేఁడిచేఁ గ్రాఁగిన, పద్మ=తామర పూవులయొక్కయు, మృణాళ=తామర తూఁడులయొక్కయు, తతులన్=సమూహములను, కంటిన్ = చూచితిని, జలజప్రసూనము లేని=నీటఁబుట్టిన పూలైనను,స్థలజసుమము లేని=నేలమీఁదఁబుట్టిన పుష్పములైనను,

కమ్మవాసనలు=సువాసనలు, విహంగంబులు=పక్షులు, నిలువుగుండె = కొట్టుకొనుట నిలిచి పోవుగుండె.

తా త్ప ర్య ము.

శ్రీరాముని వియోగమువలనఁ గలిగినట్టియు నాయనకుఁ గలిగినట్టియు నధిక శాపముచే నీటిలో డాఁగిన తామరాకుల (తేలాడవలసినవి మునిఁగినవని భావము.) గుంపులను నీళ్ళలో డాఁగిన చేఁపలు జలపక్షులయు వేఁడిచేఁ గ్రాఁగిన తామరలు, వాని తూండ్లయు సమూహములఁ గంటిని. మునుపటివలె నీటితామరలుగాని మెట్టతామరలుగాని కొంచెమైనను బరిమళింపవు తోఁటలయందు నెక్కడిపక్షు లక్కడనే పడి సంచారముగాని కలకల ధ్వనులుగాని లేకుండుటచే నవియును శూన్యములై కాన వచ్చెను. ఇఁక నూరిలోన నొకరికైన ముఖము తేటగా లేదు. మాటిమాటికి నిట్టూర్పులు పుచ్చుచున్నారు. శ్రీరాముఁడు లేనికారణమున నేను వచ్చునపుడు నిలువు గుండెపడి కదలక మెదలక నోటమాటలేక బొమ్మలవలె నిలిచి లోకులు చూచు చుండిరి.

—• సుమంత్రుఁడు పౌరులదుఃఖమును దశరథునకుఁ జెప్పుట. •—

ఉ. రాముఁడు లేనిస్యందనము • రాఁ గని పౌరులు దుస్సహవ్యథో
　ద్దామత రాజమార్గమునఁ • దల్లడ మందిరి, కాంత లన్ననో
　భూమిప! సౌధవీథులను • బొక్కుచు హా యని యేడ్చి, రింక నే
　నేమి వచించువాఁడ ధర•ణీశ్వర! దుస్సహలోకశోకమున్. ౧౮౭

స్యందనము=రథము, రాన్ = రాఁగా, దుస్సహవ్యథోద్దామతన్ = సహింపరాని దుఃఖాతిశయముచే, దుస్సహలోకశోకమున్=సహింపరాని జనుల దుఃఖమును.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి లేని తేరిని నేను దోలుకొనిరాఁగాఁ జూచి పురజనులు సహింపరాని దుఃఖాతిశయముచే రాజవీథియందుఁ దల్లడించిరి, ఇఁక నాఁడువారో మేడలమీఁదనుండి హాయని బిగ్గ నేడ్చిరి. పురజనుల తీవ్రశోకమును గుఱించి యింతకెక్కువ నేనేమి చెప్పఁగలను.

కం విమలాయతనేత్రంబులఁ, బ్రమదలు కన్నీటితోఁ బర•స్పరవీక్షా
　క్రమ మేది యేడ్చు చుండిరి, శమియింప వశంబు గాని•సంతాపమునన్. ౧౮౮

తా త్ప ర్య ము.

స్త్రీలు కన్నులనుండి నీరుకాఱుచుండ కాటుక కరఁగిపోయి తెల్లనైన నిడివాలుఁ గన్నులతో నొకరినొకరు చూడక యెవరంతటవారు దుఃఖము నణఁచుకొనలేక యేడ్చుచుండిరి.

కం. వీరలు పగగలవారలు, వీర లుదాసీనజనులు • వీరలు హితు లం
　చో రాజ! సెబుఁగ నైతిని, వారక జను లెల్లవారు • వనరుచు నుంటన్. ౧౮౯

ఉదాసీన జనులు=మధ్యస్థులు- వనరుచునుంటన్=దుఃఖించుటచే- శత్రువులు మిత్రులు నీకనికాని వారిలోవారికనికాని గ్రహింపవలెను.

### తాత్పర్యము.

జనులందఱు నేకవిధముగ దుఃఖించుటచే వీరు శత్రువులు వీరు మిత్రులు వీరు మధ్యస్థులు అని నేను దెలిసికొనలేక పోయితిని. శ్రీరామచంద్రుని విషయమున శత్రువులు లేరు, మధ్యస్థులు లేరు.

కం సంతోషరహితలోకయు, సంతప్తహయద్విపార్త • శబ్దార్దితయున్
చింతానిశ్వాసయు భూ,కాంతా! కౌసల్య యనఁగఁ • గ్రాలెం బురియున్. ౧౨

సంతోషరహితలోకయు=సంతోషములేని జనముగలదై -సంతప్త = మిక్కిలి శోకముచేఁ బరితపించు- హయ=గుఱ్ఱములయు- ద్విప=ఏనుఁగులయు- ఆర్త శబ్ద = ఏడుపు ధ్వనిచే- అర్దితయున్=పీడింపఁబడినది- చింతానిశ్వాసయు = వ్యసనమువలనఁ గలిగిన నిట్టూర్పుగలది.

### తాత్పర్యము.

సంతోషములేక శోకముచేఁ బరితపించు గుఱ్ఱములయు నేనుఁగులయు నేడ్పు ధ్వని, చింతచేఁగలిగిన నిట్టూర్పులుగలదై యిక్కడ నీకౌసల్యాదేవి యెట్లున్నదో నయోధ్య యంతయు నట్లెయున్నది. శ్రీరామవియోగమునఁ గన్నతల్లి కౌసల్యయెట్లున్నదో పురమంతయు నట్లెయున్నది. ఈమెను జూచినఁ బురమంతయుఁ నీవుచూచి నట్లే. ఈమె కన్నతల్లియని యెక్కువ దుఃఖముగాని వారన్యులని తక్కువదుఃఖముగాని కనఁబడలేదు. ఇంతవఱకుఁగల గ్రంథముచే శ్రీరాముఁడు సర్వాంతర్యామి యను విషయము కవి సూచించెను గావునఁ బ్రబంధగతవస్తువుచే వస్తుధ్వని- ఇట్లు శ్రీరాముదుఃఖమునకై ప్రజలు దుఃఖించుటకుఁ గారణము ౧౫-వ పద్యంబునఁ జెప్పఁబడెను.

కం.ఈరీతి సూతుఁ డాడిన, తీవ్రామాణుం డాలకించి • గాఢవ్యసనో
దారత దారితమతి యై, ఘోరగద్గదిక మంత్రి•కుంజరు ననియెన్. ౧౩

ఆలకించి=విని- గాఢవ్యసనోదారతన్ = దృఢమైన దుఃఖాతిశయముచే- దారితమతియై=చీల్పఁబడిన మనస్సుగలవాఁడై -గద్గదికన్=డగ్గుత్తికచే- మంత్రికుంజరున్=మంత్రిశ్రేష్ఠుని.

### తాత్పర్యము.

ఈవిధముగా సూతుఁడు చెప్పఁగా రాజువిని దృఢముగ నాటిన శోకముచే మనస్సు చీల్పబడినవాఁడై డగ్గుత్తికతో మంత్రిశ్రేష్ఠుఁడగు సుమంత్రునితో నిట్లనియె.

—• { సుమంత్రునితో దశరథుఁడు దన్ను శ్రీరాముఁ డుండుచోటికిఁ దీసికొని పొమ్మని చెప్పుట. } •—

సీ. పాపాభిజనభావ • బాలిశకైకేయి,వినియుక్తమై నవి•వేకి నగుచు
మంత్రకుశలు లైన•మంత్రులు వృద్ధులు, హితులు ధీయుతవారు • లేంద తెంద

మసల నొక్కరితోడ • మంతనంబుండక, స్త్రీ మోహమునఁ జేసి• చేసినాఁడ
నేమిరో మునిఁగి పో•యినయట్లు సాహసం,బిది భవితవ్య మై•యేఁ బుపడిరొఁ
ఆ. గులవినాశమునకుఁ • గూడె యదృచ్ఛమై, యిట్టిఘోరదుఃఖ;•మేను నీకుఁ
గొంచెమేని మేలు•గూర్చియుండినఁ, బొమ్ము తోడుకొంచుఁ•బుత్రుకడకు.
౧౩౧

తానడిగిన ప్రశ్నకుఁ బ్రత్యుత్తరమిచ్చుటయే గాక రాజ్యక్షోభాదుల నధిక ముగా సుమంత్రుఁడు వర్ణింపఁగావిని దశరథుఁడు నేను జేసినది లోకసమ్మతము గాని దుష్కార్యమని తెలుపుటకై యితఁడీ రాజ్యక్షోభము గుఱించి చెప్పుచున్నాఁడని తలఁచి తాను జేసినది దుష్కార్యమేయని యొప్పుకొనుచున్నాఁడు.

పాపాభిజనభావ=పాపరూపమై వంశపరంపరగా వచ్చిన యభిప్రాయముకలది. చావుము బ్రదుకు మేచందమైనను గమ్ము చెప్పక విడనని మగని నిర్బంధించిన తల్లి గలది. (౯౯౧-వ ప.) బాలిశ=మూర్ఖురాలు- ౩౮౦-౩౮౧ పద్యములు చూడుఁడు.) ధర్మమొ లే కధర్మమొ యుతంబొ యసత్యమొ యానుగాక యోదుర్మతి యేల నేను విడుతున్ భవదాత్మజుతిమి క దక్కసన్- రాముని రాజుగఁ జేసెదవా మహిత విమం బుఁగ్రోలి వసుధేశ! యిదే నీముందట నీవుగనన్, నేమరణము నొందుదాన నిక్కము సుమ్మా. అని చెప్పెనుగదా. వినియుక్తమైన్=విశేషప్రేరణము చేత-అవివేకిన్=యుక్తా యుక్త పరిజ్ఞానము లేనివాఁడను- ఇంద=ఈగృహమందే-మసలన్=తిరుగుచుండఁగా- మంతనంబుండక=ఆలోచింపక- స్త్రీమోహమునఁ జేసి=ఆఁడుదానియందుఁగల మో హముచేత- భవితవ్యమై=అనుభవింపవలసినదై-ఇదియిట్లు కావలసినదై - కులవినా శమునకున్=వంశము నాశమైపోవుటకు- యదృచ్ఛమై=దైవసంకల్పితమై.

తాత్పర్యము.

వంశపరంపరగా వచ్చిన పాపాభిప్రాయము గలదియు, మూర్ఖురాలు నగు కైకేయి ప్రేరణముచే నిది చేయవచ్చును ఇది చేయరాదను నాలోచనములేక యా లోచనము చెప్పుటయందు నేర్పరులైన మంత్రులు- పెద్దవారు- మేలుకోరువారు- బుద్ధిమంతులైన పౌరులందఱియింటియందే పట్టాభిషేకమునకై సుఖిగూడి యుండి నను నొకరితోడనైన నాలోచింపక స్త్రీలయందు నాకుఁగల దుష్కామముచే మతి చెడి వెంటనే చేయుకున్న నేమో మునిఁగిపోయినట్లు త్వరపడి యింత సాహస కార్యము చేసితిని. కులమీవిధముగ నాశముగావలసి యుండుటచే నింత భయంకర దుఃఖము దైవికమై తటాలున వెనుకముందు నాలోచింపనీక తటస్థించెను. అయిన దేమో యయినది. నీకెన్నఁడైన నేనేదైన మేలుచేసియుంటినేని బదులు మేలు చేయ నీకు సమ్మతమేని నన్ను శ్రీరామునొద్దకుఁ దీసికొనిపొమ్ము.

మంత్రులతో నాలోచింపక చేసినకార్యమునకై దశరథుఁడు పశ్చాత్తాప పడుట ధర్మ్యమే. దశరథుఁడు చేసినది తప్పు.

"కం. వినుమధు రాహారంబులు, గొనుటయుఁ బెక్కండ్రు నిద్రగూడిన మెడమే, లక్కనియుండుట గార్యాలో, చనము దెసవు నడచుటయుఁ జనదొక్కనికిన్."
అను నీతి నతిక్రమించెను. దశరథుఁడు మరల సభ చేసి నిన్న సభలో శ్రీరాముని రాజు చేసెదనని చెప్పితిని. ఇప్పుడు కైకకు నిట్లు వరమిచ్చితిని. ఈధర్మసంకట సమయమున నేమిచేయు మనెదరు అని మంత్రులతో నాలోచించియుండిన నింద యతని యందు లేకుండును. అట్లు చేయకుండుటకుఁ గారణము శ్రీమోహమని యతఁడె చెప్పెను. ఆ మోహఫల మనుభవించుచున్నాఁడు.

౨౩౯-౨-వ పద్యంబున నాలోచన యొంటరిగాఁ జేయుట రాజదోషమని చెప్పఁబడెను.

కం. ఇప్పటికిని నాయూవలి, తప్పక చెల్లెడిన యేని • తనయునిఁ దెచ్చి
తెప్పున రాముఁడు లేమిని, ముప్పొదవెసి బ్రతుక లేను•మూర్తం బేనిన్. ౧౪౩౨

తా త్ప ర్య ము.

అటు నీవు పోవుట సరిగాదు. నీవు పోఁబోనిన నాఁడువారందఱు వయునింతురు. ఊరివారందఱు బయలు దేఱుదురు, అందువేని నశైన నేను రాజ నని నా యాజ్ఞ మీఱరాదని నీకుండినయెడల శ్రీరామునినే వెంటనే పిలుచుకొని రమ్ము. ఆ ప్రకారమో యీ ప్రకారమో యేదో యొక విధముగ శ్రీరామునిఁ జూడకుండిన నల్పకాలమైన నేను బ్రదుకను మరణింతును.

ఉ. దూరము పోవు నేమొ యల•తోయజమిత్రకులోద్వహుండు నా
తేరిని బన్ని న న్నటకుఁ • దెప్పవె, దోడ్కొని పొమ్ము సారథీ!
యారమణీయమూర్తి విమ•లాయతకీర్తి జగజ్జనాళిహృ
ద్వారిజవర్తిఁ గాంచఁగల•వాఁడ ధరన్ మని యుండఁగల్గినన్. ౧౪౩౩

తోయజమిత్రకులోద్వహుండు=సూర్యవంశము నుద్ధరించువాఁడు, రమణీయమూర్తిన్=మనోహరమైన యాకారముగలవానిని,విమలాయతకీర్తిన్=నిర్మలమై విస్తారమైన కీర్తిగలవానిని, జగజ్జనాళి=లోకమునందలి జనసమూహముయొక్క, హృత్=హృదయమనెడి, వారిజ-కమలమునందు.వర్తిన్=వర్తించువానిని మనియుండఁగల్గినన్=బ్రదికియుంటినేని, ఇందలి విశేషణములు మూఁడును భగవంతునందు నన్వయించును.

తా త్ప ర్య ము.

శ్రీరాముఁడు మరలిరాఁడందువా అట్లైన మనమిట్లు ముచ్చటలాడుచుండి జాగుచేసిన శ్రీరామచంద్రుఁడు దూరముపోవును. కావున రథమును సిద్ధముచేసి తీసికొనిరమ్ము. ఆ యప్రాకృత దివ్యసుందర విగ్రహమును ఆ మహాయశోవంతుని, ఈశ్వరునివలె సమస్తజనుల హృదయమున నుండువాని జీవితదశయందే చూడఁగలుగుదును.

ఉ. అసగుముద్దునెమ్మొగము • నామణికుండలమండితంబు లౌ
వీనులు నాప్రఫుల్లదర•విందవిశాలవిలోచనంబు లౌ

జానుపుదీర్ఘ బాహువులుఁ • జారుతరం బగువృత్తదంతముల్
గానకయున్న సంయమనిఁ • గానఁగఁ జోక ధ్రువంబు సారథీ.  ౧౫౩౪

మణికుండల మండితంబులు=రత్నములచేఁ చేయఁబడిన చెవిపోగులచే నలంక రింపఁబడినవి, వీనులు=చెవులు, ప్రఫుల్లత్=చక్కఁగా వికసించిన, అరవింద=కమల ములవలె, విశాల=వెడల్పయిన, విలోచనంబులు=కన్నులు, ఆజాను దీర్ఘ బాహువు లు=మోఁకాటి నంటు చేతులు, వృత్త=వట్రువయైన, సంయమినిన్ = యమపట్టనం బును, ధ్రువంబు=సత్యము, భగవత్స్వరూప సాక్షాత్కారము లేనివాఁడు నరకము నకుఁబోవుట యరుదా? ఈ కాలమున నిది మానసికము.

తా త్ప ర్య ము.

చిఱునవ్వుచే నందమైన ముఖమును రత్నములు చెక్కిన పోగులును బాగుగ వికసించిన కమలములవలె విశాలములైన కన్నులును మోఁకాటి నంటు నిడుపాటి చేతులు మనోహరములైన దంతములను జూడకయుంటినేని నేను మరణించుటసత్యము.

తే. ఇంతకంటెను దుఃఖ మిం • కేది గలుగు? నిట్టిదురవస్థలోనున్న•యట్టినేను
గన్నులారఁగ రఘురాముఁ • గానవైతి, నేనియు సుమంత్ర! దిక్కేది•యింకనాకు.

తా త్ప ర్య ము.  ౧౫౩౫

సుమంత్రా! శ్రీరాముని విడిచి యుండుటకంటె మిగుల దుఃఖకరమైనది నాకేదిగలదు. ఇట్టి యాసన్న మరణావస్థలోనుండు నేను గన్నులార నా శ్రీరామ చంద్రుఁ జూడకపోయితినా నాకేది దిక్కు?

కం. హా రామా రామానుజ, హా రమణీమణి ధరాత్మ•జా దుస్సహదు
ష్పారవ్యథ దిక్కతీన, ట్లీ రీతిని జచ్చువన్ను • నెఱుఁగర మీరల్.  ౧౫౩౬

రామానుజ=లక్ష్మణా! రమణీమణి=స్త్రీరత్నమా! ధరాత్మజా = సీతాదేవీ, దుస్సహదుష్పారవ్యథన్=సహింపరాని దాఁటరాని శోకబాధచే, దిక్కతీనట్లు=దిక్కు లేనివానివలె. రెండవ పాదమునఁ బ్లుత యతి. భీతి తర్కశోక గీత దూరాహ్వాన సంశయార్థములను జరగుఁ బ్లుతము.

తా త్ప ర్య ము.

హా రామా! హా లక్ష్మణా! హా సీతాదేవీ సహింపరాని దాఁటరాని బాధచే దిక్కులేనివానివలెఁ జావనున్న నన్ను మీరలెఱుఁగరుకదా.

సీ. అని యేడు మున్ని దుః•ఖాంబుధిఁ గౌసల్య, దిక్కు మొగం బయి • దేవి రామ
శోకమహాభోగ • మై కంజనేత్ర శావ ఘూరత్న విశ్లేష•పారగంబు
నై శ్వసితోర్మిమ•హావర్తమై బాష్ప, ఫేనజలావిలా•భీల మగుచు
హస్తవిక్షేపమీ•నౌఘమై క్రందితో, దీర్ణరవంబు ప్ర•కీర్ణ కేశ
తే. శైవలంబును గైకయ•తాన్మరతేంద్ర, పుత్రికాబడబాముఖ•మును మదభ్రవు
మేగజము మంథరావాక్య•వికటనక్ర, భీకరము పాపినీవర-వేల మగుచు.  ౧౫౩౭.

ఇందు శ్రీరామవియోగ దుఃఖమును సముద్రముగాఁ గవి వర్ణించుచున్నాఁడు.

దుఃఖాంబుధిన్=దుఃఖసముద్రమునందు, రామశోకమహాభోగమై = శ్రీరాముని విడుచుటవలనఁ గలిగిన దుఃఖమనెడి వైశాల్యముగలదై, కంజనేత్రా=కమలము వంటి కన్నులుగల, వధూరత్న=సీతయొక్క, విశ్లేష=వియోగమనెడి, పారగంబు=గట్టునుగలదై, శ్వసితోర్మి మహావర్తమై=నిట్టూర్పులనెడి యలలోని గొప్పసుడులు గలదై, బాష్పఫేన జలావిలాభీలయగుచున్ – బాష్ప = కన్నీరనెడి, ఫేన=నురుగుతోడి, జల=జలముచేత, అవిల=కలఁత నొందిన, అభీలము=భయంకరమైనది, హస్తవిక్షేపమీనౌఘమై=చేతులువిదర్చుటయనెడి చేపల సమూహముగలదై, క్రందిత = ఏడుపనెడి, ఉదీర్ణరవంబు=గొప్ప ధ్వనిగలదై, ప్రకీర్ణకేశశైవలంబును=విరిసిన వెంట్రుకలనెడి పాచితీఁగెలుకలదై, కేకయత్న్యాత్రలేంద్ర తనయా=కైకయనెడి, బడబాముఖమును=బడబానల ముఖముగలదై, మదశ్రువేగజము=నాకన్నీటి వేగమువలనఁ గలిగినది, మంథరయొక్క వాక్యములనెడి, వికటనక్ర = భయంకరమైన మొసళ్ళచే, భీకరము=భయమును గలిగించునదియై, రాముఁ డరణ్యమునకుఁ బోవుటకు మంథరయే మూలకారణమని దశరథునకుఁ దర్వాత దెలిసినదని యిదిసూచించుచున్నది. తత్కాలమున నెఱుఁగఁడుకాని యావల దాసీజనులు చెప్పుటచేఁ దెలియవచ్చినది. పాపినీ=పాపాత్మురాలగు కైకయొక్క, వర=వరములనెడి, వేలము=చెలియలి కట్టగలదై.

తాత్పర్యము.

ఈ ప్రకారము రాజు దుఃఖసముద్రములో మునిఁగి కౌసల్య దిక్కు ముఖము త్రిప్పి దేవీ! రామశోకమనెడి వైశాల్యమును గలిగి సీతావియోగమనెడి యొడ్డు నొరసి నిట్టూర్పు సుడులతోఁ గన్నీటి నురుగుతో భయంకరమై యేడ్చునపుడు చేతుల విదిలింపులనెడి చేపల సంచారము గలిగి యేడుపనెడి ధ్వనియు విరియఁబోసిన వెంట్రుకలనియెడి పాచియుఁ గైకయనెడి బడబాముఖముగలదై నాకన్నీరనెడినదుల వేగముచేఁబుట్టి మంథరవాక్యములనెడి మొసళ్లు పాపాత్మురాలగు కైక వరములనెడి చెలియలి కట్టకలిగి.

కం. రామప్రవ్రజ్యాయుత, మామహితార్ణవమునందు • నబలా యిపు డా
రాముఁడు దోడ్పడ కుండిన, నే మునుఁగుదు; దాఁట లేన • యీదుఃఖాబ్ధిన్.

౧౯ ॥ ౩౮

రామప్రవ్రజ్యాయుతము=రాముఁడు దేశము విడిచిపోవుట యనెడి నిడివిగలదైన, మహార్ణవమునందున్=గొప్ప సముద్రమునందు.

తాత్పర్యము.

శ్రీరాముని దేశత్యాగమే నిడివిగాఁగల యీగొప్ప సముద్రమునందు నిప్పుడా శ్రీరాముఁడు సహాయుఁడై రాకయుండిన నేను మునిఁగిపోదును. ఈ దుఃఖసముద్రమును దాఁటలేను.

దుఃఖసముద్రమున మునుఁగు వానికి శ్రీరామానుగ్రహమే తరణోపాయము.

చం. అనుజసమేతు రాముఁ గన • నాకు జనించియుఁ గావలేన, యో
వనితరో! యింతకంటెఁ బెనుఁ • బాపము గల్గునె? యంచు మూర్ఛిలం
దనయునిమిత్తమై హృదయ • నాథునిఁ గూర్చియు నిబ్బడింపఁగా
మనమున దుఃఖ మామహిళ • మానని భీతి వణంకి వెండియున్.   ౧౫౩౯

అనుజసమేతున్ = తమ్మునితోఁ గూడినవానిని, ఇబ్బడింపఁగాన్ = రెట్టింపు కాఁగా, ఇదివఱకు కొడుకున కేడ్చునది యిపుడు మగఁడేమగునో యనికూడ నేడువ వలసివచ్చినది.

తా త్ప ర్య ము.

లక్ష్మణునితోడి శ్రీరామునిఁజూడ నాకగలిగియుఁ జూడలేకయున్నాఁను. ఇంత కంటె ఘోరపాపముండునా? యని మూర్ఛపోయిపడఁగాఁ గొడుకు నిమిత్తమై మగ నిఁగూర్చియు దుఃఖము రెండింతలు కాఁగా నా కౌసల్య వదలని భయముచే వణఁకి మఱియును.

౬౦-వ సర్గము.

ఉ. భూతము సోఁకిన ట్లసుఁబు • పోయినయ ట్లయి రాముమాత యా
సూతునిఁ జూచి యి ట్లనియె • సూతకులాగ్రణీ! నన్ను రాముఁడున్
సీతయు లక్ష్మణుం డెచటఁ • జేరిరొ యచ్చట నీకు పుణ్య మౌ;
ఖ్యాతచరిత్రుల న్విడిచి • కాయము నిల్వదు పో నిమేషమున్.   ౧౫౪౦

భూతము=దయ్యము,ఉసుఱుపోయినట్లు = ప్రాణముపోయిన విధమున, ఖ్యాత చరిత్రులన్=ప్రసిద్ధికెక్కిన నడవడిగలవారిని, కాయము=దేహము.

తా త్ప ర్య ము.

దయ్యముపట్టినట్లు దేహము తెలియక ప్రాణముపోయినట్లు చేష్టలుడిగి కౌసల్య మఱి సుమంత్రునిఁజూచి సూతవంశరత్నమా? శ్రీరాముఁడు సీత లక్ష్మణుఁ డెచ్చటఁ జేరినారో యచ్చట నన్ను వదలిపెట్టుము, నీకుఁ బుణ్యము కలుగును. ఏలన నా ప్రఖ్యాతచరిత్రుల విడిచి నిమిషమైనను దేహము నిలువదు. కావున నన్నచట విడి చినఁ బ్రాణరక్షణము చేసిన పుణ్యమబ్బును.

చం. మరలుపవయ్య తేరు గుణ • మండను లుండెడిదండకాటవిన్
సరగున నన్ను నీకు మఱి • నాసుతులం గదియంగ లేనిచో
నరుగుట నిశ్చయంబు యము • నాలయసీమకు నంచు నేడ్చినన్
గరుణము దోఁప నారమణిఁ • గాంచి సుమంత్రుఁడు పల్కె మ్రొక్కుచున్.   ౧౫౪౧

మరలుపుము = వెనుకకుఁ ద్రిప్పుము, గుణమండనులు = కల్యాణగుణములే

యలంకారముగాఁ గలవారు, సరగునన్ = త్వరగా, కదియంగన్ = సమీపింపఁగా, యమునాలయసీమకున్=యముని గృహప్రదేశమునకు.

తా త్ప ర్య ము.

అయ్యా, సుమంత్రా! తేరిగుఱ్ఱముల నింకను విప్పలేదుగదా? విప్పవలదు. తేరిని వెనుకకుఁ ద్రిప్పుము, కల్యాణగుణములే యలంకారముగాఁగల నాకొడుకులుం డెడి దండకారణ్యమందు నన్నుఁ ద్వరగా వదలుము. నా కొడుకులను నేను గలిసి కొనలేక పోయితినా యమపురికిఁ బోవుట నిశ్చయము. అని యేడ్వఁగా శోకముతో నామెను జూచి నమస్కరించి సుమంత్రుఁ డిట్లనెను.

—• సుమంత్రుఁడు కౌసల్య నూరార్చుట. •—

కం. విడువుము శోకము మోహము, విడువుము దుఃఖభ్రమంబు • విడి పరితాపం
బడవులలో దేవి! నీకొడుకు చరించెడిని సీదు•కోడలితోడన్. ౧౫౮౨

తా త్ప ర్య ము.

తల్లీ! శ్రీరాముఁడు విడిచిపోయె నను శోకము విడువుము. అడవులలో వారి కేమి యాపద గలుగునో యను మోహము విడువుము. శ్రీరామునకు దుఃఖము గలిగినదను మతిభ్రమము వదలుము. ఏ తాపము లేక నీకొడుకు నీకోడలితోడ నడవు లలో సంచరించుచున్నాఁడు.

కం. సౌమిత్రియు ధర్మరతిన్, భామారత్నంబ! రాము•పదపంకజముల్
నేమములను విజితేంద్రియుఁడై మహితపరంబు నొంద • నర్చనసేయున్. ౧౫౮౩

తా త్ప ర్య ము.

లక్ష్మణుఁడో ధర్మమందలి ప్రీతిచే శ్రీరామచంద్రుని పాదకమలములను గొప్ప పరమపదంబు సంపాదింపఁగోరి యింద్రియములజయించి ప్రాకృతసుఖములను గోరక నియమముదప్పక సేవించుచున్నాఁడు.

ఉ. రామునిమీఁద మానసము • రాజముఖమణి సీత నిల్పి తా
ధామమునందుఁబోలె జన•తారహితాటవి నైజభంగియ
ట్లామెత నొంది భీతియు ర•వంతియుఁ గానక ధీరయట్లులెం
తో ముద మారఁగాఁ దిరుగు • చున్నది కాన దొకింతదైన్యమున్. ౧౫౮౪

రాజముఖ=చంద్రునివంటిముఖముగల స్త్రీలయందు, మణి = రత్నమువంటిది, ధామమునందుఁబోలెన్ = స్వగృహమునందువలె, జనతారహితాటవిన్ = జనసమూహములులేని యడవియందు, నైజభంగిన్=స్వాభావవిధమున, ఎప్పటియట్ల-ఆమెత= తృప్తి, ధీర=ధైర్యముగలది, ఒకింత=కొంచెమైనను, దైన్యమున్=వ్యసనమును.

తా త్ప ర్య ము.

స్త్రీరత్నమగు సీతాదేవి మనస్సంతయు శ్రీరామునిమీఁదనే నిల్పి తన యింటి యందెట్లులో యట్లులే యెప్పటివలెఁ గ్రొత్తస్థలమని యెంచక తృప్తిపడి భయము

కొంచెమైనను లేక ధీరురాలివలె నెంతో సంతోషముగా వ్యసనమనునది లవమైనను లేక తిరుగుచున్నది. తనమనస్సంతయుఁ దనభర్తయందే యున్న కారణమునఁ దా నరణ్యములో నుండుట యామెకు స్ఫురింపనే లేదు.

భక్తుల చరిత్ర యింటియందున్నను నడవియందున్నను నేకవిధముగానే యుండును. ఇంట నడవియందున్నట్లును, నడవిని నింటియందున్నట్లుండును. అక్కడ నిక్కడఁ జేయవలసినకార్యము శ్రీరామునిమీఁద మనస్సు నిలుపుటయే, అందు నేమఱుపాటురాదు. తక్కిన వేవియున్నను వ్యసనము భయములేదు. అడవియు నయోధ్య యని సుమిత్ర చెప్పెనుగదా.

కం. ప్రమదావనాంతరములం బ్రమదామణి మున్ను తిరుగు • భాతిని జనశూ
న్యము లగు నడవులయందును, రమియించుచు నున్న దమ్మ • రాగము మీఱన్. ౧౪౫

ప్రమదావనాంతరములన్ = స్త్రీలుసంచారముచేయు నుద్యానవనములలోపల, మున్ను = ఇంతకుఁ బూర్వము, తిరుగుభాతిని = తిరుగునట్లే, జనశూన్యములు = మనుష్యులు లేనివి, రమించుచున్నది = క్రీడించుచున్నది.

తాత్పర్యము.

స్త్రీలు తిరుగు నుద్యానములలోఁ బూర్వము భయములేక యెట్లు క్రీడించుచుండెనో యీ విధముననే సీతజనములులేని యడవులందును ప్రీతితోఁ గ్రీడించుచున్నది.

కం. బాలికవలె బాలేందుక, లాలాలితనిటల యవని • లాసుత నిజహృ
ల్లోలాధీనాత్మక జన, జాలచ్యుత వనులలోను • సతి రమియించెన్. ౧౪౬

బాలికవలెన్ = చిన్నపిల్లవలె, బాలేందుకలా లాలితనిటల = పాడ్యమి, విదియనాటిఁ చంద్రకళవంటి యందమైన నొసలుగలది. ఇలాసుత = భూపుత్రి, నిజహృల్లోలాధీనాత్మక = తన హృదయేశ్వరు నధీనమునున్న మనస్సుగలదై, జనజాల సమూహముచే, చ్యుత = విడువఁబడిన, వనులన్ = అడవులలో, రమించెన్ = క్రీడించెను.

తాత్పర్యము.

సీతాదేవి తన మనస్సును దనపతి స్వాధీనమునుంచి మనుష్యులులేని యడవులందుఁగూడఁ జిన్నబిడ్డవలె నాడుకొనుచున్నది.

ఇంద్రియముల మూలమున మనస్సు పోయి విషయముల సంస్పర్శ కలిగిననే యవి కానవచ్చుట వినవచ్చుట లోనైనవి. మనస్సేకాగ్రముగ భగవంతుని పైనుంచినపు డేపదార్థము కానరాదు. ఏ ధ్వని వినరాదు. దేనిని జూచుట వినుట లేనపుడు భయములోనైనవి యెక్కడినుండివచ్చును.

సీతాదేవిని బాలిక యను విషయమున, 'బాల్యేన తిష్ఠాసేత్' పిల్లవానివలె నుండవలెను అను శ్రుతి స్మరించునది. చిన్న పిల్లవలె సీతాదేవి యభిమానము భయమువదలి వర్తించెనని భావము.

కం.తదధీనం బయి ప్రాణము, మది తద్గత మగుచు నుంట • మహిజ కయోధ్యా
పద మడవి రాములేమి, న్మదిరాక్షికి వన మయోధ్య • నాథుం డుంటన్. ౧౫౪౭

తదధీనము = రామాధీనము, మది=మనస్సు, తద్గతము=ఆయనను బొంది యుండునది.

మచ్చిత్తాః మద్గతప్రాణాః బోధయంతః పరస్పరమ్ ।
కథయంతిచ మాంనిత్యం తుష్యంతి చ రమంతిచ॥ భ. గీ.
"మయ్యేవమన ఆధత్స్వ. మయి బుద్ధిం నివేశయ నివసిష్యసి మయ్యేవ"
భ. గీ. ౧౨.

అను శ్లోక మీసందర్భమున ననుసంధించునది. మహిజకున్=సీతకు.

తా త్ప ర్య ము.

ప్రాణము శ్రీరాముని స్వాధీనముఁజేసి యనఁగా రఘూత్తమ మాయన యందు వైచి మనస్సాయనయందే నిలిపి యుండుటచే సీతకు శ్రీరాముఁడు లేని యయోధ్య యడవి శ్రీరాముఁడున్న యడవియే యయోధ్య. మనస్సు ప్రాణము లేని దేహ మెందున్న నేమిసుఖింపఁగలము. భక్తులకు. భక్తురాండ్రకు సీతాచరిత్ర మనుసరణీయము. సదా స్మరణీయము.

ఉ. రాముని లక్ష్మణున్ జనక • రాజతనూభవ త్రోవ నున్నయా
గ్రామములం బురంబులఁ ద•రంగిణులన్ ద్రుమపాళిఁ గాంచి పే
రేమిటొ వీని? కెందుఁ జను • నియ్యవి? యే మది? యంచుఁ బ్రశ్నలన్
గోమలి సేయుచుం జనియెఁ • గూర దొకింతయు శోక మాత్మలోన్. ౧౫౪౮

జనకరాజతనూభవ=సీత- తరంగిణులు=ఏఱులు- ద్రుమపాళిన్ = చెట్లగుంపులను- కూరదు=పొందదు.

తా త్ప ర్య ము.

సీతాదేవి త్రోవఁబోవునపుడు శ్రీరామలక్ష్మణులను ఆగ్రామము పేరేమి యీ యూరిపేరేమి యీనదిపేరేమి ఆచెట్ల పేరేమి. ఈ నదులెచ్చటికిఁ బోవును. అని ప్రశ్నలు సేయుచుఁ బోయెనుగాని శోకమునునది యామె పొందినదిగాదు.

ఇది రథముమీఁదఁ బోవునపుడు జరగిన సమాచారము. వారు నడచిపోగాఁ సుమంత్రుఁడు చూచిననాఁడు అందు పురాదులు లేవు.

తే. మనపురంబున కొకక్రోశ • మాత్రమున్న, యాటతోఁటను గ్రీడించు • నరుసమునను
నడవిఁ దిరుగుచు నున్నదా • యమలచిత్త, యామెకై నీవు దుఃఖింప • నగు నటమ్మ. ౧౫౪౯

తా త్ప ర్య ము.

నిర్మల మనస్సుగల యాసీత మననగరమున కొకకోసు దూరమందున్న క్రీడావనమందు నాటలాడువిధమున నడవియందును దిరుగుచున్నది. ఆమెకై పామరు లేడువవలయునుగాని నీయట్టిది యేడువవచ్చునా?

సీ. ఇప్పుడు జ్ఞప్తి నా • కింతియు కైకేయి,గూర్చి తటాలునఁ • గోమలాంగి
యేమేమొ పల్కె-న • వెల్ల దోఁపవ యిప్పు, డని ప్రమాదంబున•జనకతనయ
పలికినపలుకులు • పలుకఁ బూనియును ద,ల్పిన్ని స్వనమును ద్రిప్పి • ప్రమదకరము
లైనవాక్యంబుల • ననియె మధురముగ, దాచి గాసిని గాని • ఘోరవాత
తే. వేగమునఁ గాని యెండల•వేఁడినేని, సంభ్రమున నేనిఁ జంద్రాంశు•సదృశకాంతి
వికృతినొందద యింతేని • వినవు చింత,తల్లి నీపాదమాన త•థ్యంబు సుమ్ము.

తా త్ప ర్య ము. ౧౫౩౦

సీత గంగదాటి పోవునప్పుడు కైకేయి విషయమై చెప్పిన కొన్ని కఠినోక్తు లిపుడు సుమంత్రునకు జ్ఞప్తికివచ్చి కౌసల్య కింపుగానుండునని చెప్పఁబూని మరలఁ గొంతయాలోచించి యామాట లిపుడుచెప్పిన నీకిఁ ప్రాణాంతకము లగునని కావునఁ జెప్పరాదని నిశ్చయించి జ్ఞాపకము లేదనుచున్నాఁడు.

ప్రమాదంబునన్ = హెచ్చరిక లేమిని- ప్రమదకరములు=సంతోషకరములు- ఘోరవాతవేగమునఁగాని = భయంకరములైన గాడ్పుల వేగముచేఁగాని- మధురముగన్=తియ్యనగా- సంభ్రమము=సంభ్రమ శబ్దభవము- చంద్రాంశుసదృశకాంతి = వెన్నెలతో సమానమైనకాంతి- వికృతి=వికారము- నీపాదమాన = నీపాదములు సాక్షిగా- తటాలునన్=కోమలాంగి యేమేమొ పల్కె- ననుటచేత జ్ఞప్తి లేకుండుటకు హేతువు సూచించెను. కైకేయిఁగూర్చి యనుటచే సుమంత్రుఁడు తాను చెప్పఁదలఁచు కొన్నవిషయము సూచించెను. జ్ఞాపకంబింతియు యనుటచే నింక జ్ఞాపకములు చరోమ్మారి కౌసల్య ప్రేరింప నవకాశము సూచించెను ఇప్పుడు తోఁపదనుటచే నీ దుఃఖ మును జూచిన నామనస్సు వికలమైపోయినది జ్ఞప్తికిఁ దెచ్చుకొన సాధ్యపడదు. నీ వింతదుఃఖించుచుండ జ్ఞాపకమువచ్చినను జెప్పరాదు అని సుమంత్రుఁడు మాటను జాఱవిడిచెను. ఇట్లు మాటతప్పింప హేతువు కవియే చెప్పుచున్నాఁడు. ప్రమద కరములైనమాట లనుటచే సుమంత్రుఁడు చెప్పఁబూనిన సీతావాక్యములు దుఃఖ కరములని సూచితము. సుమంత్రుఁడు దాఁచిన సీతావచన మిట్టిదని నిష్కర్షించి చెప్పసాధ్యమా? ఇతమిత్థమని యెవరైనఁ జెప్పిన నెట్లునమ్మవచ్చును. ఈప్రశ్నలకు సమాధానము కవి యామాట నెచ్చటనైన వివరింపకుండినచో నిది యెవరికిని జెప్ప సాధ్యముగాదు గాని కవిదీని నాయునకై లిపద్ధతి ననుసరించి ముందు చెప్పఁగలఁడు. యుద్ధకాండమున ౬౭౪-వ పద్యము.

హా జగదాలమారికయికా నెఱవేఱెనుగా త్వదీప్సితం
బోజగజంతె వంశకలశోదధి చంద్రుఁడు గ్రుంకె వంశస
ద్బీజము పాడుచేసితివి తెంపరివై యిఁకమీఁద హాయిగా
నే జడనింతలేక సుఖయింపుము గుండియ నిబ్బరంబుతోన్

అని సీత తనయభిప్రాయము వెల్లడించెను.

శ్రీరాముని నడవులకుఁ బంపుటకుఁ గైకేయి యభిప్రాయ మిది యని సీత యిట్లు గ్రహించెను. తన కొడుకునకు రాజ్యము లభింపఁజేయుట మాత్రమే కైక యుద్దేశమేని శ్రీరాముని నడవులకుఁ బొమ్మనఁ గారణములేదు. కావున శ్రీరాముని నడవులకుఁబంపుటకుఁ బ్రబలమైన యుద్దేశము వేఱొకటి యుండవలెను. అది యేదన శ్రీరాముఁ డడవులకుఁ బోయెనా సీతపోవుటయు నిశ్చయము. ఆయనను విడిచి యామె యుండదు. ఆమె యడవులకుఁబోయెనా రాక్షసులు హరించుటచేతనో భక్షించుటచేతనో మఱి యేవిధముఁగనో యామె కపాయము రాకతప్పదు. ఆమె కపాయము వచ్చెనా శ్రీరాముఁడు బ్రతుకఁడు. లోకులనందఱ వశపఱుచుకొనిన శ్రీరాముఁడు చచ్చినఁగాని నా కొడుకునకు రాజ్యము స్థిరపడదు. శ్రీరాముని నిట్లుపాయముచేఁ జంపవలెఁగాని ప్రత్యక్షముగఁ జంపుమని కోరనురాదు. అది సాధ్యముకాదు. అని కైక యాలోచించెనని సీతాదేవి యభిప్రాయపడెను. ఇది యుహోహముఁగాదు. శ్రీ "రాముఁడు కానలోనన విరామతఁబొందు నిజంబు" అని మంథర చెప్పెఁగదా! (అయో. ౫౩౬-వ పద్యము.) కైక యభిప్రాయమును శ్రీరామచంద్రమూర్తియు నిట్లే గ్రహించెను. "సుప్తప్రమత్త కుపితానాం వచనైర్భావజ్ఞానం ద్రష్టవ్య"మ్మను లోక న్యాయానుసారముగా నారణ్యకాండమున "సీతాకారణముగనే। సీతాసుఁడనైన నీవు వేపురి కరుగన్। కేలిము రంజిలఁ గామా। స్వీతయగుచు భరతుమాత విలసిల్లుఁగదా" అరణ్య. ౯౯౮-వ పద్య. అయోధ్య. ౧౫౧౭-౧౫౧౮-వ యందును నీ విషయము సూచితము. ఈ పద్యములందు సీత యేమియుఁ జెప్పలేక యేడ్చుచు భర్తముఖమును జూచుచు మరల మరల సుమంత్రుని మోముఁజూచుచు గన్నీరు కార్చుచున్నట్లు చెప్పఁబడెను గదా! ఆమె యపుడు చేసినపనులచేఁ బూర్వము కావన్నమాట జ్ఞప్తికివచ్చినట్లును దానిని జెప్ప ననుజ్ఞగోరి భర్తముఖముఁ జూచుటవలన నా మాట మరల సుమంత్రునితో నిపుడు చెప్పరాదనియు, సుమంత్రుని జూచుచుఁ గన్నీరు కార్చుటవలన నా మాట నత్తమామలతోఁ జెప్పవలదనియు నామె సూచించెను.

తాత్పర్యము.

అమ్మా! సీతనుగుఱించి నాకు జ్ఞప్తియందుండు నదింతియే. కైకేయి నుద్దేశించి సీత యేవో కొన్నిమాటలు చెప్పెనుగాని యవి యిప్పుడు జ్ఞప్తికిరాలేదు. అని ప్రమాదమున సీతాదేవి చెప్పినమాటలు చెప్పఁబూని యవి యిపుడు చెప్పరాదని తలఁచి యాప్రస్తావమును ద్రిప్పి సంతోషకరములైన వాక్యముల నిట్లు తియ్యగాఁ జెప్పఁబూనెను. దోవ ప్రయాణముచేసిన బడలికచేతఁగాని క్రూరమైన గాడ్పుల వేగముచేఁగాని యెండల వేడిమిచేఁగాని సీతాదేవియొక్క- వెన్నెలతో సమానమైన దేహకాంతి కొంచెమైన మాఱినదికాదు. అమ్మా! ఇది నిజము. నీ పాదములపై నొట్టుపెట్టుకొని చెప్పుచున్నాను.

కం. అంభోజపత్రనిభము సు,ధాంభోనిధితనయతుల్య•మయి రాజిలునా
    కుంభినిసుతముఖముకురము,జృంభము రవ యేని వికృతిఁ•జెందదు తల్లీ.   ౧౫౧

అంభోజపత్రనిభము=కమలము రేకతో సమానము, సుధాంభోనిధితనయ తుల్యము=చంద్రునితో సమానమైనది. కుంభినిసుత = సీతయొక్క, ముఖముకురము=ముఖమను నద్దముయొక్క, జృంభము=వికాసము. "జృంభస్తు జృంభణే త్రిషు నాతు వికాసేస్యాత్" నానా. ర. రవయేని=కొంచెమైనను, వికృతి=మార్పు.

తా త్ప ర్య ము.

తామర రేకుతో సమానమై చంద్రునివలెఁ బ్రకాశించు నా సీతాదేవి యొక్క యద్దమువంటి ముఖముయొక్క వికాసము కొంచెమైనను మాఱినది కాదు.

కం. లాక్షారసనిభపదములు, లాక్షారసహీనము లయి • లలితసుకాంతిన్
    సాక్షాత్కమలముకుళములె, లక్షింపఁగ నిప్పుడును ని•లాసంభవకున్.   ౧౫౨

లాక్షారసనిభపదములు=లక్కవలె నెఱ్ఱనైన పాదములు, లాక్షారసహీనము లయి=లక్కరసము పూసికొనకపోయినను, లలితసుకాంతిన్=మనోహరమైన మంచి కాంతిచే, సాక్షాత్కమల ముకుళములె=ప్రత్యక్షముగాఁ దామర మొగ్గలె, లక్షింపఁగాన్= చూడఁగా, ఇలాసంభవకున్=సీతకు.

తా త్ప ర్య ము.

పాదములు చిగుళ్ళవలె నెఱ్ఱగానుండుటకై యిప్పటివారు కాళ్ళకుఁ బారాయణ మని సున్నము పసుపుకలిపి పూసికొనునట్లు పూర్వము లక్కకరఁగించి పలుచనఁగా నున్నప్పుడు దానిని బూసికొను వాడుకయుండెను. సీతాదేవి పాదములు స్వభావ సిద్ధముగనే పగడములవలెఁ జిగుళ్ళవలె నెఱ్ఱగా నుండును. అయినను నింట నున్న ప్పుడు లాక్షారసము పూసికొనుచుండెను. ఇప్పుడట్టి పూఁతలు లేకుండినను నామె పాదములు స్వభావకాంతిచేఁ దామర మొగ్గలవలె నెఱ్ఱగానే యున్నవి.

ఉ. సొమ్ములబిూఁది ప్రేమమున • సుందరి జానకి నూపురమ్ములన్
    సమ్మతి దాల్చియే హృదయ•నాథునితో సరిగాఁగ వేగవే
    గమ్మునఁ బోవఁ బాదములు • ఘల్ఘులు ఘల్లన హేలవోలె మో
    దమ్మున నేఁగఁ గంటిఁ జుమి • తల్లి యిఁకేటికి నీకుఁ జింతలన్.   ౧౫౩

నూపురమ్ములు=అందెలు, హృదయనాథునితోన్=పెనిమిటితో, హేలవోలెన్=క్రీడవలె, మోదమ్మునన్=సంతోషముతో.

తా త్ప ర్య ము

సొమ్ములబిూఁది యాశచే సీతాదేవి యందెలను బాదములనుండి తీయకయే శ్రీరామునితో సరిగాఁగ వేగముగ నడవవలయునని పోవుచుండఁగాఁ బాదములు ఘల్లుఘల్లన నాటవలె సంతోషమునఁబోవుచుండ నేను జూచితిని. ఇంకను నేమిటి కమ్మా! నీవు విచారపడెదవు.

శ్రీరామునితో నడువలేకపోయిన నీ శక్తి యింతయే యని లక్ష్మణుఁడు నవ్వునేమోయని లజ్జ. మెల్లగా నడచినఁ బ్రయాణము సాగకపోవునుగదా యని చింత తాను నడవఁజాలక శ్రమపడుచున్నాననిన శ్రీరామచంద్రమూర్తి నొచ్చుకొనునేమో యను విచారము. ఇన్ని యాలోచనలతో శ్రీరామునితోపాటు సీతయు నడచెను. సీతకు సొమ్ములమీఁది యాశకు మగనివెంటఁ బోవలయునను నుత్సాహమునకుఁ గొఱఁతలేకయుండెనని భావము. ౨౦౩౩-వ పద్యము చూడుఁడు.

కం. శ్రీరామబాహుదుర్గం, బారఁగఁ దా నాశ్రయించి • యడవిని బులులన్
గారుల సింగంబులఁ గన్నారఁగఁ గాంచియును భీతి • నందదు సుమ్మా. ౧౫౪౮

శ్రీరామబాహుదుర్గఁబు=శ్రీరాముని బాహువులనుకోటను, ఆరఁగన్ = పూర్ణముగా, గారులన్=ఏనుగులను.

తాత్పర్యము

శ్రీరాముని బాహువులనుకోటను రక్షకముగాఁగొని యడవియందలి క్రూరములగు పులులను భయము గలిగించు నేనుఁగులను వానికి భయంకరములగు సింహములను గన్నారఁజూచియు భయపడదు. కోటలో నుండువారు దేనికి భయపడుదురా? ఆమె స్వభావ భీరుత్వమువదలి ధీరయయ్యెను. శ్రీరామరక్షితులు ధీరులుగాక భీరులు కాఁగలరా?

కం. వారికిఁగా మన కేనియు, భారమగుచుంగూర్చిరైనఁ • జొగలకు మమ్మా
వీరిచరిత్రము స్థిరమై, ధారిణి సత్కీర్తితోడఁ • దరలక నిలుచున్. ౧౫౪౯

తాత్పర్యము.

అమ్మా వారడవులలోఁ గష్టపడుచున్నారనికాని, వారు మనలను విడిచిపోయి మనకింత దుఃఖము కలిగించిరే, యనికాని రాజు వారి నడవులపాలు చేసెఁగదా, యనికాని నీవు వ్యసనపడకుము. వీరి చరిత్రము స్థిరమై కీర్తితోడ భూమియందు నిలుచును.

దీనివలన ధర్మపద్ధతిఁ గీర్తిసంపాదించుటకై లోకక్షేమమునకై పడెడు శ్రమమునకు విచారపడరాదు యశస్సు పరులశ్రేయస్సు గోరువారెంతకష్టమైన నోర్వవలయును. వారికై యితరులు పరితాప పడరాదు. చేతనైన సాహాయ్యము చేయవలయును నిరుత్సాహపఱుపరాదు.

చం. జనకునియాజ్ఞఁ బూని తన • సత్యము లోకములో రహింపఁగా
మునిజను లేగుమార్గమున • మోదముతో ఫలపత్రభోజి యై
యనఘుఁడు నిత్యకీర్తిఁ గను • నార్తిని గూరకు మన్న నామెయుం
దనయుఁ దలంచి యేడ్చును సు • తా సుకుమార కుమార రాఘవా. ౧౫౫౦

ఫలపత్రభోజి=పండ్లు ఆకులు దినువాఁడు.

తా త్ప ర్య ము.

అయ్యా! దిక్కుమాలిన పక్షులవలె నిష్కారణముగా నడవులలో నల్లాడుట యేమికీర్తికరకార్యము? దానివలన నిహమా పరమా? యందు వేమో. అట్లు గాద మ్మా! అడవుల కేలపోయెను? పాపముచేసి శిక్ష యనుభవించుటకై పోయెనా? లేదు కదా! జనకునియాజ్ఞ నిర్వహించుటకుఁ దన సత్యము లోకములోఁ బ్రకాశింపఁ జేయుటకుఁగదా పోయెను? పోయి మునిజనులవలె వానప్రస్థమార్గమున ఫలములు పత్రములు భుజించుచు ధర్మమార్గమున శాశ్వతమైన కీర్తిని సంపాదించును. కావున వ్యసనపడకుము, అని చెప్పఁగా నామెయుఁ గొడుకును దలఁచి సుకుమారా కుమారా మారాకారా రామా యని యేడ్చెను.

—• { ౨౧-వ సర్గము. కౌసల్య దశరథునితో నతనిదుశ్చేష్టగుఱించి చెప్పుకొని యేడ్చుట. } •—

చం. అని విలపించుచున్ సుదతి • యాత్మవిభుం గని పల్కు భూమిపా!
తనరెడి రాఘవుం డిల వ•దాన్యుఁడు కారుణికుండు సత్యవా
గ్ధనుఁడు ప్రియైకవాది యని • గాఢయశంబు; సుఖప్రవృద్ధు లా
వనమునఁ బుత్రకుల్ నృపతి•వర్యతనూజయుఁ గుందు రెట్లొకో. ౧॥

వదాన్యుఁడు=దాత, కారుణికుండు=దయగలవాఁడు, సత్యవాగ్ధనుఁడు=సత్య వాక్కులే ధనముగాఁగలవాఁడు, ప్రియైకవాది=ముఖ్యముగాఁ బ్రియములే చెప్పు వాఁడు, గాఢయశంబు=అధికకీర్తి, సుఖప్రవృద్ధులు = సుఖముగాఁ బెరిఁగినవారలు, పుత్రకుల్ = చిన్నికుమారులు, ఈ విశేషణములు యథార్థములుగను గ్రహింప వచ్చును. ఎత్తి పొడుపుమాటలుగను గ్రహింపవచ్చును.

తా త్ప ర్య ము

ఈ ప్రకారమేడ్చుచుఁ గౌసల్య మగనిఁజూచి యిట్లనియె. రాజా! నీకు దాత యని దయగలవాఁడని సత్యవాదియని యధిక కీర్తియగును గాక యని యైనఁ జెప్ప వచ్చును.

రాజా! యాఁడుది కోరినంతమాత్రముననే వరములిచ్చెనే యెంతటిదాతయని యు- అలకయిలు, అఁడుకయిలు-అన్నట్లు వయసుపిల్లయగు నాఁడుదాని దుఃఖము చూచి సహింపలేక మనస్సు కరఁగినవాఁ డాయెఁగదా యెంతటి దయావంతుఁడనియు, కొడుకులుపోనీ- కోడలుపోనీ - పెండ్లాలేడువనీ దేశమంతయు నేడువనీ తానుజావనీ పెండ్లానికిఁ జెప్పినమాట తప్పని సత్యవాదియనియుఁ, దన్ను నంతటి యప్రియ ములు పలికినదానితోను బ్రియములే పలికెఁగదా! యెంతటి ప్రియైకవాదియని నానావ్రతముల నుపవాసములఁ బ్రయాసపడికనిన పెద్దకొడుకును దనవార్ధకమందు విడిచెఁగదా? యెంతటి త్యాగియని లోకములో నీకు నధికకీర్తి వచ్చిన రానీ, ఎంతో

సుఖముగఁ బెరిఁగినవారే యీ చిన్న బిడ్డలు వారును మహారాజకూఁతురు సీతయు నెల్లడవులలో దుఃఖపడఁగలరని తలఁచితివి!

దాక్షిణ్యముచేత, దయచేతఁ, బ్రియవచనశీలతచేత, నాకు నిచ్చినరాజ్యము వాచాపూర్వముగ నిచ్చినదానిని మరల నే నీయనని చెప్పఁజాలక తండ్రియందలి భక్తిచే మరల రాజ్యమిచ్చెనని శ్రీరామునకు యశస్సువచ్చిన రానీ, కష్టము లెల్ల సహింపఁగలరని నైనఁజెప్పవచ్చును.

కం. చలికిన్ వేఁడికి గాలికి, వలికొనక తపింప కెల్లు • వడఁ బడక వనీ
స్థలిఁ దరుణి శ్యామ సుఖయుత, మలయున్ సుకుమారిసుఖిత•మైథిలి చెపుమా. ౧౫౫

తరుణి=లేఁతవయస్సుగలది, శ్యామ=నడివయస్సుది, పదునాఱేండ్లకు బాల్యముపోవును. అది మొదలు తారుణ్యమే ఇపుడు సీతకు ౧౮ ఏండ్లు, సుఖయుత = సుఖముతోఁగూడినది, సుకుమారి=కోమల దేహముగలది.

తా త్ప ర్య ము.

రాజా! మగపిల్లవాండ్రెల్లయిన నడవులలో బాధ సహించెదరనుకొన్నను జలికివణఁకక వేడికిఁ దపింపక, గాలికివడఁబడక యడవులలో లేఁతవయస్సుది, సుఖమనుభవించు వయస్సుగలది సుఖమనుభవింప నభ్యాసపడినది, మృదువైన దేహము గలది మిథిలరాజు కూఁతురు. సీత యేప్రకారము తిరుగఁగలదో నీవే చెప్పుము.

ఉ. పప్పును నూరుగాయలును • బచ్చడులుం దననోటి కింపుగా
నొప్పుగ నంజుకొంచు మృదు • వోగిరమున్ భుజియించుసీత హా
యుప్పును లేక చప్పిడివి • యుర్విని రాలినగడ్డిగింజ లే
చొప్పునఁ దా మెసంగెడినొ • చూడుము దేవ! భవత్కృతంబులన్. ౧౫౮

ఓగిరము=అన్నము, భవత్కృతంబులన్=నీవు చేసినకార్యములను, ఓగిరము ప్ర. ఆహారము.

తా త్ప ర్య ము.

పప్పు ఊరుగాయలు పచ్చడులు తన నోటికి రుచిగా నంజుకొనుచు నన్నము దిను సీత యయ్యో! యుప్పులేక చప్పగానుండునట్టి నేలరాలిన గడ్డిగింజలను తా నేవిధముగఁ దినఁజాలునో నీవు చేసినపని యెట్టిదో చూడుము.

కం. గీతంబుల మంగళరవ, జాతంబుల వీను లలర•పతతము విను నా
సీత యెటు వ్యాఘ్ర హర్యక్షౌఘతభీకరరవంబు•నాలించెడినో. ౧౬౦

తా త్ప ర్య ము

మంగళవాద్యధ్వనులయందుఁబుట్టిన గీతములను వీనులార విని సంతోషించు సీత యేవిధముగాఁ బులులయు సింహములయు మిగుల భయంకరమగు ధ్వనులను వినునో విని భయపడకుండునో.

ఉ. ఎక్కడఁ బవ్వళించెనొ సు•రేశ్వరకేతనసన్నిభుండు దా
నక్కట నాసుతుండు పరి•ఘాభమహాభుజ మొప్ప దిండుగా
దిక్కుల లేనివానిపగి•దిన్ నునుఁబచ్చిక మెత్తపాన్పుగా,
దిక్కెవఁ డుండు తండ్రియ మ•దిం గలుషించి వ్యథాబ్ధిఁ ద్రోయఁగన్‌(౧౫౬౧

సురేశ్వరకేతన సన్నిభుండు=ఇంద్రధ్వజముతో సమానమైనవాఁడు, పరిఘాభ=ఇనుపగుదియతో సమానమైన, మహాభుజ=గొప్పభుజము, వ్యథాబ్ధిన్ = దుఃఖసముద్రమునందు.

తాత్పర్యము.

ఇంద్రధ్వజమువంటివాఁడగు నాకొడుకు ఇనుపగుదియఁబోలిన తన చేతిని దిండుగాఁ దలక్రిందనుంచుకొని దిక్కులేనివానివలె నేలమీఁద మెత్తని పచ్చిగడ్డి పానుపుగా నెందుఁ బండుకొనెనోకదా! తండ్రియే కోపించి దుఃఖసముద్రములోఁ ద్రోయఁగా నిఁక దిక్కెవ్వఁడగును?

ఉ. ఎన్నఁడు చూడఁ గల్గునొ క•చే వికచాంబుజపత్రవర్ణమున్
సన్నవపద్మసౌరభల•సచ్ఛ్వసనంబును బద్మనేత్రమున్
బ్రన్ననిప్రేలుముంగురుల•రమ్యమునై దరహాసభాసమౌ
పున్నమచందురుం దెగడు•పుత్రునిముద్దు మొగంబు నే నిఁకన్. ౧౫౬౨

వికచాంబుజపత్రవర్ణమున్=వికసించిన తామరరేకువంటిరంగును, సన్నవపద్మసౌరభల సచ్ఛ్వసనంబును=మంచి క్రొత్తదైన కమలములయొక్క పరిమళమువలె నింపైన యూర్పును, పద్మనేత్రమున్=కమలమువంటి కన్నులును, ప్రన్నని=ఇంపై, ప్రేలుముంగురులు=ముఖముపై ప్రేలాడు ముంగురులు, రమ్యమునై = మనోజ్ఞమై, దరహాసభాసము=చిఱునవ్వుచేఁ బ్రకాశించు, తెగడు=తిరస్కరించు.

తాత్పర్యము.

వికసించిన తామర రేకువన్నెకలదై, మేలైన క్రొందామరయొక్క పరిమళమువంటి సువాసనగలయూర్పు గాలియుఁ గమలములవంటి గన్నులును, ఇంపై ముఖముపై ప్రేలాడు ముంగురులును, చిఱునవ్వు అనెడు వెన్నెలగల నిండు చందురునిబోలిన నాకొడుకు ముద్దు మొగము నేను మరల నెన్నఁడు చూతునోకదా!

తే. ఇంత లయ్యునునాగుండె•యింత లింత,లగుచుఁ బెటలక యుండుట•యరసిచూడ
వజ్రసారమయంబుగా•వచ్చు నిక్క; మట్లుగాకున్న వేవక్క•లగుచుఁ బోదె.
౧౫౬౩

తాత్పర్యము.

ఇంతకష్టమువచ్చినను నాగుండె చిన్నచిన్న ముక్కలై పెటిలిపడక యుండుటకు నది వజ్రసారములోఁ జేయఁబడుటయే కారణమై యుండవలయును. అట్లు గాకుండెనేని యిప్పటికి వేయితునుకలై పెటిలిపోయి యుండదా.

కం. నాకొడుకును నాకోడలి, నాకుం గావలయువారి • నట్టడవుల న
స్తోకసుఖార్హులఁ ద్రోచితి, వేకాలమునందు భర్త • యిట్టిఁడుఁ గలఁడే౹౧౫౬౨౹

నట్టడవులన్ = అడవులనడుమ- కఱు- కీఱు- కడు- నిసు- నడు శబ్దంబుల
అచల కచ్చుపరంబగు నపుడుద్విరుక్త టకారంబగు- నడు + అడవి=నట్టడవి-అస్తోక
సుఖార్హులన్=అమితసుఖమునకు నర్హులైనవారిని- ఇట్టిఁడు=ఇట్టివాఁడు- అట్టి- ఇట్టి-
ఎట్టి శబ్దంబులకు వాఁడు వారు పరంబులగుచో 'వా' కు లోపంబు వైకల్పికంబుగ
నగు- ఇట్టి+వాఁడు=ఇట్టిఁడు.

తా త్ప ర్య ము.

నాకొడుకును నాకోడలిని నాకుఁ గావలసినవాఁడగు లక్ష్మణుని నెంతో సుఖ
పడ యోగ్యులగువారిని నడవుల నడుమఁద్రోసితివే- ఏకాలమందైనను నీవంటి మగఁ
డును గలఁడా. నాకొడుకు నీకొడుకు గాఁడా నాకోడలు నీకోడలుగాదా. నామీఁది
కోపముతో నిట్లుచేయవచ్చునా? ఎలుకమీఁది కోపముతోఁ దనయింటికిఁ జిచ్చు
పెట్టుకొనువాఁ డుండునా?

సీ. పదునేనవేట నా•పట్టి కాననమండి, వచ్చునేని భరతుండు • వసుధ నేలు
చుంట రాజ్యమునకు • నుల్లసింపఁడుదాన, భరతుఁడిచ్చిన నొడఁ•బాటుగొనఁడు
శ్రాద్ధంబునకు యోగ్య•బ్రాహ్మణుఁ బిలువక, ధనలోభమునఁ జేసి•ధరణిసురులు
తమవారలకు భోజ•నము పెట్టి యోగ్యుల, మీరిప్టపంక్తి కే•తేరఁ డనిన
ఆ. నట్టివారియింట • నమృతమేనియు నొండి, సుగుణవంతుఁ డైన•సూరి యమర
సన్నిభుండు ద్విజుఁడు•సమ్మతింపఁడు గ్రోల, నాఁగ వినమె మనము•నాథజగతి.
౧౫౬౩

పట్టి=బిడ్డ- ఒడఁబాటుగొనఁడు=అంగీకరింపఁడు- సూరి=పండితుఁడు- అమర
సన్నిభుండు=దేవతలతో సమానుఁడు- ద్విజుఁడు=బ్రాహ్మణుఁడు-నాఁగన్=అనఁగా.

తా త్ప ర్య ము.

పదునైదవ సంవత్సరమున నాకొడు కడవులనుండి వచ్చునేని భరతుఁడు రాజ్య
మేలుచుండు కారణమున రాజ్యము దానై కొనసంతోషింపఁడు. భరతుఁడిచ్చినను
నంగీకరింపఁడు శ్రాద్ధమునకు యోగ్యుఁడగు బ్రాహ్మణుని బిలువక దక్షిణ యియ్య
వలసి వచ్చునని పిసినితనమున నధములగు బంధులగువారికి భోజనముపెట్టి యోగ్య
లగువారిని మీరు మాయిప్టపంక్తికి రండనిన దేవతలతో సమానులైన బ్రాహ్మ
ణులు సుగుణములుగల పండితులైనవారు వారియింట మరల నమృతమైనను గ్రహిం
తురా? యని చెప్పఁగ మనము వినలేదా ?

దీనివలన యోగ్యులగు బ్రాహ్మణులు నిమంత్రణమునకు లభించనపుడు లోభ
ముచే వారిని బిలువక యయోగ్యులగు తనబంధువులను బిలుచుట దోషమని యే
ర్పడుచున్నది.

న శ్రాద్ధే భోజయేన్మిత్రం, ధనైః కార్యోస్య సంగ్రహః
నారిం నమిత్రం యంవిద్యా, త్తం శ్రాద్ధేభోజయేద్ద్విజమ్.

మను ౩-౧౩౮.

స్నేహితుని శ్రాద్ధమందు వరింపరాదు. వేఱువిధంబుగా ధనంబొసంగి వానిని తేరఁదీయవలయును. కర్త యెవ్వనిని దనకు శత్రుఁడనికాని మిత్రుఁడనికాని తలంపఁడో యట్టివానిని శ్రాద్ధమున నిమంత్రింపరాదు.

ఎవఁడు దేవ పితృకార్యంబులందు స్నేహితులను వరించునో యా హవ్యకవ్యములు వ్యర్థములు. అట్లు వరించినవాఁడు స్వర్గలోక భ్రష్టుఁడు. స్నేహితుల కిచ్చు దక్షిణ పైశాచదక్షిణ యనఁబడును. జ్ఞానవంతులు దొరకనపుడు స్నేహితుల నిమంత్రింపవచ్చును గాని శత్రువులను గూడదు వేదాధ్యయనము చేసినవారు-జ్ఞానులు దొరకనపుడు తల్లితండ్రిని- మేనమామను- మేనల్లుని- పిల్లనిచ్చినమామను దోడఁబుట్టినదాని కొడుకును- గురువును-దౌహిత్రుని- అల్లుని- పినతల్లికొడుకులను-ఋత్విజుని- శిష్యుని వరింపవలయును. దేవతాకార్యములందు బ్రాహ్మణుని కులగోత్రాదులు విచారింపఁ బనిలేదుగాని శ్రాద్ధాదులందు బ్రాహ్మణుని యోగ్యతను బరీక్షించియే నిమంత్రింపవలెను. ఇఁకఁ జెప్పఁబడువారు హవ్యకవ్యాదులందు నిమంత్రణమునకు యోగ్యులుగారు.

. దొంగ- పతితుఁడు- నపుంసకుఁడు- నాస్తికుఁడు- బ్రహ్మచారి- ముండనము చేసికొన్నవాఁడు- వేదాధ్యయన శూన్యుఁడు- బట్టతలవాఁడు- ఎఱ్ఱని తల వెండ్రుకలు గలవాఁడు- జూదరి-బహుయాజకుఁడు- వైద్యుఁడు- కూలికి గుడిపూజ చేయువాఁడు-వర్తకముచే జీవించువాఁడు-కూలికై రాజాజ్ఞను ఊరివారియాజ్ఞను నెఱవేర్చువాఁడు-పుచ్చిన గోళ్ళుకలవాఁడు- నల్లని దంతములు గలవాఁడు- గురువునకు విరుద్ధముగా నడచువాఁడు- అగ్నిహోత్రములు వదలినవాఁడు- వడ్డివ్యాపారము చేయువాఁడు-క్షయరోగి- పసులమేపరి- అన్నకంటె ముందు పెండ్లి చేసికొన్నవాఁడు-బ్రహ్మద్వేషి-తమ్మునికి వివాహమైనను దాను వివాహములేక యుండువాఁడు- పెక్కురకై యుంచిన ద్రవ్యముచే జీవించువాఁడు- నర్తకుఁడు- సన్న్యాసిగానుండి స్త్రీసంపర్కము గలవాఁడు- శూద్రస్త్రీమగఁడు- మొదట నొకనిని బెండ్లాడి యావల రెండవవానిని బెండ్లాడినవాని కొడుకు- ఒంటి కంటివాఁడు- తనభార్యాజారుని దనయింట నుంచుకొన్న వాఁడు- కూలికి వేదము చెప్పువాఁడు-జీతమిచ్చి యధ్యయనము చేయువాఁడు-శూద్రశిష్యుఁడు- శూద్రగురువు- పరుషములాడువాఁడు- మగఁడు బ్రదికియుండఁగా మఱియొకనికిఁ గన్నకొడుకు- పీఁడెకుండు- మగఁడు చచ్చిన వెనుక జారునికిఁబుట్టిన కొడుకు (గోళకుఁడు) తల్లిదండ్రులను గురువును నిష్కారణముగ వదలినవాఁడు-పతితులతోఁగూడి తిరుగువాఁడు- పతితులతో సంబంధముచేసినవాఁడు- ఇండ్లుతగుల బెట్టినవాఁడు- విషముపెట్టినవాఁడు- కుండగోళకుల యన్నము తిన్నవాఁడు- సముద్ర

యాన మొనర్చినవాఁడు- స్తుతిపాఠకుఁడు-నావులనుండి నూనెదీయు వాఁడు- తప్పు సాక్ష్యము చెప్పువాఁడు- తండ్రితో వాదించువాఁడు- మద్యపానము చేయువాఁడు- పాపరోగము గలవాఁడు- ధర్మముచేసెదఁని మోసగించువాఁడు- రసవస్తువు లమ్మువాఁడు-అక్కకు పెండ్లి గాకుండఁగా ముందు తాను పెండ్లి చేసికొన్నదాని మగఁడు-మిత్రద్రోహి- జూదమాడించి జీవించువాఁడు-కొడుకునొద్ద వేదాధ్యయనము చేసినవాఁడు- అపస్మారి- గండమాలగలవాఁడు- బొల్లిగలవాఁడు- కొండెములు చెప్పువాఁడు-పిచ్చివాఁడు- గ్రుడ్డివాఁడు- వేదనిందకుఁడు- వాస్తుశాస్త్రముచే జీవించువాఁడు- దూతకూలికి చెల్లను పెంచువాఁడు- కుక్కలను పెంచువాఁడు- డేగలను పెంచువాఁడు- కన్యను చెఱిచినవాఁడు హింసాస్వభావము గలవాఁడు- శూద్రవృత్తియం దాసక్తి గలవాఁడు- ఆచారహీనుఁడు- ధర్మకార్యములం దుత్సాహములేనివాఁడు-యాచనచే జీవించువాఁడు తానే కృషిచేసి జీవించువాఁడు- ఏనుఁగుకాలు కలవాఁడు పెద్దలచే నిందితుఁడు- విధవను పెండ్లాడినవాఁడు- ధనమునకై పీనుఁగుల మోయువాఁడు- కాయకంటివాఁడు- వీరిని శ్రాద్ధములందు బ్రాహ్మణశ్రేష్ఠుఁడు నిమంత్రణమునకుఁ జెప్పరాదు.

శ్రాద్ధశేషము పరులు భుజింపరాదు.

> సాయంప్రాతశ్చ భుంజీత నాంతరాళే సమాహితః
> అకాలేనతు భుంజీత పరశ్రాద్ధే తథైవచ॥

సాయంకాలము ఉదయము భుజింపవచ్చును. నడుమ భుజింపరాదు. అకాలమున భుజింపరాదు, పరశ్రాద్ధములయందు భుజింపరాదు. వ్రతులయు విధవలయు యతులయు శ్రాద్ధములందు భుజింపరాదు, ఈ శ్రాద్ధములందు భుజించినవారు నరకగాము లగుదురు. (మార్కండేయ) అయినను సగోత్రులు సకుల్యులు జ్ఞాతులు భుజించిన దోషములేదు. జ్ఞాతులుతప్ప దక్షిణవా రన్యశ్రాద్ధశేషాన్నము భుజించిన ప్రాజాపత్యవ్రత మాచరింపవలెను. మామ - మేనమామ - గురువు - అన్న - కొడుకు బ్రహ్మనిష్ఠుఁడు యోగి వీరి శ్రాద్ధశేషాన్నము భుజించిన దోషములేదు. (జాబాలి)

కం. మును మున్నుడిచినవారలు, జనవర! బ్రాహ్మణులె నైన • సమ్మతిఁ గుడువన్
గానరు తిరస్కృతవిప్రులు, విను శృంగచ్ఛేద మైన•వృషభములట్టుల్. ౧౯౬.

తిరస్కృతవిప్రులు=తిరస్కరింపఁబడిన బ్రాహ్మణులు, శృంగచ్ఛేదము=ఛవర్ణము పరమైనపుడు పూర్వస్వరమునకును ఛవర్ణమునకును నడుమ చ్ వర్ణమాగమమగును, శృంగము=పచ్చికకొన, ఒకయెద్దు కొఱికి విడిచినదానిని మఱియొకయెద్దు తినదు.

తాత్పర్యము.

నిమంత్రితాన్నమున కున్నవారలు బ్రాహ్మణులయినప్పుడు వెనుకటివారు భుజింపవచ్చునుగదా? ముందు భుజించినవారు శూద్రులయినఁగదా నిషేధమందు

రేమో ముందు భుజించినవారు బ్రాహ్మణులేయైనను యోగ్యతా పక్షపాతములేక లోభమున నయోగ్యులకు ముందు భుజింపఁబెట్టఁబడినేని యా శిష్టము సద్బ్రాహ్మణులు గ్రహింపరు. వృషభమునకుఁ గొమ్ములుకొట్టి నల్లవమానముగాఁ దలంతురు. ఒకయెద్దు భుజించిన తృణాగ్రములను వేఱొకయెద్దు భుజించునా?

కం. మును తమ్ముఁ డనుభవించిన, ధనమును రాజ్యంబుఁ బిదపఁ•దా నెటులు గొనున్
ఘనమతి వరిష్ఠుఁ డగునా,తనయుండు శ్రేష్ఠుఁడు నగుట • ధరణిప! చెపుమా. ౧౫౮౭

ఒక యెద్దు తిని విడిచినదానిని మఱియొకయెద్దు భుజింపదుగదా! అట్టి నియమము పశువులయందేయుండఁగా ముందు తమ్ముఁ డనుభవించి విడిచిన ధనమును రాజ్యమును బిదప గొప్ప బుద్ధిగలవాఁడు శ్రేష్ఠుఁడు నగు నాకొడు కెట్లు గ్రహింపఁ గలఁడో రాజా చెప్పుము.

కం. పరజంతుభుక్తశేషము,గురుబల మగువ్యాఘ్ర మెంకు•గోరదు తినఁగాఁ
బురుషవ్యాఘ్రం బేటికిఁ, బరభుక్తముఁ గోరు నేవ•పడక మహీశా. ౧౫౮౮

పరజంతుభుక్తశేషము=ఇతరజంతువులు తోడేలు మొదలైనవి తినఁగా మిగిలినదానిని, గురుబలము=గొప్ప బలముగలది, పరభుక్తము=ఇతరులచే ననుభవింపఁబడినది, ఏవపడక=అసహ్యించుకొనక.

తాత్పర్యము.

ఇతరజంతువు భుజింపఁగా మిగిలినదానిని బలముగల వేఱొకపులి యెపుడును దినఁగోరదు. పశువులయందే యిట్టి మర్యాదయుండఁగాఁ బురుషశ్రేష్ఠుఁడైన రాచకొడుకు శ్రీరామచంద్రుఁడు పరు లనుభవించినదానిని నసహ్యించుకొనక కోరునా?

దీనివలన మానవంతుఁ డవమానపూర్వకముగ గొప్ప రాజ్యము లభించినను గైకొనఁడని సూచితము.

తే. యాతయామంబు లైనట్టి•యాజ్యకుశహ,విస్సులును బురోడాశంబు• వెండి యూప
ఖాదిరంబుల నెవఁడైనఁ•గ్రమ్మఱంగ, వాడుకొనునొక్కొ వెనుక స•వంబులందు. ౧౫౮౯

యాతయామంబులు="జీర్ణంచ పరభుక్తంచ యాతయామ మిదంద్వయమ్" అమరుఁడు. ఒకసారి వాడుకొనఁబడినది. ఆజ్య - కుశ- హవిస్సులు=నెయ్యి దర్భలు నేతిహవిస్సులు, పురోడాశంబు=చేసినహవిస్సు, వెండియున్ = మఱియును, యూపఖాదిరములున్ = చండ్రకొయ్యగు మొదలయిన యూపస్తంభములు, సవములందున్=యజ్ఞములందు.

తాత్పర్యము.

ఒకసారి యజ్ఞమున వాడుకొనఁబడిన నెయ్యి దర్భలు హవిస్సు పురోడాశము యూపస్తంభము వీనిని మఱియొక యజ్ఞమున నుపయోగింతురా!

కం. హృతసార మైనసురవలెం, జ్యుతసోమముసవమురీతి • నుర్వీధవ! నా
సుతుఁ డేల యన్యభుక్తము, క్షితినిం గాంక్షించు; నంత • చెడి బ్రతికె నొకో! ౧౫౭౦

హృతసారము=ఎత్తివేయఁబడిన సారముగలది, చ్యుతసోమము=విడువఁబడిన సోమరసముగలదియగు, సవమురీతిన్=యజ్ఞమువలె, అన్యభుక్తము=ఇతరులచే ననుభవింపఁబడినదియగు, క్షితినిన్=భూమిని.

తా త్ప ర్య ము.

సారముతీయఁబడిన కల్లువలె సోమములేని యజ్ఞమువలె రాజా నా కొడుకేల యితరు లనుభవించి విడిచి నిస్సారమైన భూమిని గోరును. నాకొడుకంత చెడి బ్రతికినాఁడని తలఁచితివా ?

కం. ఇంతటియవమతి సీతా,కాంతుఁడు సహియించు నెట్లు•కలదే నిజవా
లాంతముఁ ద్రొక్కిన వ్యాఘ్రము, శాంతత దా నోర్చియుంట•జగతిం జెపుమా. ౧౫౭౧

అవమతి=అవమానము, నిజవాలాంతము = తనతోఁకకొనను, శాంతతన్ = శాంతితో.

తా త్ప ర్య ము.

రాజా! యింత యవమానము నా పుత్రుఁడు సీతానాథుఁ డెట్లనుభవింపఁ గలఁడు. లోకమునఁ దన తోఁకకొనను ద్రొక్కిన పులి శాంతితో నూరకుండుట గలదా? నా పుత్రుఁడు సీతానాథుఁడనుటవలన శ్రీరామచంద్రుఁడు కానట్టిరాజ్యము గ్రహించెనేని దానివలనఁ గన్న తల్లికిఁ గట్టుకొన్నభార్యకు నవమానము సంభవించునని భావము. వారి కవమానము వచ్చుకార్యము మగవాఁడు చేయఁడు పాడుకారాజ్యమువలన నీ విచారము దప్పినది.

చం. భువనము లెల్ల నొక్కటయి • పూనినయేనియు నాతనాభవున్,
లవమును భీతి గొల్పఁగ న•లంతులు గావు మహారణంబుఁన్,
భువిని నధర్మవర్తులను • బూన్పఁగ ధర్మపథంబుఁ దద్విధిన్
దవిలినమానసంబునను • దా నిటు సైఁచెడిఁ గాక దుఃఖముల్. ౧౫౭౨

భువనములు=లోకములు, లవమును=కొంచెమైనను, వలంతులు=శక్తిగలవి, అధర్మవర్తులన్=అధర్మమార్గమందు నడచువారిని, ధర్మపథంబు=ధర్మమార్గము.

తా త్ప ర్య ము.

తోఁకత్రొక్కిన పులి సహించి యూరకుండదు నిజమే. అట్లులే నీకొడుకు నకు రోషము పౌరుషము బలముండిన నేలరాజ్యము పట్టముకట్టుకొనఁ గూడదనెదవా? సామర్థ్యము లేకకాదు. పదునాలుగు లోకములన్నియు నొక్కటై ప్రయత్నించి పైనెత్తివచ్చినను మహాయుద్ధమున నవి నాకొడుకునకు భయముగలిగింప శక్తి

గలవికావు. అయినను లోకమున సధర్మమార్గమందుండు వారిని సౌమ్యవిధి ధర్మమార్గమందు వర్తింపఁజేయఁగోరి దానికిఁదాను మార్గదర్శిగానుండవలయు ననియా విధియందుఁ దన మనస్సంతయు నుంచుటచే దుఃఖములు సహింప నిచ్చగించెను. తా సధర్మమందుండువాఁ డితరుల నెల్లు ధర్మమున నుంపఁగలఁడు. దీనివలన రామావతారము స్వానుష్ఠానమున ధర్మోపదేశము చేయుటది యని యేర్పడెను.

చం. కలితసువర్ణపుంఖశిత • కాండములన్ దహియింపఁ జాలెడిన్
జలనిధి నేని భూతముల•సంఘము నేని యుగాంతకాలున
ట్టుల యటువంటిసింహబలుఁ•డున్ వృషభాక్షుఁడు గండుమీనుచేఁ
జాలిసెడిచేఁపపిల్ల యనఁ • బోయె హతుం డయి తండ్రిచేతనే. ౧౫౭౩

కలితసువర్ణపుంఖ=కూడిన బంగారు పింజలుగల, శిత=పదునైన, కాండములన్=బాణములచే, జలనిధినేనిన్ = సముద్రమునైనను, భూతములన్=జంతువులను, యుగాంతకాలునట్టుల = ప్రళయకాలమందలి యమునివలెనే, సింహబలుఁడున్ = సింహముబలమంత బలముగలవాఁడు, వృషభాక్షుఁడు = మదించిన యెద్దు కన్నుల వంటి కన్నులుగలవాఁడు, పొలిసెడి=గండుమీను=పెద్ద మగచేప.

తా త్ప ర్య ము.

బంగారు పిడులుకలిగిన కఱకుబాణములచే సముద్రమునైనను సమస్తభూతములనైనను ప్రలయకాలమందలి యమునివలెఁ గాల్చివేయఁగలఁడు. అటువంటి సింహబలుఁడు మదించినయెద్దు కన్నులవంటి కన్నులుగలవాఁడు పెద్ద మగచేపచే జచ్చెడి పిల్లచేఁపవలెఁ దండ్రిచేతనే చంపఁబడెను.

ఉ. ఈవును ధర్మవేదివి న•రేశ్వర! చెప్పుమ కన్నపుత్రునిన్
నీ విటు గానలన్ నవయ • నెట్టితిగా, యిది రాచవారు భూ
మీవిబుధార్యవర్యులును • మెచ్చు సనాతనధర్మశాస్త్ర మెం
దే విధియించెనో విహిత•కృత్యముగాఁ దెకెలెర కక్కటా! ౧౫౭౪

తా త్ప ర్య ము

రాజా! నీవును ధర్మము తెలిసినవాఁడ వేకదా! కన్న కొడుకును వడవులయందిట్లు కృశింపఁజేసితివిగదా! ఇది రాజులు బ్రాహ్మణులు వైశ్యులు సంగీకరించిన ధర్మశాస్త్రములందు నిష్కారణముగాఁ చేయఁదగిన కార్యమని యెందైన విధియించెనేమో చెప్పుమా!

కం. పతి మొదటిదిక్కు సతికిన్, సుతుఁడు ద్వితీయుండుఁ దనఁగు•జుట్టం బౌపై
గతి యవ్వాఁడుఁ బరికింపఁగ, గతి యన్యము లేదు సుమ్ము • కాంతకు నధిపా! ౧౫౭౫

తా త్ప ర్య ము.

రాజా! నీకేమి మహారాజవు! నిన్నాదరించుటకుఁ గైకవంటి భార్యగలదు. భరతునివంటి కొడుకుగలఁడు, కాని నాగతియేమి! నేనాఁడుదానను, ఆఁడుదానికి

మొదటిదిక్కు కట్టుకొన్నమగఁడు. వాఁడు లేనపుడు రెండవదిక్కు కడుపునఁబుట్టిన కొడుకు. ఈ యిరువురు లేనివారికిఁ బ్రేమగల బంధువులు తోడఁబుట్టినవారు మూఁడవదిక్కు. ఈ మువ్వురుతప్ప నెంత యాలోచించినను స్త్రీకి వేఱొక దిక్కులేదు.

పితారక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే

వార్ధకే తనయోరక్షే న్నస్త్రీస్వాతంత్ర్యమర్హతి॥ యని ప్రమాణము.

నస్త్రీస్వాతంత్ర్యమర్హతి యనఁగా స్త్రీ తన్నుఁదాను గాపాడుకొనునట్టి స్థితికి బంధువులు తీసికొనరాదు స్త్రీరక్షాభారము బంధువులగు పురుషులయం దున్నదని యర్థము. స్త్రీరక్షాభారము స్త్రీయందేవిడిచినచో వేఱుగతి లేనపుడో యడిగెడు వాఁడు లేమినో దుష్టవర్తనముకలది కావచ్చును.

చం. సవతికి నీవు దక్కి నన్నుఁ • జాఁగఱగొట్టుట నీవు గల్గియున్
ధవుఁడవు లేనివాఁడ, విఁక • నాసుతునిన్ వనిఁ ద్రోచి తీవ, నా
కెవరును లేరు చుట్టములు • నేగదఁ గానల కన్నచో మగం
డవు మని యుంటఁబోల, దిటు • నాశము చేసితి నన్ను నన్నిటన్. ౧౯॥

తాత్పర్యము.

శాస్త్రమిట్లు చెప్పుచున్నదిగదా నాగతియేమో యాలోచించి చెప్పుము.

నీవు నాసవతికి వశుఁడవై నన్ను హింసించుటచేత మొదటి దిక్కు. మగఁడవైన నీవుండియు లేనివాఁడవే. ఇఁక రెండవ దిక్కు కొడుకు. వానిని నడవులపాలు చేసి యుండియు లేనివానిఁ జేసితివి. నాకు దగ్గఱచుట్టము లెవరులేరు. కొడుకు వెంట నడవులకుఁ బోదమనిన మగఁడవగు నీవు బ్రతికియుండుటచే నట్లు పోవుటకు లేదు. నీవు నన్నన్ని విధముల నాశము చేసితివిగదా! నాగతియేమి. నాకురక్షకు లెవరు!

నాలుగవపాదంబున ననునాసికాక్షర యతి.

గీ. అలద్రుతంబునకును మధ్య మానునాసి
కమునకును జెల్లునను నాసికయతులనఁగ
డాపలను బూర్ణములు గల్గుటక డఢలును
దధదధలును గ్రమంబున దానవారి. అప్ప.

చం. హత మయి పోయె నీవలన • జ్ఞాతల,మీవును మంత్రు లెల్లరున్
హతు లిఁక, నేను నాసుతుఁడు • నాశన మైతిమి, పౌరులందఱున్
హతుల, నితాంతసమ్మదము • నన్ దర నీప్రియురాలు నీసుతుం
డతులితభోగయుక్తు లయి • హాయిగ నేలుచు నుందు రిం కిటన్. ౨౦॥

తాత్పర్యము.

మగఁడవైన నీవలన నాశమైనదానను నేనొకతనేకాదు నీవంటి యవివేకి రాజగుటవలన నీ భూమీ రాజ్యమంతయు నాశమైనదే! ప్రజలు లేనప్పుడు నీవేల! ప్రజలుండినఁగదా వారినిమిత్తమై రాజుండవలె! రాజులేనిచో మంత్రులేల! నేను నా

సుతుఁడు చెప్పఁబడిలేదు. ఎప్పుడో నాశమైతిమి. ఇందఱుపోఁగాఁ బురజనులుందురా? వారు చచ్చినవారే. అందఱు పోఁగా నిండుసంతోషముతో నీ ప్రియురాలునీకొడుకు నసమానభోగము లనుభవించుచు హాయిగా నుండురు.

చం. అనుచుఁ గఠోరభంగిఁ దను • నాడిన భూపతి వించు శోకవే
దనను సహింపలేక పడి • తాలిమి మాలి ధరాతలంబునన్
వనిత నిజంబ పల్కెడి, న•నన్యకృతంబు మహాఘ మేమి నే
నొనరిచినాఁడనో యనుచు • నుల్లమునం దలపోఁత మున్గుచున్. ౧౫౭౪

కఠోరభంగిన్=కఠినమైనవిధముగ, తాలిమి=ఓర్పు, అనన్యకృతంబు = ఇతరు లెవరు చేయనిది; మహాఘము=ఘోరపాపము. తలపోఁతన్=ఆలోచనయందు.

తాత్పర్యము.

ఈప్రకారము కౌసల్య తన్నుఁ గఠినముగాఁ బలుకఁగావిని శోకబాధసహింప లేక యోర్పులేక భూమిపైఁబడి యిది యాఁడుదైనను శోకమున మునిఁగియుండియు సత్యము పలుకుచున్నది. ఈమె చెప్పినదానియం దసత్యమేదియు లేదు. నిష్కారణముగఁ బరులను బాధించు ధర్మము ధర్మము కాదు. ఒకధర్మము చేయువారు తాము చేయు ధర్మము మఱియొకధర్మమును బాధించునది కానిదిగాఁ గనిపెట్టవలెను. ఇది నే నాలోచించినవాఁడను గాను, ఎవరు చేయని యింతటి మహాపాపము నేనేమి చేయుటచే బుద్ధిలోపమై యింతటి చేయరానిపని చేసితినో యని యాలోచించెను.

అత్యుత్కటైః పుణ్యపాపై, రిహైవ ఫలమశ్నుతే
త్రిభిర్వర్షైః త్రిభిర్మాసైః, స్త్రిభిఃపక్షై స్త్రిభిర్దినైః॥

మిక్కిలి యతిశయించిన పుణ్యఫలము గాని పాపఫలము గాని యీలోకమందే మూఁడు సంవత్సరములలోఁగాని మూఁడు నెలలోఁగాని మూఁడు పక్షములలోఁగాని మూఁడు దినములలోఁ గాని యనుభవమునకు వచ్చును. అని కలదు కావున నీజన్మమం దింత ఘోరపాపఫల మనుభవించుటకు నేను జేసిన పాపమేమి యని యాలోచించెను.

—• ౬౨వ సర్గము. దశరథుఁడు కౌసల్యను క్షమింప వేఁడుట. •—

కం. సోలుచు మూర్ఛను ధరపైఁ, ద్రాలుచుఁ గౌసల్యమోము • బరికించుచుఁ జిం
తాలులితమానసంబున నాలోచన సేయఁ బ్రాక్కృ•తాఘము దోఁచెన్. ౧౫౭౫

చింతాలులిత మానసంబునన్ = విచారముచే వ్యాకులమైన మనస్సుచే, ప్రాక్కృతాఘము = ముందుచేసిన పాపము తోఁచెన్=మనస్సునకు వచ్చెను.

తాత్పర్యము.

మూర్ఛచేఁ బరవశుఁడై నేలమీఁదఁబడి తెలిసి తెచ్చుకొని కౌసల్యముఖముఁ

జూచి చింతచే వ్యాకులమైన మనస్సుతో నాలోచింపఁగాఁ బూర్వము తాను జేసిన పాపము స్మృతికివచ్చెను.

చం. తెలియమి శబ్దవేధు లగు•తీవ్రశరంబులఁ జేసినట్టియా
కలుషము బుద్ధిఁ దోఁచినను • గాతరుఁ డై ద్విగుణంబుగా మునిన్
బొలియఁగఁ జేతకుం దనదు•పుత్రునిపోకకు నుమ్మలించు చం
జలి ఘటియించుచున్ సతిప్ర•సాదముకై తల వంచి యిట్లనున్. ౧౫౦

తెలియమిన్=తెలియకపోవుటచే, అబుద్ధిపూర్వకముగ, శబ్దవేధులు=వస్తువు కానరాకపోయినను ధ్వనినిబట్టి యాలక్ష్యమును భేదించుబాణములు, కలుషము=పాపము. కాతరుఁడై=విహ్వలుఁడై, ద్విగుణంబుగాన్ = ఇబ్బడిగా, పొలియఁగఁ జేతకున్=చంపినదానికిని, ఉమ్మలించుచున్=దుఃఖించుచు, సతిప్రసాదముకై = కౌసల్య యనుగ్రహము కొఱకై.

తాత్పర్యము.

అజ్ఞానముచే శబ్దము గుఱిగాఁ గొట్టు బాణములచేతఁ దాను జేసిన పాపము స్మృతికి రాఁగా భయపడినవాఁడై మునికుమారుని జంపుట తనకొడు కడవులకు బోవుట యాలోచించి రెట్టింపు దుఃఖముతోఁ జేతులు మోడ్చి కౌసల్యయెడఁ దాను జేసిన మహాపరాధముఁ దలంచి సిగ్గునఁ దలవంచి యామె యనుగ్రహము సంపాదింప గోరి యిట్లనెను.

చం. కరుణ దొఱంగ వెన్నఁడును • గానిజనంబుల మీఁద నేని, నన్
గరుణ క్షమింపు దేవి! కను•గానక చేసితిఁ దప్పు నీయెడన్,
గరములు మోడ్తు, ధర్మరత • కాంతలకుం బతి నిర్గుణుండయేన్
గరము లసద్గుణుం డయినఁ • గాని సమక్షదైవతం బగున్. ౧౫౧

కానిజనంబులమీఁదన్ = విరోధులమీఁద, కనుగానక = కన్నులు తెలియక, మోడ్తున్=ముకుళింతును, ధర్మరతకాంతలకున్=పతివ్రతాధర్మమందుఁ బ్రీతిగల కాంతలకు, నిర్గుణుండయేన్=గుణహీనుఁడైనను,లసద్గుణుండు=మంచి కీర్తికరములైన గుణములు కలవాఁడైనను, సమక్షదైవతము=ప్రత్యక్షదేవత.

తాత్పర్యము.

దేవీ! నీ వెన్నఁడును నీవిరోధులయందైనను దయతప్పనిదానవు. కావున నా యపరాధమును క్షమింపుము. కామాంధకారమునఁబడి కన్నులు తెలియక నీవిష యమున గొప్పయపరాధమును జేసితిని. కావున నేను నీకు పగవాఁడనే. అయినను నీకుఁ జేతులు జోడించి నమస్కరించెదను. పతివ్రతలగు స్త్రీలకు మంచిగుణములు గలవాఁడైనను చెడుగుణములు గలవాఁడైనను బతియేకదా ప్రత్యక్షదేవత,

చం. నిరుపమధర్మతత్పరవు • నిత్యము లోకులు సేయు మంచిసె
బ్బరల నెఱుంగు దీవు, గుణ•భాగ్యవు, పుంటిని నువ్వుఁ బెట్టదే

పరితపియించు న న్నిటులు • పల్కు-దే? దుఃఖిత వయ్యు, శాంతమున్
గరుణఁ దలంప రాదే? ననుఁ • గర్కశవాక్యము లాడఁ బాడియే?   ౧౫౮౨

నిరుపమధర్మతత్పరవు=అసమానమైన ధర్మమునందు నాసక్తిగలదానవు, గుణ భాగ్యవు=సద్గుణసంపత్తిగలదానవు, దుఃఖితవయ్యున్=దుఃఖించుచున్న దానవై నను కర్కశ వాక్యములు = కఠినవాక్యములు.

తా త్ప ర్య ము

ధర్మాసక్తియందు నీ వసమానవు. లోకములోనివారు చేయు మేలుకీళ్ళు నీ వెఱుఁగుదువు. సద్గుణ సంపత్తిగలదానవు. ఇన్ని మంచిగుణములు నీయందుండియుఁ బుంటిలో నుప్పుపెట్టినట్లు గోరిచుట్టుపై రోఁకటిపోటు వేసినట్లు పుత్రశోకముతో నేడ్చు నన్ను నీవు పరుషములాడి మఱింత దుఃఖపెట్టవలయునా? నీకెంతదుఃఖముండి నను స్వయంకృతాపరాధమున వాఁడేడ్చునదియే చాలును. నేను మఱింతదుఃఖంపఁ జేయవలయునా? యని శాంతత వహించి అయ్యోపాపము కట్టుకొన్న మగఁడే యని దయదలఁపరాదా. ఇంతకఠినముగా మాటలాడుట ధర్మమా.

తే. అనుచు దీనోక్తిఁ బ్రార్థించు•నధిపుఁ జూచి
భయము సంభ్రమ మొదవంగఁ • బ్రాణనాథు
నంజలిని బద్మ మన శిర • మందుఁ దాల్చి
నారి కన్నీరు గార్చె బ్ర•ణాళిఁ బోలి.   ౧౫౮౩

దీనోక్తిన్=వ్యసనములోఁగూడిన మాటలచే, సంభ్రమము = తొట్రుపాటు, అంజలిని=చేమోడ్పును, నారి=స్త్రీ, కౌసల్య, భయము=ధర్మహాని భయము, భర్త నాకు నమస్కరించునట్లు వర్తించితినిగదా. దీనివలన నాధర్మమునకు హానివచ్చునే అని భయము.

తా త్ప ర్య ము.

ఈవిధముగా దుఃఖముతోడి మాటలతోఁ దన్ను వేఁడుకొనుచున్న భర్తను జూచి ధర్మభయముచేతను దొట్రుపాటుచేతను, నతని యంజలిని పద్మమువలె శిర మందుఁదాల్చి కౌసల్య నీటి గొట్టమునుండి నీరు పాఱునట్లు తన కన్నులనుండి నీళ్ళు కార్చెను.

చం. పలికె హృదీశుఁ బ్రాణధవ • పాదములం బడి వేఁడుదాన నన్
జెలువను వేఁడికోలు దగు •నే? ననుఁ జంపఁ గ నీకు న్యాయమే
యలుకక తన్ను వేఁడుకొను•నట్లు నిజేశ్వరు బాధపెట్టు నా
కలికి యిహంబునుం బరము • గానదు, దుర్గతి నొందఁ గల్గెడున్.   ౧౫౮౪

హృదీశున్=భర్తను, ప్రాణధవ=ప్రాణేశ్వరా, చంపఁగన్=ధర్మహాని కలిగించు టయుఁ జంపుటయు సమానము లేకదా.

### తా త్ప ర్య ము

ప్రాణేశ్వరా! నీచరణములఁబట్టి నేను ప్రార్థించెదను. నేనాఁడుదానను. కావున దెలివిమాలినదానను నీకు లోఁబడియుండుదానను. నీవు నన్ను శాసింపఁదగుదు. కాని ప్రార్థింపఁదగునా? ఇట్లు నాకు స్వధర్మహాని కలిగించుట నన్నుఁ జంపుటగాదా. ఇది నీకు ధర్మమా. జంకులేక తన్నుఁ బ్రార్థించునట్లు తన భర్తను బాధపెట్టుస్త్రీ యిహమందును బరమందును జెడును. రెంటను దానికి సుఖములేదు అది నరకమునకే పోవును.

చం. తెలియనిదానఁగాను జగ • తీవర! సత్యరతుండ వంచు ని
శ్చలపరధర్మమూర్తి వని • సత్యముఁ జెప్పెద విన్ము • నాసుతున్
దలఁచుకొలంది యే మన ని • తాంతము భగ్గనిమండుఁ గచ్చులో
బలితపుఁబుత్రశోకమునఁ • బల్కితి, నన్ను క్షమింపఁగాఁ దగున్. ౧౫౬౧

### తా త్ప ర్య ము

నీవు సత్యమందుఁ బ్రీతిగలవాఁడవని చలింపని గొప్పధర్మమే యలంకారముగాఁ గలవాఁడవని నేను దెలియనిదానఁగాను, అయినను నాస్థితి యథార్థము చెప్పెదవినుము. మగఁడు సత్యాత్ముఁడను సంతోషముకంటెఁ బుత్రశోకము బలిష్ఠముగానున్నది. కావున నాకొడుకును దలఁచుకొలఁది కడుపు భగ్గని మండుచున్నది కావున నాపుత్రశోకముకొలఁది నేను బలికితినిగాని నిన్ను నొప్పింపవలయునని తలంపుచేఁగాదు. నేనుజేసినదితప్పు. నన్నుక్షమింపుము. నిన్ను నొప్పించిన నాకు రాఁగల లాభ మేమికలదు? ఇది పతివ్రతల లక్షణము.

కం. శోకంబున ధైర్యము చెడు, శోకంబున నాశ మొందు • శ్రుతమఖలంబున్
శోకంబున సర్వము చెడు, శోకము సరిపోలు వైరి • చొప్పడఁ డెందున్. ౧౫౬౨

### తా త్ప ర్య ము

శోకమనునది సామాన్య దుర్గుణముకాదు. శోకముచే ధైర్యము చెడును. శోకముచే పెద్దలవలన వినినటి ధర్మజ్ఞాన మఖిలము నాశమగును. ఇంతయేల శోకముచే సమస్తము చెడును. శోకమువంటి శత్రువులేఁడు. అతికోపమునందువలె నతిశోకమునందును మనస్సు వికలమగును. కావున నెవరినైన నెంతమాటనైన నందురు. కాని వివేకముకలవారు పశ్చాత్తాపపడి క్షమింపవేఁడుదురు. అతిసంతోష మిట్టిదే. అతి సర్వత్రవర్జయేత్తనుట యథార్థవిషయము.

ఆ. పగఱుచేతితోడ • బాఁదినదెబ్బలు, సైఁప వచ్చుఁగాని • సైఁపరాదు
స్వల్పమైనఁ గాని • యాకస్మికంబుగ, దాపరించు శోక • తాపవహ్ని. ౧౫౬౩

పగఱు=పగవారు, బాఁదినన్=కొట్టిన.

తా త్ప ర్య ము.

శత్రువులు చేతితోఁగొట్టినదెబ్బలు సహింపవచ్చును గాని తటాలున వచ్చిన శోకమువలనఁ గలిగిన సంతాపాగ్నిని గొంచెమైనను సహించుట కష్టము. దేహకష్టమునకంటె మనోవేదన తీవ్రము.

కం. ఏమనిశ లేగె రాముఁడు, కాననవాసంబు చేయఁ ♦ గడఁగినది మొదల్
మానవవర! శోకంబున, వేనేఁడులు గడచినట్టు ♦ లేర్పడె నాకున్. ౧౫౭౮

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రుఁ డరణ్యవాసముచేయ మొదలుబెట్టినది మొదలు నేటికి నైదురాత్రులు గడచెను. రాజా! శోకాతిశయమున నవియే వాకైదుసంవత్సరములవలెఁ గడచెను.

ఈ నైదురాత్రు లేవియను విషయమునఁ బూర్వ వ్యాఖ్యాతలు భిన్నాభిప్రాయులై యున్నారు.

౧. కొందఱు మొదటిరాత్రి తమసాతీరము, రెండవరాత్రి గంగాతీరము, మూఁడవరాత్రి గంగ దక్షిణతీరమందలి వనస్పతిక్రింద, నాలవరాత్రి ప్రయాగ, ఐదవరాత్రి యమునాతీరము, ఆఱవదినంబునఁ బగట శ్రీరాముఁడు చిత్రకూటము నకుఁబోవునని వృత్తాంతము తెలిసికొని యా పగటి సాయంకాలమున సుమంత్రుఁ డయోధ్యచేరెను.

ఈ విధముగ నైదురాత్రుల లెక్కయుండును.

౨. కొందఱు గంగదాఁటువఱకు వనవాసిత్వములేదు గావున అపైన వనస్పతి, భరద్వాజాశ్రమ, యమునాతీర చిత్రకూటముల నాలుగురాత్రులు నాలుగవ రాత్రి సుమంత్రుఁడు బయలుదేరెను. ఐదవరాత్రి యీ వచనము.

౩. గోవిందరాజుల యభిప్రాయమేమన :—

ఆగిరిగమనంబు నానిషాదాధిపుచారులవలనను జక్కనిజేగి గుహునిచే నను జ్ఞగొని సుమంత్రుఁడు అయోధ్యాపురమునకుఁ బోయెను అని చెప్పిన పిదప "చనుచున్ మూఁడవనాఁటి సంజపురముం జొచ్చి"యని చెప్పఁబడెను. కావున నయోధ్య విడిచినది మొదలు ఆఱవదినమందుఁగదా చిత్రకూటప్రవేశము. అవల చారులవలన నేడవదినమందో యెనిమిదవదినమందో సూతుఁ డావృత్తాంతము విని యావల మూఁడవదినము సాయాహ్నమునఁగదా యయోధ్య చేరెను. అప్పటికి పదియవదినమో పదునొకండవదినమో కావలయునే యైదవదిన మెట్లనిన సమాధానము చెప్పెదను. 'తృతీయేహని = మూఁడవ నాఁడనఁగా దినమున మూఁడవ భాగము సాయంకాలమని యర్థము. ఆగిరి గమనమనఁగా గమన ప్రయత్నమని యర్థము. "గుహునితో వచ్చియుంటి బహుదినంబులు నేనంద" యిచ్చట బహుదినంబులనుటచే మూఁడు దినంబులు శృంగిబేరపురమందు సూతుఁ డుండెను. నాలు

గవదినంబున ఋజుమార్గమున రాత్రిపగలు నడచివచ్చిన చారులవలన శ్రీరాముని చిత్రకూటప్రవేశ ప్రయత్నము విని యా దినము సాయంకాలమునఁ ద్వరగా నయోధ్యా ప్రవేశము. ఆ దినమందే కౌసల్య నేఁటి కై దురాత్రులని చెప్పెను.

౫. తీర్థీయుల యభిప్రాయము మొదటిరాత్రి, తమసాతీరము రెండవ రాత్రి, గుహపురమున మూఁడవరాత్రి, గంగాదక్షిణతీర వనస్పతిమూలమున నాలుగవదినము ప్రయాగయందు, ఐదవదినము యమునావనమందు, ఆఱవనాఁడు సుమంత్రుఁ డయోధ్యాప్రవేశము. ఈ విధముగ ముం దయిదురాత్రులని లెక్క.

౬. ఈ వ్యాఖ్యాత యభిప్రాయ మేమన:—

గంగదాఁటిన తరువాతఁగాని వనవాసదినములు లెక్కకు రావనుట సరిగాదు. ఏలన :—

"వనమున నాలుగుంబదియు వర్షములుండఁగ మీరలిప్పుడే చనుఁడని చెప్పెఁ గైక యది సాగుత నేఁడు మొదల్గ రాఘవా" యను సూతవాక్యమువలన విఘ్నమైన పట్టాభిషేకదినమే వనవాసమునకు మొదటి దినమని యేర్పడుచున్నది. అదియును గాక ౬౫౮-వ పద్యమువలన వనవాసవ్రతము నాఁడే పూనిన ట్లేర్పడుచున్నది. కావున గంగదాఁటినతరువాత వనవాసదీక్షయనుట సరిగాఁ దోఁపదు. తమసాతీర మడవిప్రదేశమనియేకదా సీతను వాల్మీక్యాశ్రమమునఁ దమసాతీరమున నుంచుట. కావున రెండవ యభిప్రాయము సరిగాదు. శ్రీరాముఁడు విడిచినది మొదలు కౌసల్యకు దినమొకయేఁడుగాని గంగదాటినది మొదలుకొనికాదు. కౌసల్యా! దశరథుల సంభాషణము పగటిపూఁటయని ౧౫౯౦ వ పద్యమున సూర్యాస్తమానము చెప్పుటచే గ్రహింపవలెను. దీనిచే నైదురాత్రు లేగెననుట యుపపన్నము. ఏలన సుమంత్రుఁడు రాత్రి యయోధ్య ప్రవేశించెను. ఈ సంభాషణము పగటిపూఁట కావున మఱుసనాఁటి పగలనియే గ్రహింపవలసియుండును గాని సుమంత్రుఁడు చేరిన రాత్రిపూఁట జరిగినది యనరాదు.

మొదటిదినమురాత్రి తమసాతీరము, రెండవరాత్రి గంగాతీరము మూఁడవ నాఁటిరాత్రి వనస్పతిమూలము, నాలుగవనాఁటిరాత్రి భరద్వాజాశ్రమము, ఐదవ నాఁటిరాత్రి సుమంత్రుఁ డయోధ్యాప్రవేశము, ఆఱవనాఁటిపగ లీసంభాషణము, కావున నైదురాత్రు లేగెననుట సముచితము.

గోవిందరాజులు సుమంత్రుఁ డయోధ్య చేరకముందే యీ సంభాషణము జరగెనని యభిప్రాయపడినట్లు 'తద్దినే' యనుటచేఁ దెలియుచున్నది గాని కథాక్రమముఁ జూచిన నది సరిగాఁ దోఁపదు ఏలన నీ సంభాషణము జరగుచుండఁగనే సూర్యుఁ డస్తమించెననియు రాత్రియయ్యెననియు, రాజు నిద్రించెననియు నర్ధరాత్రమున మేల్కని మునివధ వృత్తాంతము చెప్పెననియు నది యాఱవరాత్రియనియు, ౧౫౯౦-౧౫౯౧-వ పద్యములవలన నేర్పడుచున్నది. ఈరాత్రి సుమంత్ర సంభాషణ

కెడములేదు. కావున సుమంత్రుఁ డయోధ్యఁ బ్రవేశించి శ్రీరామ వృత్తాంతము చెప్పిన పిమ్మటనే యీ సంభాషణము జరగెనని గ్రహించుట యుక్తము. గోవింద రాజులు మూఁడు దినములు పూర్ణముగా సుమంత్రుఁడు గుహునొద్దనుండెనని యభిప్రాయపడుటచే నైదును పరిపెట్ట నిట్లు వ్రాయవలసివచ్చెనని తోఁచుచున్నది. 'సాయాహ్నసమయే తృతీయేహని' మూఁడవదినము సాయంకాలమని యర్థమగు చుండ దినమునందు మూఁడవభాగమైన సాయాహ్నమనియర్థము చెప్పుటయందు సారస్యమేమో? దినముయొక్క సాయాహ్నమనినఁ జాలునుగదా? మూఁడవ భాగమైన సాయాహ్నమనుటయం దేమివిశేషము. కావున మూఁడవ దినమున సాయం కాలముననియే యర్థముచేయుట యుక్తము. మూఁడు దినములం దెక్కువ బలము మోపి యిక్కడ వెనుకదినము వృత్తాంతము ముందు దినము జరిగినదనుటకంటె మూఁడవదినమునఁ గొంతభాగమే సుమంత్రుఁడు గుహునితో నుండెననుట యుక్తమని యీ వ్యాఖ్యాత యభిప్రాయము. వారివారికి రుచించునట్లు వారు వారు గ్రహింపవచ్చును.

కం. చింతించుకొలఁది శోకం, బంతంతకుఁ బెరుఁగ సాగు • నభివృద్ధి నదీ
 కాంతుఁడు తటినీవేగా,క్రాంతుం డయి కాంచురీతి • గతి యేమి యొకో. ౧౫౪౯

నదీకాంతుఁడు = సముద్రుఁడు, తటినీ = నదులయొక్క, వేగ=వేగముచే, ఆక్రాంతుఁడయి=ఆక్రమింపఁబడినవాఁడై.

తాత్పర్యము.

నదులవేగముచే సముద్రుఁ డభివృద్ధిఁగాంచునను లోకోపవాద ప్రకారము ఆలోచించుకొలఁది దుఃఖ మతిశయించుచున్నది. నాగతియేమి కానున్నదో?

తే. అనుచుఁ గౌసల్య యార్తయై • నస్తమించె, దివసనాథుఁడు రేఁగ్రమ్మె • నవనివిభుఁడు
 సతిహితోక్తుల వినియును • శాంతి లేక, కన్నుగూర్కొనువగపునఁ • గలఁకపడుచు.

దివసనాథుఁడు=సూర్యుఁడు, రే=రాత్రి, సతి= భార్యయగు కౌసల్యయొక్క, హితోక్తులన్=మేలగుమాటలను, కన్నుగూర్కొన్=నిదురించెను. ఈపదము గాఢ నిద్రను సూచింపదు.

తాత్పర్యము.

ఈ ప్రకారము చెప్పుచుఁ గౌసల్య యార్తయైఁగా సూర్యుఁ డస్తమించెను. రాత్రి వ్యాపించెను. రాజు కౌసల్యచెప్పిన హితవాక్యముల వినియును వ్యసనముచేఁ గలఁకపడుచు కన్నులు మోడ్చెను.

౬౩-వ సర్గము.

ఉ. మూరుతమాత్ర, మంత నృప • ముఖ్యుఁడు మేల్కని యాత్మదోషమున్
 గూరిచి చింత వేఁడివెలుఁ • గున్ గ్రసియించెడిరాహువోలికన్

ఘోరముగాఁగఁ బైకొనుదుఁ • గోడలిదిం గొడుకుం దలంచి యా
త్మారమణేంద్రుఁ డాఱవని•శన్ నడురే ధవళాక్షి కిట్లనున్. ౧౫౯౧

మూరుతమాత్రము = అల్పకాలము, వేఁడివెలుఁగున్ = సూర్యుని, నడురే = అర్ధరాత్రమున.

తాత్పర్యము.

అల్పకాలము నిద్రపోయి రాజేంద్రుఁడు మేలుకని తాను జేసిన పాపము గుఱించిన యాలోచన సూర్యుని రాహువు మ్రింగినట్లు భయంకరముగాఁ బైకొనఁగా గొడుకును గోడలిని దలఁచి యాఱవనాఁటి యర్ధరాత్రమునఁ గౌసల్యతో నిట్లనియె.

ఇది యాఱవనాఁటిరాత్రి చర్య. ఈ యాఱవనాఁటిపగలు కౌసల్య దశరథుని నిష్ఠురములాడుట. ఏడవనాఁటిరాత్రి సుమంత్రుఁడు మరలివచ్చి దశరథునిఁజూచుట.

—• దశరథుఁడు తాను జంపిన మునిబాలకువృత్తాంతముఁ గౌసల్యకుఁ జెప్పుట. •—

కం. మేలైనను గీడైనను, శీలవతీ! మనుజుఁ డెద్ది • సేయుఁ బరులకున్
వాలాయంబుగ నది ఫల, కాలంబునఁ గుడుచు వేఱు • గలుగదు చెలువా! ౧౫౯౨

తాత్పర్యము.

సదాచారసంపన్నురాలా! మేలుగానీ కీడుగానీ మనుష్యుఁడు పరులకు నేది సేయునో దానినే ఫలకాలంబున ననుభవించునుగాని, యొకటి చేసిన వేఱొకఫలము రాదు.

వాఁడువాఁడు చేసిన కర్మము వాని నీడవలె సర్వకాల సర్వావస్థల వెన్నంటి యుండునేకాని విడిచియుండదు.

శ్లో॥ శయానం చాను శేతేహి, తిష్ఠంతం చానుతిష్ఠతి
అనుధావతి ధావంతం, కర్మపూర్వ కృతంనరమ్॥

మనుష్యుఁడు పూర్వము చేసినకర్మము వాఁడు పండుకొనిన నదియుఁ బ్రక్కన పండుకొనును. నిలువఁబడెనా నిలువఁబడును. వాఁడు పరువెత్తెనా యదియు వెంటనే పరువెత్తును.

శ్లో॥ యస్యాంయస్యా మవస్థాయాం యత్కరోతి శుభాశుభమ్
తస్యాంతస్యా మవస్థాయాం తత్ఫలం సముపాశ్నుతే॥

ఏ యే దశయందు నేయే శుభాశుభకార్యము చేయునో యాయా దశయందు వాఁడాఫలము ననుభవించును.

శ్లో॥ శుభేన కర్మణాసౌఖ్యం దుఃఖంపాపేన కర్మణా
శుభకర్మముచేసిన సౌఖ్యము పాపకర్మముచేసిన దుఃఖము కలుగును.

శ్లో॥ యథాధేను సహస్రేషు వత్సోవిందతి మాతరమ్
తథాపూర్వ కృతంకర్మ కర్తార మనువిందతి॥ మను.

దూడ వేయియావులలో నుండు తనతల్లి నెట్లు తెలిసికొనునో కర్మముకూడఁ గర్తనట్లే తెలిసికొనును.

కం. వ్యాపారారంభమునం ۔బ్రాపించునో దాన శుభము • పాపఫలంబే
 ۔ప్రాపించునో యని చూడని,యాపురుషుఁడు బాలిశుండ • యగును గుణాఢ్యా.
 దానన్=చేయఁదలఁచిన కార్యమువలన. గ॥ ౩

తా త్ప ర్య ము.

ఒక కార్యము నారంభించునపుడు దానివలనఁ బుణ్యమువచ్చునా పాపము వచ్చునా యని యాలోచనలేని పురుషుఁడు మూర్ఖుఁడే యగును.

చం. ఫలములు పూలకొల్దు లని • బాలిశుఁ డొక్కఁడు మావితోటలన్
 దళిన మొనర్చి, యచ్చోటను • నాటుచు మోదుగుచెట్లు, వానినిన్
 జలములు పోసి యక్కఁఱఁగ • సాఁకి. ఫలాగమవేళఁ జింతచేఁ
 దలరు; విచారశూన్యులకృ•తంబులఁ గల్గు ఫలంబు లిట్టివా. గ॥ ౪
 బాలిశుఁడు=బుద్ధిలేనివాఁడు, విచారశూన్యుల = ఆలోచన లేనివారియొక్కఁ, కృతంబులన్=కార్యములవలన, అర్థాంతర న్యాసాలంకారము.

దీనివలనఁ బ్రతి మనుష్యుఁడు తానుచేయు కార్యమువలన మేలుకలదా కీడు కలదా యని యాలోచించి యావలశుభకార్యమునే చేయవలయును. పాపకార్యము మానవలయును.

తా త్ప ర్య ము.

పూలకొలఁది ఫలము లుండునని తలఁచి బుద్ధిలేనివాఁ డొకఁడు మోదుగు పూవులను జూచి యాహా యీపూలే యింతరమ్యముఁగా నున్నవే వీనివలనఁ గలుగు పండ్లింకెంత మనోహరముగా నుండునో యని భ్రాంతుఁడై యామిడి తోఁటలను గొట్టివైచి వానిస్థానములందు మోదుగుచెట్లను నాటి వానికి నీళ్ళుపోసి యక్కఱ గలిగి చక్కఁగాఁ బెంచి ఫలములు గలిగినపుడు విచారముచే దుఃఖించును, బుద్ధిహీనులు చేయుకార్యము లిట్టివేసుమా.

కం. ఈదృగ్విధకర్మములకు, నీదృగ్విధ ఫలము లగుచు • నెఱుఁగక యొవఁడే
 నాదటఁ బను లొనరించిన, మోదుగుపెంపరినిబోలి•ముచ్చిరుఁ జమిన్మా. గ॥ ౫
 ఈదృక్ విధ=ఇటువంటి, కర్మములకున్ = పనులకు, ఈదృగ్విధ ఫలములు = ఇటువంటి ఫలములు, ఆదటన్=ప్రీతితో, పెంపరి=పెంపుచేసినవాఁడు, ముచ్చిరున్ = శోకించును.

తా త్ప ర్య ము.

ఇటువంటి కర్మములుచేసిన నిటువంటిఫలము గలుగునని యెఱుఁగక యెవఁడైనను ఆసక్తితోఁ బనులుచేసెనేని మోదుగుచెట్లను బెంచినవానివలె ఫలకాలమున శోకించును.

కం. అట్టుల యామ్రవణంబును, గొట్టి పలాశముల నాటి • కొనను ఫలంబుల్
పుట్టఁగ రాముని( బాసెను, నట్టుగ మతి లేని యేను • నడలెదఁగంటే. ౧౬-౬

ఆమ్రవణంబున్ = ఆమ్ర+వనము = మామిడి వనమును, ఫలాశములన్ = మోదుగులను.

ఆమ్రవణము గొట్టుట = శ్రీరాముని పట్టాభిషేకము విఘ్నపఱిచియైన నడవికిఁ బంపుట, మోదుగువనము=కైకేయిని బ్రతిష్ఠించుట, ఫలము=రామవియోగము.

తా త్ప ర్య ము.

ఆ విధముగ మామిడి వనమును నఱికి మోదుగులునాటి తుదకు ఫలములు శ్రీరాముని వదలియుండునట్లు కలుగఁగా బుద్ధిలేని నే నేడ్చుచున్నాను జూచితివా, నేను జేసిన యొకానొకకర్మమునకు శ్రీరామచంద్రుని నెడఁబాయునట్లు ఫలముకలుగఁగా బుద్ధిలేనినేను దుఃఖించుచున్నాను. చూచితివా.

కం. పిన్నటనాఁటను జాపము, విన్ననువునఁ దాల్చి శబ్ద•వేధిఖ్యాతిన్
జెన్నలరుచుఁ గావించితి, మున్నొకపాపంబు నేను • మూఢుఁడ నగుచున్. ౧౬-౭

పిన్నటనాఁటన్ రూ. పిన్ననాఁటను=నేను జిన్నవాఁడనుగా నున్న కాలమందు, విన్ననువునన్=నేర్పుతో, శబ్దవేధిఖ్యాతిన్=శబ్దవేధియని పేరుపడినవాఁడనై.

తా త్ప ర్య ము.

నేను జిన్న వాఁడనుగా నున్నప్పుడు విల్లుధరించి నేర్పున శబ్దవేధియని పేరొందినవాఁడనై పూర్వ మొకపాపము బుద్ధిలేనివాఁడనై చేసితిని.

కం. బాలుఁడు విషమున్ మ్రింగిన, పోలిక మోహమునఁ బాప•మును జేయారన్
లోలాక్షీ! కావించితి, వాలాయము దాని ఫలము • వలసెం గుడువన్. ౧౬-౮

తా త్ప ర్య ము.

బాలుఁడు విషమును దనచేతులఁ దీసికొని తాన్మ్రింగినట్లు లజ్ఞానమునఁ జేయారఁ బాపముచేసితిని. బలవంతముగాఁ దప్పక దానిఫల మనుభవింపవలసి వచ్చెను.

ఉ. పామరుఁ డొక్కరుండు సుమ•భాస్వరతం గని కింశుకంబులన్
గోమునఁ బెంచినట్లు సుమ•కోమల! నేయును భావ్యనర్థమున్
నామదిఁ గావలేక యిటు • నాశన మాటకు శబ్దవేధ్యజం
బామహితాఘముం జలుపు • టయ్యెను, దత్కథ విన్ము చెప్పెదన్. ౧౬-౯

సుమభాస్వరతన్=పూలకాంతిని, కింశుకంబులన్=మోదుగులను, గోమునన్ = గారాబమున, సుమకోమల బహువ్రీహి. పూవువలె మృదువైన దేహముగలదానా, సుమకోమలి యనురూప మసాధువు. భావి=రాఁగల, అనర్థమున్=కీడును, శబ్దవేధ్యజంబు=శబ్దవేధి వలనఁగలిగిన, మహితాఘమున్=గొప్పపాపమును.

తాత్పర్యము.

ఒకానొక జ్ఞానములేనివాఁడు పూలకాంతిని జూచి గారాబముగ మోదుగు లను బెంచినట్లు కోమలాంగీ! నేనును దానివలన రాఁగల కీడు నూహింపలేక యిటు నాశమై పోవుటకై శబ్దవేధి బాణప్రయోగముల వలన నొక గొప్పపాపము చేసితిని. ఆకథ చెప్పెదను వినుము.

చం. అకృతవివాహ వప్పటికి ♦ నబ్జముఖీ! యువరాజ నేనునున్,
ప్రకటితరీతి నయ్యెడను ♦ వానలకాలము దాపరించె ద
ర్పకమద కామసంభ్రమవి♦వర్ధన మై, మహిసారమున్ సహ
స్రకరుఁడు పీల్చి ప్రేల్చుచు ర♦సాస్థలి దక్షిణదిక్కుఁ జేరినన్. ౧౦౦

నేను మీయింటికి వచ్చినపిమ్మట నట్టిపాపము నెన్నఁడు చేయలేదే ఎప్పుడు చేసితివనిన జెప్పుచున్నాఁడు.

అబ్జముఖీ=కమలమువంటి ముఖముగలదానా, అకృతవివాహవు = నీవు పెండ్లి కానిదానవు, దర్పకమద=మన్మథసంబంధమైన గర్వము, కామసంభ్రమము = కామమువలనఁ గలిగిన తొట్రుపాటు, వివర్ధనమై=వృద్ధిచేయునదియై, మహిసారమున్ = భూమియందలి సారమును = సహస్రకరుఁడు = వేయికిరణములుగల సూర్యుఁడు, ప్రేల్చుచున్=ప్రేలునట్లు చేయుచు, రసాస్థలి=భూప్రదేశము.

తాత్పర్యము.

కమలముఖీ, నీకు నప్పటికి వివాహము కాలేదు. నేను యువరాజనై యుంటిని, భూమియందలి సారమును సూర్యుఁడు పీల్చి భూమిని ప్రేలునట్లుచేసి దక్షిణదిక్కు చేరఁగా మదనదర్పమును గామమువలనఁగలుగు తొట్రుపాటును వృద్ధిచేయుచు వానకాలము ప్రాప్తించెను.

ఆ. వేఁడి మాయ మయ్యె ♦ వెలసెను మేఘముల్, స్నిగ్ధకాంతితోడ ♦ నీట బలిసి
కప్పకూఁత లెగసె ♦ నొప్పుగ సారంగ, బర్హినినద చయము♦పర్వెమింట. ౧౦౧

స్నిగ్ధకాంతి=మినమినమను జిడ్డుకాంతి, సారంగ = చాతకములయు, బర్హి = నెమిళ్లయొక్కయు, నినదము=ధ్వని మింటన్=ఆకాశమందు.

తాత్పర్యము.

వేఁడి మాయమయ్యెను, నీటిచే బలిసిన మేఘములు మినమినలాడుచుండెను. కప్పలు కూయదొడఁగెను. చాతకములయు నెమిళ్లయు ధ్వను లాకాశమున వ్యాపించెను.

తే. జడికి తెక్కలపై నైపు ♦ తడియు చుండ, స్నాన మొనరించి నట్లలై ♦ శకునివితతి
గాలివానకు నూఁగున♦గ్రములు గలుగు చెట్లకొమ్మల నెక్కెల్లా ♦ చేరెనపుడు.
౧౦౨

జడికిన్=వానకు, శకునవితతి=పక్షిసమూహము.

తాత్పర్యము.

పక్షులు తమరెక్కలపైపైఁ బున వాననీళ్ళుపడి తడియఁగా స్నానముచేసినట్లులై గాలికి వానకు నూఁగాడు కొనలుగల చెట్లకొమ్మలయందు రెక్కలు తడిసి బరువగుటచేఁ గష్టముపై చేరి నిలిచెను.

కం. జోరున కురిసిన కురిసెడి, ధారలచేఁ దోఁగి మత్త • దంతియుఁ దద్వాః
పూరంబుల గిరి నిశ్చల,వారిధివలెఁ దోఁచెనపుడు • వారిజనయనా. ౧౮౦౩

తోఁగి=స్నానముచేసి, మత్తదంతి=మదించినయేనుఁగు, తద్వాఃపూరంబులన్=ఆనీటి ప్రవాహములందు, గిరివలెన్=కొండవలె, నిశ్చల=చలనములేని, వారిధివలెన్=సముద్రమువలె, తోఁచెన్=కానవచ్చెను, వారిజనయనా = కమలమువంటి కన్నులు గలదానా.

తాత్పర్యము.

జోరున కురిసినట్టియు నింకఁ గురియుచున్నట్టియు వర్షధారలచేఁ దడిసి మదపుటేనుఁగు ఆనీటి ప్రవాహములయందుఁ గొండవలె నెత్తుగను అలలులేని సముద్రమువలెఁ గదలకయుఁ గానవచ్చెను.

కం. గైరిక ధాతుమిళితగౌ, రారుణవర్ణముల శుద్ధ • మౌ సెలయేఱుల్
వారక ప్రవహించెను గాం, తారానలభస్మయుతపృ • దాకులభంగిన్. ౧౮౦౪

గైరిక=గిరియందుఁబుట్టిన, ధాతు=రంగులుగల కావిరాయి మున్నగు మన్నులతో, మిళిత=కలిసినవగుటచే, గౌరము=తెలుపు, అరుణ = ఎఱుపు, వర్ణంబులన్=రంగులచే, శుద్ధము=నిర్మలమైన, సెలయేఱుల్=కొండవంకలు, కాంతారానల=కాఱుచిచ్చువలనఁ గలిగిన, భస్మ = బూడిదతో, యుత = కూడిన, పృదాకులభంగిన్ = పాములవలె.

తాత్పర్యము.

కొండలయందుఁ బుట్టిన మన్నులతోఁ గలియుటచేఁ దెలుపు నెఱుపు రంగులు గలిగి శుద్ధములైన సెలయేళ్లడ్డములేక కాఱుచిచ్చువలనఁ గలిగిన బూడిదలతోఁ గూడిన పాములవలెఁ బ్రవహించెను.

తే. వానకాలంబునందు నో • వనజనేత్ర, యాకులారుణతోయంబు • లగుచు నేఱు
లొడ్డులను జొచ్చి పాఱుచు • నుండె; నేను, గ్రమతర మైనయాసుఖ • కాలమునను.
౧౮౦౫

ఆకులారుణ తోయంబులు=కలఁతచెందిన యెఱ్ఱనినీళ్ళు, ఒడ్డులన్=గట్టులను, క్రమతరము=మిగులమనోహరము.

తాత్పర్యము.

వానకాలమందు నేళ్ళు కలఁతచెందిన నెఱ్ఱనినీళ్ళుకలవై గట్టులపైఁ జొరలి పాఱుచుండెను నేను మిగుల మనోహరమైన యాసుఖకాలమందు.

సీ. బాణి నై కోదండ•పాణి నై శే రేక్క, వేటపైఁ దగిలిన•వేడ్కఁ-కతన
సరయూతటంబున • సారంగమహిషాదీ, ఘాతుకమృగములఁ • గడకఁ జంప
రేవుమాటున నొక్క • రేపూఁట నొంటిగ, నుండితి వివృతచా•పుండ నగుచు
నప్పు డాలించితిఁ • జప్పు డేనుఁగు జల, మానురవంబును•బోనిదానిఁ

తే. గటికిచీఁకటికతమునఁ • గనుల కెద్ది, చూడరాకున్న శబ్దంబు•జాడపట్టి
గజముకా నెంచి యేసితిఁ • గాండ మొండు, సర్పసన్నిభ మాధ్వని•చక్కటికిని. ౧౬౦౬

బాణినై=బాణముల ధరించినవాఁడనై, కోదండపాణినై = విల్లుచేతియందుఁ గలవాఁడనై, సారంగమహిషాది ఘాతుకమృగములన్ = ఏనుఁగులు దున్నపోతులు మొదలగు హింసచేయు మృగములను, కడఁకన్ = ప్రయత్నపూర్వకముగ, రేవుమాటునన్=జంతువులు నీళ్ళు త్రాగవచ్చు రేవునొద్ద మాటుపెట్టుకొని, రేపూఁటన్ = రాత్రివేళ, వివృతచాపుండన్=ఎక్కుపెట్టిన వింటిని గలవాఁడనై, ఆలించితిన్ = వింటిని, అనురవంబున్=త్రాగుచున్న చప్పుడును, పోనిదానిన్=పోలినదాని, గజముకా = గజమేయగునని, కాండము=బాణము, సర్పసన్నిభము = పాముతోసమాన మయినది, ధ్వనిచక్కటికిన్=ధ్వనికలిగినచోటికి సరిగా.

తా త్ప ర్య ము.

బాణము విల్లు ధరించినవాఁడనై శేరెక్క వేటయందుఁగల మక్కువచేత సరయూ తీరమునందు నేనుఁగులు దున్నలు మొదలగు క్రూరజంతువులను జంపుటకై యవినీళ్లు త్రావు రేవునొద్ద మాటు కల్పించుకొని యొక రాత్రివేళ విల్లెక్కుపెట్టి యొంటరిగనుండితిని అప్పుడేనుఁగు నీళ్లు త్రావిన చప్పుడువంటి చప్పుడు విన వచ్చెను. దట్టమైన చీఁకటి కారణముగ నేదియుఁ గానరాకయుండెను. శబ్దంబు జాడపట్టి యేనుఁగేయగు నెంచి పామువంటి బాణమును ధ్వని కలిగినచోటికి సరిగా విడిచితిని.

కం. ఘనశరము పడినచోటన, విన వచ్చెన్ హా యటంచు • విశదం బగుచున్
మనుజస్వర మచ్చట నొక,ముని నాశితబాణపాత•మున నేలఁ బడెన్. ౧౬౦౭

ఘనశరము = గొప్పబాణము- ఏనుఁగును బడఁగొట్టుటకుఁ జాలినంతది. విశదంబు = స్పష్టము - మనుజస్వరము = మనుష్యధ్వని- శితబాణపాతమునన్ = పదునైన బాణము పడుటచే.

తా త్ప ర్య ము.

నాపెద్దబాణము పడినచోటనే స్పష్టముగ హాయను మనుష్యధ్వని విన వచ్చెను. నాపదునైన బాణము పడినచోట నది తగిలి మునియొకఁడు నేలఁబడెను.

సీ. పడి యిటు లనియెఁ ద•పస్వి నొనాయట్టి,నాపైని బాణంబు • పడుట యెట్లు!
నరులు మిట్టాడని • నడురేయి నీటికై, వచ్చితి నేటి కె•వ్వం డొ నన్ను

వధియించెఁగా యిట్లు • వానికి నే నేమి, రొుగ్గు చేసితి నొక్కొ • యెన్నఁడైనఁ
బరహింసనము మాని•పరఁగుచు ఋషి నయి, యాకులు ఫలము లా•హారముగను

ఆ. బొట్టపోసికొనుచుఁ • బూని జటాభార,ములను నారచీర • ములను గట్టి
యడవిలోన నుండు • నట్టినే నేడ నీ, క్రూరబాణమునను • గూలు టేడ. ౧౬-౧౭

నిట్టాడని=సంచరింపని- ఎగ్గు = కీడు- పరహింసనము = ఇతరుల హింసించుట- అలంకారము విషమము- గీ, తగని వస్తుద్వయంబు సందర్భ మెంచట, నైన వర్ణింపఁబడెనేని నదియు విషమ, మనఁగఁదగు నీ శిరీష మృద్వంగియెడ, నిట్టి చేతోభవ జ్వరం బేడననఁగ.

తా త్ప ర్య ము.

ఆ ముని నేలఁబడి యిట్లనెను- తపస్సుచేసికొను నాయట్టివానిపై నెట్లు బాణముపడెను. నరులు సంచరింపని నదిరేయి నీళ్లకై వచ్చితిని. ఎవ్వండో నన్ను నిష్కారణముగాఁ జంపెఁగదా- వానికి నేనేమికీడు నేసమయమునఁ జేసితినో కదా- ఇతరుల హింసించుట వదలి ఋషినై యాకులఫలములు దినుచుఁ గడుపునించుకొనుచు జడలుధరించి నారచీరలనుగట్టి యడవిలోనుండు నేనేడ. ఈ క్రూరబాణముచేఁ జచ్చుట యేడ.

ఉ. ఎవ్వఁడు నన్నుఁ జంపి యిటు • లేపరమార్థముఁ బొందఁ బోవునో
యెవ్వని కేమి యెగ్గు ఘటి • యించితినో, గురుతల్పగుంబలెన్
బ్రువ్వఁగఁ దిట్ట కుందురె • భూజను లాతని, నిష్ఫలంబు గా
కెవ్వఁడిఁ కేమి వాఙకొను • నిట్టియనర్థపుఁ జేఁత దైవమా. ౧౮-౧౯

పరమార్థము = గొప్ప ప్రయోజనము- గురుతల్పగుంబలెన్ = గురుభార్యను బొందినవానివలె- అనర్థపుఁ జేఁతన్ = కీడుకలిగించు కార్యముచే.

తా త్ప ర్య ము.

ఎవ్వఁడు నన్నిటు చంపి యేమి పరమలాభమును బొందఁ బోవునోగదా. వాఁడిట్లుచేయుటకు వానికి నేనేమికీడు చేసితినో. గురుభార్యను బొందినవానిఁ దిట్టినట్లు లోకులు వానిఁ దిట్టకుందురా. వాని ప్రయత్నము వ్యర్థమేకాని దైవమా నన్నుఁజంపి వాఁడేమి వాఙకొనను.

సీ. అక్కటా! నామృతి • కడలను గాని నేఁ, జిరకాలముగఁ బ్రోది•సేయుచున్న
వృద్ధదంపతులఁ దండ్రిని దల్లిఁ దలఁచిన. గుండెలు ఝల్లనుఁ;•గూలువారు
నాచావు విని నంత • నాగురుల్ ది క్కేది, యింక నెగతిఁ జరి•యింపఁ గలరు
అవివేకి బాలిశుం • డైనయెవ్వఁడో యొక్క,శరమున ముప్వుర • సంహరించె

తే. ననుచుఁ గరుణోక్తులాడిన • నాలకించి,నంత విరవిర పోయె నా• యవయవములు
పరమదుఃఖతుఁడైననే•బట్టియున్న,ధనువు బాణంబుఁదముయుంత•ధరణిఁ బడియె.

అడలన్ = దుఃఖింపను- చిరకాలముగన్ = దీర్ఘకాలముగ- ప్రోది = రక్షణము- వృద్ధ దంపతులన్ = ముసలివాండ్రగు భార్యాభర్తలను- గురుల్ = తల్లిదండ్రులు- ఏకశేషము. గురువు+గుర్వి = గుర్వులు- దిక్కేది = దిక్కులేక - అవివేకి = వివేకము లేనివాఁడు- బాలిశుఁడు = మూఢుఁడు- కరుణోక్తులు = వ్యసనముతోఁగూడిన మాటలు. కరుణ+ఉక్తులు=కరుణోక్తులు.

తా త్ప ర్య ము.

అయ్యో! నాచావునకు నేను దుఃఖింపనుగాని నేను దీర్ఘకాలముగ రక్షించుచున్న ముసలిదంపతులను నా తల్లిని దండ్రిని దలఁచిన గుండెలు ఝల్లుమనియె. చావ వలన నాచావు వినినంతనే వేఱుదిక్కులేని కారణమున వారు చత్తురు. చావ కున్న వారీయడవినెట్లు తిరుగఁ గలరు. ఒప్పు తప్పులు తెలియని మూఢుఁడెవఁడో యొక్కబాణమున ముగ్గురిని జంపెను. అను యేడుపు మాటలు వినఁగానే యవయవములు విరవిరపోయెను నాచేతి విల్లుబాణములు తమయంతఁదామే నేలఁబడెను.

విల్లు బాణములు నేలఁబడెననుటచే మొదట బాణము తప్పెనేని రెండవది వేయుటకు సంధించి యుండెనని గ్రాహ్యము.

ఉ. ఉల్లము ఝల్లనంగ సర • యూతటసీమకుఁ బోయి కంటి నేఁ
• బెల్లుగ నెత్తుటం దడిసి • విద్ధఘటోదకుఁడై ధరిత్రి మే
నెల్లను ధూళి గ్రుంగి సుమ • తీ! యవకీర్ణజటాధరంబుతో
మల్లడిఁగొంచుఁ బొర్లుచును • మార్గణవేదనఁ గుందుతాపసున్. ౧౬-౧౧

ఉల్లము = హృదయము- సరయూతట సీమకున్ = సరయూనది తీరప్రదేశమునకు- పెల్లుగన్ = విశేషముగ విద్ధ ఘటోదకుఁడై = దొరలిన కుండలోని నీళ్లు కలవాఁడై- మేను=దేహము- గ్రుంగి=మునిఁగి- అవకీర్ణ జటాధరంబుతోన్= చెదరిన జడలసమూహముతో- మల్లడి గొంచున్=లపించుచు- మార్గణవేదనన్ = బాణము వలనఁ గలిగినబాధచే- సుమతీ = మంచి మనస్సు గలదానా- అనుటచే నీ వెప్పటికి సుమతివే, చిన్నప్పటినుండి నేనెప్పటికి నిర్దోషుల హింసించు కుమతినే యని భావము.

తా త్ప ర్య ము.

ఆ మాటలువిని గుండెలు ఝల్లనఁగా సరయూతీర ప్రదేశమునకుఁబోయి విస్తారముగ నెత్తుటిలోఁ దడిసి దొరలిపోయినకుండలోని నీళ్లతోఁ, జెదరిన జడలతో నేలమీఁదఁబడి దుమ్ములోమునిఁగి తాపము పడుచుఁ బొర్లుచు బాణవేదనచే బాధ పడుచున్న తాపసిని మంచి మనస్సుగలదానా! గంటిని.

కం. కంటిని గనినంతన నెఱ,మంటలు గన్నులను గ్రమ్మ • మాణవకుఁడు నన్
గెంటసము లాడె వాలుం, గంటీ యిట్లనుచు నేమి • గా వచియింతున్. ౧౬-౧౨

నెఱిమంటలు = నిండు మంటలు- మాణవకుఁడు = బాలుఁడు- గెంటస ములు = నిష్ఠురములు- వాలుంగంటీ = దీర్ఘములైన కన్నులు గలదానా- అనుటచే నీకుండుమారవుఁజూపు దూరాలోచనము నాకులేవని భావము.

తా త్ప ర్య ము.

చూచితిని- చూడఁగానే వాలుఁగంటీ నిప్పుజ్వాలలు కన్నులందుఁ గ్రమ్ము చుండఁగా బాలుఁడు నన్ను నీ ప్రకారము నిష్ఠురములాడెను. వాని నేనేమని చెప్పుదును.

సీ. అడవులఁ బడియుండు • నట్టినే నీ కేమి యపకృతిఁ జేసితి • నయ్య రాజ
గురువులు నను దప్పి • గొని నీరు దెమ్మన్న, వచ్చి నీచేతను • జచ్చినాఁడ
నను నొక్క బాణంబు • నను గొట్టి దానన, యంధులు వృద్ధులు • నైననాదు
జననిని జనకుని • సంహరించితి వీవు, దప్పిచేఁ బెదవులు • దడిపికొనుచు
తే. నెపుడు వచ్చునో కొడు కంచు • నెదురు చూచు
చున్న వారలు సహియింప • నోర్తు రెట్లు?
లిలను బడియుండు నన్నెట్లు • లెఱుఁగుఁ దండ్రి?
శ్రుతము నాతపమును ఫల • శూన్య మయ్యె. ౧౬-౧౩

తా త్ప ర్య ము.

ఓయిరాజా! యడవులందు నొంటిగఁ బతులవలెఁ బడియుండు నేను నీ కేమి యపకారము చేసితినయ్యా! నా తల్లి దండ్రులు దప్పిగొని నన్ను నీళ్లు దెమ్మని చెప్పఁగా వచ్చి నీ చేతను జచ్చితిని. నన్ను నొక్క బాణముచేఁగొట్టి వృద్ధులు గ్రుడ్డులునైన నాతల్లిదండ్రులనుగూడఁ జంపితివి. దప్పిచేఁ బెదవులనునాలుకతోఁ దడుపుకొనుచు మాకొడు కెప్పుడు వచ్చునాయని కాచి వేచియున్న వారీవార్తవిని యెట్లు సహింతురు. నేల కఱచుకొని పడియుండు తండ్రి నన్నెట్లు తెలిసికోఁ గలఁడు- నేను విన్నది నా తపము ఫలహీనమై పోయెఁగదా. వానికిదియాఫలము.

ఉ. కన్నులు లేవు రోయఁ, గొడు•కా యని యేడ్చుచు నుందు రింట నా
యున్నవిధం బెఱుంగ, రెవ • రో వచియించెడివారు వారి, నా
పన్ను లెఱింగి రేని నడు • వంగను నేరనివారు వార లే
త్రెన్నున నన్ను రోసెదరు • ద్రిమ్మరి త్రిమ్మరి గుట్ట గుట్టయున్. ౧౬-౧౪

రోయన్ = వెదకుటకు- ఆ పన్నులు=ఆపద్దశయందుండువారు, త్రెన్నునన్ = మార్గమున.

తా త్ప ర్య ము.

నన్ను వెదకుటకా వారికిఁ గన్నులు లేవు. కావున నింటిలోనే పడి కొడుకా కొడుకాయని యేడ్చుచుందురు. అంతకు మించి వారేమి చేయఁగలరు. నిర్మానుష్యమైన యీయడవిలో వారికినాగతి చెప్పువారెవరు? ఒకవేళఁనెవరైనఁజెప్పి రనుకో నడువను లేనివారు గుట్టగుట్ట తిరిగి తిరిగి యేవిధముగ నన్ను వెదకఁగలరు.

ఆ. నడువ లేనివాఁడు • నాగతి యెఱిఁగియు, నేమి సేయఁ గలఁడు•వృద్ధుఁ డకట
గాలిఁ గూలుచెట్టుఁ • గాలునే కావంగ, నుర్విఁ గూలుచున్న • యొండుమ్రాని.

తా త్ప ర్య ము.

నే నిచటఁ బడియున్నానని యెవరైనఁ జెప్పఁగాఁ దెలిసికొన్నాఁడనుకో తెలిసికొనియుఁ గాళ్లులేని వాఁడేమిచేయఁగలఁడు. అందు వృద్ధుఁడు. గాలికిఁబడి పోవు నొకచెట్టు తనవలెనే నేలఁబడుచుండు మఱియొకచెట్టును గావఁగలదా.

చం. అరుగుము నీవ రాఘవ! ర•యంబునఁ దండ్రి వసించుచోటి కిం
పరుగఁ గయున్నకాప మిదు • న్నాగ్రహ మెత్తి దవంబు కాన నాఁ
బరువఁత నిన్ను నీక్షణము • భస్మము సేయుఁ, దదాశ్రమంబుఁ బోఁ
దెరు విటు కాలిత్రోవ యదె • తెప్పున శాంతుని జేయు తండ్రినిన్. ౧౬-౧౬

రాఘవా = దశరథా- ఇట్లు సంబోధించుటచే నింతకుఁబూర్వ మీబాలుఁడు దశరథునిఁ జూచియున్నట్లు లూహింపవలయును. రాజు వేఁటకై యీ ప్రాంతములఁ దిరుగునపుడు చూచియుండవచ్చును. దవంబు = కాఱుచిచ్చు- కాననాన్ = అడవినో యన్నట్లు.

తా త్ప ర్య ము.

దశరథా నీవు త్వరగా మా తండ్రి వసించుచోటికిఁ బొమ్ము. నీవు పోక పోయితివా వారు చిచ్చుడవిని గాల్చునట్లు నిన్నుఁ గోపమున శపించి దహించి యీక్షణము భస్మముచేయుదురు. ఆయాశ్రమమునకుఁ బోవుమార్గమిదియే. ఇటు త్వరగాఁ బోయి మాతండ్రి కోపింపకుండ శాంతుని జేయుము.

కం. నీ వతని వేఁడుకొన్నను, నీవలనం గినుక గొనఁడు • నీశర మింకన్
భూవర దీయుము యుసుఱు న,దీవేగం బిసుకతిన్న • తీరునఁ గోసెన్. ౧౬-౧౭

కినుక గొనఁడు = కోపింపఁడు- ఉసుఱు = ప్రాణము.

తా త్ప ర్య ము.

నీ వాయనను ప్రార్థించితివా నీ యందుఁ గోపింపఁడు- ఏటివేగ మిసుక దిన్నెను గోయునట్లు నీ బాణము నా ప్రాణములను దెగఁగోయుచున్నది. కావున నీ బాణమును నూడఁ దీయుము.

కం. అనవుడు బాణముఁ దీయమిఁ, దనువేదన దుస్సహంబు • దానిం దీయన్
దనువు దొలఁగు నటంచును, వనటం బడునన్ను దీను • బాలుం డనియెన్.

తా త్ప ర్య ము.

బాణమును దీయకుంటినా బాధ సహింపరాదు. తీసితినా ప్రాణముపోవును. ఏమిచేయుదునా యని దుఃఖపడుచుండు నన్నుఁజూచి బాలుఁడిట్లనియెను.

చం. అడలకు మయ్య తీయు భవ • దాశుగ మిప్పుడు బ్రహ్మహత్య వ
చ్చెడు నని, తద్భయంబు మదిఁ • జేర్పకు, నేను ద్విజుండఁగాను జూ;

పొడమితి శూద్రకాంతకును ♦ భూమిప వైశ్యున; కంచు వేదనన్
బడమిని బొర్లి సొమ్మసిలెఁ ♦ బోఁడుఁడు పల్కఁగలేక సోలుచున్. ౧౬౧౯

భవదాశుగము = నీ బాణము. వైశ్యునకు శూద్ర స్త్రీయందుఁ బుట్టినవాఁడు కరణజాతివాఁడు. వైశ్యాత్తు కరణః శూద్ర్యాం విన్నాస్వేవ్య విధిస్మృతః వైద్యనాథీయము. పోఁడుఁడు = బాలుఁడు. ఉత్తమజాతి పురుషునకు నధమజాతి స్త్రీకి జనించినవాఁడు తండ్రి జాతివాఁడు కాఁజాలఁడు. రావణాసురుఁ డిట్టివాఁడేకదా?

తా త్ప ర్య ము.

రాజా నీ బాణము దీసిన తొడల నేను మరణింతును. నేను మరణించితినా నీకు బ్రహ్మహత్యవచ్చునని భయపడకుము. నేను బ్రాహ్మణుఁడనుగాను. నేను వైశ్యునకు శూద్రస్త్రీయందుఁ బుట్టినవాఁడను అని చెప్పి బాధపడలేక భూమిమీఁదఁబడి బాలుఁడేడ్చుచు శ్వాసపుచ్చుచు మాటాడలేక మూర్ఛపోయెను.

ఆ. నెఱఁకు నాటి యున్న ♦ కఱకుబాణమువానిఁ, బలుక లేనివాని ♦ వణఁకువానిఁ
బొరలువానిఁ జేష్ట ♦ పొలిసినవాని మేన్, ముడుఁచువానిఁ గాంచి ♦ ములికిఁ బెఱుక.

నెఱఁకు = మర్మస్థానము.

తా త్ప ర్య ము.

మర్మస్థానమందుఁ గ్రుచ్చికొనియుండు బాణముగల వానిని, మాటలాడలేని వానిని, వణఁకుచుండువానిని, నేలపైఁ బొరలాడువానిని, చేష్టలుడిగినవానిని, దేహము ముడుఁచుకొన్నవానినిఁ, గాంచి బాణము నూడఁదీయఁగా.

కం. అతండు నన్నుఁ గనుచున్, భీతుండై ప్రాణములను ♦ విడిచెన్ నే నా
పూతచరిత్రకునిన్ సరయూతీరశయాను గాసి ♦ నూర్చెడివానిన్. ౧౬౨౧

భీతుండై = తన తల్లి దండ్రుల గతియేమో యని భయపడినవాఁడై నీవు పోయి చెప్పుమని యర్థము సూచించు దృష్టుల నన్నుఁ జూచుచుఁ బ్రాణములను విడిచెను. నేనో యా పవిత్రచరిత్రముగలవానిని సరయూనది యొడ్డునఁబడియుండువాని బాధచే నూర్పులు పుచ్చువానిని.

కం. జలములఁ దడిసినమేనిం, గలవానిని జూచి చూచి ♦ కళవళపడుచున్
విలపించితి విలపించితిఁ, జెలియా! నాకెట్టియఘము ♦ చేపడె ననుచున్. ౧౬౨౨

తా త్ప ర్య ము.

నోరలినకుండ నీళ్లచేఁ దడిసిన దేహముగలవానిని జూచి చూచి యయ్యో నా కెటువంటి పాపము సంభవించెనని యూరక యేడ్చితిని.

సప్తవ్యసనములలో రెండువ్యసనములఁ జెడినవానికి (స్త్రీవ్యసనము వేఁటవ్యసనము) దశరథుఁడే దృష్టాంతము.

కం. అని చెప్పి మునికుమారుని, మనమునఁ దలపోసి యేడ్చి ♦ మానిని కనియెన్
జనపతి మునిపతిఁ గానఁగ, జనుటయె నేమంబొ కాక ♦ దనయుయ మేలో. ౧౬౨౩

### తా త్ప ర్య ము.

అని యీ ప్రకారము చెప్పి యామునికుమారుని స్థితి మనస్సునకు రాఁగాఁ గన్నులఁగట్టినట్లై యేడిచి మరలఁ గౌసల్యతో నిట్లనెను. దేవీ! యీవల నే నిట్టు లాలోచించితిని. మునీశ్వరు నే నిపుడు పోయి చూచుట మేలా. అక్కడికిఁ బోక యుండుట మేలా?

కం. పొరపాటున నా కెంతటి, దురితము ప్రాపించె ననుచు ♦ దురపిల్లుచు నేఁ
 బరమోదక మాఘటిఁ గొని, యరిగితి వినియున్నత్రోవ ♦ నాశ్రమమునకున్. ౧౬౩౮

పొరపాటు = ప్రమాదము- దురితము = పాపము- దురపిల్లుచున్ = దుఃఖించుచు- ఘటిన్ = కుండయందు.

### తా త్ప ర్య ము.

ప్రమాదవశమున నా కెటువంటి పాపము వచ్చెనురా దైవమా యని దుఃఖించుచు నానదీ తీర్థమును నాకుండయందుఁ దీసికొని బాలుఁడు చెప్పఁగా వినియున్న త్రోవనుబట్టి యాశ్రమమునకుఁ బోయితిని- చీఁకటి వ్యాపించినట్లు ముందు చెప్పఁబడెను.

వెలుతురున కేమి యుపాయముచేసెనో. వైద్యుత దీపమువంటిదేదైన నొక సదుపాయము నలునియొద్ద నున్నట్లుండె నేమో. శృంగార నైషధమునఁ బడుక టింటి వర్ణనము చూడుఁడు. (౨ అ ౧౬౫ ప.)

చం. నడువఁగ లేనివారి, నయ ♦ నంబులు గానివారి, వృద్ధులై
 వడఁకెడిమేనివారి, హత ♦ పక్షిఖగంబులఁ బోలువారలన్,
 బడుగుల, నింత నే పయిన ♦ బాలుఁడు రాఁడు జలంబుఁ గొంచు నం
 చడలెడివారి, మత్కృతని ♦ రాశులఁ, గంటిని యత్నహీనులన్. ౧౬౩౯

హతపక్షిఖగంబులఁబోలు వారిని = కొట్టఁబడినఱెక్కలుగల పక్షులవంటి వారిని- బడుగులన్ = దిక్కులి ముసలి వాండను- అడలెడివారిన్ = పరితాప పడెడి వారిని- మత్కృతనిరాశులన్ = నాచే నిరాశులుగఁ జేయఁబడిన వారిని- యత్నహీనులన్ = కేవలము పరాధీనులై- తమకుఁదామేమియుఁ జేసికొన నేరని వారిని- చూచితిని.

### తా త్ప ర్య ము

నడువలేనివారిని, గన్నులులేని వారిని ముసలులై దేహములు వణఁకువారిని, ఱెక్కలు తెగఁగొట్టఁబడిన పక్షులవంటి వారిని, దిగుల ముసలిన్ను, నింతకాలమ య్యెనే నీళ్లు తీసికొని పిల్లవాఁడు రాఁడాయెఁగదాయని తపించువారిని, అవిషయ మున నాచే నాశలేని వారుగాఁ జేయఁబడిన వారిని, పరాధీనులై యేమియుఁ జేసికొనలేనివారినిఁ జూచితిని.

కం. మునిపుత్రునిఁ జంపిన పెన్వనటన్ వ్యాకులత నొంద•స్వాంతము వెఱచే
తను గుండె లదుర నాశ్రమ,మును డాసెడికోలఁది వగవు • ముమ్మర మయ్యెన్.

వనటన్ = శోకముచే- స్వాంతము = మనస్సు- వ్యాకులతనొందన్ = కలవరపడుచుండఁగా- వెఱ = భయము- ముమ్మరము = అధికము.

తా త్ప ర్య ము.

మునికుమారుని జంపితినిగదా యను పెద్ద దుఃఖముచే మనస్సు వ్యాకుల పడుచుండ నాశ్రమము సమీపించుకొలఁది గుండెలు కొట్టుకొనుట యెక్కు-వకాఁగా దుఃఖము విశేషించెను.

తే. కాలిచప్పుడు వారింత • యాలకించి, యెంత సేపాయెరా తండ్రి•యిదిగొ నున్న
యేటినీటికి నీ వేగి • యింతతడవు, తడయఁగాఁ జెల్లునా నీకుఁ • గొడుకుఁ గుఱ్ఱ•

ఆలకించి = విని- తడయఁగాన్ = ఆలస్యము చేయఁగా. ఇదిగొ = ఇది సామీప్యమును దెలుపును.

తా త్ప ర్య ము.

దూరమునందే నాకాలి చప్పుడు వారు కొంచెముఁవిని కొడుకువచ్చెఁగదా యని తలఁచి కుమారా యీ సమీపముననున్న యేటికిఁబోయి వచ్చుటకు నెంత సేపు చేసితివిరా తండ్రీ! యింత యాలస్యము చేయవచ్చునా చిన్నినాయనా.

ఉ. నాలుక లెండ మాకు నిట • నాయన! నీటికిఁ బోయి యాటలన్
గాలముఁ బుచ్చు చుంటి గద • కాలవిళంబన మైన రాఁడుగా
బాలుఁ డటంచుఁ బెన్వగపు • పాటునఁ దూలెడి నీదుతల్లియున్
నీళులు దెమ్ము, యెన్నఁడిది • నేరవు, నేఁడ యి దేల పుత్రకా! ౧౬-౨౮

కాలవిళంబనము = జాగు- పెన్వగపుపాటునన్ = గొప్ప దుఃఖముచే.

తా త్ప ర్య ము.

నాయనా! మాకు నాలుక లెండిపోవుచున్నవే నీటికై పోయి మా కష్టము లాలోచింపక యాడుకొనుచుంటివిక దా. ఇంత తడవాయెనే నాకొడుకు రాఁడా యెనే యని నీ తల్లియెంత దుఃఖించుచున్నదో యెఱుఁగవుక దా. ఇప్పుడైనను నీళ్లు దెమ్ము. ఎప్పుడిట్లు సేయవే ఈ దినమే యిట్లు చేసితివేల తండ్రీ!

ఉ. తప్పుగ నెంచఁ బోకుము సు•తా! నిను నేనొ ద్వితీయమాతయేన్
దప్పులు పట్టి యుండినను • ధన్యుఁడ వీవు తపోధనుండ! మా
తెప్పయు నీవ, మాగతియు • దృష్టియు నీవ, యటంచుఁ బ్రాణ మే
కొప్పుడు నీపయి న్నిలుప • నేటికిఁ బల్కు-వయో కుమారకా! ౧౬-౨౯

ద్వితీయమాత = నీతల్లి.

తా త్ప ర్య ము.

పుత్రా నేనుగాని నీతల్లిగాని యెప్పుడైన నిన్నుఁ దప్పు పట్టి యుండితిమేని యది దోషముగా నెంచకుము- నీవు తపోధనుఁడవు. మాతాపితృ శుశ్రూషచే ధన్యుఁడవు. ఈ సంసారసాగరము దరించుటకు నీవే మాకుఁ దెప్పవు, మాకు గతులు కల్పింపవలసినవాఁడవు నీవే- మాదృష్టులు నీవేయని మా ప్రాణము లన్నియు నీ మీఁద నిలిపియుండఁగా నేలరా నాయనా మాటలాడవు.

ఆ. కనులు లేనిమాకుఁ • గనులు నీ వనుచును, దిక్కు- లేనిమాకు • దిక్కు- నీవ
యనుచు నమ్మియుండ • నగునయ్య నీ కిట్లు, మ మ్ముపేక్ష సేయ• మహితచరిత.

తా త్ప ర్య ము

కన్నులులేనిమాకు నీవేకన్నులు- రక్షకుఁడు లేనిమాకు నీవే రక్షకుఁడవు. అని నమ్మియుండఁగా నీవు మమ్ము నుపేక్షింప దగునా.

ఆ. అనుచు నీరెలుంగు • నను దొట్రుపాటునఁ, బలుకు చున్నయట్టి•పరమమునిని
జేరఁ బోయి చెనఁటి• సేఁత భీతిల్లుచు, నల్లనల్ల నిట్టు • లంటి నేను. ౧౬-౩౧

ఈ రెలుంగునన్ = సన్నిని గొంతుతో - తొట్రుపాటునన్ = తొందర పాటున- చెనఁటిసేఁత = నేను జేసిన చెడ్డపనికై, భీతిల్లుచున్=భయపడుచు- అల్ల నల్లన్ = మెల్ల మెల్లగా. తా త్ప ర్య ము.

అనియిట్లు సన్న గొంతుతోఁ దొందరపాటుతో మాటలాడుచున్న యా మునిశ్రేష్ఠుని యొద్దకుఁబోయి నేను జేసిన పాపకార్యముఁదలఁచి భయపడుచు మెల్ల మెల్లగా నిట్లంటిని.

ఉ. పుత్రుఁడఁగాను మీకు, ముని • పుంగవ! పంక్తిరథుండఁ జేరునన్,
క్షత్త్రియుఁడన్, మహాఘమును • సజ్జనగర్హితమైననీచచా
రిత్రము సల్పి పొందితిని • నే సరయూతటభూమి వేఁటకై
గాత్రము డాఁచి హస్తమునఁ • గార్ముకముం గొని వేచి యుండఁగన్. ౧౬-౩౨

పంక్తిరథుండన్ = దశరథుండను- పఙ్క్తి-యని వ్రాయుట సంస్కృత వ్యాకరణానుసారి యైనను నాంధ్రభాషయందట్టి సంయోగములేదు. తత్సమముల నను నాసికస్థానమున బిందువే వచ్చును. "సింగంబాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమైనుండి మాతంగ స్ఫూర్జిత"యని తిక్కనయు "నిఁడు మనంబున వ్యసనసిత సమానము పల్కు-దారుణా ఖండల శస్త్రతుల్యము" అని నన్నయ భట్టారకుఁడు. మఱి నాంధ్రకవులందఱు నిట్లే ప్రయోగించినారు గాని తద్విరుద్ధ ప్రయోగ మొకటి యైనలేదు. మహాఘము = గొప్ప పాపము- సజ్జన గర్హితము = సాధువులచే నిందింపఁదగినది- నీచ చారిత్రము = క్షుద్రపు నడవడి. రేఁ-రాత్రి- సరయూతట భూమి = సరయూనది తీరప్రదేశమునకు- గాత్రము = దేహము- డాఁచి = మఱుఁగు పఱిచి, కార్ముకము = విల్లు- వేచి = కాచుకొని.

తా త్ప ర్య ము.

మునీంద్రా! మీకు నేను పుత్రుఁడనుగాను. నా పేరు దశరథుఁడు- నేను క్షత్రియుఁడను- సత్పురుషులు నిందించు నీచపు నడవడిని ప్రవర్తించి గొప్ప పాపము సంపాదించితిని. ఈ రాత్రియందు సరయూతీర భూమికై వేటకై వచ్చియుండి దేహముదాఁచి చేతవిల్లుగొని మృగమునకై కాచియుండఁగా.

చం. బుడబుడ మన్న నాదము త•పోధన. నీచుల వింటి నాదుస
వ్వడి నది కుండ ముంచెడిర•వం బని యెంచక దంతి నీళ్లు ద్రా
వెడినులి వన్నభ్రాంతి వెస • వ్రేసి శరంబున డాసి యొమ్మనన్
బెడిదపుటమ్ము నాట ధర • వ్రీలినవాని నొకండుఁ జూచితిన్. ౧౬-౩౩

నాదముచప్పుడు-తపోధన = తపస్సే ధనముగాఁ గలవాఁడా- వీనులన్ = చెవుల- నాదుసవ్వడి=ధ్వనిజాడ- దంతి=ఏనుఁగు- ఉలివు=చప్పుడు- బెడిదపుటమ్ము= భయంకరమైన బాణము- వ్రీలిన=పడిన.

తా త్ప ర్య ము.

తపోధనా యిట్లు నేను పొంచి కాచియుండఁగా నీళ్ళలో బుడ బుడ మను చప్పుడు వినవచ్చెను. ధ్వనిజాడఁబట్టి యది కుండముంచెడి ధ్వనియని తలంపక యే నుఁగు నీళ్ళుత్రావు చప్పుడని తలఁచి శీఘ్రముగ బాణమువేసి దగ్గఱఁ బోయి యొమ్మన బాణము నాటఁగా నేలఁబడియున్న యొక మనుష్యునిఁ జూచితిని.

కం. అనఘాత్మలార! వనగజ, మును జంపఁగ నీట బాణ•మును విసిచిన మీ
తనయుని నది వధియించెను, వినిపించె నలందు తనదు•వృత్తాంతంబున్. ౧౬-౩౪

అనఘాత్మలారా = పాపములేని మనస్సులుగలవారలారా- వనగజమును= అడవియేనుఁగును- వధియించెన్=చంపెను,

తా త్ప ర్య ము.

పుణ్యాత్ములారా! యడవియేనుఁగును జంపుటకై నేనుప్రయోగించిన బాణము మీకొడుకును జంపెను. అతఁడే తనవార్తయంతయుఁ దెలిపెను.

ఉ. అతనిమాట-చొప్పునన • యాశుగముం బెఱుకంగ నాతఁడున్
హా తలిదండ్రులార! ముది•యంధకులార! యటంచుఁ గూలె నే
నాతనిబోధపద్ధతి మ•హాత్మకులార! కనంగ వచ్చితిన్
పాతకి నీని మీమనసు•వచ్చినరీతి నొనర్పుఁ డిం కిటన్. ౧౬-౩౫

ఆశుగము=బాణము- అంధకులార=గ్రుడ్డివారలారా! బోధపద్ధతిన్ = ఆయన బోధించినమార్గమున- పాతకిన్=పాపిని

తా త్ప ర్య ము.

అతని మాటప్రకారము బాణము నూడఁదీయఁగా నతఁడు హా తల్లిదండ్రు లారా ముసలి గ్రుడ్డులారా యని చచ్చెను, నేనాతఁడు నేర్పినమార్గమున మిమ్ము

జూడ వచ్చితిని. ఈ పాపాత్ముని నిఁక మీమనస్సువచ్చినట్లు చేయుఁడు.

క్షమింపుఁడనికోరక మీ యిష్టమువచ్చినట్లు చేయుఁడననేల? పాప మతి ఘోరమైనది. క్షమింపఁదగినది కాదని యంతరాత్మ చెప్పుచున్నది. దండింపుఁడనుటకు నోరురాలేదు. కావున మీయిష్టమువచ్చినట్లు చేయుఁడనెను.

కం. మీసుతు నజ్ఞానంబున, నే సంపితి నిమిషమాననుఁ ♦ నిజ మిది నేనో
దోసిని ననుఁ గరుణింతురొ, శాసింతురొ యిచ్చకొలఁది ♦ పలుపుఁ డటన్నన్.

అజ్ఞానంబుననే=తెలియమిచేతనే- సంపితిన్=వధించితిని- దోసిన్=దోషము చేసినవాఁడను- శాసింతురొ=దండింతురో- ఇచ్చకొలఁది=ఇష్టముచొప్పున.

తా త్ప ర్య ము.

మీకొడుకును నే నజ్ఞానముచేతనే నిమిషములోఁ జంపితిని- ఇదినిజము. నేను దోషము చేసినవాఁడనే నాయందు దయయుంచి మన్నించుటయు దండించుటయు మీయిష్టము. ఎట్లుచేసినను శేయుఁడు.

చంపు శబ్దము రూపాంతరము సంపు 'సారంగాహితమున్ సంపెగన హర్ష మేపునఁ జొదలన్-హరివల ౨-వ ఆ. దశరథుఁడు తనదోషమును జెప్పుకొనుటచే నల్పదండముతో క్షమింపఁబడెను. పశ్చాత్తాపమున సగముపాపము పోవును. గొప్పవారియెడల నపరాధముచేసినవారు తమయపరాధమును జెప్పుకొని క్షమింప వేఁడుట శ్రేయస్కరము. నరకము దప్పును. ఇట్లుచేయని కారణముచేతఁగదా పరీక్షితుఁ డట్లుచచ్చెను.

ఉ. పాపభయంబుచే వగపు♦పాటున నా యనినట్టి కర్కశా
లాపము వీనులం బడఁ బ్ర♦లాపము సేయుచు నుష్ణబాష్పధా
రాపరిణాహ మారఁగ భ♦రంపడి యూర్చుచుఁ బల్లటిల్లుచున్
దాపున నున్న నన్ను ముని♦తల్లజుఁ డి ట్లని పల్కె నార్తుఁడై. ౧౩౭

వగపుపాటు = వ్యసనపడుట- కర్కశాలాపములు=కఠినములైన మాటలు- వీనులన్=చెవులయందు- ప్రలాపము=ఏడుపు- ఉష్ణబాష్ప=వేఁడికన్నీళ్ళ - ధారా=ధారలయొక్క- పరిణాహము=ఎక్కువ- పల్లటిల్లుచున్ = దుఃఖించుచు.

తా త్ప ర్య ము.

పాప భయముచేతను వ్యసనముతోడను నేను బలికిన కఠినపు మాటలు చెవులఁబడఁగానే గట్టిగాఁ గొడుకా కొడుకా యని యేడ్చుచు వేఁడి కన్నీళ్లధారలు ప్రవాహముగాఁ బాఱఁగా నిట్టూర్పు లధికముగా నూర్చుచుఁ దపించి యార్తుఁడైన యా మునిశ్రేష్ఠుఁడు సమీపమందున్న నన్నుద్దేశించి యిట్లుపల్కెను.

శా. వానప్రస్థునిఁ జంపి క్షత్రియుఁడె ని ♦ ల్వం జాలు? నా వాక్యయేన్
స్థానభ్రష్టత మిక్కిలిం గనఁడె ప్ర ♦ జ్ఞాపూర్వముం జేసినన్

తన్మనాథా! బ్రదుకంగఁ గంటి నిటు ప • శ్చాత్తాప మారంగ నీ
వే నీపాపముఁ జెప్పుటన్; శిరము తా • దేన్ జోదె వేవ్రక్కలై. ౬౩-౪౮

వజ్రి=ఇంద్రుఁడు-స్థానభ్రష్టతన్ = పదవినుండిపడినవాఁడగుటను - ప్రజ్ఞాపూర్వమున్ = బుద్ధిపూర్వకముగా.

తాత్పర్యము.

రాజా! వానప్రస్థునిఁజంపి క్షత్రియుఁడా బ్రతుకఁ గలవాఁడు. బుద్ధిపూర్వకముగఁ జేసినవాఁడు దేవేంద్రుఁడైనను నాపదవినుండి పడిపోఁడా. నీవు పశ్చాత్తాపము గలవాఁడవై నీపాపమును నీవే చెప్పుటచేత బ్రదుకఁ గలిగితివి. నీవు చెప్పకుండితివేని నీతల యీవెంటనే వేయివ్రక్కలై పగిలియుండదా.

చం. ఎఱిఁగి యెఱింగియున్ ముని న • హీనతపోధను బ్రహ్మవాదినిన్
గఱకుశరంబునం దునుమఁ • గాఁ దల గూలెడి నేఁడువ్రక్కలై
మఱకువఁ జేయుటం గలిగె • మన్గడ నొంద, నెఱింగి చేసినన్
నెఱి రఘువంశమే చెడదె • నీ వన నెంతటివాఁడ వో నృపా. ౬౩-౪౯

అహీనతపోధనున్ = అధికతపమే ధనముగాఁ గలవానిని, బ్రహ్మవాదినిన్ = బ్రహ్మజ్ఞానము గలవానిని - కఱకుశరంబునన్=పదునైన బాణముచే-తునుమఁగాన్= నఱకఁగా - చంపఁగా - మఱకువన్=అజ్ఞానముచే-మన్గడ=బ్రతుకుపాటు.

తాత్పర్యము

తెలిసి తెలిసి మునిని, గొప్పతపమే ధనముగాఁ గలవానిని, ఆత్మజ్ఞానిని, బదునైనబాణమున ఖండించిన వానితల యేడుతునుకలై నేలఁబడును. నీవజ్ఞానముచేఁ జేయుటవలన బ్రదుకఁ గలిగితివి. తెలిసియే నీవు చేసియుండిన నీరఘువంశమే మూలముట్టుగ నశించియుండదా. నీవన నెంతమాత్రము.

ఈవానప్రస్థుని వాక్కులవలనఁ దెలిసి చేసినపాపమున కెక్కువ శిక్షయనియుఁ బ్రమాదమునఁ జేసినదానికిఁ దక్కువ శిక్షయనియు నేర్పడుచున్నది.

అకామతః కృతేపాపే, ప్రాయశ్చిత్తం విదుర్బుధాః
కామకార కృతేప్యాహు, రేకే శ్రుతి నిదర్శనాత్

తెలియకచేసిన పాపమునకుఁ బ్రాయశ్చిత్తము గలదని పండితులు చెప్పుదురు. మఱికొందఱు బుద్ధిపూర్వకముగఁ బాపము చేసినను బ్రాయశ్చిత్తము కలదని శ్రుతివాక్యమువలనఁ జెప్పిరి.

ఇట్లనుటచేఁ బ్రమాదమునఁ జేసినపాపమునకు లఘుదండన మనియుఁ దెలిసిచేసిన దానికిఁ గ్రూరదండన మనియు నేర్పడెను.

ఉ. ఎచ్చట మాసుతుండు పడి • యెన్ నృప! తోడ్కొని పొమ్ము మమ్ము నీ
వచ్చటికిం దనూజు రుధి • రార్ద్రశరీరుఁ బ్రకీర్ణజూటుఁ డై

చచ్చి ధరాస్థలిన్ యమవ•శంగతుఁ డై పడియున్న పుత్రు లో
నిచ్చ జనించెఁ జూడ నన • నేఁ గొనిపోయితి వారి నిద్దఱన్. ౧౬౪౦

తనూజున్=కొడుకును- రుధిరార్ద్ర శరీరున్=నెత్తుటిచేఁ దడిసిన దేహముగల వానిని-ప్రకీర్ణజాటుఁడై = విరిసిన జడలు గలవాఁడై - యమవశంగతుఁడై =యము నకు వశపడినవాఁడై.

తా త్ప ర్య ము.

రాజా! మా కుమారుఁ డెక్కడఁ జచ్చిపడి యున్నాఁడో యక్కడికి మమ్ముఁ దోడుకొని పొమ్ము. నెత్తుటఁదడిసిన దేహముతోఁ విరిసిన జడలతోఁ జచ్చి మృత్యు దేవతవశుఁడై నేలఁబడియున్న కొడుకును జూడ మాకుఁ గోరిక కలిగెను అనిన నేను వారి నిద్దఱ నచ్చటికిఁగొని పోయితిని.

—• ఋషి తనపుత్రునకై విలపించుట. •—

ఆ. కాలధర్మమొంది•కూలిననిజపుత్రుఁ, దడవి తడవి చూచి•తండ్రి యనియె
నేల పుత్ర! తండ్రి•యే తెంచియుండిన, దండ మిడవు నీకుఁ•దగునె యిట్లు.

కాలధర్మము=మృతి.

తా త్ప ర్య ము.

చచ్చి నేలఁబడిన తనకొడుకును దేహము నిమిరినిమిరిచూచి తండ్రి యిట్లనియె. పుత్రా తండ్రి నీసమీపమునకు నేను వచ్చినపుడు నీవు నాకు నమస్కరింపకుండుట నీకు ధర్మమా? పెద్దవారు తన యొద్దకు వచ్చినపుడు కూర్చుండిన పిన్నవారు లేచి కులధర్మపద్ధతి నమస్కరింపవలెనని నీతిబోధ.

ఉ. అయ్యయొ నాతనూజ! పలు•కాడ విదేమిర, కోప మేలరా,
యిర్యొడ నేలపైఁ బడిన•దేటికిరా, యొకమాట చెప్పరా,
నెయ్యము నాపయిం గలుగ•నేరద యేనియుఁ దల్లిఁ జూడరా,
తియ్యనిపల్కు పల్కర, మ•దిన్ వగ పాయఁగఁ గౌఁగిలింపరా. ౧౬౪౨

తనూజా = కొడుకా.

తా త్ప ర్య ము.

అయ్యయ్యో కొడుకా యేలరా మాటలాడవు. ఏలరా నాపైఁ గోపగించితివి. నేలమీఁద నిప్పుడిక్లేలరా పడితివి. ఒక్కమాట యేదైనఁ జెప్పరా నామీఁద నీకు స్నేహములేదేని నీతల్లినైనఁ జూడరా. కమ్మని పలుకొకటి పలుకరా నాయనా మాదుఃఖము తీఱఁగౌఁగిలింపరా.

కం. క్రమమారఁగఁ గడుహృదయం,గమముగ శాస్త్రాది సకల•కళల నపరరా
త్రములందు నెవఁడు చదువఁగ, నమలమతీ యింక వీను • లారఁగ విందున్.

క్రమమారఁగన్ = క్రమము దప్పింపక- హృదయంగమముగన్ = మనస్సున కింపుగ-శాస్త్రాది సకలకళలన్ = శాస్త్రము మొదలగు సకల కళలను-అపరరాత్రము

లందున్=రాత్రియొక్క కడపటి భాగమందు - అమలమతీ = మలినములేని మనస్సు గలవాఁడా - వీనులారఁగన్ = చెవులార.

తా త్ప ర్య ము

నిర్మల మనస్సుగలవాఁడా! క్రమము దప్పింపక చదువవలసిన విధముగ మిగుల సంతోషకరముగ శాస్త్రములోనగు కళలను నుదయమున రాత్రియుండఁ గనే లేచియొవఁడు చదువఁగ నీకిఁ జెవులార వినఁగలను.

కం ఎవఁ డింక స్నాన మొనరిచి, సవరగ సంధ్యాగ్నిహోత్ర•సముపాసనముల్
సువిహితముగ నొనరిచి నన్, బ్రవిమలమతి భీతుఁ గొల్చుఁ • బట్టీ! చెపుమా.

తా త్ప ర్య ము.

ఎవఁడు స్నానముచేసి శాస్త్రప్రకారము శాంత్రికముగ సంధ్య - అగ్నిహోత్రము - ఉపాసనము చేసి పుత్రశోకమువలనఁ గలిగిన భయముగలనన్ను నాసమీపమునసుండి యుపచారము చేయును.

ఇచ్చటి సంధ్యావందనము నమస్కార పూర్వకము శాంత్రికమునగు. శూద్రస్త్రీయందు వైశ్యునికిఁ గలిగినవాఁడుగదా కరణ జాతివాఁడు. వీనికిహోమాధికారి మెచ్చటినుండి వచ్చెను. అనిప్రశ్న - కరణజాతి యనులోమ జాతియేకాని విలోమజాతికాదు. ఎక్కువజాతి పురుషునకుఁ దక్కువజాతి స్త్రీకిఁ బుట్టినవాఁడు, పురుషుని జాతికంటెఁ దక్కువవాఁడును స్త్రీజాతికంటె నెక్కువవాఁడు నగుచున్నాఁడు. ఇది వివాహితుల విషయముగాని అంకుటాంగ్ర విషయముగాదు. వేశ్యలవిషయముగాదు. కావునఁ గరణజాతియందు నీబాలుఁడు శూద్రజాతి కంటె నెక్కువవాఁడగు చున్నాఁడు. రావణాసురుఁడు నిట్టివాఁడే-వాఁడు బ్రాహ్మణ సవర్ణుఁడే కాని బ్రాహ్మణ జాతివాఁడు కాఁడు.

“నమస్కారేణ మంత్రేణ పంచయజ్ఞాన్ సమాపయే”త్తని శూద్రులకుఁ బంచయజ్ఞాధికారము చెప్పఁబడియుండ వారికంటె నుత్తముఁడగు కరణజాతివానికి నేల లేకపోవునని గోవిందరాజులు తీర్థీయులు వ్రాసియున్నారు. రావణాసురుని వర్ణవిషయము సుందరకాండమునఁ జర్చింపఁబడును.

చం. తిరుగఁగ లేనివారి, నొక•దిక్కు నెఱుంగనివారి, నిత్యక
ర్మరతికి శక్తి లేని మము•రాగమునం బలుకందమూలముల్
వరమతి సత్ప్రియాతిథికి•భాతిని మా కిడి నిందుఁబ్రీతితో
నరసెడువార లెవ్వ రిఁక•హా తనయా! చన నీకు న్యాయమా. ౧౬-౫౫

నిత్యకర్మరతికిన్ = నిత్యకర్మానుష్ఠానమునకు-సత్ప్రియాతిథికిభాతిని = మంచి ప్రియమైన యతిథినివలె, అరసెడువారు = విచారించువారు. నాలవపాదమునఁ బ్లుతయతి. భాతికివలె ననునర్థ మాంధ్రమంద గలదు. సంస్కృతంబున లేదు.

తా త్ప ర్య ము

నడవలేనివారి నేదిక్కు-లేనివారి నిత్యకర్మములు చేయుటకు శక్తిలేని మమ్ముఁ బ్రేమముచే ననేకములైన కందమూలములు దెచ్చి మంచి ప్రియుఁడైన యతిథికివలె నిండు ప్రీతితో నెవ రాదరింతురు! హాకుమారా! యిట్టి యనాథుల విడిచిపోవ నీకు ధర్మమా!

తే. కడుపుదుఃఖంబునను గకుఁ • గ్రాఁగు చున్న, నీదుతల్లిని గృపణను • నిండుముసలిఁ గనులు గానని దాని నే•కరణిఁ జెపుమ, నాయనా! యింక భరియింప•నాకువశము!

తా త్ప ర్య ము.

కొడుకు చచ్చెనను దుఃఖమున వెఁగులఁ గాలిపోవుచున్న దీనురాలిని నీతల్లిని నిండు ముసలిదై కన్నులు గానరానిదానిని నే నేవిధముగ నిఁక భరింపఁగలను. చెప్పుమా.

ఉ. పోకుము కాలువీటికిని • బుత్ర! యిదే భవదీయమాతతో
వేకువ నైన వచ్చెదను • వెంబడి, నిల్వుము నేను జెప్పెదన్
మాకొమరున్ సహింపుము య•మా! గురులన్ మముఁ బోడి సేరఁగా
జేసితెఁ గాలయాపనము • శిక్షకుఁ బాత్రుఁడు గాఁ డటంచునున్. ౧౬-౪౭

కాలువీటికిన్=యమునిపురమునకు- భవదీయమాతతోన్=నీతల్లితో - వేకువ నైనన్=ఉదయముకాఁగా- కాలయాపనము=జాగు-

తా త్ప ర్య ము

కుమారా! నీవు యమపురికిఁ బోవలదు నిలుము. తెల్లవాఱఁగానే నీవెంబడి నీతల్లితోడ నేనువచ్చెదను. వెంటనే యేల రావైతివి. జాగేలచేసితివని యముఁడు నిన్ను దండింపఁబూనెనా యముఁడా మాకుమారుని క్షమింపుము. దండింపకుము. తల్లిదండ్రులైన మమ్ముఁ బోడితెచ్చుటకై యాలసించెను వీఁడు గురుపూజా దురంధరుఁడు కావున శిక్షకుఁ బాత్రుఁడు కాఁడు. అని మేము చెప్పెదము.

చం. నిలువఁగ నెట్టు లోఁ దనయ • ని న్నెడఁ బాసి వ్యథాభరంబునన్
నలఁగుచు దిక్కు-లేకిటు వ•నంబుల గ్రుస్సఁగ; నాదుమన్నిలన్
గలితమహాయశుండు గత•కల్మషుఁ డాశమనుండు జాలి ని
న్నలుగఁడు కూర్మిఁగూరియభ•యం బొసఁగున్ మముఁజూచి నంతటన్. ౧౬-౪౮

వ్యథాభరంబునన్ = దుఃఖాతిశయముచే - కలితమహాయశుండు = పొందఁబడిన మహాకీర్తిగలవాఁడు-గతకల్మషుఁడు=పోయిన కల్మషముగలవాఁడు-శమనుండు= యముఁడు- అలుగఁడు=కోపింపఁడు- అభయము=భయము లేమి-

తా త్ప ర్య ము.

నావెంట నీవేల రావలయును. ఇంకను గొన్నిదినములు భూలోకమున నుండరాదా యందువేని వినుము. నిన్నెడఁబాసి దుఃఖాతిశయముచే నలఁగుచు దిక్కు-లేక యిటువంటి యడవులలోఁ గ్రుస్సుచు నెట్లుండ శక్యమగును. అదియును

గాక మేము నీవెంట వచ్చితిమా నామనవి విని గొప్పకీర్తిగలవాఁడు పాపములేనివాఁడు నగు యముఁడు నిన్నుఁ జూచినంతనే మనస్సుగరఁగి యయ్యోపాపమే యని దయ గలవాఁడై నీవాలసించినందునకు నీపైఁ గోపింపక దయచే నభయమే యొసఁగును.

సీ. అఘము నీచేసిన • యది లేదు పాపి యగా, త్మనాయకుఁడు నిన్నుఁ • జంపెఁ బుత్ర!
దాన నాసత్యస • త్తపముల బలమున, శస్త్రయోధులగతిఁ • జనుము కలన
వెనుకంజ పెట్టక • మునఁబోటునను గూలు,శూరులలోకంబుఁ • జేర వయ్య
సగరదిలీపులు • శైబ్యనహుషధుంధు,మారులు జనమేజ • యారిశేత

ఆ. యరిగినట్టిగతికి • నరుగుము పుత్రక! యేది గతియొ మునుల • కెల్ల సాధు
వులకు భూమిదులకుఁ • గలుగు నేగతి యట్టి.గతికి నీవు చనుము • హితచరిత్ర !

అఘము=పాపము- నాసత్యసత్తపముల బలమునన్=నాసత్యము మంచితపస్సు వీనిబలముచే- శస్త్రయోధులగతికిన్=శస్త్రము ధరించి యుద్ధముచేయువారి గతికి- కలనన్=యుద్ధమందు- వెనుకంజ = వెనుక+అంజ = ముందుబెట్టినకాలు వెనుకకుఁ బెట్టుట- మునుపోటునకు నెదురుగానుండు. ఎదురుగా నుండువానిచే ఱొమ్మున దెబ్బ తిని. భూమిదులకున్=భూదానము చేసినవారికి.

తా త్ప ర్య ము.

కుమారా! నీవిట్లు బాల్యమున మాకుముందు చచ్చుటకు నీవుచేసిన పాప మేదియులేదు. కాని పాపపురాజు నిన్నుఁ జంపెను. ఆకారణముచే నాసత్యము బలము చేతనూ నా తపోబలముచేతను జెప్పెదను వినుము. నీవు శస్త్రమున సమ్ముఖమున ఱొమ్మున దెబ్బదిని మరణించితివి కావున నీవును శస్త్రయోధులై రణమున ముందు పెట్టినకాలు వెనుకకుఁదీయక ముందుపోటున దెబ్బదిని చచ్చు వీరుల లోకమునకుఁ బొమ్ము. సగరుఁడు దిలీపుఁడు శైబ్యుఁడు నహుషుఁడు ధుంధుమారుఁడు జనమే జయుఁడు పోయినట్టిగతికి నీవును బొమ్ము.మునులకు సాధువులకు భూమిదానముచేసిన వారికి నేదిగతియొ యాగతికి నీవుపొమ్ము.

శ్లో॥ ఆహవేషు యథాన్యోన్యం, జిఘాంసంతో మహీక్షితః
యుధ్యమానా పరంశక్త్యా, స్వర్గం యాంత్య పరాఙ్ముఖః॥ మను. 7-89.

రాజులు వెనుకంజపెట్టక మిగుల శక్తిగలవారై యొకరి నొకరుఁ జంపఁగోరి చేసిన యుద్ధమందుఁ జచ్చినవానికి స్వర్గప్రాప్తి కలుగును.

శ్లో॥ ద్వావిమౌ పురుషౌలోకే, సూర్యమండలభేదినౌ
పరివ్రాడ్యోగ యుక్తశ్చ, రణే చాభిముఖో హతః॥

లోకమున యోగయుక్తుఁడై ప్రాణము విడిచిన సన్న్యాసి, ఎదురుఱొమ్మున దెబ్బదిని చచ్చిన శూరుఁడు వీరిరువురు సూర్యమండలము భేదించి పోదురు.

తే.ఏకపత్నీ వ్రతస్థు ల•నేకగోస,హస్రదాతలు గుర్వర్చ•నాభిరతులు
యోగసంపరిత్యక్త దే•హులును జనెడి,యట్టివరలోకములకు నీ • వరుగు వత్స!

ఏకపత్నీవ్రతస్థులు=వివాహమాడిన మొదటిభార్యతోఁదప్ప రెండవ భార్యతోఁగాని యితర స్త్రీతోఁగాని రమింపని వ్రతముగలవారు. భార్యలలో నెందఱలో నైనను రమించినను జారుఁడుగాక యుండువాఁడును నేకపత్నీ వ్రతస్థుఁ డని కొందఱీశబ్దమునకు విపరీతార్థము చెప్పుచున్నారు. వీరి యభిప్రాయమున మూఁడు వందల ముప్పదిముగ్గురు భార్యలుగల దశరథుఁడును వేలకొలఁది భార్యలుగల రాజులును ఏకపత్నీవ్రతస్థులే. శ్రీరాముఁడు బహుభార్యుఁడనువా రేకపత్నీవ్రత శబ్దమునకుఁ జెప్పెడి యర్థమిదియే. ఇట్టి విపరీతార్థములు సాధింపఁ బండితులే యర్హులు. ఏకపత్ని యనఁగా నొకనికిమాత్రము భార్యగానుండు పతివ్రత యని స్త్రీపర్యాయమున నర్థము. ఏకపత్నీవ్రత మిదంకోనాశయిత మిచ్ఛతి. కిష్కింధా. దీనికి పండితులు ఏకే ముఖ్యాన్య కేవలా యని నిఘంటు వుదాహరించుచు ఒక మగనివెనుక మఱియొక మగని వానివెనుక మఱియొకని వివాహమాడువారును నేకపత్నీవ్రతలే. యనియు సాధింపఁగలరు.

గోవిందరాజీయ వ్యాఖ్యయందు "ఏకపత్నీవ్రతస్యేతి. ఇదంచవ్రత మనుకూలాయాం పుత్రిణ్యాం పత్న్యాం బోధ్యం" అని కలదు. అనఁగా నీవ్రతము అనుకూలయుఁ బుత్రులు గలదియు నగు పత్నియందని తెలియవలయునని యర్థము. ఇది కాముకపక్షము. భార్య పుత్రవతియయినను గాకపోయినను రెండవ భార్యను స్వీకరింపక యుండుట యుత్తమపక్షము. "పుత్రార్థం నోద్వహేదన్యాం,కర్మపుత్రాహి యోగినః। అపుత్రోఽపి పరంయాతి, కర్మినాన్యోఽపి సత్సుతః" అను భారద్వాజ సంహితోక్తియె దీనికిఁ బ్రమాణము. పుత్రులు లేరని పురుషుఁడు రెండవభార్యను బరిగ్రహింపవలసిన పనిలేదు. పుత్రుఁడు లేకున్నను కర్మి పరమును బొందును. సత్సుతులు గలిగినను కర్మిగానివాఁడు పొందలేఁడు. పుణ్యగతులు గలిగించునది వాఁడు వాఁడు చేసిన కర్మము.

ఏకపత్నీవ్రతము ద్వివిధము. ఏకఃపతిః యస్యాఃసా ఏకపత్నీతస్యాః వ్రతమేకపత్నీవ్రతమ్" ఏకాదనాపత్నీచ ఏకపత్నీసైవ వ్రతమేక పత్నీవ్రతమ్" అని విగ్రహము.

ఎవతెకుఁ బెనిమిటి యొకఁడో ఎవనికిభార్య యొకతెయో వాఁడేకపత్ని. వాని వ్రత మేకపత్నీవ్రతము. ఈపద్యమున నేకపత్నీ వ్రతస్థులనుటచే నీ యిరు దెగలవారు చెప్పఁబడినారు.

శ్లో॥ ఆసీతామరణాత్ కాంతా, నియతా బ్రహ్మచారిణీ

యాధర్మ ఏకపత్నీనాం, కాంక్షంతీ తముత్తమమ్॥

పతివ్రతయగు స్త్రీ భర్త గతించిన తరువాత ఓర్పుగలదై బ్రహ్మచర్యవ్రతస్థల నియమములు పూని మరణమువఱకు భోగాదులఁ గోరక యుండవలయును.

శ్లో॥ అనేకాని సహస్రాణి కుమార బ్రహ్మచారిణామ్
దివంగతాని విప్రాణా మకృత్వా కులసంతతిమ్॥

బాల్యమున బ్రహ్మచారులై వివాహము చేసికొనని సనకాదులు వేనవేలు సంతానము లేనివారయ్యు స్వర్గమును బొందిరి. కావున సంతానము లేదని యెవరు వ్యసనపడరాదు.

శ్లో॥ మృతేభర్తరి సాధ్వీస్త్రీ, బ్రహ్మచర్యే వ్యవస్థితా
స్వర్గం గచ్ఛత్యపుత్రాపి, యథాతే బ్రహ్మచారిణః

భర్తచనిపోయినపిమ్మట పతివ్రతస్త్రీ బ్రహ్మచర్యమం దుండెనేని పుత్రులు లేక పోయినను అసనకసనందన వాలఖిల్యాదులవలె స్వర్గము పొందును. కావున బిడ్డలు లేరని స్త్రీలు పరపురుషులతో సంభోగింపరాదు. అట్లులే పురుషులును. ఒకపురుషున కొకతెకంటె నెక్కువగ లభించుభార్యలు పూర్వజన్మంబుల దుష్కామ సంబంధమున లభించినవారని తెలియునగు. ఒకజన్మమున నొకనికి నొకతెయు, నొకతెకు నొకఁడును భార్యగా భర్తగానుండుట యుత్తమధర్మము తక్కినది కామకార్యము అనేకగోసహస్ర దాతలు=పెక్కువేల గోవుల దానముచేసినవారు- గుర్వర్చనాభిరతులు = గురుసేవ యందు విశేషప్రీతిగలవారు- యోగసంపరిత్యక్తదేహులు = యోగబలమున దేహ మును విడిచినవారు- వత్స=కుమారా!

తాత్పర్యము.

ఒంటిభార్యను మాత్రమేగలవారు, పెక్కువేలగోవుల దానము చేసినవారు గురుసేవయందు ప్రీతిగలవారు, యోగముచే దేహము విడిచినవారు, పోవు లోక ములకుఁ గుమారా! నీవును బొమ్ము.

ఆ. ఊర్ధ్వలోకలాభ • ముల్లంబునను నిల్పి, గంగ సూర్యతనయ • గలియుచోట
నగ్నియందొ నీళ్ళ•యందునో తమమేని, విడుచువారిగతికిఁ • గొడుక! పొమ్ము.

ఊర్ధ్వలోకలాభము = పైలోకములప్రాప్తి-ఉల్లంబునను = మనస్సునందు- సూర్యతనయ=యమున.

తాత్పర్యము.

కొడుకా! యూర్ధ్వలోకములు పొందు కోరికతో గంగా యమునా సంగమ స్థలంబున నగ్నియందో నీళ్ళయందో తమదేహము విడుచువారిగతికిఁ బొమ్ము.

గంగా యమునా సంగమమున మరణించువారును వానప్రస్థులుగా నుండి వ్రతము జరుపఁజాలని జీర్ణశరీరులును నగ్న్యాదుల దేహము విడిచిన నాత్మహత్యా దోషము లేదు.

కం. మావంశసంభవులకున్, లేవు సుమీ యధమగతులు • నీ కెట్టు లగున్
నీవధకుఁ గారణం బగు,నావానికిఁ గలుగుఁ గాక • యవి నాపుత్రా! ౧౬౫౭

తాత్పర్యము

మావంశమునఁ బుట్టినవారికి నధోగతులులేవు. అట్లుండ నీకు నధోగతు లెట్లు గలుగఁగలవు. నీవేవిధముగఁ జచ్చినను నీకు నధోగతులురావు. గాని నీవు తపస్సు పూర్తిచేసి దేహము విడువనీయక యిట్లు ఘోరవిధమున నకాలమృత్యువు గూర్చినవాని కా యధోగతులు గలుగునుగాక! సయోహవై పరమం బ్రహ్మవేద ! బ్రహ్మైవభవతి నాస్యాబ్రహ్మవిత్కులే భవతి॥ ముండ. ౩–౨౯.

ఒక్కొక్క జన్మమునను బ్రారబ్ధానుభవ నియతి గలదు. అట్లుదానిని బూర్ణ ముగ ననుభవింపనీయక నడుమ విఘ్నము గలిగించిరేని యతఁడు లోకక్కవ కాలము పిశాచమై యుండవలసియుండును. అట్టిదోష మా విఘ్నకరుని బాధిం చును. దీనిచే నివారింపరాని రోగముచేఁ బీడింపఁబడువానిని జంపుట దోషముగా దనువారి దుర్మతము ఖండితము.

కం. అని పనవి పనవి యేడ్చుచు, మునివరుఁ డుదకంబు లిచ్చె ◆ నొుగిఁ బుత్రునకున్
మునిసుతుఁడు దివ్యరూపం, బున శక్రునితోడ నిల్చె ◆ పుష్కరవీథిన్. ౧-౪౩

పుష్కరవీథిన్=ఆకాశమార్గమునందు.

తాత్పర్యము.

అని పనవిపనవి యేడ్చుచు నామునివరుఁడు పుత్రున కుదకంబు లిచ్చెను. అప్పుడు మునికుమారుఁడు దివ్యరూపము ధరించి యాకాశమున నింద్రుతోడనిలిచె. శక్రునితోడనిల్చె యనుటచేఁ బితృపూజాధురంధరు నాబాలునిఁ బిలుచుకొనిపోవ నింద్రుఁడే వచ్చెనని సూచితము.

ఉదకప్రదానానంతరము దివ్యస్వరూపము వచ్చెననుటచేఁ బ్రేతమునకు జల ప్రదానము చేయువఱకు నారూపము పోదని యేర్పడుచున్నది.

శ్లో॥ నస్నానేన నమౌనేన, నైవాగ్ని పరిచర్యయా
బ్రహ్మచారీ దివం యాతి, సయాతి గురుపూజనాత్॥ శంఖ.

స్నానములచే, మౌనముచే, నగ్నిపరిచర్యచే బ్రహ్మచారి స్వర్గమునకుఁబోఁడు. తలిదండ్రుల, గురువుల సేవచేతనే పోవును. ౨౫-వ ప. చూడుము

కం. గురులకు నిట్లనియెమీ, పరిచారము సేఁత నాకుఁ ◆ బరలోకసుఖో
త్కరములు ఘటిల్లెఁ గావునఁ, బరితపియింపకుఁడు మీరు ◆ బ్రహ్మవిధిజ్ఞుల్.

పరిచారము సేఁతన్=పరిచర్యసేయుటవలన, పరలోక సుఖోత్కరములు = పర లోకము ననుభవింపఁదగిన సుఖసమూహములు- ఘటిల్లెన్ = కలిగెను - బ్రహ్మవిధి జ్ఞుల్=బ్రహ్మవిధిజ్ఞులారా- వైదికకర్మ మెఱిఁగినవారలారా! పరితపియింపకుఁడు=పరి తాపము పొందకుండుఁడు.

బ్రహ్మవిధిజ్ఞులార. యనుటచేఁ బ్రేతమునకుఁ జేయవలసిన వైదిక కర్మములు చేయుఁడని సూచితము.

తా త్ప ర్య ము.

తల్లిదండ్రులతో నిట్లనియె- వై దిక ధర్మవిధిజ్ఞులారా! మీకు శుశ్రూష చేసిన కారణముచేత నా కూర్ధ్వలోక సుఖము లనేకములు ప్రాప్తించెను. కావున నాకై మీరు సంతాప పడవలదు.

తే.వచ్చెదరు మీరు నన్నీర•భవ్యులార, సత్వరంబుగ నంచు భా•స్వరవిమాన
మునను దివ్యశరీరంబు•నను దివంబుఁ, జేరఁ బోయె మునీంద్రకు•మారకుండు.

తా త్ప ర్య ము.

పుణ్యాత్ములారా మీరుకూడ నన్ను శీఘ్రముగ స్వర్గమునఁ గలిసికొనఁగలరు. అనిచెప్పి ప్రకాశించు విమానమున దివ్యశరీరము ధరించి యా మునికుమారుఁడు స్వర్గము చేరఁ బోయెను.

తే. తనయుఁ డీభంగి దివమేగఁ • దాపసుండు, నెలఁతతోఁగూడి యతనికి•నీళ్లువిడిచి
కరములు మొగిడ్చితనయుంతి•కమునన్న, నన్ను వచియించెదుఃఖసం•త ప్తుఁడగుచు

తా త్ప ర్య ము.

కొడుకీప్రకారము స్వర్గమునకుఁబోఁగా నాతాపసుండు భార్యతోఁగూడి యతనికి నివాపము లిచ్చి తనసమీపమునఁ జేతులు ముకుళించి నిలువఁబడియున్న నన్ను దుఃఖమునఁ దపించుచు నిట్లనియెను.

—• ఋషి దశరథుని శపించుట. •—

ఉ.భూమిప! యేకపుత్రకుని న•పుత్రకుఁ జేసితి గాదె నన్ను, నిం
కేమిభయంబు చా వనఁగ • మృత్యువుఁ గూర్పుము నన్ను నిప్పుడే
ధీమహితున్ శుచిన్ సుతునిఁ • దేరకుఁ జంపితి జ్ఞానహీనతన్
హేమిక దీఱ ని న్నిదె భ•యంకరదుఃఖము గల్గఁ దిట్టెదన్. ౧౬-౫౭

ఏకపుత్రకున్=ఒంటికొడుకు గలవానిని-అపుత్రకున్ = పుత్రుఁడు లేనివానిఁగ- హేమిక = గర్వము.

తా త్ప ర్య ము.

ఓయిరాజా! యొంటికొడుకునుఁగల నన్ను గొడుకు లేనివానిఁగఁ జేసితివి. ఇఁకఁ జావనిన నాకేమిభయము. కావున నన్నుఁగూడ నిప్పుడే చంపుము. నిష్కారణముగ గొప్పబుద్ధిగలవానిని శుచిని నాకొడుకును నజ్ఞానముచేఁ జంపితివి కావున నీపొగరణఁగునట్లు భయంకరమైన శాపము నీకిచ్చెదను.

కం.నాకిప్పు డిట్టిపుత్రక,శోకంబును గూర్చుకతన•సుతశోకమునన్
భూకాంతుఁడ! నీవిటులే, యేకాంతము వగరి వగరి • యీల్గెదు వింటే. ౧౬-౫౮

తా త్ప ర్య ము.

నా కిప్పు డిట్టిపుత్రశోకము గలిగించిన కారణముచే నీవును మావలెఁ బుత్రశోకముచే మిక్కిలి యేడ్చియేడ్చి చచ్చెదవుగాక!

కం. తెలియక చేసినకతమునఁ, గలుగదు సుమి బ్రహ్మహత్య•క్షత్రియ! నీకున్
గలిగెడు దాతకు దక్షిణ,ఫల మన శ్రీఘ్రంబ యిట్టి•భంగియు నీకున్. ౧౬౫౯

కతమునన్=కారణము చేత- బ్రహ్మహత్య=తెలియక చేసిన కారణమున నీకు బ్రహ్మహత్య లేదనికదా వానప్రస్థుఁడు చెప్పెను. బ్రాహ్మణునిఁ జంపినఁగదా బ్రహ్మహత్య. మరణించిన బాలుఁడు కరణజాతివాఁడుగదా. వానిఁ జంపుటవలన బ్రహ్మహత్య యెట్లువచ్చును? అప్రసక్తియే లేనపు డామాటచెప్పనేల? యని సందేహము. బుద్ధిపూర్వకముగ శూద్రునిఁ జంపినను బ్రహ్మహత్యకలదు గాని లేకపోలేదు.

శ్లో॥ విప్రేతు సకలం దేయం, పాదోనం క్షత్రియేస్మృతమ్
వైశ్యేర్థం పాదయేకస్తు, శూద్రజాతిషు శస్యతే॥ బృహద్విష్ణువు.

బ్రాహ్మణునిఁ జంపినఁ బూర్ణబ్రహ్మహత్య గలదు. క్షత్రియునిఁ జంపిన ముప్పాతికగలదు. వైశ్యుని జంపిన నర్ధముగలదు. శూద్రుని జంపినఁ బాతికగలదు. మరణించిన బాలుఁడు శూద్రుఁడుగాఁడు. శూద్రస్త్రీయందు వైశ్యునకుం బుట్టినవాఁడగుటచే శూద్రునికంటె హెచ్చు వైశ్యునికంటెఁ దక్కువ. అదియునుగాక యితఁడు మాతృపితృపూజా నియతుఁడు గుణవంతుఁడు అనఁగాఁ గులమున బ్రాహ్మణుఁడు గాకున్నను బ్రాహ్మణగుణము లన్నియు వనియందుఁగలవు. కావున బ్రహ్మహత్యా ప్రశంస.

తా త్ప ర్య ము.

• తెలియక చేసినకారణముచే నీకు బ్రహ్మహత్యవంటి ఘోరపాపము గలుగదు కాని యల్పప్రాయశ్చిత్తముచేఁ దొలఁగుపాపము గలదు. కావున దాతకు దక్షిణ ఫలమువలె నిప్పుడు మాకువచ్చినస్థితియే నీకును గలుగునుగాక!

ఆ. ఇట్లు నాకు శాప • మిచ్చి పల్దెఱఁగుల, వగచి పుత్రకునకు • వార లిరువు
రంతఁ జలము చేర్ప • నగ్నిఁ జొచ్చి దివంబుఁ, జేరఁ జనిరి యేమి • చెప్ప నింక. ౧౬౬౦

పల్దెఱఁగులన్=అనేకవిధములు- వగచి=దుఃఖించి.

తా త్ప ర్య ము.

ఈప్రకారము వారు నన్ను శపించి పుత్రునికై యనేకవిధముల నేడిచి వారిరువురును నేను నీరుచేర్పఁగా వారగ్నిలోఁ బ్రవేశించిరి. ఇంకేమిచెప్పుదును.

ఇది యాత్మహత్యగాదు.

శ్లో॥ అనుష్ఠానా సమర్థస్య, వానప్రస్థస్య జీర్యతః
భృగ్వగ్ని జలసంపాతై, ర్మరణం ప్రవిధీయతే॥ వి. పు.

ముసలితనముచే ననుష్ఠానము జరుపుకొనలేని వానప్రస్థుఁడు కొండమీఁద నుండి పడిగాని యగ్నిలోనీళ్ళలోఁ బడిగాని ప్రాణము విడువవచ్చునని విధింపఁబడినది.

తే. శబ్దవేధిశరంబున • సంయమీంద్రు,బిడ్డ నేయుట, బాణంబుఁ • బెఱుకుటయును
బాల్యమునఁ జేసినట్టియా•పాప మిపుడు, స్మృతికి వచ్చెను దేవిరో! • చింత కలన.

తా త్ప ర్య ము

శబ్దవేధి బాణముచే మునికుమారుని వేయుట ఆబాణము పెఱుకుట వాఁడు చచ్చుట లోనగునవి బాల్యమునఁజేసిన యాపాప మిపుడేల నాకీదుఃఖము కలిగె నని యాలోచింపగా స్మరణమునకు వచ్చెను.

కం. అకలుషముఫల మీావిధి, జేకూరె నపథ్యభుక్తి • చేసినయేనిన్
బైకొన కున్నె రోగముఁ హాకౌసల్యా! యిఁ కేమి•యనఁ గలవాఁడన్.౧౬౬౨

కలుషముఫలము=పాపఫలము- ఈవిధిన్=ఈరీతిగ- చేకూరెన్ = లభించెను- అపథ్యభుక్తి=అపథ్యపు భోజనము-పైకొనకున్నె=పైపడకుండునా.

తా త్ప ర్య ము.

ఆపాపముఫల మీారీతిగ నేఁడు లభించెను. దేహమునకు సరిపడని భోజనము చేసిన రోగమురాకయుండునా? అయ్యో కౌసల్యా! యిఁకేమి నేను జెప్పఁగలనే.

వ్యాధుల యుత్పత్తికి ముఖ్యకారణ మాహారమే. అతిభుక్తి = మితమునకు మించి తినుట- అధ్యశనము=భోజనముచేసి తేచి మరల భోజనముచేయుట. అకాల భుక్తి- రాజసాహారభుక్తి- దేహ తత్త్వమునకు సరిపడనివి తినుట యివి రోగకారణ ములు. ఇవన్నియు నపథ్యములే యగును.

తే. అయుదారులవాక్యంబు • లంబుజాక్షి
యిపుడు సరిదాఁకెఁ బుత్రశో•కేధితార్తిఁ
బ్రాణములు నేను విడుచుట • ప్రాప్తమయ్యె
నరులు మరులును మిక్కుట • మయ్యెఁ దవ్వి. ౧౬౬౩

ఉదారులన్ = (1) గొప్పవారల- అనఁగా గొప్పతపోబలము గలవారల (2) బిడ్డలులేని నాకు వారివాక్యబలమున బిడ్డలు గలిగిరి కావున వారుదారులు. బిడ్డలు లేకున్న నాకీదుఃఖానుభవములేదు. వారి శాపప్రకారము నాకీయనుభవము రావలసి యున్నది. కావున నదిసత్యమగుటకై బిడ్డలు కలిగిరనిభావము. పుత్రశోక + ఏధి తార్తిన్=పుత్రవియోగశోకముచేఁ బెరిఁగినబాధచే, అరులుమరులు=తెలివిమఱపులు.

తా త్ప ర్య ము.

ఆ గొప్పవారిమాట లిపుడనుభవమునకు వచ్చెను. పుత్రశోకమువలనఁ బెరిఁగినబాధచే నేను జావవలసివచ్చెను. దాని సూచనగాఁ దెలివు మఱపులును నధిక మయ్యెను.

కం. కన్నులు గన రాకున్నవి, నిన్నుం గనలేను మాని•నీమణి! నన్నున్
దిన్నగ స్పృశియింపు మటం,చన్నరపతి యేడ్చు చిట్టు•లనె వెఱ సతికిన్.౧౬౬౪

తా త్ప ర్య ము.

నాకుఁ గన్నులు కానరాకయున్నవి. నీ వెందుండునది నేను జూడఁజాల కున్నాను. కావున దేవీ నీవు నన్ను స్పృశింపుము. అని యీ ప్రకార మేడ్చుచు మరణభీతి నిల్లనియె.

ఉ. రాముని కేను జేసినది ♦ రాజముఖి! విను నాకుఁ జెల్లు, నా
రాముఁడు నాకుఁ జేసినది ♦ రామునకే సరి, యెట్లు లంటివా
భూమిని నెట్టిదుశ్చరితుఁ ♦ బుత్రునిఁ బాయువివేకి యుండునే?
యామెయిఁ బొమ్మటన్న సుతుఁ♦డెవ్వఁడు దండ్రిని సైఁపఁ జాలెడిన్? ౧౬౬౬

శ్రీరాముని విషయమున నేను జేసిన వివాసరూప ఘోరకార్యము బాలక హంతనైన క్రూరుఁడగు నాకే తగినకార్యము అనాఁడట్లు మునికుమారుని జంపి తిని. ఈనాఁడిట్లు కన్నకుమారుని జంపునంతకార్యము చేసితిని. ఇట్టికార్యము నేను దప్ప మఱియొకఁడు చేయఁడు. చేయఁజాలఁడు. నావిషయమున శ్రీరాముఁడు చేసి నది శ్రీరామునకే చెల్లును. ఆవిధముగా మఱియొకఁడు చేయఁజాలఁడు. అదేమనిన లోకమున నెటువంటి చెడునడవడి గలవానినైనఁ గన్నకుమారుని జ్యేష్ఠుని వదలునట్టి వివేకహీనుఁ డుండునా? ఒకవేళ యుండుననుకొన్నను నీవిధముగ నిష్కారణముగ నడవికిఁ బోరా యన్నంతనే సహించి యూరకుండు కొడుకుండునా?

కం. యమపురి కేగినవారలు, తమవారిని జూడ వశమె ♦ తన్వీ కావున్
క్ష్మను జీవించియ యుండఁగఁ, గమలాక్షుని రామచంద్రుఁ ♦గనఁ గాంక్షింతున్. ౧౬౬౭

తా త్ప ర్య ము.

యమపురికిఁ బోయినవారు మరలఁ దమవారిని నీ లోకమున నున్నవారిని జూడసాధ్యమా కావున భూమిపై జీవించియుండఁగనే కమలములవంటి కన్నులుగల శ్రీరామచంద్రునిఁ జూడఁగోరెదను.

ఉ. రాముకరంబు సోఁకినను ♦ రాముముఖాబ్జముఁ జూడఁ గల్గినన్
భామరో యంతకాలయము ♦ పజ్జనఁ బోవక దక్కవచ్చుఁ జు
మ్మా మది సంభ్రమించె. స్మృతి ♦ మాఱుపడెన్ నిన్నుఁ గాన నేరనే,
నేమ యిఁ కెట్లు గల్గుఁ, ద్వర ♦ సేసెద రిద్దిగోఁ గాలకింకరుల్. ౧౬౬౮

తా త్ప ర్య ము.

శ్రీరామునిచేయి నన్నుఁదాఁకినను శ్రీరామచంద్రుని ముఖకమలమును నేను జూడఁగలిగినను యముని పురమునకుబోక బ్రతుకవచ్చును. మనస్సు తొట్రుపాటు పడుచున్నది. స్మృతి మాఱిపోయినది. నిన్నుఁజూడఁజాలను. ఇఁక నేనెట్లు బ్రదికి బాగుండఁగలను. అదిగో యమకింకరులు రమ్మని తొందరపెట్టుచున్నారు.

కం. ఎన్నఁగ నింతకు దుఃఖం, బున్నే నా కెందు మరణ ♦ మొందెడివేళన్
గన్నారఁ గాన నైతిని, సన్నుతమతి రామచంద్రు ♦ సద్గుణసాంద్రున్. ౧౬౬౯

తా త్ప ర్య ము.

ప్రాణముపోవు సమయమున సజ్జనులచే స్తోత్రముచేయఁబడిన మంచిమనస్సుగల సద్గుణములచే దట్టమైన శ్రీరామచంద్రుని గన్నులారఁ జూడలేకున్నాను ఇంతకంటె దుఃఖము వేఱొకటియుండునా.

ఉ. అతనిఁ జూడకుండెడు మ•హావ్యథఁ బ్రాణము శోషగిల్లెఁ దీ
త్త్వాతపతాపవృద్ధికిని • నల్పజలంబులయట్లు లెవ్వ రా
పూతచరిత్రుచారుము•ఖంబు బదునేనవయేంటఁ గ్రమ్మఱన్
జూతురొ వారు నిర్జరుల • చూ సుదతీమణి! కారు మానవుల్. ౧౬౬౯

శోషగిల్లెన్=క్షీణించెను-తీత్త్వాతపతాపవృద్ధికిన్ = తీవ్రమైన యెండవేఁడిమి యభివృద్ధిచే- అల్పజలంబులు=కొంచెపునీళ్ళు- పూతచరిత్రున్=పవిత్రమైన నడవడి గల శ్రీరామచంద్రుని, చారుముఖమున్=మనోహరమైన మొగమును, నిర్జరులచూ =దేవతలేసుమా- లంకలో దశరథుఁడు దేవస్వరూపముననే చూచెనుగదా.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రుని జూడమివలనఁ గలిగిన పెనుబాధచేఁ దీక్ష్ణమైన యెండ వేఁడిమికిఁ గొంచెపునీళ్లు క్రమక్రమముగా క్షీణించునట్లు నా ప్రాణములు క్షీణించు చున్నవి. పదునైదవసంవత్సరమున నెవ్వరు మరల శ్రీరాముని ముఖముఁజూతురో వారు దేవతలేకాని మనుష్యులుగారు. ఇది వాస్తవపడియెఁగదా.

ఉ. అనళినాయతేక్షణము • లారమణీయతరోన్న సంబు నా
జా నగుకన్నుబొమ్మలు ల•సద్ధళధాళ్య మెసంగుచెక్కులున్
శ్రీనుతశారదేందురుచి • చిందెడిరామముఖారవిందమున్
మానిని ధన్యులొజనులు • మానుగఁ గాంతురు వెండి వచ్చినన్. ౧౬౭౦

నళినాయతేక్షణములు=కమలములవంటి దీర్ఘములయిన కన్నులు, రమణీయ తరోన్న తనాసంబు=మిగుల సుందరమైన యెత్తైనముక్కు, జానగు=అందమైన, కను బొమలు-లసత్ ధాళధళ్యము=తళతళప్రకాశించు, శ్రీ=శోభచే, నుత = పొగడఁ బడిన, శారద=శరత్కాలమందలి, రుచి=కాంతి, ముఖారవిందము=ముఖకమలము.

తా త్ప ర్య ము

కమలములవలె దీర్ఘములైన యా కన్నులును సుందరమై యెత్తైన యాము క్కును, అందమైన యా కనుబొమలును తళతళమని ప్రకాశించు నా చెక్కులును గాంతిచే శ్లాఘింపఁబడిన శరత్కాల చంద్రునికాంతినిగల శ్రీరాముని ముఖము కమలమును దేవి శ్రీరాముఁడు మరలివచ్చినపుడు పుణ్యాత్ములై జన్మము సఫలము కాఁగలవారు చూడఁగలుగుదురు.

కం. వనవాసము నెఱవేఱిచి, చను దెంచినపుణ్యు రామ•చంద్రుని బుజామా
ర్గనయున్ శక్రునిఁ గనుగతిఁ, గనుఁగొందురు పుణ్యాతములు•కౌతుక మమరన్.

ఋజుమార్గ నయున్ = వక్రమార్గమును విడిచి తన యెప్పటి సరియైన త్రోవ నుండు వానిని.

తాత్పర్యము.

అరణ్యవాసము ముగించి వచ్చిన పుణ్యాత్ము శ్రీరామచంద్రుని వక్రగమనము వదలి యెప్పటియట్ల సరియగుమార్గమునుబొందిన శుక్రునివలె విశేషపుణ్యముచేసిన వారు సంతోషముతోఁ జూతురు.

ఆ. కానరావు కనులు • వీనులు వినరావు, చిత్తమోహమనను • జెలియ యెడఁద
తునుకలై నయట్లు• తోఁచుచునున్నది, యింద్రియములు లేవొ • యే నెఱుఁగ.

తాత్పర్యము.

కన్నులా కానరావు, చెవులా వినరావు, చిత్తవిభ్రమముచేత హృదయము తునుకలైనట్లు తోఁచుచున్నది. ఇంద్రియములుగలవో లేవో తెలియఁజాలకున్నాను.

ఆ. చమురు లేనిదివ్వె• చవులచందంబునఁ, జిత్తనాశమునను • జిగురుఁబోణి
యింద్రియంబు లెల్ల • నిట్టట్టు వికలంబు, లయ్యె నేమి చెప్ప • నగును యింక.

తాత్పర్యము.

చమురులేని దీపపుఁగాంతులవలెఁ జిత్తము నశించుటచే నింద్రియములుకూడ నిట్టట్టులు చెదరి వాని కార్యము లవి చేయఁజాలకున్నవి. ఇంక నేనేమి చెప్పఁగలను.

తే. ఏటివేగంబు కూలంబు • నెల్ల నురలఁ
ద్రోయు చందంబునను నిప్డు • తోయజాక్షి
తనయశోకంబు వేగంబు • నను ననాథు
ననటఁ గూల్చుచు నున్నది • యనుచు మఱియు.　　　　౧౬–౫౪

తాత్పర్యము.

ఏటినీళ్ల వేగమొడ్డును గూలఁద్రోయువిధమున నిపుడు పుత్రశోకముయొక్క వేగము దిక్కులేని నన్ను దుఃఖముచేఁ గూల్చుచున్నది. అని చెప్పి మఱియు,

ఉ. హాయను, నాదుముద్దుఁదన•యా యను, నెక్కడ కేగి తీవు రా
రా యను, నీవ దిక్కు గద•రా యను, నన్ను భృశార్తి ముంపఁ జ
న్నే యను, నొంటి వీడఁ దగు•నే యను, మద్దశఁ జూచియైనఁ బో
రా యను, నిట్లు నీకుఁ దగు•రా యను నయ్యయొ పుత్రకా! యనున్.　　　　౧౬–౫౫

తాత్పర్యము.

హాయనును, ముద్దుకుమారాయనును, ఎక్కడికిఁ బోయితివిరాయనును, నీవే కదా నాకు దిక్కనును, నన్నుఁ దీవ్రదుఃఖమున ముంపఁజనునాయనును, ఒంటిగా నన్ను విడిచి నీవు పోఁదగునాయనును, నాదుర్దశఁజూచియైనఁ బోరాయనును ఇట్లు చేయ నీకుఁదగునటరాయనును అయ్యో! కొడుకా కొడుకా యనును.

కం. హా రామ! మహాబాహూ! హా రాకాచంద్రవదన • హా ప్రియపుత్రా!
హా రక్షక! యెట కేగితి, రారా యాయాస మణఁప • రా పుణ్యమగున్. ౧౬-౭౬

తా త్ప ర్య ము.

హా రామా! దీర్ఘబాహువులుగలవాఁడా! హా పూర్ణచంద్రునివంటి ముఖము గలవాఁడా! హా ప్రియకుమారా! అయ్యో నా రక్షకుఁడా! ఎందుఁ బోయితివిరా రారా నాయాయాస మణఁపరా నీకుఁ బుణ్యమగును రా!

శా. కౌసల్యా! నినుఁ గూడ నే జెఱచితిం • గాంతా సుమిత్రా! నినున్
గాసింబెట్టితి, నాదుదాయ వగుకై • కా! మత్కులోన్మూలినీ!
యీసంతాపము నీవ పెట్టితివి చం • డీ! యంచు వాపోవుచున్
జేసెం గాలము మధ్యరాత్రమునఁ దా • సీతేశుఁ జింతించుచున్. ౧౬-౭౭

మత్కులోన్మూలినీ=నావంశమును మొదలంటఁ బెఱికివైచినదానా!మూఁడవ పాదంబునఁ బ్లుతయతి. కాలముచేసెన్=మరణించెను.

తా త్ప ర్య ము.

కౌసల్యా! నా పాపముచే నేను జెడుటయేగాక నావంటిపాపికి భార్యవగుటచే నీకును బుత్రశోకము గలిగించి చెఱచితిని. సుమిత్రా యెంతో యింపైన నడవడికల దానా! నిన్నుఁ జాలఁగష్టపెట్టితిని. పగదానవైనకైకా వంశనాశకురాలా యిందఱి కీ దుఃఖము నీవేకదా తెచ్చిపెట్టితివి. ఓసీ చండీయని యేడ్చుచు దశరథుఁ డర్ధరాత్ర మున శ్రీరాముని జింతించుచుఁ బ్రాణములు విడిచెను. ఇది యాఱవనాఁటి వృత్తాంతము.

•— ౬౫-వ సర్గము. దశరథుఁడు మృతుఁ డగుట. •—

సీ. వేగుఁబోకట వంది • విశ్రుతగాయకుల్, సూతులు వే ర్వేఱ • వొచ్చి నగరు
మంగళాశీర్వచో • మానితస్తవములు, ప్రాసాద మం దెల్లఁ • బరఁగఁ జేయఁ
బాణివాదకు లంతఁ • బఱ తెంచితమనేర్పు, మెయిఁ గరతాళముల్ • మిగులఁగొలుప
నారవంబున నృపా • లాలయగతపంజ రస్థశాఖాస్థప • త్రరథచయము

తే. మేలుకొని కలకల మని • లీలఁ గూయ, వ్యాహృతంబులు పుణ్యశ్లో • కంబులొలయ
వేణువీణారవంబులు • విస్తరిల్ల, నిలయ మెల్లను రవమున • నిండి యుండె. ౧౬-౭౮

వేగుఁబోకటన్=ఏడవనాఁటి యుదయమున, వందివిశ్రుతగాయకులు = వందులు సంగీతశాస్త్రముప్రకారము పాటపాడువారు మాగధులు, మంగళాశీర్వచో మానిత సవముల్=శుభకరములైన దీవనలరూపములై గౌరవింపఁబడు స్తోత్రముల చేత, పాణివాదకులు=చేతితోఁ దాళములువేయువారు, నృపాలాలయగత = రాజనింటియుందుండు. పంజరస్థ=పంజరములనుండునట్టియు, శాఖాస్థ = చెట్లకొమ్మలయం దుండునట్టియు, పత్రరథచయము = పక్షులసమూహము, వ్యాహృతంబు = బ్రాహ్మ

ణులు చెప్పు పుణ్యశబ్దంబులు. పుణ్యపురుష పుణ్యక్షేత్ర పుణ్యతీర్థములకీర్తనలు, నిలయము=ఇల్లు.

తాత్పర్యము.

ఉదయకాలమున వందులు, గాంధర్వశాస్త్రప్రకారము పాటలు పాడువారు వంశమును వర్ణించు సూతులు వేయునేయుగా వచ్చి నగరు ప్రవేశించి శుభకరములై యాశీర్వాదన రూపకములగు స్తోత్రములు చేయు ధ్వనులు రాచనగరునందు వ్యాపింపఁగాఁ జేతులఁ దాలము వేయువారు, తమ నేర్పుకొలఁది కరతాళములు వేయుచుండఁగా నాధ్వనికి రాజు నింటియందు నుద్యానవనవృక్షములందలి చెట్లకొమ్మలయందు నుండు పక్షులు వినోదముగాఁ గూయఁగా బ్రాహ్మణులు పుణ్యక్షేత్రపురుషులగురించి చెప్పుచుండఁగాఁ బిల్లంగ్రోవులయు వీణెలయు ధ్వనులు విస్తారముకాఁగా నాయిల్లంతయు ధ్వనితో నిండియుండెను.

సీ. ఆవలఁ గల్య సే•వావిచక్షణకామి,నీవర్షధరపాళి • నిర్మలహరి
చందనసంపృక్త•సలిలముల్ కాంచనఘటముల మజ్జన•కార్యములకు
నినిచి మంజు ప్రాశ•నీయానులేపన, దర్పణాభరణవ•స్త్రసుమములను
గన్యకల్ సిద్ధంబు • గావించికొని సర్వ, లక్షణసంపన్న • లలితవిధుల

తే. నుండ నుదయంబునకు మున్న•యుచితరీతి,వేవినను రాక యున్నఁ బృ•థ్వీవరుండు
కారణం బేమి యనుచు శం•కావిలోల,మతుల నుండఁగఁ జెంగట•మలయుసతులు

కల్యసేవావిచక్షణ=ఉదయకాలమునఁ జేయు సేవయందు జ్ఞానముగల, "కల్యమహర్ముఖే" నానా. ర. కామినీ = స్త్రీలయు, వర్షధర=షండులయు, పాళి=సమూహము, నిర్మల=మలినములేని, హరిచందన సంపృక్తసలిలములన్=శ్రీగంధముతోఁ గూడననీళ్లు, కాంచనఘటములన్ = బంగారు పాత్రములయందు, మజ్జనకార్యములకున్=స్నానము మొదలగు పనులకు, నినిచి = నిండించి, మంజు = మనోహరమైన. ప్రాశనీయ=పుక్కిలించెడి సమయమున స్వీకరించెడి జీలకఱ్ఱ మొదలగునవి. (౨) గంగానది పుణ్యతీర్థములు, (౩) అఖిలపాప నివారణార్థము సకలవైదిక కర్మాధికార సంపాదనార్థము ప్రతిదినము పుచ్చుకొనెడి వారి గృహారాధ్యుఁడగు శ్రీరంగనాయకుల పాదతీర్థము తులసి మున్నగునవి. విలేపన=గంధము, దర్పణ=అద్దము, ఆభరణవస్త్ర సుమములు=సొమ్ములు వస్త్రములు పూలు, కన్యకల్=పడుచులు, (భోగముపడుచులు) సర్వ....విధులన్=సమస్త లక్షణములతోఁ గూడిన మనోహరములగు నేర్పాటులతో, వేవినను=సూర్యోదయమైనను, శంకావిలోలమతులన్=సందేహముచేఁ జలించుచున్న మనస్సులతో, చెంగటన్=సమీపమున, మలయు=సంచరించు.

తాత్పర్యము

ఆవల నుదయకాలసేవయందు నేర్పరులగు స్త్రీలు షండులు పరిశుద్ధములై హరిచందనముతోఁగూడిన జలములను బంగారు కుండలలో స్నానముచేయించుటకై

నిండించి మనోహరమై లోపలఁ బుచ్చుకొనఁదగిన పుణ్యతీర్థములను పూసికొనఁ దగినగంధము, చూచుటకు వస్త్రము ధరించుట కాభరణములు, జలశాటు వస్త్రములు సువాసనగల పుష్పములు, (ఇవి యన్నియు నిద్దురలేవఁగానే చూచుట శుభకరము.) మొదలగు మంగళపదార్థములను భోగము పడుచులు సూర్యోదయమునకు ముందే సిద్ధముచేసికొని సమస్తశుభలక్షణములతోడి యేర్పాటులతో నుండఁగా నుదయమునకు ముందే వెలుపలకావలసిన రాజు సూర్యోదయమైనను రాకుండుట కేమికారణమని సందేహపడుచునుండఁగ రాజు సమీపమునఁ దిరుగు స్త్రీలు.

ఉ. మెల్లగఁ జేరి యానృపతి • మేల్కొలుపం బయిఁ జేయి వైచి య
ల్లల్ల నయుంబు దోఁపఁ దను • వంటియు నిద్దురలక్షణంబు భూ
వల్లభునందుఁ గాన కెటు•వైచినకాలును గేలు నట్టులే
చల్లగ నుంట, వ్రేలిడిన • శ్వాసము నాసికయందు లేమిచేన్. ౧౬౮౦

తాత్పర్యము.

సద్దుచేయక సమీపించి యా రాజును మేలుకొలుపుటకై మీఁదఁ జేయివైచి మెల్లమెల్లగ దేహముఁదాఁకి నిద్దురపోవు వాని లక్షణములు రాజునందుఁగానక యెటువేసినకాలట్టులే యెక్కడవేసినచేయి యక్కడనే చల్లగనుండుటచేతను ముక్కునొద్ద వ్రేలుపట్టఁగా శ్వాసము రాకుండుటచేతను.

కం. గుండియ లదరఁగ నియ్యా, యండజనయనాళి కంప • మందుచు హృన్నా
థుండు మనుట సందియపడి, యుండెను బ్రత్యాపగాళ్ళ•నోత్కర మనఁగన్.

తాత్పర్యము.

గుండెలదరకయుండుటచేతను నాస్త్రీసమూహము రాజు ప్రాణేశ్వరుఁడు బ్రదికియుండుట సందేహించి యేటినీటి కెదురుగనుండు గడ్డిపోచలవలె భయమున వణఁకెను. హృన్నాథుఁడనుటచే వీరు రాజపత్నులని యెఱుఁగఁదగును.

కం. వడఁకుచుఁ బార్థివుఁ గనుచుం, దడఁబడఁ బాదములఁ జక్క • దర్శించి మదిం
దొడరినశంకయె నిజమని, మిడుకుచుఁ గోసలసుతాస•మీపం బరుగన్. ౧౬౮౨

తాత్పర్యము.

ఇట్లు వడఁకుచు రాజునుచూచి పాదములు తడఁబడ మఱియుఁ జక్కఁగాఁ బరీక్షించి చూచి రాజు చచ్చెనను తమ సందేహమే నిజమని దుఃఖించుచుఁ గౌసల్యాదేవి యొద్దకుఁబోఁగా.

—• దశరథుమృతికై యంతఃపుర స్త్రీ లేడ్చుట. •—

సీ. పుత్రశోకంబునఁ• బొగలుచుఁ గౌసల్య,యును సుమిత్రయు జేని•యొద్దఁ జచ్చి
నట్టులు వెల్లని•యాస్యంబులోఁ దిమి,రావృతతారక•లట్లు తేజ
మాసి బొంది ను•సుఱు మాత్రతోఁ బనిన్రిదఁ, జెందియుండఁగ వారి•స్థితిని నృపతి
మృతిని గనుంగొని• మెలఁతలు గొల్లున, హాతయూథపతివశా•తతులభంగి

తే. నొక్క-పెట్ట యాక్రోశింప • నుల్లమదర, లేచికౌసల్యయు సుమిత్ర • చూచివిభుని
దాఁకి గతజీవుఁడగుట స•త్యం బెఱింగి,ధరణిఁ ద్రెళ్లిరి ప్రాణనా•థా! యటంచు.

వెల్లనియాస్యంబులతోన్=తెల్లపాఱినముఖములతో, తిమిరావృత తారకలట్లు = ఉత్పాతకాలమున నావరించు చీఁకటియందలి నక్షత్రములవలె, తేజమాసి = కాంతి హీనములై, ఉసుఱుమాత్రతోన్ = ప్రాణము మాత్రముతో అనఁగా నూపిరిమాత్రము నాడుచుండుటచే బ్రదికియున్నారని తెలంపవలయునేకాని యాకారమునఁ జీనుఁగులవలెనే యున్నారనిభావము. హతయూథపతి వశాయువతులభంగిన్ = యూథనాథుఁడు చచ్చిన యాఁడేనుఁగులగుంపులవలె, ఆక్రోశింపన్=ఏడువఁగా, ఉల్లమదరన్ = గుండెలుకొట్టుకొన, గతజీవుఁడు=ప్రాణముపోయినవాఁడు, సత్యంబు = నిజము, త్రెళ్లిరి=పడిరి, చచ్చిన రాజునకు బ్రదికియుండు కౌసల్యా సుమిత్రలకు విశేష భేదము కానరాదని భావము.

తాత్పర్యము.

రాజు చచ్చెనని సందేహించుచు నయినను గౌసల్యాదేవివచ్చి చూచి నిశ్చయింపవలెనని రాజు సమీపమందే పుత్రశోకముతో నేడ్చియేడ్చి తెల్లనిముఖముతో నుత్పాతకాలమునఁ గ్రమ్ము చీఁకటియందలి నక్షత్రములవలెఁ గాంతిలేని కనుగ్రుడ్లతో నూపిరిమాత్రముకలవారై పడి కౌసల్యయు సుమిత్రయు నుండఁగా వారి స్థితిని రాజు మృతినిగని రాజు చచ్చినట్లు వీరుకూడఁ జావనున్నారని తలఁచి యూథనాథుఁడు చచ్చిన యాఁడేనుఁగులవలె నొక్క-సారిగ గొల్లున నేడువఁగా నా ధ్వని విని గుండె లదుర గౌసల్యయు సుమిత్రయులేచి భర్తను దాఁకి చూచి ప్రాణముపోవుట నిశ్చయించి ప్రాణేశ్వరాయని నేలఁబడిరి.

ఉ. నేలను ధూళి సోలిపడి • నింగినినుండి ధరాతలంబునన్
రాలినచుక్క-యట్లు రుచి • నాశిలి కోసలకన్య యుండినన్
జాలఁగఁ దక్క-చేడియలు • సంభ్రమపాటున రోదనధ్వనుల్
గోలున నింపఁగైకయును • లోనగుకాంతలు పల్లటిల్లఁగన్. ౧౬౪౮

నింగినినుండి = ఆకాశమునుండి, ధరాతలంబునన్ = భూమియందు, రుచి = కాంతి, నాశిలి=నాశమైపోయి, పల్లటిల్లఁగన్=దుఃఖింపఁగా, కైకయును అనుటచే దశరథుఁడు చచ్చెనన్న వార్తవిని కైకయు నావల నచ్చటికివచ్చెనని గ్రహింపవలయును.

తాత్పర్యము.

నేలమీఁద దుమ్ములో మూర్ఛపోయి పడి యాకాశమునుండి భూమిమీఁదఁ బడిన నక్షత్రమువలెఁ గాంతిచెడి కౌసల్యయుండఁగాఁ దక్క-న స్త్రీలు దుఃఖవేగముచే నేడ్పుధ్వను లిల్లునిండఁజేయఁగాఁ గైక మొదలగు నితరస్త్రీలు దుఃఖించుచుండఁగా.

కం. చుట్టంబు లెల్లవారును, జుట్టుకొని ధరాతలేంద్రు•సువతుల్ చేతుల్
పట్టుకొని పెక్కు- విధముల, బిట్టుగను బ్రలాపములను • వెరసిరి యంతన్. ౧౬౪౯

### తాత్పర్యము

బంధువులందఱు రాచపీనుఁగును జుట్టుకొని రాజభార్యలు చేతులు పిసికికొని యొకరిచేతు లొకరుపట్టుకొని యనేకవిధముల గట్టిగా నేడ్చిరి.

## ౬౬-వ సర్గము.

ఉ. శాంతదవానలం బనఁగ • శంబరహీనమహార్ణవం బనన్
గాంతివిహీనభాస్కరుని•కైవడి నున్నమృతుం బతిన్ వ్యథా
క్రాంత మనంబునం గనులఁ • గాల్వలు కట్టఁగ బాష్పవారి భూ
కాంతుశిరంబు స్వాంకమునఁ•గ్రాలఁగ రామునితల్లి కైకతోన్. ౧౬౮౬

శాంతదవానలంబు=చల్లారిన కాఱుచిచ్చు, శంబరహీనమహార్ణవంబు = నీళ్లు లేని సముద్రము, కాంతిహీనభాస్కరునికైవడిన్=కాంతి లేని సూర్యునివలె,మృతున్= మరణించినవానిని, వ్యథాక్రాంతమనంబునన్=దుఃఖబాధచే నాక్రమింపఁబడిన మనస్సున, బాష్పవారి=కన్నులనీళ్లు, స్వాంకమునన్=తన తొడలమీఁద.

### తాత్పర్యము.

చల్లారిన కాఱుచిచ్చువలె నీళ్లులేని మహాసముద్రమువలె కాంతిలేని సూర్యునివలెనున్న మరణించినభర్తను శోకబాధచే నాక్రమింపఁబడిన మనస్సుచేఁ గనుల నీళ్లు కాల్వలు పాఱఁగా రాజు శిరస్సును దనతొడలపై నుంచుకొనికౌసల్య కైకతో నిట్లనియె.

ఉ. ఓసి దురాత్మురాల! యిఁక • నుల్లము చల్లనగా నకంటకం
బౌసిరి యెల్లరాజ్యమును • హాయిగఁ గైవసపెట్టుకొమ్ము నీ
గాసి సహింపఁ జాల కిటు • కాంతుఁడు స్వర్గముఁ జేరె రాముఁడా
యాసము నొందెడిన్ వనుల • హా నెఱవేఱెఁగ నీదుకోరికల్. ౧౬౮౭

దురాత్మురాలా=చెడ్డ మనస్సుగలదానా! ఉల్లము = హృదయము, అకంటకంబు=బాధించువారులేని, కైవసపెట్టుకొమ్ము=స్వాధీనపఱుచుకొమ్ము, నీగాసి=నీవు పెట్టెడిబాధ, కాంతుఁడు=భర్త.

### తాత్పర్యము.

ఓసి చెడుమనస్సుగలదానా! యిఁక హృదయము చల్లనగా నితరులవలన బాధలేనిరాజ్యమును సంపదను సుఖముగ స్వాధీనపఱుచుకొమ్ము. నీబాధపడలేక రాజు చచ్చెను. శ్రీరాముఁ డడవులఁ జొచ్చెను. నీ కోరికలు నెఱవేఱెనుగదా. ఇఁక నీ వేయాటలాడిన వలదను వారెవరు?

కం. చోరభయసహిత సైకత,హారణ్యమునందు నొంటి • యరిగెడిసతినా
నేరీతి నుండఁగల నీ,యూరం బతిసుతుల విడిచి • యూపిరితోడన్? ౧౬౮౮

చోరభయసహితము = దొంగలవలని భయముతోఁగూడినది, మహారణ్యమునందున్=గొప్ప యడవియందు, సతినాన్=స్త్రీయనఁగా.

తాత్పర్యము.

దొంగలభయముగల పెద్దయరణ్యమునందుఁ దోడులేక యొంటరిగాఁ బ్రయాణముచేయు స్త్రీవలెఁ బతిని సుతుని విడిచి యీయయోరనే నూవిరితో నెట్లుండఁగలను.

కం. తనపాలిదైవతం బగు,తనమగని న్విడిచి బ్రదుకఁ • దమకము సేయున్
వనజాక్షి యెవ తె ధర్మం,బును విడచిన కైకదక్క • భూవలయమునన్. ౧౬౪౯

తాత్పర్యము.

తనపాలిదేవుఁడగు మగనివిడిచి బ్రదుకుటకు ధర్మము విడిచిన కైకదక్క మఱే యేస్త్రీ యుత్సహించును.

ఈ ప్రకారము చెప్పిన కౌసల్య భర్తతోడ సహగమనమేల చేయలేదు? పతివ్రతలుసహగమనము చేయవలయునుగదా యని శంక.

శాస్త్రములందు స్త్రీలు భర్త మరణించినపుడు వారి వెంట సహగమనము చేయవలయునని, చేయరాదని రెండు విధములఁ జెప్పఁబడినదిగాని సహగమనమే వైధమని చెప్పఁబడలేదు. కనుకనే 'భర్తర్యుపేతే బ్రహ్మచర్యం తదన్వారోహణంవేతి విష్ణుస్మరణాత్' వైధవ్యనాథీయము అని రెండును వికల్పముగాఁ జెప్పఁబడెను.

మృతేభర్తరియానారీ సమారోహేత్ హుతాశనమ్
సారుంధతీసమాచారా స్వర్గలోకే మహీయతే-శంఖః
• పృథక్ చితిం సమారుహ్య నవిప్రాగంతుమర్హసి
బ్రాహ్మణస్త్రీకి మగనికాష్ఠముదప్ప రెండవ కాష్ఠములేదు.
సహగమనపక్షమున నిత్యాది వాక్యములుగలవు.

శ్లో॥ యాస్త్రీ బ్రాహ్మణజాతీయా మృతంపతి మనువ్రజేత్
సాస్వర్గ మాత్మఘాతేన నాత్మానం నపతింనయేత్॥
అంగిరస స్మృతి.
నమ్రియతే సమంభర్త్రా బ్రాహ్మణీ శోకకర్శితా
సబ్రహ్మ గతిమాప్నోతి మరణా దాత్మఘాతినా॥
వ్యాఘ్రపాదుఁడు.
ఇట్లు సహగమనమును నిషేధించు వాక్యములు గలవు.

శ్లో॥ అష్టౌ మహిష్యః కథితా రుక్మిణీ ప్రముఖాస్తుయాః
ఉపగుహ్య హరేర్దేహం వివిశుస్తా హుతాశనమ్
రేవతీ చాపిరామస్య దేహమాశ్లిష్య సత్తమా
వివేశ జ్వలితంవహ్ని తత్సం గాహ్లాదశీతలమ్
ఉగ్రసేన స్తుతచ్ఛ్రుత్వా తథైవానక దుందుభిః
దేవకీ రోహిణీచైవ వివిశుర్జాత వేదసమ్॥ వి. పు. ౫-౩౮.

దీనివలన రుక్మిణీ మొదలగువారు రేవతిదేవకి రోహిణి సహగమనముచేసిరని తెలియుచున్నది.

సహగమనము చేయనివారెందఱో గలరు.

పాండురాజు భార్యలలో మాద్రి సహగమనము చేసెను. కుంతి చేయలేదు.

సహగమన మాత్మహత్య ఆత్మహత్యను శ్రుతులు నిషేధించుచున్నవి. "తస్మా దుహన పురాయుషః ప్రేయాత్" అసూర్యానామ తేలోకాః అంధేనతమసావృతాః। తాం స్తేప్రేత్యా భిగచ్ఛంతి యేకేచాత్మ హనోజనాః॥ ఈశావాస్య॥

ఆత్మహత్యలన్నియు నరక కారణములుగావు.

"సితాసితే సరితో యత్రసంగతే" యను శ్రుతిప్రకారము గంగా యమునా సంగమునఁ బ్రాణములు విడిచినవారికి నరకగతులు లేవుకదా? ఈ రామాయణమందే ౧౬౬౦-వ ప. వానప్రస్థులు చితి చొచ్చిరికదా. అరణ్య. ౭౮ శరభంగుఁ డగ్నిలోఁ బ్రవేశించెఁగదా ౧౨౭౮-వ ప. శబరియు నిట్లే దేహమును విడిచెఁగదా? వీరికి నరకమురాక యుత్తమగతులే వచ్చెనుగదా? యుద్ధమునందుఁ జంపువారికి హింసా దోషము చచ్చెడివారి కాత్మహత్యాదోష మెట్లు లేదో వీరికి నట్లులేదు. అటులే భక్తిచే ననుగమనము చేయు పతివ్రతలకు నాత్మహత్యా దోషములేదు. సుకృతమే కలదు. అటయిన సహగమనముచేయుట శ్రేష్ఠమా చేయకుండుట శ్రేష్ఠమా? భర్తతోడ సహగమనము చేసిన స్త్రీకి భర్తృసాలోక్యము వచ్చినట్లే భర్తమరణించిన తరువాత జీవించియు బ్రహ్మచర్యవ్రతమును సాధించినస్త్రీకిని భర్తృసాలోక్యముగలదు. ఫలభేదము లేదు.

ఆసీతా మరణాత్ క్షాంతా నియతా బ్రహ్మచారిణీ
యోధర్మ ఏకపత్నీనాం కాంక్షంతీ తమనుత్తమమ్॥
అనేకాని సహస్రాణి కౌమార బ్రహ్మచారిణామ్
దివంగతాని విప్రాణా మకృత్వా కులసంతతిమ్॥
మృతేభర్తరి సాధ్వీస్త్రీ బ్రహ్మచర్య వ్రతేస్థితా
స్వర్గం గచ్ఛత్యపుత్రాపి యథాతే బ్రహ్మచారిణః॥ మను

ఈశ్లోకముల కర్థము ముందు (౭౮౪-వ పుట) వ్రాయఁబడెను. కావున సహగమనము చేయకపోయి నంతమాత్రమునఁ బతివ్రతయగు స్త్రీకిఁ బరలోకహానిలేదు. కాలవిలంబనముమాత్రము గలదు. ఇరువురకు ఫలము సమానమనుటకు.

గీ. పాండురాజు పీఁడె బహురత్నఖచిత వి, మాన మెక్కి గొంతి మాద్రి తనయు
పాంతభాగమున సుఖాసీనలుగ నాడు. వలను వచ్చుచున్నవాఁడు కంటె.

స్వర్గారోహణపర్వము ౧-౬౨.

అని సహగమనము చేసిన మాద్రికి, సహగమనముచేయని కుంతికి నిరువురకు సమానఫలము భర్తసాలోక్యము చెప్పఁబడెను.

సహగమనముచేయు పతివ్రత యార్త ప్రపన్నుని వంటిది. సహగమనము చేయని పతివ్రత దృప్త ప్రపన్నుని వంటిది. దృప్తప్రపన్నుఁడు దేహాంతరమువఱకు సైఁచును. ఆర్త ప్రపన్నుఁడు క్షణమైన నీలోకమున నుండనొల్లఁడు. ఇరువురకు ఫలము సమానమే. ఎక్కువ తక్కువలు లేవు. కావునఁ గౌసల్య సహగమనము చేయక పోవుట దోషముగాదు.

కం. పిసినారి దోష మెఱుఁగునె, పిసఁ గింపాకంబుఁ దినెడి • పేటికిఁ డిరీతిన్
బస గలరఘువంశంబును, మసిఁ గలిపె గయాళి కైక • మంథరకొఱకై. ౧౯౦

పిసినారి=లోభి, పిసిని+అరి, సంధియందు దీర్ఘమిటనిత్యము, పిసన్ = అవివేకము, కింపాకము=విషము కలిసిన యన్నము, పస = సారము సామర్థ్యము, మసిఁగలిపెన్=బూడిదలోఁ గలిపెను.

తాత్పర్యము.

లోభి దోషమనుదాని నెఱుఁగునా ధనాశచే లోభి యేపాపకార్యమైనఁ జేయును. అవివేకముచే విషముగలిపిన యన్నమును దినెడి బుద్ధిలేనివానివలె గయ్యాళికైక ప్రసిద్ధికెక్కిన రఘువంశమును బూడిదపాలు చేసెను. ఇంతయు దేనికి? మంథరకొఱకు.

కం. చెనఁటినుడి నాలు చెప్పిన, జనపతి విని రామచంద్రు • సతితో వనికిన్
బనిచె నటంచును వినినన్, జనకుఁడు నాయట్లు లెంత • సంకటపడునో. ౧౯౧

చెనఁటినుడిన్=దుష్టవాక్యమును, ఆలు=భార్య.

తాత్పర్యము.

భార్య చెప్పిన చెడ్డబోధవిని రాజు దశరథుఁడు శ్రీరాముని సీతతో నడవులకుఁ బంపెనని విని నావలె జనకరాజెంత సంకటపడునో?

కం. ఇక్కడ జనపతి యీల్గుట, దిక్కఱి వైధవ్యమునను • దీనత్వమునన్
స్రుక్కుచు నేనుండుట తా, నక్కడ నాతనయుఁ డెఱుఁగఁ • డకటా వనిలోన్.

తాత్పర్యము.

ఇక్కడ రాజు చచ్చుట దిక్కులేనిదాననై విధవనై యేడ్చుచు నేనుండుట యక్కడ నడవిలో శ్రీరాముఁ డెఱుఁగఁడుకదా?

ఉ. ఏ మనుకొందు నట్టడవి • నెన్నఁడు దుఃఖ మెఱుంగనట్టి యా
కోమలి మైథిలాత్మభవ • క్రూరమృగేంద్రతరక్షుబుక్షశా
ఖామృగసూకరాహిపృథు • గండకభీషణరావభీతయై
రాముని నాశ్రయించుచు భ • రం బగుకష్టము లెల్ల నోర్చెడిన్. ౧౯౩

మైథిలాత్మభవ=మిథిలాధిపతియగు జనకునికూఁతురు సీత, క్రూర.... భీతయై = హింసచేయు, మృగేంద్ర=సింహములయు, తరక్షు = చిఱుత పులులయు, బుక్ష = ఎలుఁగు గొడ్డులయు, శాఖామృగ = క్రోఁతులయు సూకర = అడవిపందులయు, అహి=పాములయు, పృథు=గొప్ప, భీషణ = భయంకరమైన, రావ=ధ్వనిచే, భీత

రై=భయపడినదై, ఏమనుకొందున్ = దేనికనియేడ్తును, మగఁడు చచ్చెనని యేడు తునా? కొడుకునకై యేడ్తునా! కోడలు నట్టడవులలో స్త్రీలకు సహింపరాని దుఃఖ మనుభవించుచున్నదని యేడ్తునా? తరక్షుబుక్ష=సంధి ప్రకృతి భావము.

## తా త్ప ర్య ము.

దేనికి నేనేమనుకొందును, నడి యడవిలో నెన్నఁడు దుఃఖమెట్టెరో యెఱుఁగ నిది కోమలదేహము గలది. మిథిలరాజు కూఁతురు చూడ భయంకరములైన సింహ ములు చిఱుతలు ఎలుఁగులు-క్రోఁతులు - పందులు - పాములు పెద్దఖడ్గమృగములు వీనియొక్క భయంకరధ్వనులచే భయపడినదై శ్రీరాముని నాశ్రయించుచు భరిం పరాని యధిక కష్టములెల్ల సహించుచున్నది.

చం. కనుఁగొన నల్పపుత్రకుఁడు • కానఁడు పెక్కురనైన, వృద్ధుఁడున్
జనకుఁడు దుస్సహార్తిఁ బడి • సంపరితప్తుఁడునై నశించు, నే
నును సతి నౌట సువ్రతము • నూల్కొని యీవిభుతోడ నిప్పుడే
చనియెదఁ గాలుప్రోలికిఁ గృ • శానుశిఖాపరిదగ్ధగాత్రనై. ౧౬-౯౪

అల్పపుత్రకుఁడు = కూఁతురే కొడుకనియెంచి యుండువాఁడు, సతిన్ = పతి వ్రతను, "సతీసాధ్వీ పతివ్రతా" నిఘంటు "ఆర్తార్తే ముదితాహృష్టా ప్రోషితే మలి నాకృశా । మృతేమ్రియేత యాపత్యౌ సాస్త్రీజ్ఞేయా పతివ్రతా॥" యని మగని సంతోషమే తన సంతోషము మగని దుఃఖమే తన దుఃఖము మగఁడు పరదేశమున నుండిన మలినవస్త్రము గట్టి కృశించునది, చచ్చినఁ దోడఁజచ్చునది యెవతో యామె పతివ్రతయని పతివ్రతాలక్షణము, సువ్రతము = మంచివ్రతమును, నూల్కొని = పూని, కాలుప్రోలికిన్ = యమునిపురమునకు, పుకశబ్దభవముప్రోలు, దీని పర్యాయ ముగ వేలను శబ్దమెుండుగాన నయ్యెడి. బద్దెవేలు-చిట్టివేలు, కృశానుశిఖా = అగ్ని శిఖలచే, పరిదగ్ధ=బాగుగా దహింపఁబడిన, గాత్రనై=దేహముగలదాననై.

## తా త్ప ర్య ము.

తన కూఁతురు పడుకష్టములను దలఁచి కన్నకొడుకులు లేక యొక్కరిద్దఱు కూఁతులేకాని పెక్కురు కూఁతులైన లేక యా కూఁతురే కొడుకని యెంచియుండు ముసలివాఁడు జనకరాజు సహింపరాని బాధపడి మిక్కిలి తపించి కృశించును. నేనో పతివ్రతనైన కారణమునఁ బాతివ్రత్యము విధిననుసరించి సహగమనముచేసి యగ్ని హోత్రునకు దేహము సమర్పించెదను.

చం. అని పలవించుచుండ వ్యవ • హారవిదుల్ చనుదెంచి తత్పతిన్
సనయత నూఱడించి యల • తన్మపతిగాత్రము నూనెకాఁగులో
నునిచి యనంతరక్రియల • నొప్పుగఁ దీర్చిరి రాజకార్యముల్,
తనయుఁ డొకండు లేమి నట • ధర్మవిదుల్ నృపుఁ గావఁ బంచుచున్. ౧౬-౯౫

పలవించుచుండఁన్=ఏడ్చుచుండఁగా, వ్యవహారవిదుల్ = జరుగవలసిన కార్య

విధము తెలిసినవారు, తత్సతిన్ = ఆ కౌసల్యను, సనయైరన్ = మంచి మాటలతో, న్యాయమార్గమున, ఊఱడించి=సమాధానపఱచి, అనంతరక్రియలన్ = ఆవలఁజేయ వలసిన కార్యములను, నలుగురు కొడుకులుండియు సమయమునకు నొక కొడుకైన నొద్దలేదయ్యె, వసుదేవునిగతి యిట్లయ్యె. కొడుకులకై యేడ్చువారీరెండు నిద ర్శనముల గుణపాఠముగ గ్రహింతురుగాక. వాస్తవపుత్రుఁడు భగవంతుఁడే.

## తాత్పర్యము.

అని విలపించుచుండఁగా రాజకీయవ్యవహారములు తెలిసినవారువచ్చి కౌసల్య నూరార్చి రాజు దేహమును నూనెకాఁగులోనుంచి యావలఁ జేయవలసిన రాజకార్య ములు దీర్చిరి. కొడుకొకఁడైన సమీపమున లేమిని ధర్మవిదులగువారు రాజశరీర మును గావఁదగువారికి నాజ్ఞ చేసిరి.

శా. తైలద్రోణిని నుంప భూరమణు శు • ద్ధాంతాంగనల్ చూచి భూ
పాలా! పోయితె యంచు నార్తరవలై • బాహుద్వయం బెత్తుచున్
వాలాయంబుగ నెత్తి మోఁదికొనుచున్ • బాష్పాంబులీనాస్యలై
ప్రాలం బొచ్చిరి హా పతీ చనితివే • ప్రాణేశ యం చుర్విపై. ౧౬-౧౧

నూనెకాఁగులో నుంపఁగా రాజు నంతఃపురస్త్రీలు చూచి రాజా పోయితివా యని యేడ్పుధ్వనులుగలవారై రెండు చేతులు మీఁది కెత్తుచు దబాదబా యని బల ముగఁ దలకొట్టుకొనుచుఁ గన్నీళ్లలో మునిఁగిపోయిన ముఖముగలవారై పతీ ప్రాణే శ్వరాయని నేలపైఁ బడసాగిరి. దహనమునకుఁ దడవగువట్లుండినచో శవమును నూనెలో వేసి యుంచవలెను. "అహితాగ్నిం జనేత్ప్రమీతం తైలద్రోణ్యా యావ ధాయ శకటేన హరంతి" యాజ్ఞవల్క్యుడు ఔరసులుండువారికిఁ బుత్రులు తప్ప మఱియొక్కరు సంకలనము చేయరాదు.

సీ. సత్యసంధుఁడు రామ • చంద్రుఁడు ప్రియవాది, వాసెనీవునుమమ్ముఁ • బాయఁదగునె?
చెనఁటికైకయి వేఱు • చేసెను శ్రీరాముఁ, బతిహంత్రి కడ నెట్లు • వచ్చు నిలువ
విధవల మగుచును • విభుఁ డగు నీకు మా, కెల్ల దిక్కన్న నీ • కేశుఁ డొకఁడె
యట్టిధన్యుండు రా • జ్యశ్రీలఁ బెడఁబాసె, జనితివి నీవును • స్వర్గపురికి

ఆ. మగని నిన్నుఁ జంపె • సుగుణి రాముని బాపె, నీకు లక్ష్మణుని • విడిచిపెట్టె
ముద్దుఁగోడలైన • ముగ్ధ సీతఁ దోలంచెఁ, గ్రుంప దింక నెవరి • దుష్టకైక? ౧౬-౧౨

పతిహంత్రి=మగనిని జంపినది.

## తాత్పర్యము.

సత్యప్రతిజ్ఞుఁడై ప్రియములు మాటలాడు శ్రీరామచంద్రుఁడు మమ్ము వదలి పోయెను. నీవుకూడ విడిచిపోవ న్యాయ్యమా దుష్టురాలగు కైకయి శ్రీరాముని వేఱు చేసెను. మగనిఁజంపిన యటువంటిదానియొద్ద నెట్లు విధవలమై నిలువఁగలము. నీకు మాకుఁ బ్రభువు దిక్కనిన శ్రీరాముఁడొకఁడే. అట్టి పుణ్యాత్ముఁడు రాజ్యసం

పద విడనాడెను. నీవును స్వర్గమునకుఁబోయితివి. మగఁడవైన నిన్నుఁజంపెను. మంచిగుణములుగల శ్రీరాముని నడఁబాపెను. వీరుఁడైన లక్ష్మణునిని విడిచి పెట్టెను. ఏమియుఁదెలియని సుందరిని సీతను దగ్గరనుండకుండఁ జేసెను. ఇఁక నీ దుష్టురాలు కైక యెవరిని జంపఁజాలదు? ఎవరినైనఁజంపఁగలదు. ఇఁక మే మెంత లెక్క-యీ దానికి.

కం. కైక యనుమాటలం బడి, యేకరణిని నిలువఁ గలమొ • యిచ్చట నని దుః
ఖాకులచిత్తంబుల న,స్తోకంబుగఁ బొరలి పొరలి • దూపిల్లంగన్. ౧౧౯౮

తా త్ప ర్య ము.

కైకయనెడి నిష్ఠురవాక్యముల సహించుచు నేవిధముగా నిందు మేము నిలువఁగలము. అని దుఃఖముచేఁ గలఁతపడిన మనస్సులతో వెక్కి-లి పొరలి పొరలి యేడువఁగా-

కం. పతి లేనిసతిని దారా,పతి లేనిత్రియామఁ బోలి • పట్టనము ధరా
పతిలేమిని దేజోవ,ర్జితమై శోభిల్లకుండెఁ • జింతాయుతమై. ౧౧౯౯

తా త్ప ర్య ము.

మగఁడుచచ్చిన మగువవలె నలంకారములేక చంద్రుఁడులేని రాత్రివలె దుఃఖాంధకారమున మునిఁగి రాజులేనికారణముచే నయోధ్యాపురి కాంతిలేక చింతతోఁ గూడి ప్రకాశింపకుండెను.

మాలిని. కలయఁగ జను లెందుం • గార్పఁగన్ బాష్పవారిన్
గులతరుణులు హాహా • ఘోషముల్ నించు చుండన్
లలి నలుకులు ముగ్గు • ల్గానరా కెట్టియింటన్
బొలుపు దొఱఁగి యుండెం • బ్రోలు గుర్తింపకుండన్. ౧౨౦౦

కులతరుణులు = కులస్త్రీలు, ప్రోలు = పురము. మాలినీవృత్తమునకు ననమ యయగణములు ౯-వ యింట యతి.

తా త్ప ర్య ము.

ఎక్క-డఁ జూచినను జనులు కన్నీరు గార్చుచుండఁగా గులస్త్రీలు హాహాకారములు చేయుచుండఁగా నేయింటియందును నందముగా నలుకులు ముగ్గులు లేక యిది యయోధ్యాపురమా యని గుర్తింపరాక యుండునట్లు సౌందర్యము చెడియుండెను.

కలితాంతము. భూమీశ్వరుఁడేడ్చుచు • బొంది విడన్, భామాజన మార్తిని • వ్రాలనిలన్
శ్రీమద్దివి యస్తముఁ • జేరఁ జనెన్, భూమిం జెనఁ జీఁకటి • పొల్పెసఁగెన్

బొంది=దేహము, శ్రీమద్దివి=కాంతియుక్తుఁడైన సూర్యుఁడు, అస్తము=అస్త పర్వతము, క్రుంకుమల. కలితాంతమునకు తజజవగణములు ౭-వ యక్షరము యతి.

తా త్ప ర్య ము.

పుడమిఁ జేడుచుచు శరీరమునువదల, దశరథుని భార్యలందఱు దుఃఖమున నేల్ర వాలిరి-శోభాయుతుఁడగు సూర్యుఁడ స్తగిరిఁ జేరఁజనెను. భూమియందుఁ జెనుచీఁకటి యావరించెను.

కం. సుహృదాప్తులు చేరియు న,మ్మహిపతిసుతులేమిఁ జూచి ♦ మానిరి తనువున్
దహనము సేయక యాతని,గృహమందున యుంచి రతనిఁ♦గృతమతు లగుచున్.

సుహృదాప్తులు=సుహృత్ + ఆప్తులు, స్నేహితులు, బంధువులు, దీనివలనఁ గొందఱు శవమును దీర్ఘకాల ముంచరాదు. కావున నప్పుడే దహనముచేయ నభిప్రాయపడిరనియు వీరు దాని నంగీకరింపలేదనియుఁ దోఁచెడి.

తా త్ప ర్య ము.

దశరథుస్నేహితులు బంధువులు చేరి యారాజు కుమారుఁ డొకఁడైన లేకుండుటఁజూచి శవమును దహనము సేయుటమాని బుద్ధిమంతులై యింటియందే పదిలపఱచిరి.

మానిని. తామరసాప్తుఁడు లేనినభం బనఁ ♦ దారలు లేనిత్రియామ యనం
గా మహితాత్ముఁడు భూపతి లేమిని ♦ గద్గదకంఠసమాకులితా
యామమహాపథచత్వరసంఘము ♦ నై పురి యొప్ప నరుల్ సతులున్
స్తోమములై చెడఁదిట్టుచు నుండిరి♦ద్రోహ మొనర్చినకైకయినిన్. ౧౭౦౩

తామరసాప్తుఁడు = సూర్యుఁడు, నభంబు = ఆకాశము, త్రియామ=రాత్రి, మహితాత్ముఁడు = గొప్ప మనస్సుగలవాఁడు, గద్గదకంఠ = డగ్గుత్తికగల కంఠధ్వనిగలవారిచేత, సమాకులిత = కలఁతపడినదియు, ఆయామ = దీర్ఘమైనదియునగు మహాపథ = రాజమార్గములు, చత్వరసంఘము = నాలుగువీథులు గలియుప్రదేశములగుంపులు కలదియు, స్తోమములై = గుంపులు గుంపులుగాఁ జేరి చెడఁదిట్టుచున్ = నోటికివచ్చినట్లు నాశమైపోనీయనితిట్టుచు,

మానినీవృత్తమునకు ఏడు భగణములు గురువు, ౧౩వ యింట యతి.

తా త్ప ర్య ము.

సూర్యుఁడులేని యాకాశము. నక్షత్రములేనిరాత్రి యన్నట్లు గొప్పమనస్సుగలరాజు లేకుండుటచే వ్యసనముచే డగ్గుత్తికపడిన కంఠములవారిచేఁ గలఁతచెందిన రాచబాటలు- నాలుగుత్రోవలు కలియుచోటులు గలిగి పుర మొప్పుచుండెను- పురుషులు స్త్రీలు గుంపులు గుంపులుగాఁ జేరి రాజద్రోహము భర్తృద్రోహము పుత్రద్రోహము ప్రజాద్రోహము చేసిన కైకయిని నాశమైపోనీ యని నోటికి వచ్చినట్లెల్లఁ దిట్టుచుండిరి.

## ౬౭వ సర్గము.

సీ. తరువాత వెలువాఱఁ • దరణి దూర్పునఁ దోఁప, రాజకర్తలు ద్విజ•రాజవరులు
గౌతమమార్కండల్య•కాత్యాయనులును మా,ర్కండేయజాబాలి•కాశ్యపులును
వామదేవుండును • వల నొప్ప సభ దీరి, మంత్రియుక్తంబుగ • మానవేంద్రు
వరపురోధ వసిష్ఠు • వంకఁ గనుంగొని, తెల్పెపతి స్వర్గంబుఁ • జనుట కతన

తే. రేయినూఱేండ్లవిధముగఁ•బోయె మనకు, రాజుపరలోకగతుఁ డయ్యె•రాముఁడనుజు
తోడఁగానకుఁజనియెశ•త్రుఘ్న యుక్త,రాజగృహమున భరతుండు•గ్రాలువాఁడు.

తరువాత = అవల, వెలువాఱన్ = ఎనిమిదవదినము నుదయము, తరణి = సూర్యుఁడు, కర్తలు = రాజు నేర్పఱుచువారు, ద్విజరాజవరులు=బ్రాహ్మణశ్రేష్ఠులు, వరపురోధ=శ్రేష్ఠుఁడగు పురోహితుఁడు రూ. పురోధసుఁడు.

### తా త్ప ర్య ము.

అవల నెనిమిదవనాఁటి యుదయమునఁ దూర్పున సూర్యుఁ డుదయింపఁగా రాజను నిర్ణయించు నధికారముగలవారు బ్రాహ్మణశ్రేష్ఠులు గౌతముఁడు మార్కండల్యుఁడు కాత్యాయనుఁడు మార్కండేయుఁడు జాబాలి కాశ్యపుఁడు వామదేవుఁడు వీరందఱు మంత్రులతోడ సభదీరి రాజపురోహితులందు శ్రేష్ఠుఁడగు వసిష్ఠునిఁజూచి మునీంద్రా! రాజు మరణించుటచేత నిన్నటియొక్క రాతిరియే మనకు నూఱేండ్ల విధముగఁబోయెను. రాజు పరలోకమేగెను. రాజ్యమునకు రావలసిన పెద్దకొడుకు కడవులపాలాయెను. శత్రుఘ్నునితోడ భరతుఁడు మేనమామయొద్ద రాజగృహమును పురమున నున్నాఁడు.

కం. ఘను లగురాసుతులం దె,వ్వని నైనను రాజుఁ జేయ•వలయుం బరికో
యనఘ! యరాజక మొందిన, జనములు రాష్ట్రములు మిగుల•సంకటపడవే.

### తా త్ప ర్య ము.

గొప్పవారగు రాజకుమారులం దెవ్వనినైన నొకని పురమునకు రాజుగాఁ జేయవలయును. అటుగాక యున్నరాజ్య మరాజకమైనచో జనములు రాష్ట్రములు మిగుల సంకటపడునుగదా.

### —• అరాజకత్వదోషవర్ణనము •—

కం. ధారిణి యరాజకము గా, వారిధరచయంబు దివ్య•వార్ధారాప్తిన్
వారక చపలాగర్జో,దారంబుగ వృష్టి నిడదు • తగుసమయములన్. ౧౭౬

ఇదిమొదలు కవియరాజకత్వవర్ణనము నెపంబున దశరథ రాజున్నప్పటి నాగరకత సూచించుచున్నాఁడు. దీనివలన నప్పటి నాగరకత యెట్టిదైనది గ్రహింపఁదగు.

అరాజకము=రాజులేనిది, వారిధరచయంబు = మేఘముల సమూహము. దివ్యవార్ధారాప్తిన్=వర్షధారలపొందికచే, వారక=అడ్డములేక, వర్షప్రతిబంధ కారణములులేక, చపలాగర్జోదారంబుగన్ = విశేషముగ మెఱుపులు గర్జలుగలదై,

వృష్టి=వర్షము. యజ్ఞములు దేవపూజలు లేమిని వానలు లేవు.

తా త్ప ర్య ము.

భూమిని పాలింప రాజు లేకుండెనేని మేఘసమూహము వర్షధారలతోఁగూడి యురుములు మెఱుపులతోడ నవారిగాఁ దగినయదనులందు వర్షము గురియదు.

కం. ధారిణి యరాజకము గాఁ, గారున బీజములు నాటి ✦ కాఁపుజనంబుల్
పైరు నొనర్పరు ఫలసం,వారగ్రహణంబు నమ్మ ✦ వల నెని లేమిన్. ౧౭౦౭

కాపనన్ = అయాసమయమందు, బీజములు = విత్తనములు, ఫలసంవార గ్రహణంబు=ఫలసమూహము (ధాన్యపుగింజలనుగ్రహించుట) వలను=ఉపాయము.

తా త్ప ర్య ము.

భూమిని పాలింప రాజు లేకుండెనేని యాయాధాన్యముల నాటవలసిన సమయములందుఁ గాఁపులు విత్తనములు నాటి పైరులు పెట్టరు, ఏలనః—పైరుపండును, అధాన్యము దొంగలపాలుగాక యింటికిఁ దేఁగల మను నమ్మకము లేకుండుటచే.

కం. ధారిణి యరాజకముగాఁ, బూరుషవశవర్తు లగుచుఁ ✦ బొదలరు పుత్రుల్
దార, లరాజకమున లే,వారయవిత్తములు లేర ✦ యాంధ్రు మగలకున్. ౧౭౦౮

తా త్ప ర్య ము.

పూరుషవశవర్తులగుచున్ = మగవారికిలోఁపడి బిడ్డలుగాని పెండ్లాలుగాని వర్తిరిపరు. రాజులేని దేశమున మగవారి కిది నాధనమని యిది నాభార్యయని చెప్ప సాధ్యపడదు ఏనిమిషమున నేబలవంతుఁడు వచ్చి హరించుకొనిపోవునో-యెవ్వఁడెఱుఁగును. వానిని దండించువాఁడెవ్వఁడు.

కం. అత్యాహిత మిటు గూడిన, సత్యం బెట నుండు నెందు ✦ శౌచం బుండున్
క్షిత్యధిపతి యొకఁ డుండుట, యత్యావశ్యకముగా మ✦హర్షి ప్రవరా. ౧౭౦౯

అత్యాహితము=అధికభీతి, క్షిత్యధిపతి=భూమికిఁబ్రభువు, మహర్షిప్రవరా = మహర్షులయందు శ్రేష్ఠుఁడా!

తా త్ప ర్య ము.

జారులవలనఁ జోరులవలన దుష్టులవలన నధికభయము కలుగఁగా సత్యమెచట నుండును. శౌచ మెచటనుండును. కావున రాజుండుట యత్యావశ్యకముగదా.

కం ధారిణి యరాజకముగాఁ, జారుతరోద్యానములు ప్ర✦శస్తపుఁబుణ్యా
గారంబులు గలుగవు సభ, చేరరు మానవులు ముదుల✦స్తిమితత లేమిన్. ౧౭౧౦

చారుతరోద్యానములు=మిగుల మనోహరములైన యుద్యానములు, ప్రశస్తపుఁ బుణ్యాగారంబులు=మిగులఁ గొనియాడఁదగిన పుణ్యగృహములు, స్తిమితత=నెమ్మది

తా త్ప ర్య ము.

భూమిని పాలించుఁ బ్రభువులేకున్న నెవరంతటవారు స్వతంత్రించి ప్రవేశించి చెట్లుకొట్టి పాడుచేయుదురు గావున మనోహరములైన యుద్యానములు

నుండవు. శూద్రులు ప్రవేశించి యపరిశుద్ధము చేయుదురు గావున క్షేత్రములు నిలువవు. మనస్సులందుఁ గుదురుపాటు లేకుండుటచే సభలందు మనుష్యులు చేరరు.

కం. ధారిణి యరాజకముగా, ధారిణీసురు లధ్వరములఁ • దలఁపరు సలుపన్
గూరినచోరభయమున ను,దారులు ధను లయ్యునిడరు • దక్షిణ లెందున్. ౧౭౧౧

ధారిణీసురులు=బ్రాహ్మణులు, అధ్వరములన్=యాగములను, ఉదారులు=దాతలు.

తా త్ప ర్య ము.

రాజు పాలింపని దేశమందు సాంతమగు ననునమ్మకము లేమిచే బ్రాహ్మణులు యజ్ఞములు చేయఁదలఁపరు. దొంగల భయమువలన దాతలు ధనికులయ్యు దక్షిణల నీయరు.

కం. ధారిణి యరాజకముగా, రారాజన్నర్తకనట • రాష్ట్రసమృద్ధి
స్ఫారోత్సవయాత్రాసం,చారంబులు గనఁగ రావు • సమ్మద మారన్. ౧౭౧౨

రారాజత్=మిక్కిలి ప్రకాశించు, నర్తక = నాట్యమాడువారును. నట=అభినయముతో నర్తించువారును గలవియు. రాష్ట్ర=దేశముయొక్క, సమృద్ధి=వృద్ధిచేత స్ఫార=వెలయునట్టివియునగు, ఉత్సవ = దేవోత్సవములు, యాత్రా=తీర్థయాత్రకై సంచారములు, ఉత్సవతీర్థయాత్రలు లేనిచో దేశమునకు హానికలుగునను సంశయమును రాష్ట్రసమృద్ధి స్ఫారయనుపదము సూచించుచున్నది.

తా త్ప ర్య ము.

భూమి యరాజకమయ్యెనేని నటులు నర్తకులుగలవియు రాష్ట్రవృద్ధి వెలయించు నుత్సవములు యాత్రార్థమైన సంచారములు సంతోషముగాఁ జూతమన్నఁ గానరావు.

కం. ధారిణి యరాజకముగా, బేరులు లాభంబు గనరు • బేహారములం
దీరుపఁ దగవులు తెగునధి,కారులు లేకుంటఁగొనుటఁ • గడు లంచములన్. ౧౭౧౩

బేరులు=కోమట్లు, బేహారములన్=బేరములందు, బేహారి- వి. బేరి.

తా త్ప ర్య ము.

అధికారులు లంచములుతీసికొనుటచే తగవులను న్యాయముగాఁ బరిష్కరింతురను నమ్మకము లేకుండుటచేతఁ గోమట్లు బేరములందు లాభము సంపాదింపలేరు.

కం. ధారిణి యరాజకముగాఁ, బౌరులు స్వేచ్ఛానువృత్తి • బహురమ్యకథా
ధోరణి వెలయరు పలుసిం,గారంబులు చేసికొనరు • కంజాతాక్షుల్. ౧౭౧౪

స్వేచ్ఛానువృత్తిన్=వారివారి యిష్టానుసారము, బహురమ్యకథాధోరణిన్=మిగుల వినోదములైన కథలు చెప్పుటయందు.

తా త్ప ర్య ము.

పాలించు రాజులేనపుడు పౌరులు వారిమనస్సు నిశ్చింతముగా లేమిచే వారివారి యిష్టానుసారము కథలు చెప్పుకొనరు. దుష్టులభీతిచే స్త్రీలు సింగారించుకొనరు.

కం. ధారిణి యరాజకముగాఁ, నారిమిఁ శృంగారిత లొప్పఁ • గొమిరెలుఁగేళిన్
సారారామంబులను బ్రచారములన్ సౌఖ్యపడరు • సాయాహ్నములన్. ౧౭౧౫

శృంగారితలు=శృంగారములు, కొమిరెలు=వయస్సుస్త్రీలు, కేళిన్=ఆటయందు, సారారామంబులన్ = సారవంతములయిన యుద్యానములందు, ప్రచారములు=వేడుక్గాఁ దిరుగుటలు. సాయాహ్నములన్=సాయంకాలములందు.

తా త్ప ర్య ము.

రక్షించు రాజు లేనపుడు వయసు పడుచులు శృంగారించుకొని ప్రేమతో విలాసముగాఁ దోఁటలయందు వేడుకగా సాయంకాలములందుఁ దిరుగుచు సుఖింపరు.

కం. ధారిణి యరాజకముగా, స్వారిం జనఁ బోరు పతులు • వల్లభయుతలై
తేరులపై వరసుమనో, వారాపచయంబుకొఱకు • వనభూములకున్. ౧౭౧౬

స్వారి=సవారి, వల్లభయుతలై=భర్తలతోఁగూడి, వరసుమనోవారాపచయంబుకొఱకు=మంచి మేలైన పూలగుంపులను గోయుటకై.

తా త్ప ర్య ము.

పాలించు ప్రభువు లేనపుడు భార్యలు భర్తలతోఁ దేరులపైఁ గూర్చుండి మేలైన పూలు గోయుటకై వనములకు సవారిపోరు.

కం. ధారిణి యరాజకముగా. భూరిధనుల్ గోపజనులు • ప్రొద్దు మఱఁగినన్
ద్వారములు తెఱచి నిదుర. గూరరు చోరులభయాన • గుండియ లదరన్.

భూరిధనుల్ = విశేషధనముగలవారు, గోపజనులు = గొల్లవారు, ప్రొద్దు= బ్రధ్నశబ్దభవము, సూర్యుఁడు, మఱఁగినన్=చాటునకుఁబోఁగా=అస్తమింపఁగా.

తా త్ప ర్య ము.

ప్రభువు లేని రాష్ట్రమందు విశేషధనముగలవారు గొల్లవాండ్రు సూర్యుఁడస్తమింపఁగా దొంగల భయమువలన గుండెలదరుటచేత వాకిండ్లు తెఱచి నిద్రింపరు.

పూర్వమున జనులు చోరభయము లేక తలుపులు తెఱచియుంచి నిద్రించుచుండిరి. చోరులవలనఁగలుగు నష్టిగ్రామాధికారి కట్టవలయునని రాజాజ్ఞ కావున వారు రాత్రియంతయుఁ బ్రహరి తిరుగుచుందురు.

కం. ధారిణి యరాజకముగా, వారణరత్నములు షష్టి • వర్షాంచితముల్
తిరుగ ఘంటానాదము, లారఁగ ఘంటాపథముల • నలవడదు చనన్. ౧౭౧౭

వారణరత్నములు=శ్రేష్ఠములైన యేనుఁగులు, షష్టివర్షాంచితముల్ = అఱువదియేండ్లుగలవి, ఘంటానాదము = మీఁద వ్రేలవేసిన గంటల చప్పుడు, ఘంటాపథములన్=రాచబాటలందు.

తా త్ప ర్య ము.

రాజులేని నగరమున నఱువది సంవత్సరముల వయస్సుగల యేనుఁగులు గంటలనాదముతో రాచబాటలందుఁబోవ సాధ్యపడదు.

కం. ధారిణి యరాజకముగా, నారాచాభ్యాసనమున వి • నంబడు పటుమౌ
ర్వీరావము విన రా దెట, వీరులకుం జిత్త మొక్క•విధమున లేమిన్. ౧౨౯

నారాచాభ్యాసమునను = బాణములు వేయుట యభ్యసించునపుడు, పటుమౌర్వీనాదము = దృఢమైన యల్లెత్రాటి చప్పుడు, వీరలకుఁ జిత్త మొక్క విధముగా నుండక నానాచింతలపాలై పోవుటచే.

తాత్పర్యము.

రాజులేని నగరమున బాణవిద్య నేర్చుసమయమున వినవచ్చు నల్లెత్రాటి చప్పు డావీరుల మనసొక్క విధముగ లేకుండుటచే నెందును వినరాదు.

కం. ధారిణి యరాజకముగా, దూరవిషయగాము లగుచుఁ • దోరపువస్తుల్
బేరంబునఁ గొని యరిగెడు, నూరుభవుల్ సుఖతఁ జేర•రూళ్లను బల్లెల్. ౧౩౦

దూరవిషయగాములు=దూరదేశములకుఁబోవువారు, తోరపువస్తుల్=విస్తారముగ పదార్థములను, ఊరుభవుల్ = ఊరువులందుఁబుట్టిన వైశ్యులు, సుఖతన్ = సుఖముగా.

తాత్పర్యము.

రాజులేని రాష్ట్రమందు దూరదేశమునకుఁబోవుటకై వస్తువులనుగొని తీసికొని పోవు కోమట్లు సుఖముగా నూరు చేరరు. దోవలందు దొంగలచే దోఁపుడు పోయి దెబ్బలు తినవలసియుండును.

కం. ధారిణి యరాజకముగా, ధీరత యతి యొంటిగాఁగఁ • దిరుగఁడు పంతన్
దారి రవి గ్రుంకుచోటన, కోరం డట నన్న దాత•గొఱలమి నొకఁడున్. ౧౩౧

తాత్పర్యము.

రాజు పాలింపని దేశమున సన్న్యాసి యొంటరిగాఁ దిరుగఁడు. అన్నదాత లేనికారణమున నెక్కడఁ బ్రొద్దుగ్రుంకునో యక్కడనే పండుకొనఁడు.

సన్న్యాసి కృత్రిమదీపము లుపయోగింపరాదు. సూర్యుఁడు చంద్రుఁడు నక్షత్రములే వానికి దీపములు దివిటీలు. కావున నెక్కడఁ బ్రొద్దుగ్రుంకునో యక్కడనే పండుకొనవలయునుగాని చీఁకటిలోఁ దిరుగరాదు. ఈ నియమము కలికాలమందు లేదని వృద్ధపరాశర స్మృతి.

అరాజకదేశములో నట్లు పండుకొనిన భుక్తి యభావమగును గనుక రాత్రియైనను నన్నము పెట్టువాఁడున్నచోటికిఁ బోవలసియుండును.

కం. ధారిణి యరాజకముగా, మూరదు పుణ్యంబు యోగ•మును క్షేమంబున్
ఘోరారులచే సేనలు, ధీరుఁడు పతి లేమి మొదలఁ ? దెగటాఱి చనున్. ౧౩౨

యోగము=లేనిది సంపాదించుట, క్షేమము = ఉన్నది రక్షించుట, ఘోరారులచేన్=భయంకరులైన శత్రువులచే, తెగటాఱి=నాశమై ఖండింపఁబడినవై.

తా త్ప ర్య ము.

అరాజకమైన రాజ్యంబునఁ బుణ్యము కలుగదు. యోగములేదు. క్షేమము లేదు. యుద్ధమునకుఁబోయిన సేనలు ధీరుఁడైన నాయకుఁడు లేనికారణమున శత్రువులచే ఖండింపఁబడును.

కం. ధారిణి యరాజకముగా, నారతరానందమునను ♦ జనములు పురిలో
వారణ ఘోటకరథయా, నారూఢులు నగుచు నిచ్చ ♦ నరుగరు మానీ! ౧౭౨౩

సారతరానందమునన్=నిర్మలమై దృఢమైన సంతోషముతో, వారణ = ఏనుఁగులు, ఘోటక=గుఱ్ఱములు, రథ=తేరులు, యాన = వాహనములమీఁద, ఆరూఢులు=ఎక్కినవారు, నిచ్చ=ఎల్లప్పుడు, ఇచ్ఛ=ఇష్టప్రకారము.

తా త్ప ర్య ము.

రాజులేనిదేశమందు మిక్కిలి సంతోషముతోఁ బురమునందలి జనులు ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములు లోనగు వాహనములెక్కి వారివారి యిష్టప్రకారమెప్పుడు తలఁచినప్పుడు సంచారము చేయరు.

కం. ధారిణి యరాజకముగాఁ, బారంగతి మగుచు శాస్త్ర ♦ పటలిన్ జన మి
చ్ఛారతి వనముల నుపవన, తీరంబుల వాదములను, ♦ దేఁలదు మహిమన్. ౧౭౨౪

పారంగతము = తుదముట్టినది, శాస్త్రపటలిన్ = శాస్త్రసమూహమును, ఇచ్ఛారతిన్=ఇష్టప్రకారము, వనములన్=ఋషులుండు నరణ్యములందు.

తా త్ప ర్య ము.

పాలించు రాజులేనిదేశమందు జనులు శాస్త్రములు నెల్లఁ దుదముట్టఁ జదివి వారివారి యిష్టప్రకారము ఋషులుండెడి వనములందుఁ దోఁటలయందు నదీతీరములందుఁ దమ పాండిత్యమహిమచే వాదములను గృతార్థులుగారు.

కం. ధారిణి యరాజకముగా, నారయఁగా దేవతార్చన♦నార్థము సుమనో
హారోపహారములఁ దమిఁ, బౌరులను సదక్షిణముగఁ ♦ బరఁగింప రెటన్. ౧౭౨౫

దేవతార్చనార్థము=దేవుని బూజించుకొఱకు, సుమనోహారోపహారములు = పూలదండలు నైవేద్యవస్తువులు,తమిన్=కోరికతో, సదక్షిణముగన్=దక్షిణలతోడ.

తా త్ప ర్య ము.

రక్షించు రాజులేనిచోట దేవుని పూజానిమిత్తముపూలదండలు నైవేద్యవస్తువులు దక్షిణలతోడఁ దీసికొని పురజనులు దేవాలయాదులకుఁబోరు.

కం. ధారిణి యరాజకముగా, సారాగరుచందనాది♦చర్చలను వసం
తారూఢ వృక్షములవలె, భూరమణకుమారు లెంమఁ ♦ బొలయరు సుఖులై.

సారాగురుచందనాదిచర్చలన్ = చేవగల యగురుచెక్క శ్రీగంధముచెక్క మొదలగు వానితోఁదీసిన గంధములను బూసికొనుటచే, వసంతారూఢ వృక్షములవలెన్=వసంతకాలమందలిపూచినచెట్లవలె, భూరమణకుమారులు=రాజకుమారులు,

తా త్ప ర్య ము.

రాజు పాలింపని రాజ్యమందు సారవంతములై నయుగుర శ్రీగంధములగంధము పూసికొని వసంతకాలమందలి చెల్లవలె రాజకుమారులు సుఖులై యెందును సంచరింపరు.

కం. నీళ్ళులు లేనిస్రవంతులు, సల్లలితతృణాళి లేని ♦ సారవనంబుల్
వల్లవులు లేనియావులు, వల్లభుపాలనము లేని ♦ వసుధయు సమముల్. ౧౭౨౭

స్రవంతులు=నదులు, సల్లలితతృణాళి = మంచి మనోహరమైన గడ్డిసమూహము, వల్లవులు=గొల్లవాండ్రు, వల్లభు=రాజుయొక్క, వసుధ=భూమి.

తా త్ప ర్య ము.

నీళ్ళులేని యేళ్ళు మంచి మృదువైన పచ్చికలేని వనములు, కాఁపరులగుగొల్లలు లేని యావులు, రాజులేని భూమి సమానములు.

కం. కనఁ దేరికిఁ గేతనమును, ననలునకుం బొగయుఁ జిహ్న ♦ మగు నారీతిన్
మనకును ధ్వజ మగుభూపతి, మనలోకము విడిచి చనె న♦మర్త్యులపురికిన్.

తేరికిన్=రథమునకు, కేతనము=ధ్వజము, అనలునకున్=అగ్నికి, చిహ్నము=గుఱుతు. అమర్త్యులపురికిన్=దేవతల నగరమునకు=స్వర్గమునకు.

తా త్ప ర్య ము.

రథమునకు ధ్వజము, అగ్నిహోత్రమునకుఁ బొగ గుర్తగునట్లు మనకునురతొ చిహ్నమగు రాజు మనలోకము విడిచి స్వర్గముఁ జేరెను.

కం. ధారిణి యరాజకముగా, నేరికి నెది సొంత మనుచు ♦ నెన్నఁగ రా దెం
దూరక జనులొక రొకరిన్, వారక మ్రింగుదురు మత్స్య♦వర్గముభంగిన్. ౧౭౨౯

తా త్ప ర్య ము.

భూమి యరాజకమైనప్పుడు బలవంతులది సొమ్ము గావున నిది నాసొంతమని యెవని జెప్పరాదు. చిన్నచేపలను పెద్దచేపలు మ్రింగునట్లు మనుష్యు లొకరి నొకరు చంపుదురు.

తే. భిన్నమర్యాదు లగుచు నా♦స్తిక్యమూని, నృపతిచే మున్ను శిక్షితుల్ ♦నీచజనులు
రాజు లేమిని జంకక ♦ తేజు మెఱసి, స్వప్రభావంబు వాఁగెదు♦వారు గా రె.౧౭౩౦

భిన్నమర్యాదులు= తెగిపోయినకట్టుబాటులుగలవారు, నాస్తిక్యము=దేవుఁడు లేఁడు పరములేదు అని.

తా త్ప ర్య ము.

శాస్త్రనిబంధనములను ద్రెంచినైచి దేవుఁడులేఁడు పరములేదని మాధ్యమిక బౌద్ధులవలెను, అవల పరిపూర్ణవాదులవలెను వాదించి యట్లు చేయుటకై ముందు శిక్షింపఁబడినవారగు నీచజనులు రాజులేనికారణమున దండించువాఁడు లేమిని సందేహింపక తమ ప్రభావంబు వదరుచుందురు. ఇది యిప్పుడు అనుభవసిద్ధము.

కం. పన్నుగ నిత్యము మేనికిఁ, గన్నులవలెఁ జన్మి రాజు • తా నెజనములకున్
సన్నుతధర్మము సత్యము,ల న్నిలుపుం జెడక బలక • లాయుతుఁ డగుచున్. ౧౭౩౧

బలకలాయుతుఁడు=దేహబలము శాస్త్రజ్ఞాన బలముగలవాఁడు.

తా త్ప ర్య ము.

కన్నులు దేహమునకు సరియైనమార్గముఁజూపి దుష్టమార్గమునుండి తొలఁగి పోవఁ బట్టుదలగాఁ జేయునట్లు రాజును బ్రజలకుఁ గన్నులవలెనై సాధుసమ్మతమైన ధర్మమును సత్యమును జెడకుండ దేహబలముతోను శాస్త్రబలముతోను గూడిన వాఁడై స్థాపించును.

కం. రాజే సత్యము ధర్మము, రాజే సత్కులజులకును • బ్రథితకులంబున్
రాజే తల్లియుఁ దండ్రియు, రాజే హితపథ్యకరుఁడు • ప్రజలకు నెల్లన్. ౧౭౩౨

ప్రథితకులము=ప్రసిద్ధికెక్కిన కులము, హితపథ్యకరుఁడు=హితము పథ్యము నైన దాని నిచ్చువాఁడు.

తా త్ప ర్య ము.

ప్రజలకందఱకు రాజేసత్యము, రాజులేనియెడ సత్యములేదు. అట్లే రాజు లేనియెడ ధర్మములేదు. కావున రాజే ధర్మము.

గొప్ప కులమునఁబుట్టినవారికి వారి కులమును రక్షించువాఁడు రాజే, తల్లి వలెఁ దండ్రివలెఁ బోషణధారణకర్త రాజే, హితము శ్రేయస్కరమునైన దానిని జేయువాఁడు రాజే.

కం. దండధరవిత్తనాథా, ఖండలవరుణులను మీఱుఁ • గడిమిని భూపా
ఖండలుఁడు మహితవృత్తి సు,మండితుఁడయి జగము లెల్ల • మన్నింపంగన్.

దండధర=యముని, విత్తనాథ = కుబేరుని, అఖండల=ఇంద్రుని, వరుణుని, పాపుల దండించుటయందు యముఁడు, ధనదత్వమునందుఁ గుబేరుఁడు పాలనమందు నింద్రుఁడు సదాచార నియమమునందు వరుణుఁడు ప్రసిద్ధులు. ఈనాలుగు గుణములు రాజునందుండును గావున వారిలో నొక్కొక్కనికంటె రాజే శ్రేష్ఠుఁడు. కడిమిని=పరాక్రమమందు, భూపాఖండలుఁడు = రాజశ్రేష్ఠుఁడు, మహిత సువృత్తి మండితుఁడయి=శ్లాఘనీయమైన నడవడియనుదానిచే నలంకరింపఁబడినవాఁడై.

తా త్ప ర్య ము.

రాజేంద్రుఁడు దక్షిణదిక్కున కధిపతియగు యముఁడు, నుత్తరదిక్కున కధిపతి యగు కుబేరుఁడు, తూర్పుదిక్కున కధిపతియగు నింద్రుఁడు, పశ్చిమదిక్కున కధిపతి యగు వరుణుఁడు చేయుకార్యములు దానొక్కఁడే పరాక్రమముచేఁ జేయుచు శ్లాఘనీయమైన నడవడియే యలంకారముగాఁ గలవాఁడై జగములు గౌరవింపఁగా లోకమును బాలించును.

కం. సాధువుల నసాధువులన్, తా నెఱవుఁ డీల విభజనంబు • సలుపనిచో న
య్యా! ధారిణీవలయమ్మున, మేధితతమమునమునింగి • మిడుకదె చెపుమా.

తా త్ప ర్య ము.

రాజొకఁడుండి వీరు సాధువులు కావునఁ బూజ్యులు. వీరసాధువులు కావున దండ్యులనని వేఱువేఱ విభజించి రక్షింపవలసినవారిని రక్షించి శిక్షింపవలసిన వారిని శిక్షింపకున్న పక్షమున భూచక్రమంతయు గాఢాంధకారమున మునిఁగి దుఃఖింపదా?

కం. జీవితుఁడై యుండఁగనే, భూవిభుఁడు త్వదీయవాక్య • మును మీఱమి పా
రావారము వేలనువలె, నీ వేళను జెప్ప నేల • హితసంకల్పా. ౧౭౩౫

జీవితుఁడై=బ్రదికియున్నవాఁడై, త్వదీయవాక్యమున్ = నీమాటను, పారావారము=సముద్రము, వేలను=చెలియలికట్టను, హితసంకల్పా = లోకహితముగోరువాఁడా!

తా త్ప ర్య ము

రాజు జీవించియున్న కాలమందే చెలియలికట్టను సముద్రమువలె నీయాజ్ఞను మీఱక వర్తించుచుంటిమి ఇఁక నిప్పుడేమి చెప్పవలయును. కావున లోకహితమాలోచించి రాజ్యమున కొక ప్రభువు నేర్పాటుచేయుము.

కం. నృపతి యొకఁ డుండఁ డేనియు, విపినముగన్ రాష్ట్ర మిదియు • విదితము నీకున్
నృపుఁగా దశరథుసుతు నీ,విపు డొనరించుట యె తగు ము • నీంద్రప్రవరా! ౧౭౩౬

మునీంద్రప్రవరా=మునీంద్రులలో శ్రేష్ఠుఁడా!

తా త్ప ర్య ము.

• రాజనువాఁ డొకఁడు లేకుండిన రాష్ట్రమడవియగును. ఇది నీకుఁ దెలిసిన విషయమే. కావున దశరథుని కుమారులలో నొకని రాజుగా నిర్ణయింపుము.

—• ౬౮-వ సర్గము. మంత్రిపురోహితులు భరతునకు దూతల నంపుట •—

చం. అనుడు వసిష్ఠుఁ డా యనఘు • లాడినవాక్యము లెల్ల నాదటన్
విని భరతుండుఁ దమ్ముఁడును • నెమ్మిని రాజగృహంబునందు సౌ
ఖ్యనిరతి నున్నవారు జవ • నాశ్వములం గొని దూత లిప్పుడే
చని వడిఁ దోడి తేవలయు • సాగదు నెయ్యది వారు లేనిచోన్. ౧౭౩౭

ఆదటన్=ఆదరముతో, తమ్ముఁడు=శత్రుఘ్నుఁడు, రాజగృహంబునందున్ = కేకయరాజపట్టణమందు, జవనాశ్వములన్ =వేగముగల గుఱ్ఱములను, వారు=భరతశత్రుఘ్నులు.

తా త్ప ర్య ము.

రాజకర్తలు మొదలగు సభ్యులీప్రకారము చెప్పఁగా నాపుణ్యాత్ములు చెప్పిన మాటలు విని వసిష్ఠుఁ డిట్లనియె. ఆర్యులారా! భరతుఁడు శత్రుఘ్నునితోడ మేనమామ పురమగు రాజగృహంబున సుఖముగ నున్నాఁడు. వారిరువురు లేక యేపని యెట్లుసాగును. కావున దూత లిప్పుడే వేగవంతములయిన గుఱ్ఱములపైఁ బోయి వారిని శీఘ్రముగఁ దోడుకొని రావలయును. భరతున కేకదా రాజు రాజ్యమిచ్చెను.

సీ. అగు నగు నన్న సి • ద్ధార్థ విజయు జయుం, డాశోక నందనా • ఖ్యాతిదూత
లను గాంచి మునిపల్కె • వినుఁడు క ర్తవ్యంబు, జవనాశ్వముల నెక్కి • చనుఁడు వేగ
రాజగృహాఖ్యపు • రంబును జేరంగ, నందుఁ గించిచ్ఛోక • మొంద కీరు
భరతునిఁ గనుఁగొని • గరిమ నాయాజ్ఞగాఁ, బలుకుఁడీ శోకంబు • నభుకు లేక

తే. క్షేమ మడిగిరి మంత్రివ • సిష్ఠు లేదొ, ముఖ్య మైనట్టిపని యుంట • మూ ర్తమైనఁ
దడవు సేయక రమ్మని • నుడివినా రటంచుఁ జెప్పుఁడు మఱి యేమి • యనఁగవలదు.

కించిచ్ఛోకము=కొంచెమైననుశోకము, అభుకు=జంకు భయము.    ౧౭౩౮

తా త్ప ర్య ము.

అని వసిష్ఠుఁడు చెప్పఁగా వారందఱు సరిసరి అదియేకదా రాజనియమనము. కావున నదే బాగని యంగీకరింపఁగా సిద్ధార్థుఁడు, విజయుఁడు, జయంతుఁడు, అశోకుఁడు, నందనుఁడు అను పేరుగల దూతలను (వీరామంత్రుల పేర్లుగల దూతలేకాని మంత్రులుగారు. మంత్రులు క్షేమ మడిగినట్లు క్రిందఁ జెప్పఁబడును) బిలిచి యిట్లనియె. మీరు చేయవలసినకార్యము చెప్పెద వినుఁడు, వేగవంతములైన గుఱ్ఱముల నెక్కి రాజగృహమను పేరుగల పురమందు శోకమనునది యెఱుఁగకయుండు భరతుని జూచి వసిష్ఠుఁ డిట్లాజ్ఞాపించెనని నా మాటగా మీరిట్లు చెప్పుఁడు. చెప్పుటకు భయపడవలదు. చెప్పుటయందు జంకనువలదు. రాజకుమారా! వసిష్ఠుఁడు లోనగు మంత్రులు మీ క్షేమమడిగిరి. ఏదో ముఖ్యమైన పనియుండుటచే నల్పకాలమైన జాగులేక రమ్మనినారు అనిమాత్రము చెప్పుఁడు. ఇంకేమియు మీరు చెప్పవలదు.

ఉ. చెప్పకుఁ డీర లాతనికి • సీతవిభుండు ప్రవాసి యౌట, మీ
యప్ప దివంబుఁ జేరె నని • నైనను, జేనికిఁ గైకపట్టి కిం
పొప్పగువస్త్రభూషణము • లుత్తమ మైనవి కొంచు నేఁగుఁడీ
తెప్పున, నన్ను వారికి వి • ధించి యొసంగినదారి బత్తెముల్.    ౧౭౩౯

ఈరలు=మీరు, ప్రవాసి=పరదేశవాసి అరణ్యముననుండుట అప్ప = తండ్రి, ఈశబ్దమునకు అక్కయనియు కొన్నిమండలముల నర్థముగలదు.

తా త్ప ర్య ము.

మీరు భరతునకు శ్రీరాముఁ డరణ్యమునకుఁబోయిన వార్తగాని మీతండ్రి మరణించెననికాని చెప్పవలదు ఆయన కిచ్చుట కింపైన శ్రేష్ఠమైన వస్త్రములు భూషణములు కొనిపొండు. అని వారికి దారిబత్తెమునకు వలసినది యీయఁగా.

సీ. కైకొని వారు స్వా • గారంబులకు నేఁగి, సమ్మతాశ్వములను • నరగ నెక్కి
పయన మై వలసిన • వస్తువు ల్గొని వసి, ష్ఠున కెఱింగించి చ • య్యనను జనుచుఁ
నపరతాలాఖ్య మహా • నద్రికిఁ బడమర,యును ప్రలంబాద్రికి • నుత్తరంబు
నగుచు నీ రెంటిమ • ధ్యమునఁ బారెడిమాలి, నీనదిబడి నేగి • నెఱిగ హ స్తి

తే. నాపురముపొంత జాహ్నవీ•నదిని దాఁటి
యవలఁ బశ్చిమముఖముగ•నరిగి జాంగ
లంబుత్రోవను బాంచాల•కంబుఁ జొచ్చి
కొలఁకులను నదులను గనుం•గొనుచువారు. ౧౭౮౦

స్వాగారంబులకున్ = తమ యిండ్లకు, సమ్మతాశ్వములన్ = వేగముగఁ బోఁగలవి దూరప్రయాణముగాసి సహింపఁగలవియని వారికి సమ్మతమైన గుఱ్ఱములను, నెఱిగన్=చక్కఁగ.

తా త్ప ర్య ము.

దారిబత్తెములను దీసికొని భార్యలకుఁ జెప్పుటకు, గుఱ్ఱములను దీసికొనుటకునై తమ యిండ్లకుఁబోయి వేగముగఁ బోఁగలవి దూరపుఁ బ్రయాణముగాసి సహింపఁగలవని వారికి సమ్మతమైన గుఱ్ఱములనెక్కి పయాణమై కావలసిన వస్తువులు తీసికొని పోవుచున్నారమని వసిష్ఠున కెఱిఁగించి శీఘ్రముగఁబోవుచు నపరతాలమను కొండకుఁ బడమర ప్రలంబాద్రికి నుత్తరంబునై వాయువ్యమూలగ నీ రెండు కొండలనడుమఁ బ్రవహించు మాలినీనది వెంబడి చక్కఁగఁబోయి హస్తినాపురమునొద్ద గంగదాఁటి యచ్చటనుండి పశ్చిమాభిముఖులై కురుదేశములోని భాగమగు జాంగలముత్రోవను బాంచాలదేశంబుఁ బ్రవేశించి సరస్సును చూచుచు.

సీ. చని చని కార్యవ•శంబున ద్రుతగతిఁ, దతజ•నాకుల శర•దండ యనెడి
తటినిఁ దరించుచుఁ • దత్పశ్చిమతటస్థ,సత్యోపయాచన•శాఖిజ వెంటఁగి
చని కుళింగపురంబుఁ • గని యభికాళ మన్, గ్రామంబు దాఁటి త•త్ప్రాంతలసిత
బోధిభవన మను•భూధరంబును జేరి, యాజపూర్వమహీధ•వానుభూత

తే. మిక్షుమతిఁ గాంచి యందు దో•సెడు జలంబుఁ
గ్రోలి తప మున్నపుణ్యావి•ప్రాళిఁ గాంచి
యంత బాహ్లిక దేశమ•ధ్యంబుఁదాఁటి
పోయి యవల సుదామాఖ్య•భూమిధరము. ౧౭౮౧

తా త్ప ర్య ము.

కార్యవశమున నతిశీఘ్రముగఁ బ్రయాణముపోవుచు జనులచే నిండియుండు శరదండ యను నదినిదాఁటి దానికిఁ బడమటనున్న నికూలమను పేరుగల సత్యోపయాచనమగు (కోరిన కోరికలిచ్చునది) వృక్షమునకు నమస్కరించి కుళింగపురము ప్రవేశించి యభికాళమను గ్రామముదాఁటి యాప్రాంతమందుండు బోధి భవనమను పేరుగల పర్వతము సమీపించి దశరథునకుఁ బూర్వపురాజు లనుభవించిన యిక్షుమతీనదిఁగాంచియందొక దోసెడు నీళ్ళుద్రావి (ఎక్కువగఁద్రావి ప్రయాణముచేసినఁ గడుపునొప్పి వచ్చును) యందుఁ దపము చేయుచున్న పుణ్యవంతులైన బ్రాహ్మణులఁ

జూచి యావల బాహ్లీకదేశము నడుమదూఱిపోయి యావలసుదామ మను కొండను నందు.

సీ. విష్ణుపదంబును•వీక్షించుచు విపాశ, శాల్మలీతరువును • జూరువాపి
　కానదీపల్వల•కమ్రతటాకాళిఁ, దిలకించుచును మృగ•ద్విపమృగేంద్ర
　శార్దూలభీకర•సత్త్వాళి దృష్టించి, చని చని యావల • శ్రాంతతురగు
　లైనదూతలు దూర•యానంబు నడచి శీఘ్రంబునఁ గని గిరి•వ్రజపురంబు

తే. భర్తకును బ్రియ మొదవింప•భర్తృవంశ,సుప్రతిష్ఠకుఁ గులమోహ•సుమతులైన
　దూత లల్లంత రేయి సం•ప్రీతిఁబురిని, జొచ్చి నిశ యెల్లనొకచోటఁ • బుచ్చిరంద. ౧౭౪౨

తాత్పర్యము

విష్ణుపాదములుండుటచే విష్ణుపదమును పేరుగాంచిన క్షేత్రమును జూచుచు, వసిష్ఠుఁడు పుత్రశోకమున మరణింపఁగోరి కట్లుకట్టుకొని తనయందు దుముకఁగా నాయనకట్లను దొలఁగించి తీరమునఁ జేర్చుటచే విపాశయను పేరుగాంచిన నదిని బూరుగుచెట్టును మనోహరములైన బావులు నదులు చిన్న సరస్సులు నిండైన చెఱువులు కనుఁగొనుచు, జింకలు, ఏనుఁగులు, సింహములను బెద్ద పులులను మఱియు భయంకరజంతువులను జూచి పోయిపోయి యచటఁ జాలదూరము నడచుటచే డస్సిన గుఱ్ఱములుగల దూతలు చాల దూరము నడచి త్వరగా గిరివ్రజపురంబును జూచిరి. (గిరివ్రజ మనునది కేకయరాజపట్టణమునకు మఱియొక పేరు. ఇదియె రాజగృహమని ముందు చెప్పఁబడెను.)

తమభర్తయగు దశరథునకు శీఘ్రముగఁ బ్రేతకార్యములు చేయించి పరలోకమును గలిగించి యాకారణమునఁ బ్రియము కలిగించుటకు నిక్ష్వాకువంశమును దృఢపఱుచుటకు, ఆ వంశమును భరతుని మూలమున రక్షించుటకు, బుద్ధిమంతులైన దూతలు కొంత రాత్రి గడచినపిమ్మటఁ బురంబు బ్రవేశించి రాత్రియంతయు నొకచోటఁ గడపిరి.

—• ౬౯-వ సర్గము. భరతుఁడు దుస్స్వప్నముఁ గని పరితపించుట •—

కం. ఏరాత్రియందు దూతలు, చేరిరి తత్పురము నాని•శీథినియందే
　క్రూరస్వప్నము కైకకుమారుండును గాంచి బెంగుల•మల్లడిగొనియెన్. ౧౭౪౩

తత్పురము=ఆ గిరివ్రజపురము. నిశీథిని=రాత్రియందు, క్రూరస్వప్నము=చెడుకల, మల్లడిగొనియెన్=పరితపించెను.

తాత్పర్యము.

ఏ రాత్రియందు దూతలు భరతుఁ డున్ననగరముఁ బ్రవేశించిరో యా రాత్రియందే కైక కుమారుఁడు ప్రభాతవేళఁ జెడ్డకలఁగాంచి బెంగుల సంతాపించెను.

కం. వేకువన లేచి తత్స్మృతి, వ్యాకులుఁడై యున్న నిష్ట•వాదులు మిత్రుల్
శోక మణంపఁగ సభలోఁ, బోకల నెన్నేని యుబుసు•పోకకుఁ బోవన్. ౧౬౨౨

వేకువన=ఉదయముకాఁగానే, తత్స్మృతిన్ =ఆ స్వప్నముజ్ఞప్తికివచ్చుటచేత వ్యాకులుఁడై = కలఁతనొందినవాఁడై, ఇష్టవాదులు=ఇష్టమైన మాటలుచెప్పువారు, మిత్రులు=స్నేహితులు, ఉబుసుపోకకున్ =ప్రొద్దుపోవుటకు.

తాత్పర్యము.

ఉదయముకాఁగానే భరతుఁడు లేచి రాత్రి గన్నకల స్మృతికిరాఁగా కలవర పడినవాఁడై యుండఁగా నింపైన వాక్కులు చెప్పు స్నేహితు లాయనదుఃఖ మణఁచుటకుఁగాను సభలోఁ బ్రొద్దుపోవుటకు ముచ్చటల నెన్నేని యేమేమో చెప్పిరి.

కం. కొందఱు కథలు వచించుచుఁ, గొందఱు హాస్యంబు లాడి • కొందఱు నాట్యా
దిం దిలకింపఁగఁ జేసియుఁ, గొందఱు వాద్యముల నెఱపి • కొఱ గా కున్నన్. ౧౬౨౩

తాత్పర్యము.

కొందఱు వింత కథలు చెప్పిరి. కొందఱు హాస్యము లాడిరి. కొందఱు నాట్యములాడి చూపిరి. కొందఱు వాద్యముల వాయించిరి. అన్నియు వ్యర్థము లాయెను. ఆయనకుందు దీఱదాయెను.

చం. ప్రియసఖుఁ డొద్దకుం జని సు•హృజ్జను లందఱుఁ జుట్టి కొల్వ నే
లి యెద ముదంబుఁ గావే? యని • లాలన వేఁడిన నాతఁ డిట్లనున్
నయమున మిత్రుఁడా! వినుము • నాయతిదీనతకారణంబు ని
శ్చయ మిది భీషణంపుఁగల • సంకటపెట్టెడి నేమి సేయుదున్. ౧౬౨౪

ఎదన్ = హృదయమందు, ముదంబు = సంతోషము, లాలనన్=బుజ్జగింపు మాటలు, అతిదీనతన్ = మిగుల దుఃఖపాటుయొక్క, కారణంబు = హేతువు, భీషణంపుఁగల=భయంకరమైన స్వప్నము.

తాత్పర్యము.

ముఖ్యస్నేహితుఁడు భరతు సమీపమునకుఁబోయి తక్కిన స్నేహితు లందఱుఁజుట్టి సేవింపఁగా రాజకుమారా! యేల నీకు మనస్సున సంతోషములేదు అని బుజ్జగింపుమాటలు నడుగఁగా నాయన నయముతో నిట్లనియెను. మిత్రుఁడా! నా మిక్కిలి దుఃఖమునకు హేతువు చెప్పెద వినుము. ఈ కల నిశ్చయము. ఇది భయంకరమైన కలయగుటచే మనస్సును జాల సంకటపెట్టుచున్నది. నేనేమి చేయుదును.

సీ. కలలోన మాతండ్రి • మలినుఁడై ముక్తకేశుం డయి శైలమ్ము•నుండి పేడ
మడువులోఁ గూలిన•మాడ్కిని దా నందుఁ, గప్పగంతులతోడఁ • గడఁగి నవ్వు
కొనుచు దోసిటిలోనఁ • గొని తైల మానిన,కరణిఁ దిలోదన•గ్రాసయుక్తిఁ
దలక్రిందుగా నుండి•తైలంబు మెయినిండఁ, బూసి తానా తైల•మునను మునుఁగఁ

తే. గంటి శుష్కించి పోయె సా♦గరము లెల్లఁ
గువలయాప్తుండు ధరణిపైఁ ♦ గూలఁబడియెఁ
జిమ్మచీఁకటి ముంచె జ♦గమ్ము నెల్లఁ
బట్టపేనుఁగుదంతంబు ♦ భగ్నపడియె. ౧౭౪౭

మలినుఁడై = మాసిన దేహముగలవాఁడై, ముక్తకేశుండయి=విరియఁబోసికొనిన వెండ్రుకలుకలవాఁడై, శైలమ్మునుండి=పర్వతమునుండి, అనివశరణిన్=త్రాగినట్లు, తిలోదన(గ్రాసయు)క్తిన్=నూవులయన్నముతోడ, మెయినిండన్=దేహమునిండ, శుష్కించి=ఎండి, కువలయాప్తుఁడు = చంద్రుఁడు, చిమ్మచీఁకటి=గాఢాంధకారము, భగ్నపడియెన్=విఱిగెను. తాత్పర్యము

మాసినదేహముఁగలవాఁడై తల విరియఁబోసికొని కొండమీఁదనుండి తాను పేడమడువులోనికి దుమికినట్లును అందులోఁ గప్పవలె గంతులు పెట్టుచు నవ్వుచు దోసిటిలో నూనెగొని నూనె యన్నముఁ దిని త్రాగినట్లును దల(క్రిం)దికిఁ గాళ్ళుపైకి నుంచి నూనె దేహమునిండఁ బూసికొని తా నా నూనెయందు మునిఁగినట్లును సముద్రము లెండినట్లును జంద్రుఁడు నేలపైఁబడినట్లును గాఢాంధకారము లోకమునిండ వ్యాపించినట్లును, బట్టపేనుఁగు దంతము విఱిగినట్లును గలగంటిని.

ఆ. అగ్ని చల్లపడియె ♦ నవని బ్రద్దలు వాఱె, నెండిపోయెఁ జెట్లు ♦ లెల్లయెడలఁ
బొగయు చుండె శైల♦ములు; నల్లయినుప పీఠంబుమీఁద నల్ల♦డంబు గలుగు.
• బ్రద్దలువాఱెన్=పగుళ్ళు వోయెను, డంబు=కాంతి.

తాత్పర్యము.

నిప్పు చల్లనయ్యెను. భూమి పగుళ్ళువాఱెను. చెట్లులన్నియు నెండిపోయెను. కొండలు పొగరాఁజుచుండెను నల్లయినుపపీఁటమీఁద నల్లకాంతిగల.

తే. అంబరముఁ దాల్చి కూర్చున్న ♦ యాజి దన్నుఁ, గృష్ణపింగళ లంగనల్ ♦ గేలినవ్వు
చుండ నెఱ్ఱనిపూవుల♦దండ లమర, నఖరరథమున దక్షిణా♦శకును జనియె. ౧౭౪౮

అంబరము=వస్త్రము, అజి=దశరథుఁడు, కృష్ణపింగళుల్=నల్లనివారుపచ్చనివారు, నఖరరథమున్ = గాడిదలఁగట్టిన తేరియందు, దక్షిణాశకున్ = దక్షిణ దిక్కునకు, పూర్వపద్యమందలి కడపటి కలుగు అనునది ఉదంత తద్ధర్మార్థక విశేషణము. దానికి అచ్చు అగు 'అ' పరమైనపుడు నుగాగము నిత్యముగా వచ్చి నంబరము కావలయును. అయినను పద్యాంతమగుటచే సంధి విడఁదీసి వ్రాయఁబడియె. వాక్యాంతమున సంధి లేమి కోషముగాదని పెద్దలందురు. ప్రయోగములును గలవు.

తాత్పర్యము.

వస్త్రమునుధరించి కూర్చున్న దశరథుఁడు తన్ను నల్లని పచ్చని స్త్రీలు పరిహసించి నవ్వుచుండ నెఱ్ఱనిపూవుల దండలు ధరించి గాడిదలుకట్టిన తేరిపై దక్షిణ దిక్కునకుఁ బోయెను.

తే. రక్తవాసిని యొక్కర్తు • రాజుఁ జూచి నవ్వుచుండెను; వికృతాన•నంబు గలుగు
రాక్షసియొకర్తు నాతండ్రిఁ•బ్రసభమునను, లాగుచుండఁగఁ గంటి నీ•లాగు కలను.

రక్తవాసిని = ఎఱ్ఱనివస్త్రము ధరించినది, వికృతాననంబు =వికారపుముఖము ప్రసభమునన్=బలాత్కారముగ, ఈలాగు=ఈవిధముగ.

తాత్పర్యము.

ఎఱ్ఱగుడ్డకట్టుకొన్నయొకస్త్రీరాజునుజూచి నవ్వుచుండెను. వికారపు ముఖము గల యొకరాక్షసి నాతండ్రిని బలాత్కారముగ లాగుచుండెను. ఇటువంటి కలగంటిని.

కం. ఈరాత్రి యిట్టిభయదా, కారపుఁగలఁ గంటి దీనఁ • గాకుత్స్థునకో
శ్రీరామునకో నాకో, యారయ లక్ష్మణునకో ల•యంబు ఘటిల్లున్. ౧౭౪౧

ఈరాత్రి = ఇప్పుడు కడచినరాత్రి, భయదాకారపుఁగల = భయంకరమైన స్వరూపముగల కల, దీనన్=దీనిచే, కాకుత్స్థునకో=దశరథునకో, లయంబు = మరణము, ఘటిల్లున్=కలుగును.

తాత్పర్యము.

ఈ కడచినరాత్రి యిటువంటి భయంకరమైన కలగంటిని. ఈ కల ఫలమేమందురా. దశరథుఁడో రాముఁడో నేనో లక్ష్మణుండో మరణించుట కలుగును.

కం. ఖరయుక్తవాహనంబుల, నరుఁ డెవ్వం డేగుఁ గలను • నాతిచిరముగాఁ
బరఁగును నాతని చితిపై, నురు వగుధూమములు దీన• నుల్లం బనగనెన్. ౧౭౪౨

ఖరయుక్త వాహనంబులన్=గాడిదలఁగట్టినవాహనములపై, నాతిచిరముగాన్= మిక్కిలి సమీపకాలమందే, న+అతిచిరము = అనతి చిరము కావలసియుండినను నైకము, నారాయణుఁడు లోనగు నిట్టి శబ్దములుగలవు ద్వితీయపాదమున నజ్ యతి.

ఈ రామాయణమున దశరథ-భరత-త్రిజటలు స్వప్నములు గన్నట్లు చెప్పఁబడెను. ముప్పఁస స్వప్నములు సత్యములే యయ్యెను ఈ విషయము శాస్త్రేతిహాసములందును విపులముగఁ జెప్పఁబడెను. కావున స్వప్నములు సత్యములేకాని యసత్యములుగావు.

రోగేధాతు వికారేవా దివాస్వప్నో నిరర్థక, స్వర శాస్త్రము. రోగములవలన ధాతువికారములవలన వచ్చుకలలు పగటికలలు వ్యర్థములు.

వాతకం పిత్తకంచైవ చింతితంచానువర్జయేత్ ॥బృహస్పతి॥ వాతపిత్తములవలన వచ్చు కలలు తానాలోచించుచుండినవే వచ్చుకలలు వదలవలయును.

స్వప్న కాలము

స్వప్నాస్తు ప్రథమేయామే సంవత్సర విపాకినః
ద్వితీయే చాష్టభిర్మాసై స్త్రిభిర్మాసై స్తృతీయకే
చతుర్థయామే యస్స్వప్నో మాసేన ఫలదః స్మృతః
అరుణోదయ వేళాయాం సద్యఏవ ఫలంలభేత్

శ్లో॥ విసర్జన వేళాయాం దశాహేన ఫలం భవేత్
భవేదేవంచ సుస్వప్నే దుస్స్వప్నేతు తదర్థకమ్
సుస్వప్న దర్శనాదూర్ధ్వం నిద్రాభు ర్నపునర్భవేత్
దుస్స్వప్న దర్శనాదూర్ధ్వం శుద్ధశాంతిం సమాచరేత్
అనుక్త్వాచ పునర్నిద్రాం లభేతద్దోష శాంతయే
సుస్వప్నం బ్రాహ్మణేభ్యశ్చ నివేద్యాశిష మాప్నుయాత్
నపున శ్శయనంకుర్యా న్న రాత్రౌ తన్నివేదయేత్॥

మొదటి జామునవచ్చిన కల సంవత్సరమునకు ఫలించును. రెండవ జామున వచ్చినది ఎనిమిది నెలలలో, మూఁడవ జామునవచ్చినది మూఁడు నెలలలో, నాలుగవ జామున వచ్చినది నెలలో సూర్యోదయవేళ వచ్చినది వెంటనేఫలించును. ఆవులకు దూడలు విడుచువేళ వచ్చినకల పది దినములలో ఫలించును. ఇట్లు మంచి కలలు. చెడు కలలు వీనిలో సగము మంచి కలలు వచ్చినతరువాత మరల నిద్రపోరాదు. ఉదయముకాఁగానే బ్రాహ్మణులకుఁ జెప్పి వారి యాశీర్వచనము పొందవలయును. చెడుకలలు వచ్చినతరువాత నిద్రింపవలయును. శుద్ధుఁడై శాంతి గావింపవలయును. స్వప్నవిషయ విచారము సుందరకాండమునఁ ద్రిజటాస్వప్నఘట్టమునఁ జూచునది. తక్కిన విషయములందు వ్రాయఁబడును.

తాత్పర్యము.

గాడిదలఁగట్టిన వాహనములపైఁ గల యం దెవ్వఁడు పోవునో శీఘ్రముగానే వాని చితిమీఁద గొప్ప ధూమములు వ్యాపించును. దానివలన హృదయముపగిలెను.

చం. తడఁబడె మాట, కుత్తుకయుఁ • దద్దయు నెండెఁ, జిత్తమున్ననో
సుడివడఁ జొచ్చె, నెట్టిగడు•సుందనపున్నుడి వింట గల్గునో.
యుడుకుట మానసంబు మొగ • మొప్పదు మీమొడఁ బ్రీతిఁ బల్క, నీ
యెడ భయకారణం బెఱుఁగ • నత్తినభీతిని దల్లడిల్లెదన్. ౧౭౩

కుత్తుక=గొంతు, తద్దయు=మిక్కిలి, సుడివడఁజొచ్చును=సుడి తిరిగినట్లుతిరుగ నారంభించెను, గడుసుందనపున్నుడి=కఠినవాక్యము.

తాత్పర్యము.

మాటలు తడఁబడుచున్నవి. గొంతు మిక్కిలి యెండిపోయెను. మనస్సు సుడిగుండములోఁబడిన దానివలె సుళ్ళుబెట్టుచున్నది. స్థైర్యములేదు. ఎటువంటి పరుషవాక్యము విందునోనేమో! మనస్సుడుకుటచేత మీతో సంతోషముగ మాట లాడుటకు ముఖము చెల్లలేదు. భయకారణమేమో యిప్పుడు నాకుఁ దెలియదు. భయముచే మనస్సు తల్లడిల్లుచున్నది.

కం. ఏలొకొ నాస్వరయోగము, దూలెన్నా కాంతి మాసె • దూపిలె నెదయున్
వాలాయము కారణ మే,మొ లవమును దోఁప దయ్యో•నుల్లంబునకున్. ౧౭౧౮

స్వరయోగము =స్వభావమైనకంఠధ్వనితోడికూడిన, తూలెన్=చెడిపోయెను. ఎద=హృదయము, దూపిలెన్=శోకించుచున్నది. వాలాయము = నిర్బంధము, లవమును=కొంచెమైనను.

తాత్పర్యము.

స్వభావమైన నాకంఠస్వరమేమి కారణమో చెడినది. నా కాంతియు మలినమైనది. మనస్సా యప్రయత్నముగ సంతాపించుచున్నది. కారణమేమో కొంచెమైనను మనస్సునకుఁ దోఁచినదికాదు.

కం. మును పెన్నఁ డెఱుంగనియీ, పెనుఁజెడుకల వివిధగతులఁ • బీడించుటచే
ననుఁగుంజెలికాఁడా! నా, జనకున కేమో యటంచు • సంతాపింతున్. ౧౭౧౯

తాత్పర్యము.

ఇంతకుఁ బూర్వమెన్నఁడు రాని యిటువంటి యీ పెద్ద చెడ్డ కల నన్ను నానావిధములఁ బీడించుటచేఁ బ్రేమగల మిత్రుఁడా! నా జనకునకేమి కీడు మూఁడెనో యని సంతాపపడుచున్నాను.

ఈదుస్స్వప్నఘట్టమునందు "అథస్వప్నే పురుషంకృష్ణం కృష్ణదంతం పశ్యతి ఖరైర్యా" యనుశ్రుతి వివరింపఁబడెను. మఱియు మేలుకొన్న కాలమందు మనమును కొన్న విషయమే కలలో వచ్చునేని యది నిష్ప్రయోజనము. ఫలము కలగన్న వానికో వాని సమీపబంధువులకో కలుగుననియు నందు వివరింపఁబడెను.

కం. అని తనస్వప్న చరిత్రము, వినిపించుచు మిత్రులకును • వేదుఱు గొనుచున్
జనకునిఁ దలఁచుచుఁ జింతా, వననిధి మునుఁగుచు నతండు • వ్యథపడుచుండన్.

తాత్పర్యము.

ఈప్రకారము తన కల విధమును స్నేహితులకు వినిపించుచుఁ బిచ్చియెత్తిన వానివలెనగుచుఁ దండ్రిని స్మరించుచుఁ జింతాసముద్రమునందు మునుఁగుచు నతఁడు బాధపడుచుండఁగా.

—• ౭౦ వ సర్గము. రాజదూతలు భరతునితో సంభాషించుట •—

సీ. తత్సమయమున దూ•తలు వచ్చి నృపుచేత, నృపపుత్రుచేత న•ర్చితులు నగుచు
క్షితిపతిపాదముల్ • చే నంటి భరతునఁ, గని యిట్టు లనిరి యో•త్కృష్టశీల
మీ సేమ మడిగిరి • మీపురోహితమంత్రు, లెల్లరుఁ బయనింపు • మింక వేగ
యాత్యయికంబు కా•ర్యంబు నీకొనరింపఁ,దగిన దున్నది యట • నగలు వస్త్ర
తే. ములనొసంగిరి నీకయి • తొలుత నిమ్ము, పిదప వింశతికోటులు • పృథ్వీపతికి
మేనమామకుఁ బదికోట్లు • నా నతండు, వానిఁ గైకొని యిట్లని • వారి నడిగె.

అర్చితులు=గౌరవింపఁబడినవారు, త్వామ్కర్త్ర = రాజా, అత్యయికంబు = మిక్కిలి యవశ్యమైనది.

తా త్ప ర్య ము.

ఆసమయమందే దూతలు వచ్చి కేకయరాజుచేతను రాజకుమారుచేతను, గౌరవింపఁబడినవారై రాజు పాదములను దమ చేతులతోఁ దాఁకి భరతునిఁ జూచి యిట్లనిరి. రాజా! మీ పురోహితులు మంత్రులు నందఱు మీ సేమ మడిగిరి. ఇఁక వేగముగఁ బ్రయాణము సేయుము. అందు నీవు చేయవలసిన మిక్కిలి యనివార్య కార్యమున్నది. ఆభరణములు వస్త్రములు నీ కిమ్మని యిచ్చిరి. వీనిలో మొదట నిఱువదికోటులు రాజుగారి కిమ్ము. మీ మేనమామకుఁ బదికోట్లిమ్ము. అనిన భరతుఁడు వానిని గైకొని వారితో నిట్లనియె.

రాజుతో సమానముగా రాజపుత్రునకు నిచ్చిన నది బహుమాన మనిపించు కొనదు. కావునఁ బెద్దపిన్నల తారతమ్య మెంచి యియ్యఁబడెను.

సీ. మాతండ్రి దశరథ•మహిపతి కుశలియే, సౌఖ్యమా శ్రీరామ•చంద్రునకును
నారోగ్యవంతుఁ డే•యనఘుఁడు సౌమిత్రి, సేమమే మానిన•సిద్ధునకును
భద్రమే శ్రీరామ•భద్రునిమాతకు, నార్య ధర్మజ్ఞ ధ•ర్మైకనిరత
కామోదమేకదా•యతి ధర్మ మతియైన, లక్ష్మణుజననికి • లలితశీల

తే. కాత్మకామ సదాచండి • యతులకోప, శీలయును బ్రాజ్ఞమానిని • చెనఁటినాదు
తల్లికైకవ్యాధిలేదుక•దా మఱేమి, పలికె మీతోడ మీరిట•వచ్చునపుడు. ౧౭౫౮

ఆర్య=పెద్దతల్లి కావున,పూజ్యురాలు ధర్మజ్ఞ=ధర్మము తెలిసినది, ధర్మైకనిర తకున్=ధర్మము ననుష్ఠించుటయందే ప్రీతిగలదియగు కౌసల్యకు, ఆమోదమేకదా = సంతోషమేకదా, అతిధర్మమతి=మిక్కిలి ధర్మముతోఁగూడిన మనస్సుగలది, లలిత శీలకున్=మనోహరమైన నడవడిగలదానికి, ఆత్మకామ=తనలాభమె కోరునది, సదా చండి = ఎప్పుడు క్రూరస్వభావముగలది, అతులకోపశీల = అసమానమైన కోపము తోఁగూడిన స్వభావముగలది, ప్రాజ్ఞమానిని=తన్నుఁదానే పండితురాలనని తలఁచు నది,చెనఁటి=దుష్టురాలు, వ్యాధిలేదుకదా=రోగములేదుకదా. కౌసల్యకు భద్రమా సుమిత్ర కామోదమా యని యడిగి కైకకు రోగము లేదుకదా యని యడుగుటచే నామెకు రోగమువచ్చిననే లోకమునకు క్షేమమని యప్పుడే చేష్ట చేయకయుండునని భరతుని యభిప్రాయమని తోఁచుచున్నది.

తనకుఁ జెడ్డకలవచ్చుట, దాని ననుసరించి దూతలు వచ్చి తీవరించుట, తన తల్లిగుణము. తానే వచ్చి చేయవలసిన యవశ్యకార్యమున్నదని దూతలు చెప్పుట యివి యన్ని యాలోచించినఁ దనతల్లి యేదో గొంప కవర్థము తెచ్చిపెట్టినదని అది తనకుఁదప్ప నితరులకుఁ జక్కఁజేయ సాధ్యముకానిదగుటచేఁ దనకుఁ జెప్పి పంపిరని భరతుఁడు తలఁచెను.

కౌసల్యా సుమిత్రులకంటె గైక చిన్నది. కావున వారి యిరువుర క్షేమ మడిగినపిమ్మటఁ గైక క్షేమ మడిగెను కైక తక్కిన వారినిఁబట్టి వడిమిది కావున మధ్యమాంబయని యరణ్యకాండమునఁ జెప్పఁబడెను, నతేంబా మధ్యమాతాత గర్హితవ్యా కదాచన, యని రాముఁడు లక్ష్మణునితో ననును.

తాత్పర్యము.

దూతలారా! మాతండ్రి దశరథమహారాజగారు కుశలముతో నున్నారా? శ్రీరామచంద్రునకు సుఖమా? లక్ష్మణుఁ డారోగ్యవంతుఁడేకదా? వసిష్ఠునకు క్షేమమా? పూజ్యురాలును ధర్మము తెలిసినదియు ధర్మమాచరించుటయందేమిగులఁ బ్రీతిగలదియునగు కౌసల్యాదేవికి భద్రమా? మిగుల ధర్మమతియు మనోహరమైన స్వభావముగల సుమిత్రాదేవి సంతోషముతో నున్నదా? తన లాభమే కోరునదియు మూర్ఖురాలగుటచేఁ గ్రూరయును మిగులఁ గోపస్వభావముగలదియు, జ్ఞానము శూన్యమైనను, దన్నుఁ దానొక పండితురాలని తలఁచునదియు, దుష్టురాలగు నా తల్లి కేరోగములేదుకదా? ఆమె మీరిచ్చటికి వచ్చునపుడు మీతో నేమి చెప్పెను.

చం. అనుడును దూత లెంతో వినయంబున నాడిరి మీర లిప్డు కో
రినమనవారికిన్ సుఖమె ♦ శ్రీసతి పద్మ వరించు గాత ని
న్ననఘు గుణాఢ్య! యేల యిఁక ♦ నాలము, వే పయనింపు మన్న నే
జనపతికిన్ వచించి యిడె ♦ చయ్యన వచ్చెద నంచుఁ బల్కుచున్. ౧౭౫

ఎంతో=మిక్కిలి, మీరలిప్డుకోరిన మనవారికిన్ సుఖమె = (౧) మీరు కోరిన మనవారలందఱు సుఖులుగానే యున్నారని యొక యర్థము. (౨) రెండవ యర్థంబున వ్యతిరేకార్థక బోధక ప్రశ్నార్థకము. నీవు కోరినవారికిని సుఖమా? కొంప కూలి యేడ్చుచుండ సుఖమెందుండి వచ్చునని భావము శ్రీసతి=లక్ష్మీదేవి, పద్మ = చేతియందుఁ బద్మముగలది, పద్మము=ప్రపంచచిహ్నము ప్రపంచమందలి జీవకోటి స్థితి ప్రవృత్తులామె కరగతములని యర్థము. ఆకారణముచేతనే లక్ష్మీదేవి రూపములు విగ్రహములు దీర్చునపు డామె యొడమచేతఁ గమలముంతురు. లోకేశ్వరయామెయెకదా? ఇట్లు చెప్పుటచే నీకు రాజ్యపట్టాభిషేకము కాఁబోవునని సూచితము. ఇది వసిష్ఠు నాజ్ఞప్రకారము బహిరంగముగఁ జెప్పరాదుగదా? ఈ కారణముచేతనే ౧౭౫-వ పద్యమందు శ్లోకశ్రతయని బోధించిరి. అనఘున్ = ఏదోషమెఱుఁగని నిన్ను. గుణాఢ్య = ప్రభువుగా నుండువాని కుండవలసిన గుణములు కలవాఁడా? ఆలము=ఉపేక్ష, పయనింపుము=ప్రయాణముచేయుము.

తాత్పర్యము.

అని యీ ప్రకారము భరతుఁడు ప్రశ్నింపఁగా నాలస్యము చేసిన సందేహించునని వెంటనే తమ భావము బయటపడకుండునట్లు మిక్కిలి వినయముతో నిట్లు చెప్పిరి. మీరు కోరినవారికందఱకు సుఖము. నిన్ను దోషరహితుని సాధుగుణా

ధ్యుని బద్మహస్తయైన లక్ష్మీదేవి వరించునుగాక. ఇంక నేల జాగుచేసెదవు? శీఘ్రముగ లెమ్ము. ప్రయాణము చేయుము. అని చెప్పఁగా రాజుగారికిఁ జెప్పి శీఘ్రముగా వచ్చెదనని చెప్పుచు.

చం. భరతుఁడు తాతఁ గన్గొని నృ♦పాల యయోధ్యకుఁ బోయి వచ్చెదన్
దొరపడు చున్నవార లిదె ♦ దూతలు మీ రెపు డిచ్చయించినన్
సరగున వచ్చెద నని ♦ సమ్మతిఁ జెంది యతండు నాయనా!
గురులఁ బురోధ మంత్రులను ♦ గూరిమి సేమపుమాట లాడుమీ. ౧౭౦

సరగునన్ = శీఘ్రముగ, భరతునియొద్దకు దూతలు వచ్చిరని విని యాయన యున్నచోటికిఁ గేకయరాజు యుధాజిత్తు వచ్చిరనికాని భరతుఁడే వారికిని నాఁడు వారికిని జెప్ప వారి యిండ్లకుఁ బోయెననికాని గ్రహింపవలెను.

తాత్పర్యము.

భరతుఁడు తాతయగు కేకయరాజును జూచి రాజా! యయోధ్యకుఁ బోయి వచ్చెదను దూతలు తీవరించుచున్నారు. మీరెప్పుడు కోరిన నప్పుడు త్వరగా వచ్చెదను. అనిన నా రాజు సమ్మతించి నాయనా గురువులను బురోహితుని మంత్రులను ప్రేమతో సేమ మడిగితినని చెప్పుము.

కం. రామునకును లక్ష్మణునకు, ధీమహితద్విజుల కెల్లఁ ♦ దెలుపుము కుశలం
బీమహితకంబళాది,స్తోమము వారలకు నెల్ల ♦ సొంపుగ నిమ్మా. ౧౭౧

ధీమహితద్విజులకున్ = బుద్ధిబలముచేఁ బూజ్యులగు బ్రాహ్మణులకందఱకు, మహితకంబళాదిస్తోమము=గొప్పవగు కంబళ్ళు మొదలగువాని సమూహము.

తాత్పర్యము.

శ్రీరామునకు లక్ష్మణునకు బుద్ధిచేఁ బూజ్యులయిన బ్రాహ్మణులకు మాకుశలము దెలుపుము. ఈ కంబళ్ళు తీసికొనిపోయి వారికందఱ కిమ్ము.

తే. అనుచుఁ గాంచననిష్కస♦హస్రయుగముఁ బదియునార్నూర్ల వాజుల♦భరతునకును
గంబళాజినవిత్తంబు ♦ లింబు మీఱఁ, నొసఁగె సత్కృతి మున్నుగ ♦ నుల్ల మలర. ౧౭౨

కాంచననిష్కసహస్రము=రెండువేల బంగారు నిష్కములు పదునాఱునూర్ల గుఱ్ఱములను, కంబళాజినవిత్తంబులు=కంబళ్ళు పులి జింక మొదలైనవాని చర్మములు ధనములు సంతోషముతో సత్కారపూర్వకముగ భరతున కిచ్చెను. నిష్కములు, (౧) వక్షోభూషణములు, పతకములు, (౨) దీనారములు బంగారు నాణెములు, "నిష్కోఽస్త్రీ హేమ్ని దీనారే సాష్టేకర్ష శతేపలే వక్షో విభూషణే కర్షే" యని వైజయంతి.

ఉ. బాపటగాఁగ నశ్వపతి ♦ పంపె సమాత్యుల సద్గుణాఢ్యవి
శ్వాసులఁ ద్రోవఁ దోడుగ వె♦సం దనయుల్లునకున్ యథాజితుం

డాస నిరావదుద్భవము • లైంద్రశిరంబుల దంతులన్ జవో
ద్భాసిశిఖరంబులన్ భయద • దంష్ట్రము లొసెనుఁ గ్రోడికుక్కలన్. ౧౭౬౩

బాసటగాఁగన్ = సహాయులుగా- అశ్వపతి=కేకయరాజు-సద్గుణాఢ్య విశ్వా సులన్=మంచి సంపత్తిగలిగి నమ్మఁదగినవారిని- అమాత్యులన్ = అమా = సహ, ప్రాణాన్ త్యజంతి యను వ్యుత్పత్తిప్రకారము కూడఁ బ్రాణము నిచ్చువారు అని యర్థము. మంత్రులు = ఆలోచనచెప్పువారు- ఆలోచనలు కార్యరూపముగఁ బరిణ మింపఁజేయువా రమాత్యులు. ఇరావదుద్భవము = ఇరావంతమను పర్వతమునఁ బుట్టినవి- ఐంద్రశిరంబులన్ = ఇంద్రశిరమను పర్వతమునఁబుట్టినవి- దంతులన్ = ఏనుఁగులను- జవోద్భాసిశిఖరంబులన్ = వేగముచేఁ బ్రకాశించు కంచరగాడిదలను- భయదదంష్ట్రములు=భయము కలిగించు కోఱలుగల పెద్ద సాకుడు కుక్కలను.

తా త్ప ర్య ము.

అశ్వపతియగు కేకయరాజు భరతునకు సహాయులుగా మంచి గుణసంపత్తి గలిగి నమ్మఁదగినవారలను ద్రోవతోడుగఁ బంపెను. మేనమామయగు యుధా జిత్తుఁడు దన మేనల్లునకు నాశతో నిరావంతమునందు నింద్రశిరంబునందుఁ బుట్టిన యేనుఁగులను వేగముచేఁ బ్రకాశించు కంచరగాడిదలను భయంకరములైన కోఱలు గల సాకుడుకుక్కలను నిచ్చెను.

ఉ. ఇచ్చినవానిఁ గైకొనియు • నేమియుదం బెద లేక స్వప్నయా
వచ్చరితంబు దూఁత లిడు • వానిరితీవరపాటు నెంతయే
నిచ్చ మెలంగఁగా భరతుఁ • డేగఁ గడంగినయంతఁ దాతయున్
వచ్చరితుండు మామయును • సమ్మతి వీడ్కొలుపన్, రథంబులన్. ౧౭౬౪

స్వప్నయావచ్చరితంబు = కలలోఁదోఁచిన సమస్తవిషయములును- కడంగిన యంతన్=ప్రయత్నముచేయఁగా- వీడ్కొలుపన్ = పోయిరమ్మని సాగనంపఁగా.

తా త్ప ర్య ము.

ఇట్లు మేనమామ యిచ్చినవానిని దీసికొనియుఁ గొంచెమైన మనస్సులో సంతోషమనునదిలేక కలలోఁదోఁచిన విషయము, దూఁతలుపెట్టుతొందర మనస్సులో మెదలుచుండఁగా భరతుఁడు పోవఁ బ్రయత్నింపఁగాఁ దాతయు మంచి నడవడిగల మేనమామయు నిండుమనస్సుతో సాగనంపఁగా రథంబులందు.

ఉ. తమ్ముఁడుఁ దాను నెక్కి సుర•ధామము వెల్వడుసిద్ధుపోల్కి వే
గమ్మున నూరు వీడి బల•కాండము గొల్వఁగ మండలోరుచ
క్రమ్ముల నొప్పు తేర్ల తుర•గమ్ములు గోవులు నుష్ట్రసంఘముల్
సమ్మతిఁ గొంచు భృత్యజన•సంతతి వెంబడి రా మహోత్వరన్. ౧౭౬౫

సురధామము=స్వర్గము- బలకాండము=సేనాసమూహము- మండలోరుచక్రమ్ములన్=గుండ్రమై గొప్పవగు చక్రములచే- ఉష్ట్రసంఘముల్ = ఒంటెలగుంపులు- తమ్ముఁడు తానునెక్క- ననుటచే భరతునకంటె శత్రుఘ్నుఁడు తొందరపడుచున్నాఁడని భావము.

తాత్పర్యము.

తమ్ముఁడు తాను నెక్క- స్వర్గమునుండి బయలు వెడలిన సిద్ధునివలె శీఘ్రమ్ముగ నూరువిడిచి సేనలు గొలువఁగా వర్తులములు గొప్పవయిన చక్రములచే నొప్పు తేర్లు గుఱ్ఱములు నావులు ఒంటెల సంఘములుకూడఁ దీసికొని బాటులు తనవెంటరాఁగా మిగుల వేగమున-

—• ౭౧-వ సర్గము. భరతుఁ డయోధ్యకుఁ బ్రయాణం బగుట •—

సీ. రాజగృహమునుండి • ప్రాఙ్ముఖుండై కొంత, చని సుదామాఖ్యంబు•ధునిని దఱిసి
యతివిశాలం బగు•హ్లాదిని దరియించి, పశ్చిమముఖ మయి • పాఱునది శ
తద్రు వేలాధాన•తటమున లంఘించి, యపరపర్వతముల • నాశ్రయించి
ఘనశిలావహానది • ననఘుఁడు దాఁటుచు, నాగ్నేయమున హృద•యానురంజ

తే. కంబు నగుపురమును శల్య • కర్తనంబుఁ
జూచి చైత్రరథంబున • సొంపు మెచ్చి
గంగయు సరస్వతియునాఁగ • రంగుమీఱు
జోడునదులను గాంచి యా•సూర్యకులుఁడు.		౧౭౬౬

ప్రాఙ్ముఖుండై = తూర్పుముఖముగలవాఁడై-ప్రాక్+ముఖము=ప్రాఙ్ముఖము. అను నాసికములు పరమగుచోఁ బదాంతములైన యక్ప్రత్యాహార వర్ణంబుల కా వర్గమందలి యనునాసికవర్ణములు వికల్పముగ నాదేశమగును- ధునిని = నదిని - తఱిసి = సమీపించి- హ్లాదిని; వేలాధానతటమునన్ =వేలాధానమను పురమునొద్ద - ఏలకులు పుట్టుప్రదేశము గావున దీనికి వేలాధానమనిపేరు. అపరపర్వతములన్ = అపరపర్వతమనెడి గ్రామములను- పర్వతములు ఇది యొకజాతి యోషధీలతలు- వానికి సమీపమునసుండు గ్రామములు- పర్వతములు- 'అదూరభవశ్చ' యనెడి పాణిని సూత్రప్రకారము వచ్చిన తద్ధితప్రత్యయమునకు 'వరణాదిభ్య' యనుపాణిని సూత్రప్రకారము లోపము లుపియుక్తవద్వ్యక్తివచనతా' యను సూత్రానుసారము ముందున్న ప్రయత్యయము లోపించినను నున్నది అందేకవచనార్థమే పూర్వ పర్వటమని యొకగ్రామము. అపరపర్వటమని యొకగ్రామము. ఆశ్రయించి = అలసట తీర్చుకొనుటకై పొంది- శిలావహానది- శిలావహయను గొప్పనది-తాలను లాగునది కావున శిలావహయని పేరు. ఆగ్నేయమునన్=ఆనదికి నాగ్నేయదిక్కున - హృదయానురంజకము=మనస్సును సంతోషపఱుచునది-శల్యకర్తనము = శల్యకర్తనమను పట్టనము-(మనస్సులోని శల్యము=దుఃఖమును కర్తనము=కత్తిరించునది - కావున శల్యకర్తనమని పేరు) చైత్రరథంబున సొంపు=చైత్ర రథమునందలి సొంపు- అలుకని

మాసము- కుబేరుని వనమగు చైత్రరథములో సమానముగ నుండుటచే నాపేరు పెట్టఁబడినది- గంగా సరస్వతులు- ఇచ్చట గంగ యనఁగా సింధునది- గంగయె మూఁడు పాయలయ్యెనని యందు సింధువొకటి యనియు బాలకాండమునఁ జెప్పఁబడెను. (చూ. ప. ౯౦౩ బాల.) యమునదాఁటిన పిమ్మట భాగీరథిని దాఁటినట్లు ౧౭౬౮-వ పద్యమునఁ గలదు కావున నిది యదిగాదు.

దూతలు పోవునపుడు గుఱ్ఱములపై బోయిరి కావున సమీపమార్గమునఁ బోయిరి ఇప్పుడు సేనతోడ నాత్రోవఁబోవ సాధ్యపడదు. కావున మఱియొక త్రోవ పోవలసివచ్చెను. కావున మార్గములు భిన్నములు.

తా త్ప ర్య ము

రాజగృహమునుండి తూర్పుదిక్కుగాఁ గొంతదూరముపోయి సుదామ యను నదిని సమీపించి మిగుల విశాలమైన హ్లాదినిదాఁటి యక్కడినుండి పశ్చిమ దిశగాఁ బాఱు శతద్రునదిని నేలధానమను నూరియొద్దదాఁటి యపర పర్వటములయొద్దఁ గొంచెము సేపు నిలిచి యావల శిలావహాయను నదినిదాఁటి యచ్చటినుండి యాగ్నేయ దిశయందు శల్యకర్తనమను పురమునుజూచి చైత్రరథమును దర్శించి గంగాసరస్వతులను రెండునదులను జూచి-

సీ. వీరమత్స్యోత్తర • భారుండవనిఁ జొచ్చి, కొండలనడుమను • గోమరు మీఱు
వలకులింగంబు నా • వల యమునాతీర,మున బలంబులఁ దాను • ముదము మీఱ
విడిసి సేదలు దీర్చి • కడిగి గుఱ్ఱంబులఁ దాను మజ్జన మాడి • దప్పి తీఱ
జలములు గ్రోలి యా • వలనీరములు లేమి, జలము లానదియందు • సంగ్రహించి
తే. ఘోరవనములలోఁజొచ్చి • కుంజరంబు,మీఁద రాకొమరుండుదా • మింటఁజనెడి
గాలిపోలిక వానిని • లీల దాఁటి, చేరె భాగీరథీనదీ • తీరభూమి. ౧౭౬౭

వీరమత్స్యోత్తర భారుండవనిన్=వీరమత్స్యములనెడి దేశముల కుత్తరమున నుండు భారుండమను వనమునఁ బ్రవేశించి, సేదలుదీర్చి బడలికఁ బోఁజేసికొని, ఆత్మనేపద+మనిత్యము గావునఁ దీర్చియని చెప్పఁబడియె, మజ్జనము = స్నానము- కుంజరము=ఏనుఁగు; మింటఁజనెడిగాలి = నేల నానుకొనిపోవుగాలి వనపర్వతముల కారణమున మందవేగమై యుండును- ఆకాశమున వద్దములేక వేగమునఁ బోవును.

తా త్ప ర్య ము

వీరమత్స్యములను దేశముల కుత్తరమునందు భారుండవనమునఁ బ్రవేశించి కొండల నడుమనుండు కులింగదేశమున కావల యమునాతీరమున సేనలు దాను నిలిచి బడలిక దీర్చుకొని గుఱ్ఱములఁ గడిగి తాను స్నానముచేసి దాహమాఱమంచి నీళ్ళుద్రావి యావల నీళ్ళులేమిని నచ్చటనే జలములు పదిలపఱచుకొని యడవి ప్రదేశములలోఁదూఱి భద్రజాతి యేనుఁగుమీఁద వానినెల్లదాఁటి భరతుఁడు గంగాతీర ప్రదేశముఁ జేరెను.

తే. అంశుధానాఖ్య దేశంబు•నందుఁ బ్రాగ్వ,టాఖ్యపురిని భాగీరథి•నధిగమించి
యవలఁ గుటికోష్టికానది•యవల ధర్మ, వర్ధనాఖ్యపురంబును•వరుసఁ గాంచి.

అంశుధానమను దేశమందుఁ బ్రాగ్వటమను పురమునొద్ద గంగను దాఁటి యవలఁ గుటికోష్టికానది యవల ధర్మవర్ధనమను పురమును వరుసఁజూచి.

సీ. తోరణదక్షిణ•ధారిణి నుండి జం,బూప్రస్థనామక•పురముఁ జేరి
రమ్యవరూథ మన్•గ్రామంబు దరి వనీ,స్థలి నిల్చి తూర్పుగఁ•జనుచు నుజ్జి
హానంబనం బ్రియ•కారామమును డాసి, యచ్చట జవనంబు•లశ్వములను
రథమునకును గట్టి•రాజకుమారుండు, వాహిని మెల్ల రాఁబలికి తూర్ణ

ఆ. ముగను ద్రోవనడచి• మొగి సర్వతీర్థంబు,నందు నొక్క-రేయి•యునఘుఁ డుండి
యొప్పుగాఁగఁగదలి•యుత్తానికాదివా,హినులఁ గుటికహస్తి•పృష్ఠకమున గడచి

తోరణ దక్షిణధారిణినుండి = తోరణదేశమున దక్షిణ భాగమునుండి, వాహిని = సేన.

## తా త్ప ర్య ము.

తోరణదేశమున దక్షిణభాగమునుండి జంబూప్రస్థమను పురముఁజేరి యావల రమ్యవరూథమను గ్రామము సమీపమున వనమునందు నిలిచి తూర్పుగఁ బోవుచు నుజ్జిహానమునొద్దఁ దమరాష్ట్రములోఁ జేరిన ప్రియకమను కడపచెట్ల వనమును సమీపించి యచ్చట నేనుఁగుడిగి వేగవంతంబులైన గుఱ్ఱములను రథమునకుఁ గట్టించి యందుఁ గూర్చుండి భరతుఁ డిఁకమీఁద మనరాష్ట్రము గావున మెల్లగా రండని సేనలకుఁజెప్పి శీఘ్రప్రయాణముచేసి సర్వతీర్థంబునందు నొక్క-రాత్రియుండి యక్క-డనుండి పయనమై లోఁతులేనిదగుటచే నుత్తానక యనునది మొదలగు నదులను దాఁటి కుటికయను నదిని హస్తిపృష్ఠకమునందు దాఁటి (ఏనుఁగువీపువలె లొత్తైనది హస్తిపృష్ఠకము)

సీ. దాఁటి లౌహిత్యప•త్తనసమీపమునఁ గ,పీవతిఁ దరియించి•వీరవర్యుఁ
డేకసాలంబున•లెసఁగుస్థాణుమతిని, వినతంబునను గోమ•తిని గమించి
యధ్వపరిశ్రాంతి•యణఁగఁ గళింగపు,రంబున సాలవ•ణంబునందు
నొక్కిం-త నిలిచి రే•తక్క-క యది దాఁటి, యరుణోదయంబున•భరతుఁ డాత్మ

తే. పురము మనునిర్మితంబయి •సిరులమీఱు,నయ్యయోధ్యను గనుఁగొని•యవనినాథ
తనయుఁడిట్లులుస ప్త రా•త్రములునడచి, తనదుపురమునుజూచిసూ •తునకుననియె.

అధ్వపరిశ్రాంతి = త్రోవనడచినగాసి. ఒక్కింత = కొంచెముసేపు. అరుణోదయంబునన్=సూర్యోదయమువేళ. సప్తరాత్రములు=ఏడురాత్రులు. ఏకదేశసంఖ్యావయవంబులకును సర్వసంఖ్యాతి పుణ్యాశబ్దములకును బరమైన రాత్రిశబ్దము అకారాంతమగును. సు. వ్యా. సమాస ౫౩ సూత్ర. కపీవతి = అన్యేషామపి దృశ్యత యను సూత్రప్రకారము దీర్ఘము.

తాత్పర్యము.

ఎఱ్ఱమట్టి గలదగుటచే లౌహిత్యమను పేరుగల పట్టణమునొద్దఁ స్రోఁతులు పెక్కులుండుటచే, గపీవతి యనుపేరుగల నదినిదాటి యేకసాలమందుండు స్థాణుమతీ నదిని వినతమునొద్ద గోమతీనదిని దాటి యచట దోవగాసి శమింపఁ గళింగపురమున సాలవనంబునందుఁ (మద్దితోఁపు) గొంచముసేపు నిలిచి రాత్రివేళనే యదియెల్లదాటి యరుణోదయంబున భరతుఁడు దన యయోధ్యా పురమును జూచెను. ఈవిధముగా నేడురాత్రులు ప్రయాణముచేసి యెనిమిదవదిన ముదయము దూరమునందే యయోధ్యనుజూచి తన సారథితో నిట్లనియె.

—• భరతుఁ డయోధ్యాదుస్థితికి వగచుట •—

ఉ. సారథి! కంటివే నృపతి•సత్తమపాలిత మైచు యజ్వసం
వారములన్ శమాదిగుణ•భాసురపాఠుల వేదపారగో
దారచయంబులన్ వెలసి • తద్దయుఁ దెల్లనిసుద్దఁ బోలుచున్
దూరదృష్టి కీపురము • దోఁచి ముదంబు ఘటింప దేలొకో. ౧౭౭౧

నృపతిసత్తమ=రాజశ్రేష్ఠుఁడగు దశరథునిచే- పాలితము=రక్షితము- యజ్వసంవారములన్ = శాస్త్రప్రకారము యజ్ఞముచేసిన దీక్షితులసమూహము- శమాదిగుణభాసుర పాఠులన్=శమదమాది గుణములచేఁ బ్రకాశించువారును-వేదపారగ = వేదమును సాంతముగఁ జదివినవారలయు - ఉదారచయంబులన్ = గొప్పవారునగు బ్రాహ్మణుల సమూహములచే-

తాత్పర్యము.

చూచితివా సారథీ! యయోధ్యయెట్లున్నదో రాజులందు శ్రేష్ఠుఁడయిన దశరథుఁడు పాలించుచున్నను యజ్ఞములు చేసినట్టియు శమదమాది గుణములచేఁ బ్రకాశించునట్టియు వేదములు తుదముట్ట నధ్యయనముచేసినట్టియు గొప్పవారల సమూహముచే నొప్పియు నెత్తురు లేనివాని ముఖమువలెఁదెల్లనై తెల్లసుద్దవలె దూరమునుండి చూడఁగా నీ యయోధ్య నాకు సంతోషము కలిగింపకున్నది.

దశరథుఁడు పోయినది మొదలుగ నిండ్లకు సున్నముకొట్టుట మొదలగుసంస్కారములు లేకపోవుటచేఁ గాంతిచెడి సుద్దవలె నున్నదని భావము.

కం. మున్నెప్పుడుఁ గలకల మని, యన్నులపురుషులరవంబు • లతిదూరమునన్
జెన్నుగ వినఁబడు నిపు డా సన్నంబున కరిగి వినము • సారథి యేలా? ౧౭౭౨

అన్నుల=స్త్రీల-రవంబులు=ధ్వనులు- ఆసన్నంబునకున్=సమీపమునకు-

తాత్పర్యము.

పూర్వము సకలవేళల స్త్రీల పురుషుల గలగలమను ధ్వనిదూరమునకే వినవచ్చుచుండును. ఇప్పుడు సమీపమునకు మనమువచ్చినను వినఁబడకున్నది. సారథీ! యేమికారణమై యుండును.

కం. కేళీలీలాలోలజ, నాలులు సాయంతనముల • నారామములన్
వాళిమెయి నుండి వేకువ, నేలా చన రిండ్లకడకు • నిమ్మెయి సూతా. ౧౭౭౩

కేళీలీలాలోల జనంబులు = క్రీడా విలాసంబులందు నాసక్తిగల జనంబులు - ఆరామములందున్=తోఁటలయందు- వాళిమెయిన్=సంతోషముగ-

తాత్పర్యము.

విలాసముగాఁ గ్రీడించుటయం దాసక్తిగల మనుష్యులు సాయంకాలములందుఁ దోఁటలలోఁ గ్రీడించి యుదయమున వారివారి యిండ్లకుఁ బోవుచుందురు. ఇప్పు డొకఁడైనఁ బోవువాఁడు లేకున్నాఁడే. ఓలసూతా.

శా. నాకుం జూడఁగ సారథీ! పుర మర • ణ్యప్రాయ మై తోఁచెడిన్,
రాకల్ పోకలు సేయ రెవ్వరుఁ బురిన్ • యానంబులం దేని, నా
నాకుంభీంద్రతురంగమంబులపయి • న్హర్షంబున న్లోకు ల
స్తోక క్రీడలు సల్ప రెవ్వ, రెదయున్ • దోలాయితం బయ్యెడిన్. ౧౭౭౪

అరణ్యప్రాయము = అడవితోసమానము- యానంబులందున్ = వాహనములందు-నానాకుంభీంద్ర= అనేకములైన యేనుఁగులమీఁదను- తురంగమంబులపయిన్ =గుఱ్ఱములమీఁదను-అస్తోక క్రీడలు=గొప్పయాటలు- దోలాయితంబు = ఉయ్యెల వలె నూఁగునది- దోలా రూ డోలా. తద్భ. డోలి.

తాత్పర్యము

సారథీ నాకుఁజూడ మనుష్యసంచారములేని వనమువలెఁ నయోధ్య గాన వచ్చుచున్నది. వాహనములమీఁద నొకరైనను బురినుండి వచ్చువారులేరు. పురికిఁ బోవువారులేరు. పెక్కులగు నేనుఁగులమీఁద గుఱ్ఱములమీఁదఁ గ్రీడసలుపువారు కానరాలేదు. ఇవన్నియుఁజూడ మనస్సుసందేహముచే నుయ్యాలవలె స్థిరములేక యున్నది.

ఉ. మత్తశుకీపికంబులను • మంజులరంజకకందళంబులన్
హత్తిన కేళికారతి స • మాగతసుందరబృందసంగతిన్
జత్తి మిగుర్పఁ జేయుసర • సీసుమమందిరకందరంబులన్
సత్తి నెసంగుతోఁట లివి • సారథి! యేగతి పట్టెఁ జూచితే ౧౭౭౫

మత్తశుకీపికంబులను = మదించిన యాఁడు చిలుకలచేతను కోవెలలచేతను - మంజుల=సుందరములై -రంజక=మనస్సును రంజింపఁజేయు- కందళంబులన్= చిగుళ్ళ చేతను-హత్తిన=పొందిన- కేళికారతిన్ = ఆటలయందలి ప్రీతిచేతను- సమాగతసుందర బృందసంగతిన్=గుమిగాఁ జేరిన యందగాండ్ర గుంపుల కూడికచేతను- సరసీ = కొలఁకులచేతను- మందిర=ఇండ్లు- కందరములు=గుహాలు వీనిచేతను- సత్తి = సత్తువతోను.

తాత్పర్యము

మదించిన యాఁడుకోకిలలచేతను చిలుకలచేతను రమ్యమై మనస్సును సంతోషింపఁజేయు చిగుళ్ళచేతను ఆటలయందుఁ బ్రేమగలుగుటచే వచ్చిన సుందరుల గుంపులచేతను మనస్సు చిగిరించునట్లుచేయు కొలఁకులు పూలయిండ్లు పూలగుహాలు వీనిచేతను సారవంతమై ప్రకాశించు తోఁటలివి విచారించువారులేమి నేగతిపట్టినవో చూచితివా.

కం. రాలెడునాకులతోడను, వ్రీలెడుశాఖాచయముల • వృక్షంబు లయో
గోలున నేడ్చెడి రీతిని, లీలాచ్యుతిఁ దోఁచె సూత • లీలావనులన్. ౧౭౭౬

తాత్పర్యము.

రాలుచున్న యాకులతో విఱిగిపడెడు కొమ్మలతో గోలుగోలున నేడ్చునట్లం దముచెడి క్రీడావనములందుఁ జెట్లెట్లున్నవో చూడుము.

కం. కనరా రొక్కరుఁ దోఁపుల, వినరాదు విహంగరుతము • వీనుల కింపై
చనుదేర దగురుచందన, ఘనధూపమిళత్సమీరు•కమ్మనితావుల్. ౧౭౭౭

తాత్పర్యము.

తోఁపులందు నొక్కరైనను గనులకుఁ గానరాకున్నారు. వీనులకు నింపుగలుగ పక్షులధ్వనియు వినరాకున్నది. అగరు చందనము వీనిగొప్ప పొగలచేఁ గూడిన గాలి కమ్మని వాసనలతో వీవకున్నది.

కం. భేరీమృదంగవీణా, చారునినాదములు తొల్లి•చందంబున నే
లా రావు వినఁగ శకునము, లారయ మేల్గావు హృదయ•మాకులతఁ గనెన్.

తాత్పర్యము.

భేరులయు మృదంగములయు వీణెలయు మనోహరములైన ధ్వనులు పూర్వమువలె నేలవినరాకున్నవి. ఆలోచింపఁగా శకునములు మంచివిగావు. కావున హృదయము కలఁత చెందెను.

ఈ వర్ణనముఁబట్టి భరతుఁడు నగరము సమీపించెనని తెలియవలయును.

చం. ధ్రువ మిది యెట్టులున్ శుభము • దుర్లభ మౌను మదీయబంధులం
దవశతఁ జెందెడిన్ హృదయ • మారటపాటున నంచుఁ దత్పురిన్
జవమున వైజయంతి యను•సత్ప్రథఁ గాంచినద్వారసీమఁ జొ
చ్చి విజయ మష్టదర్శకులు • చెచ్చెర రా వెనువెంట నేగుచున్. ౧౭౭౯

తాత్పర్యము.

ఇది నిశ్చయము. నా సమీప బంధువులం దెవరికో యేమో యశుభము ప్రాప్తించినది. ఆరాటముచే నా మనస్సు పరవశమైపోచున్నది. అని చెప్పుచు వైజయంతియను పేరుగల పడమటి గవనిలోనుండి నగరములోఁ బ్రవేశించి తన్నుఁ జూచి విజయమును బ్రశ్నచేయువారు తనవెంటఁ ద్వరగా రాఁగా నూరిలోఁ బోవుచు.

చం. పరిపరిరీతులన్ మనము • బ్రద్దలు వాఱఁగ సూతుతో ననున్
గురుఁడు వసిష్ఠుఁ డేమిటి కొ•కో పిలిపించె నకారణంబుగన్
దొర తొర రమ్మటంచు ననుఁ • దోఁచె నెదో యశుభంబు గల్గెడిన్
విరవిర వోయె మేను గడు•విహ్వలభావము గాంచెఁ జిత్తమున్. ౧౬౦

తా త్ప ర్య ము.

భరతుఁడు సారథితో నిట్లనియె. సారథీ! యాలోచించుకొలఁది నా మనస్సు నానావిధముల బ్రద్దలు బ్రద్దలుగాఁ బగిలిపోవుచున్నది. పెద్దవారు దశరథుఁడు శ్రీరాముఁ డుండంగా వసిష్ఠుఁడు నన్నుఁ బిలిపింపఁగారణమేదైన నుండవలయునుగదా! తొందర తొందరగా రమ్మని వసిష్ఠుఁడు చెప్పి పంపినపుడు దాని కేదియో కారణము లేకుండునా? ఇవన్ని చూచిన నేదో కీడు మూఁడినట్లే తోఁచుచున్నది. దేహమా విరవిర పోవుచున్నది. మనస్సా విహ్వలమగుచున్నది.

చం. నృపతివినాశకాలమున • నేవి ఘటిల్లు నటంచు వింటినో
యవి డవి యెల్లఁ దోఁచెడిని • నిచ్చట సారథి! వింత లూఁద్చుటో,
విపులసుధూపధూమములు • వెల్వడుటో, పచనంబు సేయుటో,
సపరికరంబుగా బలులు • సల్పుటయో, కన దీఁగృహంబులన్. ౧౬౧

తా త్ప ర్య ము.

ఇది వీథుల వెంటఁబోవుచు ననుకొనుమాటలు రాజు మరణించి నపుడేవేవి జరుగునని ముందు వింటినో యవియెల్ల నిప్పు డీయూరఁ గానవచ్చుచున్నవి. అవి యేవి యంటివా? ఈ యిండ్లలోఁ గసవూఁడ్చుట లేదు. మంచి వాసనగల పొగలు బయలు దేఱుట లేదు. వంటలు లేవు. కావలసిన వస్తువులతోఁ బూజలు సలుపుటయు లేదు.

కం. గేస్తులభవనము లెల్ల న, పాస్తశ్రీకంబు లయ్యెఁ • బ్రభ చెడిరి జనుల్
సిస్తుగఁ బూలవిపణులను, రస్తులు గన రావొకండుఁ•గ్రయ్యంబగుచున్. ౧౬౨

గేస్తులభవనములు=గృహస్థులయిండ్లు, అపాస్తశ్రీకంబులు=పోయిన లక్ష్మి కలవి, పూలవిపణులన్ = పూలయంగళ్ళయందు, క్రయ్యంబగుచున్ = విక్రయింప యోగ్యమై రస్తులు=పదార్థములు.

తా త్ప ర్య ము.

గృహస్థులయిండ్లన్నియుఁ గాంతివిహీనములై లక్ష్మి తొలఁగిపోయినట్లున్నవి. జనులు కాంతి చెడియున్నారు. అందముగాఁ బూలయంగళ్ళయందు నమ్మఁదగిన పదార్థమొకటియు లేకున్నది.

చం. అలుకవు, రంగవల్లుల జ•నావళి లుంపవు, దేవతాగృహం
బుల రమణీయ మాల్యములఁ • బూన్పవు, మానిసి మోముఁ జూడఁగా
నలవడ దందుఁ బాడిడిన•యట్టులు దోఁచెను, గుభ్భ వొల్లియ
ట్టుల లసియింప వే లొకొ క•డుం బరితాపము పుట్టె సారథీ. ౧౬౩

తాత్పర్యము

జనములు దేవాలయముల నలుకలేదు. ముగ్గులు పెట్టలేదు. మంచి పూల దండలు వ్రేలఁదీయలేదు. మనుష్యుల ముఖము చూతమనఁ గానరాదు. అన్నియుఁ బాడుపడినట్లున్నవి. ఏలొకో గుళ్ళు మునుపటివలెఁ బ్రకాశించుటలేదు. ఇవన్నియుఁ జూచిన మిక్కిలి పరితాపము కలుగుచున్నది.

కం. కొన రమ్మరు వైశ్యులు చిం,తను మునిఁగినవార లయి యథాపూర్వముగన్
గన రారు వాడుమోములఁ, బని చెడి యున్నార లేమి భంగిమొ సుతా.

తాత్పర్యము. ౧౬౨౪

వైశ్యులు కొనుటయులేదు అమ్ముటయులేదు. అందఱు వ్యసనములో మునిఁగి యున్నారు. మునుపటివలెఁ గానరాకున్నారు. వాడిన ముఖములోఁ బనిచెడి యున్నారు, ఏమిటికొగదా!

ఉ. కోవెలలందుఁ జైత్యముల నూరిన పెంపుడుపుల్గులున్ వ్యథా
భావములన్ శిరంబు లర వ్రాల్చి తొరంగెడి బాష్పవారితో
వావిరిపల్లటిల్లెడిని వారిజనేత్రలు పూరుషుల్ దురం
తావిలవృత్తి నార్తిపడ నయ్యె కతం బది యేమొ దైవమా. ౧౬౨౫

తాత్పర్యము.

దేవాలయములందును రచ్చకొట్టములందునుగల పెంపుడు పక్షులు దుఃఖ భావములతోఁ దలలు సగమువంచి కాఱుచున్న కన్నీటితో మిక్కిలి శోకించుచున్నవి. స్త్రీలు పురుషులు సంతతములేని కలఁతతో శోకింపఁగారణమేమి కలిగెనో!

ఉ. మాటికి సూతుతో నిటులు మాటలు చెప్పుచుఁ బోయి శూన్యశృం
గాటక వేశ్మరథ్యముల గాఢరజోరుణయంత్ర దేహళీ
వాటక వాటఘాటముల వర్తిలుస్వర్గనికాశ మైనయ
ప్పీటిని జూచి దుఃఖమున విహ్వలుఁడై తల వాంచి వేగ నై. ౧౬౨౬

మాటికిన్ = పలుమాఱు, శూన్య = జనములులేని, శృంగాటక = నాలుగుత్రోవలు కలియుచోటులచేతను, వేశ్మములన్ = ఇండ్లచేతను, రథ్యములన్ = వెడలుపుబాటలచేతను, గాఢ = అధికమైన, రజస్ = దుమ్ముచే, అరుణ = ఎఱ్ఱనైన, యంత్ర = యంత్రములయు, దేహళీ = కడపలయు, కవాట = తలుపులయు, ఘాటములన్ = సమూహములచే, స్వర్గనికాశము = స్వర్గముతో సమానము పీటిన్ = పట్టణమును, విహ్వలుఁడై = కలఁతి చెందినవాఁడై.

తాత్పర్యము.

ఎడపాదడపా యీ ప్రకారము సారథితో మాటలు చెప్పుచుఁబోయి జనములులేని నాలుగుత్రోవలు కలియుచోటులను, ఇండ్లను వీథులను ఉపయోగింపకుండుటవలన నధికమైన దుమ్ముచే నెఱ్ఱనైనయంత్రములు కడపలు తలుపులు వీని సమూ

హాములచే వర్తిలుచు పూర్వము స్వర్గముతో సమానమైయుండిన యా యయోధ్యా పట్టణమును జూచి దుఃఖముచేఁ గలఁతచెందిన మనస్సుగలవాఁడై తలవంచుకొని వేగమున.

—♦ ౭౨-వ సర్గము. భరతుఁడు కైకేయిమేడకుఁ బోవుట ♦—

కం. జనకునిమేడకుఁ జని యట, జనకుఁడు గనరామి నతఁడు ♦ చయ్యనఁ జనుదున్
జననీగృహంబులోనికిఁ, దత్ప్రోషితసుతునిఁ జూచి ♦ తతమోదమునన్. ౧౭౪౮

తాత్పర్యము.

తండ్రి యెప్పుడుండు మేడకుఁబోయి యచట నాయన లేకుండఁగా దల్లి యింటిలోనికిఁ బోఁగాఁ బరదేశముపోయి యుండివచ్చిన తన కొడుకును జూచి కైక మిక్కిలి సంతోషముతో.

కం. కనకాసనంబుఁ దటుకున, జనయిత్రియు దుముకఁ జూచి ♦ చరణంబులకున్
వినతుం డయినన్ భరతుం, దనయంకముఁ జేర్చి శిరము ♦ దా మూర్కొనుచున్.

కనకాసనంబున్ = బంగారుపీఠమునుండి, వినతుండు = నమస్కరించినవాఁడు, అంకము=తొడ, మూర్కొనుచున్=వాసనచూచుచు.

తాత్పర్యము.

బంగారుతోఁ జేయఁబడిన యెత్తు పీఠముపైఁ గూర్చుండిన తల్లి తన్నుఁజూచి తటాలున నేలదుముకఁగా భరతుఁడు పాదములకు నమస్కరింపఁగాఁ బుత్రునిఁ దన తొడలపైఁ గూర్చుండఁ బెట్టుకొని శిరము వాసనచూచి యిట్లనియె.

శా. ఎన్నాళ్ళాయెనొ యూరు వీడి తనయా ♦ యెంతేఁ బథశ్రాంతిచే
నున్నావో కద? మేనమామ సుఖియై ♦ యున్నాఁడుగా? యందు నీ
విన్నాళ్ళెట్టులు ద్రోచి? తక్కడ ముదం ♦ బేపారెనా నీకు? నా
యన్నా! కన్నులఁ గట్టు చుంటివిగదా ♦ యత్యంతమున్ నాకిటన్. ౧౭౪౯

పథశ్రాంతిచేన్=మార్గాయాసముచేత.

తాత్పర్యము.

నాయనా! నీవూరు విడిచి యెన్నాళ్ళాయెను? మార్గాయాసమున మిగులఁ బడలియున్నావుకదా? మేనమామ సుఖమా? ఏవిధముగా నీవచటఁ గాలముఁ ద్రోచితివి. అక్కడ నీకు సంతోషముగా నుండెనా? అన్నా! యిన్నాళ్ళిచ్చట నాకుఁ గన్నులఁగట్టి నట్లుంటివికదా?

కం. అని యడిగిన నిజజననికి, ననియెన్ భరతుండు నేఁటి ♦ కాఱునొకంటన్
జనె నమ్మ రేలు మామస,దనమును నే విడిచి చెప్ప ♦ తాతయు మామన్. ౧౭౫౦

తాత్పర్యము.

అని తల్లి యడుగఁగా భరతుఁ డిట్లనియె. అమ్మా! నే నూరు విడిచి యేడు రాత్రులు గడచెను. తాత మామ యాదిగాఁ క్షేమముగా నున్నారు.